అందుకొని వారివైపు అడుగులు వేసే ప్రయత్నాన్ని చేయకపోతే రాబోవు అతి సమీపకాలంలో చిత్రవిచిత్రమైన మానసిక సంఘర్షణతో తీవ్ర పశ్చాత్తాపానికి గురి కావలసివస్తుంది.

ఓ రాజుకి లేక లేక ఓ అమ్మాయి పుట్టింది. ఆ రాజు తన రాజ్యంలోని జ్యోతిష్యుల్ని పిలిపించి భవిష్యత్తు ఎలా ఉంటుందని అడిగాడు. వారిలో వరాహవీరుడనే జ్యోతిష్యుడు ఇలా చెప్పాడు. 'మీ అమ్మాయి జాతకప్రకారం అడుక్కుతింటుంద'న్నాడు. రాజుకు కోపం వచ్చింది. మిగతా అందరి జ్యోతిష్యుల్లాగా ఆహా ఓహో అంటూ పొగడకుండా స్పష్టంగా అలా చెప్పేటప్పటికి రాజు ఆలోచనలో పడ్డాడు. అహంకారంతో జ్యోతిష్యుడితో ఇలా అన్నాడు. నేను రాజుని. నా ఐశ్వర్యం నీకు సరిగా తెలిసుండకపోవచ్చు. నాకు ఈ కుమార్తె లేక లేక కలిగింది. ఈ సంపద అంతా ఆమెదే గదా ! ఎందుకడుక్కు తింటుంది ? నీ జ్యోతిషం తప్పని కొద్ది కాలం తరువాత నిరూపించేట్టు చేస్తాను. అప్పుడైనా నీవు చెప్పిన జ్యోతిషం తప్పని నీవు చేసిన పొరపాటుని గుర్తిస్తావు. ఆరోజు నేను నీకివ్వబోయే శిక్ష గురించి అప్పుడే మాట్లాడుకుందాం" అనేసి జ్యోతిష్యుడ్ని పంపించేశాడు.

ఒంటి స్తంభం మేడొకటి కట్టించాడు. పిల్లనీ, తల్లినీ అందులో ఉంచేశాడు. వాళ్ళక్కావలసిన సమస్త వసతులూ అందులోనే కల్పించాడు. ఆ పిల్లకి ఎప్పుడెప్పుడు ఏదవసరమో ఎవర్నీ అడక్కుండానే అమెకన్నీ అందేలా సకల ఏర్పాట్లు చేశాడు. అలా పదేళ్ళు గడిచిపోయాయి. ఉన్నట్టుండి ఓరోజు జ్యోతిష్యుడు రానేవచ్చాడు. వస్తూనే 'మీ అమ్మాయి ఎలా ఉంద'నడిగాడు. రాజు వెంటనే భటుల్ని పంపించి "ఒంటి స్తంభం మేడలో యువరాణి ఎలా ఉందో కనుక్కురమ్మ"ని పంపించాడు. భటులు తిరిగొచ్చి అన్నీ సవ్యంగానే ఉన్నాయని చెప్పారు. అపుడా రాజు జ్యోతిష్కుడితో తమ కుమార్తె ఎవర్నీ ఏమీ అడగాల్సిన అవసరం లేకుండా అన్నీ సమయానుకూలంగా అమర్చే పనివారిని నియమింపచేశానని జ్యోతిష్యుడితో చెప్పాడు. చెప్పి "నేను

గ్రహాల్ని మార్చివేయగలిగాను. అడుక్కుతింటుందని మా అమ్మాయిని ఆనాడన్నారు కదా ? మీరు చెప్పినట్లు జరగలేదు. ఇప్పుడేమంటారు ?" అన్నాడు కోపంగా. జ్యోతిష్యుడు శాంతంగా "ఓసారి అక్కడికెళ్ళి చూసొద్దాం పదండ"న్నాడు రాజుతో. ఇద్దరూ బయలుదేరారు. యువరాణి గృహంలో ప్రవేశించారు. అప్పటికి భోజన సమయమైంది. యువరాణి గది బయట ఓ తెర వేసున్నది. ఆ కర్టెన్‌ను తప్పించుకొని రాజుగారు లోపలకెళ్ళబోయారు. జ్యోతిష్యుడు ఆపేశాడు రాజుని. అవి తెర కొంచెం ప్రక్కకు తొలగించి రాజుగార్ని లోపలకు చూడ మన్నారు. రకరకాల బొమ్మలు చుట్టూఉండగా ఓపెద్ద అమ్మవారి బొమ్మలాంటి దాని ముందున్న ఆహారపదార్థాల్ని చూపిస్తూ ఆ పిల్ల ఆ బొమ్మతో "తల్లీ ! నాక్కొంచెం అన్నం పెట్టవా ?" అనడుగుతోంది. ప్రతిసారీ అలా అడుగుతూ ఆ పాత్రలోని ఆహారాన్ని తనే తీసుకుతింటోంది రాజుగారి ముద్దుల కుమార్తె.

పరమపూజ్య గురుదేవులు మనకీ కథ ఎందుకు చెప్తున్నారంటే ఇది మన కథే కనక ! సృష్టికర్త అనంతమైన సామర్థ్యాన్నీ, శక్తి భాండాగారాన్నీ, ఓ పెద్ద ఖజానానీ మనలో నింపి భూమ్మీదకి పంపించాడు. 'నేను' అనే అహంకారపు ఒంటిస్తంభపు మేడమీదుంటూ జన్మజన్మలుగా అడుక్కుతింటానికలవాటు పడ్డాం. దీన్ని మనం సవరించుకోవాల్సిఉంది.

5000 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణనిర్యాణం జరగబోయే ముందు ఆ జగద్గురువు ఓ చెట్టుకానుక్కూచున్నాడు. అప్పుడాయన దగ్గర ఇద్దరున్నారు. ఒకరు ఉద్ధవుడు, రెండోవారు మైత్రేయుడు. వీళ్ళిద్దరికీ శ్రీకృష్ణుడు ఆ సమయంలో భవిష్యద్దర్శనం చేయిస్తున్నాడు. వారు చూస్తోన్న ఆవేదనా భరితమైన భవిష్యత్తులో కులం పేరుతో అనేకమంది కొట్టుకు ఛస్తున్నారు. మామూలు మనుషులకే తను ప్రేమిస్తోన్న వ్యక్తులు పోట్లాడుకుంటుంటే ఎంతో బాధగా ఉంటుంది. అలాంటిది జగద్గురు చేతనత్వం యొక్క ప్రేమను మనం అంచనా వేయలేం. ఆ ప్రేమ ప్రేమజగత్తుకే పరాకాష్ఠ అని చెప్పవచ్చు. మరి అలాంటి ప్రేమ



స్వరూపుడు పడిన బాధ, ఆవేదన ఎంత తీవ్రంగా ఆలోచించాలి. అది కూడా పరాకాష్ఠలోనే ఉంటుంది. అ‹ ఉన్న జగద్గురువును ఓ బోయవాడు దూరాన చెట్టు ‹ బాణంతో కొట్టాడు. ఆ దెబ్బ శ్రీకృష్ణుని మర్మస్థానానికి తగిలింది. ఎంతలా ఆ మహనీయుడు విలవిలలాడి పోయుంటాడో ఊహించ వచ్చు. అంతటి బాధలో కూడా ఓ అద్భుతమైన ప్రణాళిక తయారు చేశారు. రాబోవు రోజుల్లో అమృతత్వ విద్య ఈ మానవజాతికి ఎలా అందించాలో దాన్ని ఓ ప్రణాళికబద్ధంగా తయారుచేసుకున్నారు వారు ముగ్గురూ. అలాంటి శ్రీకృష్ణ నిర్యాణకాలంలో మైత్రేయుడికీ - ఉద్ధవుడికీ ఏ జ్ఞానసంపదైతే అందజేయబడిందో దానికి సంబంధించిన మహాద్భుత విద్య నేడు ఇలా మనం తెలుసుకుంటున్నాం. మైత్రేయుడికి ఓ శిష్యుడున్నాడు. ఆయన్ని మాస్టర్ KH అంటారు. ఆయన శిష్యుడే జ్వాలాకూల్ మహర్షి. ఆ జ్వాలాకూల్ పంపిన స్పందనల్ని ఏలిస్ ఎ బెయిలీ అనే ఓ ఫ్రెంచి మహిళ పట్టుకోగలిగింది. అంతే కాకుండా దాన్ని ఆవిడ భర్త సహాయంతో పుస్తకరూపంలోకి మార్చింది. అలా 24 పుస్తకాలు తయారుచేసిందావిడ. ఒక్కో పుస్తకం 600 పేజీల చొప్పున ఆ 24 పుస్తకాల్లో ఉన్న అనేక రహస్యాంశాల్ని దయామయులైన మాస్టర్ RK (శ్రీ రామకృష్ణ మాష్టారు) మనకిలా అందిస్తున్నారు.

ఆధ్యాత్మిక జగత్తులో పృథ్వీగ్రహ చరిత్రలోగానీ, మానవజాతి చరిత్రలోగానీ ఎన్నడూ ఇంతవరకు జరగనటువంటి ఓ అద్భుత ప్రయోగం జరగబోతోంది. పరమ గురువులు ఓ రహస్యాహ్వానాన్ని మనకోసం పంపించారు. దానిపట్ల మనం ఆసక్తి చూపకపోయినా - ఋషుల అమోఘప్రద మహావాక్యాలకు స్పందించలేకపోయినా దురదృష్టవంతులమే మరి. జన్మజన్మలుగా మనల్ని వెంబడిస్తూ వస్తోన్న మాయ ఎలాంటి స్పందనలు లేని జడపదార్థాలుగా మనల్ని మారుస్తోంది.

రామాయణకాలం నాటికి ముందు ఓ రాజుండేవాడు. ఓనాడతనికి పశ్చాత్తాపం కలిగింది. తప్పుచేశానని తెలుసుకున్నాడు. ప్రాయశ్చిత్తం

..ఉకోవాలనుకున్నాడు. ఓ ఆశ్రమానికెళ్ళాడు. ఆ కాలంలో ప్రాయశ్చిత్తం చేసుకునేందుకు రాజులు కూడా తొందరపడే వారు. ఆ ఆశ్రమంలో ఉండాల్సిన అధిపతి ఆ రోజు లేడు. అతని కొడుకున్నాడు ఆ సమయంలో. ఆ రాజు తన విషయం చెప్పుకుని ప్రాయశ్చిత్తం చేయమన్నాడు. అందుక్కొడుకు ఆ రాజు చేత రామ-రామ-రామ అని మూడుసార్లు అనిపించాడు. అలా అనిపించాక స్నానం చేయించి ప్రాయశ్చిత్తమై పోయిందని పంపించేశాడు. రాజుకూడా మంత్రప్రభావం తనలో బాగా పనిచేస్తున్నట్టు అర్థం చేసుకున్నాడు. సరే అతను వెళ్ళిపోయాడు. నాల్రోజులుపోయాక ఆశ్రమాధిపతి తిరిగొచ్చాడు. అప్పుడతని కొడుకు నాల్రోజుల క్రితం వచ్చిన రాజు గురించి, తను రామనామంతో ప్రాయశ్చిత్తం చేసి పంపిన సంగతీ మొత్తం తెలియజేశాడు. తండ్రికి విపరీతమైన కోపం వచ్చింది. కొడుకుని శపించాడు. అతను చేసిన తప్పులకు, పాపాలకు ఒక్కసారి రామా అంటే చాలు. అలాంటిది నువ్వు మూడుసార్లనిపించావు. దాని శక్తి ఆ రాజు భరించగలడో ? లేదో ? రామనామ మహిమ నా కొడుకువైన నీకే సరిగా తెలియదు. ఆ రామనామం యొక్క మహిమను తెలియజేయడానికి రాబోయే రోజుల్లో ఓ వ్యక్తి ఉద్భవిస్తాడు. అతను నీదగ్గరకి వస్తాడు. అప్పుడైనా నువ్వు సరిగా అర్థం చేసుకో రామనామం ఎంత గొప్పదో. అంతవరకు నువ్వు నిషాదుడుగా ఉండు" అని శపించాడు. దాని తర్వాత రామావతరాం వచ్చింది. ఆయన పిలుపుకి స్పందించే శక్తి ఉన్న జీవులంతా ఆ వైపు ఆకర్షింపబడ్డారు. ఆ కాలంలో కోతులు స్పందించాయి. కొన్ని వృక్షాలు స్పందించాయి. కొన్ని పక్షులు స్పందించాయి. ఉడతలు స్పందించాయి. కొద్ది మంది మనుషులు కూడా స్పందించారు.

నేడు పరమగురువులు ఆవేదనగా "నాయనలారా యోగి కులంలో చేరండి ! మీ జీవితాన్ని ఆనందమయం చేసుకోండి. రోగాల్లేని, చింతలు లేని, ఆఖరికి మరణం కూడా లేని అమృతత్వ విద్య ఈ సందర్భంగా మీకందించబడుతుంది. ఈ రహస్య ఆహ్వానాన్ని



పెడ చెవిన పెట్టకండి ! రండి !" అంటూ తమ చిట్టచివరి శంఖారావాన్ని కూడా ఇటీవలే తెలియజేశారు. అసత్యమాడటం కాని, అతిశయోక్తులు చెప్పటంకాని చేతకాని దివ్యాత్మల ఆవేదనాపూర్వక రహస్య ఆహ్వానాన్ని పెడచెవిన పెట్టకూడదు. దానిపట్ల మనం స్పందించాల్సి ఉంది. అయితే జన్మజన్మల నుంచి మనల్ని వెంబడిస్తూ అజ్ఞానపు చీకటి బావులలోనే తిప్పి తిప్పి తిప్పుతోన్న ఓ మాయా చక్రం ఈ కలియుగంలో మనల్నిలా గుడ్డివారిని చేసి వదిలింది. దాంతో మనకు చీకట్లో ఉన్నామన్న సత్యమే తెలియకుండా పోయింది. ఈ విషయాన్ని పూజ్య గురువులు ప్రస్తావిస్తూ ఓ కథ చెప్పేవారు.

ఒక రాజుగారికి సముద్రపు ఒడ్డున ఓ తోట ఉండేది. దాన్ని ఆనుకుని ఓ పెద్ద భవంతి కూడా ఉండేది. దానికి కాస్త దగ్గరలో ఓ గూడెం కూడా ఉండేది. ఆ గూడెంలోని వారు సముద్రంలో చేపలు పట్టుకుని జీవిస్తుండేవారు. ఓసారి సముద్రంలో ఏ వాయుగుండమో ఏర్పడి ఎడతెరపి లేకుండా వర్షాలు పడసాగాయి. దానితో గూడెంలోని చేపలు పట్టేవారు ఈ గాలివాన యొక్క ఉధృతికి భయపడిపోయి రాజుగారి అనుమతితో గూడెం వదలి వారి తట్ట, బుట్ట తీసుకుని తోటలో మకాం వేశారట. రకరకాల పూలవాసనల గుబాళింపులతో నిండి ఉన్న ఆ తోటలో మకాం వేసిన జాలర్లకు రాత్రిళ్లు నిద్రరావడం లేదు. వారు ఎంతో ప్రయత్నించారు. చివరికి వాళ్ల చేపల బుట్టలు తడుపుకుని నెత్తిమీద వేసుకుని పడుకుంటే అప్పుడు నిద్ర పట్టిందట హాయిగా.

ఈ కథ జ్వాలకుల్ మహర్షి తన రచనల్లో చెప్పిన కథ అని చెప్తూ "ఈ రోజుల్లో డబ్బు వాసన వేయకుండా ఉంటే మనుషులు గురువుల్ని కూడా దరికి రానివ్వట్లేదు. ఫలానా వారితో మనకింత లాభం వస్తుంది అని అనిపిస్తేనే మనం ఏదైనా స్పందిస్తాం. ఇది ఇంతకు ముందు ఎలా ఉన్నా ఇకపై ఈ మానసికధోరణి అత్యంత ప్రమాద కరమ"ని చెప్తున్నారు. మాస్టర్ అరవిందో ఎంతో ఆవేదనగా 'నేడు ధనాగారం యావత్తూ అసురుల చేతిలోకి వెళ్లింది. దాన్ని మనం

సరిచేసుకుని లక్ష్మీదేవిని అసురుల గుప్పెట్లోంచి విడిపించాల్సిఉంది. భారతదేశము జగద్గురు పీఠాన్ని అధిరోహించబోతుంది. ఈలోగా పరమగురువులు ఈ ధనశక్తిని తిరిగి యథాస్థితికి తేబోతున్నారు' అన్నారు. బ్రహ్మంగారు కూడా దీన్ని సూచనప్రాయంగా తెలియజేశారు. "బళ్లు ఓడలు - ఓడలు బళ్ళు కాబోతున్నాయి" అన్నారు. నేడు ధన వంతులు కూడా దానధర్మాలు చేస్తున్నారు. పన్నులు ఎగ్గొట్టడం కోసం. ఇలాంటి దుస్థితిని అతిత్వరలో మానవజాతి సవరించుకోలేకపోతే ఎన్నెన్నో ఊహించని ప్రమాదాలు జరిగిపోతాయి. దీన్ని గురించి స్పష్టంగా తెలియజేస్తూ దివ్యాత్మలు ఒక్క మాటలో ఇలా చెప్పారు. "రాబోవు అతి సమీప కాలంలో మీ మానసిక స్థితి మార్చుకుని ధనశక్తి పట్ల మీ ఉక్కుపాదాన్ని తొలగించి సంయమనం చూపించకపోతే ఈ భూమి మీద ధనసంపద మొత్తం అంతరించి పోతుంది. అదే గనక జరిగితే సముద్రమథనం చేస్తే తప్ప మళ్లీ ధనశక్తి పృథ్వీమీద కానరాదు. మళ్లీ కూర్మావతారం అవతరించాల్సిన పని కల్పించిన వాళ్లవుతారు. ఈ వినాశనానికి కారకులు నేడున్న ధనవంతులే అవుతారు. ఇది వారికెంతో కీడు కల్గిస్తుందని భవిష్యవాణిగా తెలియ జేయబడుతోంది."

*ఓం చందనస్యమహాత్ పుణ్యం పవిత్రం పాపనాశనం ।*
*ఆపదాముప హరతే నిత్యం లక్ష్మీః తిష్ఠతి సర్వదా ॥*

"బొట్టు పెట్టుకోండి ! లక్ష్మి స్థిరంగా నిత్యమూ మీ వెంట ఉండాలంటే అది తప్పనిసరి" అని చెప్పారు ఋషులు ఏనాడో. అయితే ధన వ్యామోహం పెంచుకుంటూ వెళుతోన్న మానవజాతి నేడు ఆర్థిక సమస్యలు, అనారోగ్యాలు, అకాల మరణాలు తన ఇంటికి ఆహ్వానించు కున్నాడు. ఈ పరిస్థితిని వివరిస్తోన్న దివ్యాత్మలు భవిష్య వాణి చెబుతూ "ఈ ధోరణి మార్చుకోక పోతే అతి త్వరలో ఖచ్చితంగా భూమిమీద ఇప్పుడున్న సమస్త బ్యాంకులు మూతపడిపోతాయి. ఖాతాదారులు జమచేసిన డబ్బు కుళ్ళిపోతుంది. దాని తాలూకు కుళ్ళు కంపు వారి వారి శరీరాల్లోంచి అనారోగ్య రూపంలో దుర్గంధ భూయిష్ఠ మౌతూ బయట పడ్తుంది" అన్నారు.



దీనిపట్ల మనకెలా ఉందో కాని పరమగురువులు తీవ్ర ఆవేదనకు గురౌతూ మనకో సూక్ష్మమైన రహస్యమయ అంశాన్ని తెలియజేశారు. బొట్టు పెట్టుకోవడానికి నామోషీగా తలపోస్తున్న ఈ రోజుల్లో మన దుస్థితికి జాలిపడుతోన్న ఆ కరుణామయులు కనీసం మీ ఉంగరపు వేలిని ఆగ్నేయచక్రం దగ్గర (కనుబొమ్మల మధ్యన) తాకించండి. కొద్దిపాటి ఒత్తిడి కలిగించండి చాలు. ఎర్రటి కుంకుమో, పచ్చటి గంధమో పెట్టుకోనక్కర్లేదు. పెట్టుకుంటే మరీ మంచిది. కనీసం ఈ పై రహస్యాన్ని తెలుసుకుని వీలైనపుడల్లా నుదుటన అనామికను తాకించి చూడండి. **లక్ష్మీః తిష్ఠతి సర్వదా.** ఆర్థిక ఇబ్బందులు రావు. లక్ష్మి స్థిరంగా ఉంటుంది. దాని తర్వాత వీలైతే ఈ చందనధారణ ఒకరికొకరు చేసుకోండి. కేవలం ఈ చిన్న ప్రయత్నం ధనశక్తిని పునర్జాగరణ చేయడమే కాకుండా మన జీవితాలలో సంభవించబోయే అనేక ప్రమాదాల్నీ, ఎన్నో ఆపదల్నీ కూడా నిలిపివేస్తుంది" అన్నారు. ఇంకా ఇలా పేర్కొన్నారు "ఎవరి దృష్టి ఆజ్ఞాచక్రంపై ఉంటుందో ఆ వ్యక్తి లక్ష్మీ పుత్రుడౌతాడు. ఏ పనులు చేసుకొంటున్నా మనసు మాత్రం ఆజ్ఞాచక్రం దగ్గర ఉంచుకొంటుండాలి. కనుబొమ్మల మధ్యన ఉన్న ఆగ్నేయచక్రంపై ఎవరైతే నిరంతం ధ్యాస పెట్టుకుని పనిపాటలు చేసుకొంటూంటారో వారే యోగికులంలో చేరబోయే అదృష్టవంతు లౌతారు. అలాంటి ఐశ్వర్యవంతులు మాత్రమే రాబోవు రోజుల్లో నిజమైన ధనవంతులు. వారి వాక్కు అగ్నివలే పనిచేస్తుంది. వారి దృష్టి దరిద్రాన్ని పోగొడుతుంది. రోగాల్ని నాశనం చేస్తుంది. వారే మాకు ఎంతో అవసరపడతారు. వారి కోసమే మా తాపత్రయము. అలాంటి వారికోసమే మా వెతుకులాట" అంటూ మనవైపు పరమ దైన్యంతో చూస్తూ ఈ రహస్య ఆహ్వానాన్ని పంపించారు.

మనం వాడుతోన్న కాలిక్యులేటర్‌లోంచి నేడు కంప్యూటర్ తయారైంది. క్యాలిక్యులేటర్లు, కంప్యూటర్లు మొదలైన నాటి ప్రారంభ దశలో వాటిని తయారుచేస్తోన్న శాస్త్రజ్ఞులు మాట్లాడుకుంటోన్న

మాటల్ని బట్టి వారి అభిప్రాయాన్ని కాస్త గమనించగల్గితే నవ్వొస్తుంది. ఆశ్చర్యం కూడా వేస్తుంటుంది. "అసలు క్యాలిక్యులేటర్స్ అనవసరం. ఈ కంప్యూటర్ భూతం సమాజాన్ని నాశనం చేయడానికొచ్చింది. దీనివల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోగా సమాజాన్ని పరోక్షంగా దెబ్బ తీస్తుంది" అంటూ ఎంతో మంది సైంటిస్టులే అభిప్రాయపడ్డారని మనం పేపర్లలో చదివాము.

ఏదైనా కొత్తగా ప్రారంభించేప్పుడు ఆ విషయం పట్ల సుముఖత కంటే విముఖత ఎక్కువగా కనిపిస్తుంటుంది. దాన్ని పైకి పొక్కనీకుండా అనేక శక్తులు పనిచేస్తుంటాయి. నేడు ఈ అద్భుత విశేష సమయంలో సాక్షాత్తు మహాకాలుడే మనల్ని ఉద్దేశించి కొంగు చాచి ప్రార్థిస్తున్నాడు. ఆ మహాకాలుడైన ఈశ్వరుడు లయకారకుడు కూడా. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో బ్రహ్మ సృష్టిచేయడానికి, విష్ణువు దాన్ని పాలించడానికీ ముందే శివశక్తి, ఆ మహాకాల శక్తి ప్రప్రథమంగా పనిచేయాల్సి ఉంటుంది. ఉదాహరణకి ఓ పెద్ద భవంతి నిర్మించాలన్న ప్రణాళికలో ముందు ఆ మంగళకరమైన కార్యానికి అక్కడున్న చెట్లు, చేమలు కొట్టేసి శిథిలాల్ని ఏరివేయవలసి ఉంటుంది. దాని తరవాతే కదా బ్రహ్మ తన నూతనసృష్టిని ప్రారంభించగలడు ? పరమగురువుల వాక్య ప్రకారము రెండు విశేష శక్తిధారలు భూమ్మీద ప్రసరిస్తున్నాయని తెలుసుకున్నాం. వాటిలో ఒకటి సృజనాత్మక శక్తిధారలు. రెండు విధ్వంసాత్మక శక్తిధారలు. ఈ విశేషకాల ప్రభావం వల్ల రెండూ ఒకేసారి జరుగుతున్నాయి. ఓ పక్క ఏరివేత కార్యక్రమము. అదే సమయంలో నాటడమనే మహత్కార్యము రెండూ ఒకేసారి జరుగు తున్నాయి. ఋషి ప్రణాళిక ప్రకారము జరుగుతోన్న పరమాద్భుతాల్ని మనం గమనించుకోవట్లేదు. జరగబోయే మహత్కార్యాలు ఈ మానవజాతి కనీసం ఊహించనేలేదు. దివ్యాత్మలు కావాలనే వాటిని గోప్యంగా ఉంచదలచుకున్నప్పుడు మనమేదో కనిపెట్టేశామనుకోవడం పిచ్చిభ్రమ. మరివన్నీ మనకెలా తెలుస్తున్నాయి ? పైవారి అనుగ్రహంతోనే, వారిష్ట పూర్వకంగానే ఇలా తెలియజేయ బడుతున్నాయి.



ఇందులో పరమ ఆశ్చర్యకరమైన అంశమేమంటే కోట్లకొలదీ ఉన్న మానవజాతిలో కొద్దిపాటి అనుగ్రహపాత్రులకే ఈ అమృతత్వవిద్య మహత్తరంగా పంచబడుతోంది. ఇక్కడ మనం ఓ విషయాన్ని కాస్త గమనించాల్సి ఉంది. సర్వసమర్థులైన వారికి భూమిని స్వర్గంగా మార్చడం పెద్ద లెక్కలోనిది కాదు. మనల్ని దేవతలుగా మార్చాలంటే కూడా వారు తలచుకుంటే పెద్ద పనేం కాదు. కానీ ఇక్కడ గురుదేవులు ఎంతో స్పష్టంగా తెలియజేసిన రహస్యాంశములోని ఆవేదనను మనం కాస్త అర్థం చేసుకోవల్సిఉంటుంది. 'వ్యక్తులనుంచి సమయానుకూల స్పందన లేకుండా తన దగ్గరున్న ఏ విద్యనైనా గురువులు మనకు అనుగ్రహించలేరు. అది వారి యొక్క బలహీనత అనుకోవచ్చు' అంటుంటారు.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం భరతభూమిలో పాతుకుని పోయి ఉన్నది. భారతదేశానికి స్వాతంత్ర్యం తేవడం కోసం కొంతమంది చర్చించుకుంటుంటే ఎక్కువ మంది నవ్వుకునేవారు ఆరోజుల్లో. ఆ అసంభవాన్ని గురించి పిచ్చిచర్చలు చేస్తోన్న 'చాదస్తపు వాళ్ల' ని గేలి చేసేవారు. నిజానికి స్వతంత్ర్యపోరాటం అనే ప్రయత్నం 1825 లోనే ప్రారంభించబడింది. దానికంటే ఎంతో ముందునించే చాలా సార్లు ప్రారంభించబడి ఆగిపోతూ వచ్చింది. కానీ 1947 వరకు దాని ఫలితాన్ని భారతీయులు పొందలేకపోయారు. స్వాతంత్ర్యం వల్ల మనం ఏం సాధించాం ? దాని వల్ల మనకు ఏం ఒరిగింది ? అనే చర్చకోసం కాదిక్కడ ఈ విషయాల్ని ప్రస్తావిస్తోంది. కేవలం ఉదాహరణగా అందించబడిందంతే.

ఆనాడు కరెంటును కనుక్కున్నవాడు గాని, బల్బును కనుకున్న వాడు గాని ఎన్ని విధాల నిరుత్సాహపరచబడ్డారో తెలుసు మనకు. పెద్ద పెద్ద చదువులు కూడా వారికి లేవు. కరెంటు కనుక్కున్న ఫారడేకైతే మరీ ప్రతికూల వాతావరణం ఉండేది. పాపం ఆయనకు చదువుకునే స్థోమత లేక ఏ ఐదో తరగతిలోనే చదువు మానేసి బతకడం కోసం పుస్తకాలు బైండింగ్ పని చేయాల్సి వచ్చింది. అయితే శాస్త్రం పట్ల అతనికున్న అవగాహన, అతని ఆలోచనలు, అతని లక్ష్యము గురించి

విన్న ఆనాటి సమాజం అతన్ని ఎంతగానో ఎగతాళి చేసేది. సూటీ పోటీ మాటలంటుండేవారతన్ని. అయినా అతనెన్నడూ నిరుత్సాహ పడలేదు. వారే గనక ఆ రోజు నిరుత్సాహపడి తమ లక్ష్యాన్ని వదిలేసి ఉంటే మనమంతా ఇవాళ చీకట్లో ఉండి ఉండేవాళ్ళం. చదువు కుంటేనే తెలివితేటలు వస్తాయనే పిచ్చి భ్రమ మనందరికీ దెయ్యం పట్టినట్టు పట్టింది. ఆనాడు పక్కవాళ్ళు అవహేళన చేస్తున్నారని కరెంటు కనిపెట్టడం కోసం చేసే పని అతను మానేసి ఉంటే ఈనాడు ఈ కంప్యూటర్లు, టెక్నాలజీలు ఇంతగా అభివృద్ధి చెందుండేవేనా ? నేటి ఈ విద్యా విధానం మనిషి స్వతంత్రంగా ఆలోచించే శక్తిని నాశనం చేసి పారేసింది.

ఓసారి గురుదేవులు వారి స్నేహితుడింటికి వెళ్ళారట. వాళ్ళ అమ్మాయి ఐదోతరగతి చదువుతోంది చాలా ఖరీదైన పబ్లిక్ స్కూల్‌లో వీరిద్దరు మాట్లాడుకుంటున్నారు. అక్కడే ఆ పిల్లకూడ పుస్తకాలు ముందరేస్కొని చదువుకుంటోంది. ఆ పిల్ల చదువుతున్న ఇంగ్లీష్ పాఠంలో కొన్ని పదాల స్పెల్లింగ్‌లు తప్పు చదువుతోంది. వెంటనే వాళ్ళనాన్న కలిపించుకొని ఆ పిల్లకి స్పెల్లింగు అలా కాదు ఇలా అంటూ సరిచేయబోయాడుట. దానికాపిల్ల "ఏంకాదు. మా టీచరు ఇలాగే చెప్పింది" అన్నదట. దాంతో ఆ పిల్ల తండ్రి "రామకృష్ణా నువ్వైనా చెప్పవయ్యా !" అన్నాడట. అప్పుడు గురుదేవులు కూడా తండ్రిని సమర్థిస్తూ స్పెల్లింగు సరిచేయబోయారట. అయినాకాని ఆ పిల్ల వాళ్ళ మిస్ చెప్పిందే రైట్ అని వాదనకు దిగిందట. ఇంతాచేసి ఆ పిల్లని వీరిద్దరూ కలిసి ఒప్పించలేకపోయారు. పైగా "ఏంటంకుల్ మీరు కూడా మా నాన్నలాగానే తప్పు చెప్తారు" అందిట.

ఈ విద్యావిధానం పసి బిడ్డల జీవితాల్ని ఏవైపుకు తీసుకు వెళ్తున్నాయో గమనించు కోనటువంటి మన నీచ మనస్తత్వం గురువుల్ని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని గ్రహించాలి. ఈ విషయాల్ని ఆందోళనగా పేర్కొంటూ గురుదేవులు మరో రహస్యాంశాన్ని కూడా ఆవేదనా



పూర్వకంగా తెలియజేశారు. ఈ విద్యావిధానంలోని భయంకరమైన దోషం నేటి విద్యార్థుల్ని కాన్సర్‌వ్యాధి గ్రస్తుల్ని చేస్తోంది. కాన్సర్ వంటి మహా ప్రమాదకరమైన వ్యాధులు రావడానికి కారణం అనవసరమైన ఎక్కువ విషయాల్ని తెలుసుకోవడమే. నేడు జనరల్ నాలెడ్జి పేరున పనికిమాలిన సవాలక్ష ప్రశ్నలకు జవాబులు పిల్లలకు బలవంతంగా నేర్పిస్తున్నారు. ఇదెంత విషపూరితమైన చర్యంటే దీన్ని ఇంతవరకు సహించిన దివ్యాత్మలు ఇకపై సహించబోరు. ఋషుల తీవ్రశాపానికి గురికావల్సి వస్తుంది. ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులు ఈ అంశాల్ని తుది హెచ్చరికగా తీసుకొని వారి పిల్లల పట్ల, వారి చదువుపట్ల సరియైన అవగాహనతో ఆరోగ్య విద్య అందించ లేకపోతే జన్మ జన్మలు మహా ఘోర నరకం అనుభవించాల్సి వస్తుందని ఈ సందర్భంగా తెలియజేయబడుతోంది.

1940 సెప్టెంబరులో పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్యకు ఓ ఉత్తరం వచ్చిందట. దానికి సమాధానంగా వారిలా సెలవిచ్చారు. "ఈ కుళ్ళి పోయిన విద్యావిధానం పనికి మాలిందే అయినా మరో మార్గం లేదు. కాబట్టి ప్రస్తుతానికి ఇంగితాన్ని (కామన్‌సెన్స్‌ని) ఉపయోగించుకుంటూ మీ పిల్లలకు అందుబాటులో ఉన్న ఆరోగ్యకర విద్యనందించేందుకు ప్రయత్నించండి !" అని సమాధానం రాయించారట మాష్టారిచేత.

సరసవతి - సరస్వతి. చక్కగా మాట్లాడడం తెలియాలి. ముఖ్యంగా పిల్లలకు నేర్పించాల్సిందదే. మరి మనమేమో సరస్వతి పూజ స్కూల్లో చేయించేందుకు తర్జన భర్జనలు పడతాం. ఇతర మతాలవారు గబుక్కున గుర్తుకొచ్చేస్తారు. వారేమనుకొంటారో, వీరే మనుకుంటారో అనుకుంటూ ఎవరికి వారు తటస్థంగా ఉంటారు. కనీసం సరస్వతీ ప్రార్థనకూడా పిల్లలకు నేర్పించం. ఆ సరస్వతి స్వరూపంలోని ఆంతర్యాన్ని, అంతరార్థాన్ని గ్రహించలేకుండా ఉన్నాం. దీన్ని రాబోవు రోజుల్లో సరిచేసుకోవాల్సిఉంటుంది. ఆధ్యాత్మిక విద్య పట్ల ఉత్సాహం ఉన్నవారైనా కనీసం దేవతాస్వరూపాల్నీ, వారి చేతిలో

నున్న ఆయుధాల్నీ, వాటి మర్మాలనూ గ్రహించి పిల్లలకు తెలియ జెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భౌతికమైన ఈ విద్య కేవలం ఏ ఉద్యోగాన్నో సంపాదించిపెట్టి కడుపునింపుకోడానికి ఉపయోగపడు తోంది. అదీ ఈ జన్మలోనే. ఈ చదువు మహా అయితే నలుగురులో గొప్పగా బ్రతికేందుకు ఉపయోగపడొచ్చు. అదీ ఈ జన్మవరకే. కాని ఆధ్యాత్మిక విద్య జన్మజన్మలకు నిలిచిఉంటుంది. క్రితం జన్మలో ఈ ఆధ్యాత్మిక విద్య ఎంతవరకు నేర్చుకున్నామో దాని తర్వాతనుంచి ఈ జన్మలో అది కొనసాగింపబడుతుంది. మరో ప్రధానమైనదేమిటంటే ఈ ఆధ్యాత్మిక విద్య జన్మజన్మలకు సుఖశాంతులనిచ్చేది. మరి అలాంటిది కాస్త ఆత్మ పరిశీలన చేసుకుంటే మనకే అర్థమవుతుంది. మామూలు జీవితం గడిపేవారికంటే ఆధ్యాత్మిక జీవితం గడిపేవాళ్ళే సుఖశాంతులు లేకుండా అశాంతిగా ఉంటున్నారు. మరి అలాంటప్పుడు ఆధ్యాత్మికత సుఖశాంతుల్నిస్తుందన్న ఋషుల వాక్యము అసత్యమా ? కాదు. **ఆధ్యాత్మికతను కూడా మన జీవితంలో నటిస్తున్నాం.** నటుడు రంగస్థలంపై కోటీశ్వరుడైనంత మాత్రాన నిజ జీవితంలో అతని కోట్లు ఎందుకైనా పనికొస్తాయా ? అతని ఐశ్వర్యం అతని నిజజీవితంలో ఉపయోగపడ్తుందా ? నటన అనేది ఆధ్యాత్మికతలో కూడా ప్రవేశపెట్ట గలిగిన మన అమాయకత్వము ఇదివరలో దివ్యాత్మల్నీ, ఋషుల్నీ జాలిపడగలిగేట్లు చేసింది. మరి ప్రస్తుత పరిస్థితుల్లో ముంచుకు రాబోతున్న ప్రమాదాల్నించి ఏ మాత్రం కాపాడుకోగలిగే ప్రయత్నం చేయని ఈ మానవజాతి పట్ల దయామయులైన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రోజుకు 2000 మందికి పైగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తయారవు తున్నారు. ప్రభుత్వం, పెద్దలు ఘోష పెడుతున్నా అనేకమందిలో స్పందన కలగడంలేదు. ఈ కంప్యూటర్ యుగంలో కంప్యూటర్ వాడుతున్న వారికి ఓ విచిత్రమైన రోగం వస్తోంది. "ఈ కంప్యూటర్‌ని నాశనం చేసేయండి. లేకపోతే అది మానవజాతిని నాశనం చేస్తుంది" అంటూ మొన్న 2000వ సంవత్సరములో జరిగిన శాస్త్రవేత్తల సభలో ఎంతో మంది శాస్త్రవేత్తలు కంప్యూటర్‌ని వ్యతిరేకించారు. అసలది ఉండనే ఉండకూడదన్నారు. 'యాంటి ఇంటిగ్రేటెడ్ సైకిక్ సింద్రోం' (A.I.C.S.) ఎయిక్స్ అనే విచిత్రమైన రోగం కేవలం కంప్యూటర్ వాడుతున్న వారికే వ్యాపిస్తోందన్నారు. ఈ విషయాలు కూడా మనలో చాలా మందికి తెలుసు. అయినా మనలో ఎలాంటి స్పందనా లేదు. దొంగకు తేలు కుట్టినట్లు ఎవరికి వారము నిశ్శబ్దంగా ఉండి పోతున్నాం. ఇవికాక ఇంకా చిత్రవిచిత్రమైన కొత్త కొత్త రోగాలు రాబోతున్నాయి. డిశంబర్ 7న ఎంతో మంది శాస్త్రజ్ఞులు (W.H.O.) సర్వసభ్య సమావేశంలో ఇలాంటి సభనొకదాన్ని ఏర్పాటు చేసుకొని ఎంతో అరుదైన, ఆశ్చర్యకరమైన అంశాల్ని వెలిబుచ్చారు. గాయత్రీ మంత్రం గురించి ప్రస్తావిస్తూ ఎయిడ్స్‌వ్యాధి గాయత్రీ మంత్రంతో ఆశ్చర్యకరంగా నయం చేసుకోవచ్చు" అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయం అనేక పత్రికల్లో వచ్చింది. లక్షలమంది చదివారు. అయినా మనలో స్పందన రాలేదు.

ప్రబుద్ధాత్మలు, పరమగురువుల ద్వారా వెల్లడవుతున్న అనేక అమృతమయ రహస్యాంశాల్ని పూజ్యగురుదేవుల ఆదేశానుసారము పుస్తక రూపంలోకి మార్చి ప్రపంచానికి అందజేయడమనే బృహత్ప్రణాళికలో కొంతమంది మిత్రులు, భక్తులు స్వచ్ఛందంగా తమ తమ సహకారాన్నందిస్తూ మాతో పనిచేస్తున్నారు. శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో పెద్ద సంఖ్యలో సందర్శనార్థం వచ్చే భక్తకోటికి కొందరు కార్యకర్తలు సమూహంగా ఏర్పడి ఈ మహత్తరాంశాలతో నిండిన పుస్తకాలను యావన్మందికీ అందజేస్తూ తిరుగుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల మనుష్యులకి ఋషుల ఆవేదనాపూర్వక వాక్యాలుకూడా స్పందన కల్గించడం లేదు. కొన్ని కొన్ని చోట్ల ఈ అంశాలపట్ల చాలా మంది ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. అక్కడక్కడా చాలా అరుదుగా ఓ వర్గంవారు కనిపిస్తుంటారు. మా సంస్థ, మీ సంస్థ - మా గురువు, మీ

గురువు అంటూ గురువులమధ్య సంస్థలమధ్య పెద్దపెద్ద కందకాలు తవ్వుకుంటూ అదోలోకం, ఇదోలోకం అన్నట్లు ప్రవర్తిస్తుంటారు. ఓ మహత్తర సత్యాన్ని మన మనస్సుల్లో బాగా ముద్రించుకోవాలి. ఏంటంటే **గురువులంతా ఒక్కటే. సద్గురువు ఎన్నడూ మరణించడు. మనకి చావకుండా బతికుండడం ఎలా చేతగాదో అలాగే ఆయనకి చనిపోవటం రాదు.**

ఇది మరీ బాగుంది. మన కళ్ళముందే గదా షిర్డిబాబా, భరద్వాజ మాస్టారు, శ్రీరామశర్మ ఆచార్య, మాతాభగవతీదేవి, శ్రీరామకృష్ణ పరమహంస ఇంతమంది మన కళ్ళముందే కదా మరణించారు. మరి వాళ్ళు కూడా మిగతా వాళ్ళలాగా ఇలా చనిపోతుంటే వాళ్ళని అమరులు అంటారేంటి ? అననిపిస్తుంది చాలా మందికి. ఇక్కడే మనం కాస్త విజ్ఞతనుపయోగించాల్సిన అవసరం ఉంది. ఖచ్చితంగా వాళ్ళు అమరులే. ఓ ప్రణాళిక ప్రకారం వాళ్ళు అనుకొని శరీరాలొదిలేస్తారే తప్ప మామూలు మనుషుల్లాగా చచ్చిపోవడం కాదది. జీసెస్ వరకు అక్ఖరలేదు. సశరీరంగా షిరిడీసాయి దర్శనమివ్వడం చాలా మందికి తెలుసు. అంతవరకూ అక్ఖర్లా. మన పరివార్ సభ్యులకే ఎన్నో అనుభవాలు. ముఖ్యంగా శ్రీ మారెళ్ల శ్రీరామకృష్ణ గురుదేవులతో పరిచయమున్న ప్రతి ఒక్కరికీ - ఇంకా ముఖ్యంగా వారి ప్రవచనామృతాన్ని విన్న అనేకానేక మందికి అమితాశ్చర్యకర అనుభూతులు ఉన్నాయి. ప్రతిరోజు క్రమం తప్పకుండా చక్కటి క్రమశిక్షణతో భగవాన్ శ్రీ మారెళ్లవారి నివాసంలో జరుగుతూండే ప్రవచనానికి ఆ రోజు హాజరైన వారు నిజంగా ఎంతో ఉన్నతశ్రేణికి చెందిన సాధకులని చెప్పవచ్చు.

రోజూలానే ఆ రోజు కూడా శ్రీ మాస్టారు ప్రవచన సమయానికి వారి గదిలోంచి ఎంతో ఉల్లాసంగా వేదికవైపు రావడం గమనించాం మనం. నాడు ప్రవచనం సందర్భంగా వారందించిన ఓ అమృతమయ సందేశం నిజంగా ఎంతో అమితానందాన్నిచ్చింది. ఆనాటి వారి ఉల్లాసానికి కారణం తెలిసికొని ఎంతగానో ఆనందించాం. పగలు రాత్రి నిర్విరామంగా మాచేత అత్యంత కీలకమైన సాధనలు చేయిస్తూ



మాస్టారు మధ్య మధ్య సాధనా రహస్యాల్ని అందజేస్తూ సాధకుల్ని తీర్చిదిద్దడంకోసం శ్రమిస్తోన్న రోజులవి. ఆ పనిలో వారు తమ అనారోగ్యాన్ని సైతం లెక్క చేసేవారు కాదు. ఆ రోజు వారి ప్రవచనంలో అక్కడి వారినుద్దేశించి "ఇవాళ దూర్వాసమహర్షి ఇక్కడకు రావడం జరిగింది. ఇక్కడ జరుగుతున్న సాధనలూ అవీ నిశితంగా గమనిస్తున్నాట్ట ఆయన. మీరెంతో అదృష్టవంతులు. ఎందుకంటే మీ సాధనలు ఆయనకెంతో నచ్చాయట. ఇలాగే కొనసాగించండని మిమ్మల్ని ఆశీర్వదించి వెళ్ళాడాయన. Keep it up". అన్నారు మాస్టారు మనల్ని అభినందిస్తూ.

వేల వేల సంవత్సరాల నాటి మహర్షి ఆయన దూర్వాసుడు. అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటనలెన్నో చూశాం అక్కడ. మచ్చుకు ఒకటి రెండు మాత్రమే వీటిని ఇక్కడ ఉదహరిస్తున్నాం. షిరిడీసాయి మాస్టారి దగ్గరికి వచ్చి తనతోపాటు ఆయనా ఉండిపోతానన్నారట అక్కడ. తక్షణం రాత్రికిరాత్రి తమ నివాసానికి నైఋతి భాగాన అత్యంత రమణీయమైన సాయి మందిర నిర్మాణానికి సంకల్పించారు శ్రీ మాస్టారు. అప్పటికప్పుడే దానికి సంబంధించిన పనులు ప్రారంభించ బడ్డాయి. సాయికెదురుగా పృథ్వీ మీద ప్రప్రథమంగా ఓ విశేషమైన శైలిలో ఆగ్నేయభాగాన ధుని ఏర్పాటు చేయబడింది. శివలింగాకారంలో నిర్మించబడిన ఆ ధుని ప్రారంభోత్సవానికి వేలాదిమందిమి హాజరయ్యాం. షిరిడీనించి, ఒంగోలు భరద్వాజ మాస్టారు కట్టించిన సాయి మందిరం లోని ధునినించి అగ్ని తెప్పించబడింది. అంతేకాదు భగవాన్ శ్రీ మారెళ్ళవారి అనుగ్రహ విశేషం చేత ఆశ్చర్యపరుస్తూ ఓ వ్యక్తి హరిద్వార్ నుంచి రావడం జరిగింది. అక్కడ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీదేవిశర్మల స్వహస్తాలతో వెలిగించబడి నాటినుంచి వారి దివ్య సంరక్షణలో అలా అఖండంగా నేటికీ ప్రజ్వరిల్లు తున్న అఖండదీపం నించి వెలిగించుకున్న ఓ దివ్యజ్యోతిని తనతో పాటు తెచ్చాడాయన. సరిగ్గా ధుని ప్రారంభించబడబోయే సమయానికి దాన్ని ఆయన తేవడం నిజంగా విశేషం. పరమాశ్చర్యముకూడా.

హిమాలయాలలో శివపార్వతుల కళ్యాణం జరిగినప్పుడు వెలిగించబడిన యజ్ఞాగ్ని ఆ జగత్పితరుల అఖండశక్తి ప్రభావం చేత నేటికీ చల్లారకుండా అలా వెలుగుతూనే ఉంది. పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీదేవిశర్మల దివ్యసంరక్షణలో అఖండంగా నేటికీ హరిద్వార్‌లో వెలుగుతోన్న ఆ అఖండజ్యోతి - ఆ శివపార్వతుల కళ్యాణవేదిక మీది యజ్ఞాగ్నితోనే ఆనాడు ప్రతిష్ఠించ బడింది.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే ఆనాటి ఆ ధుని ప్రారంభోత్సవానికి స్వయంగా దాదా గురుదేవులే విజయం చేశారు. ఆనాటి ఈ సంరంభోత్స వాలను వీడియో తీస్తోన్న వీడియోగ్రాఫర్ ధునికి దూరంగా నిలబడి వీడియో కవర్ చేస్తున్నాడు. అత్యంత కోలాహలంగా ఉన్న సప్తర్షి ఆశ్రమంలో 'తప్పుకోమనండి, తప్పుకోమనండ'ంటూ అతనేసిన కేకలు ఎవరూ పట్టించుకోలేదు. అరవగా అరవగా కొందరు సోదరీ మణులు అతని దగ్గరకెళ్ళి 'ఎవరు తప్పుకోవాలి ?' అనడిగారు. అందుకతనిలా అన్నాడు. "అక్కడ మంట పెద్దదిగా మండుతోంటే ఆ పెద్దాయన మంటకి మరీ దగ్గరదగ్గరగా వెళతాడేంటి ? ఎవరూ తప్పుకోమని చెప్పరేం ?" అంటూ తనే ఆశ్చర్యపోయాడు. ఆ మంట దగ్గరే కాదు ఆ పరిసరాల్లోనే అలాంటి వారెవరూ కనబడలేదు. వెంటనే కొద్దిక్షణాల క్రితం తను కవర్‌చేసిన వీడియో చిత్రాన్ని రివైండ్‌చేసుకొని కెమేరాలోనే చూశాడతను. ఓ సాధువులాంటి బారుగడ్డం ఉన్నాయన ధునికడ్డం నిలబడి మంటకు దగ్గరగా నుంచొని చూస్తున్నాడు. తను చూసిన ఆ దృశ్యాన్ని ఆశ్చర్యపోతూ అక్కడి వాళ్ళందరికీ చూపించాడు. సందేహమే లేదు. స్పష్టంగా దాదాగురుదేవులే. ఎవరో గబగబా అతనిదగ్గర కెమెరా లాక్కొని మాష్టారి దగ్గరికి తీసుకెళ్ళి చూపించారా దృశ్యాన్ని. అప్పుడు మాష్టారన్న మాటలు ఇంతకన్నా ఆశ్చర్యపరచాయి మమ్మల్ని. "వస్తారమ్మా ! ఎందుకు రారు ?" అన్నారు చాలా క్యాజువల్‌గా వీడియోవైపు చూడకుండానే. ప్రస్తుతం ఆ క్యాసెట్ అలా అలా చేతులు మారి ఎక్కడికెళ్ళిందో ? ఎవరి ర్యాక్‌లో బంధింప బడిందో ?



శ్రీజగజ్జననీ మహాయోగేశ్వరీదేవి భూమిపై ఆవిష్కరింపబడే సుముహూర్తాన మాష్టారిచేత స్వయంగా నిర్వహింపబడుతోన్న మహా యజ్ఞంలో తీసిన ఫోటోగ్రాఫ్స్‌లో అత్యంత కాంతివంతమైన వెలుగురేఖ ఒకటి ఆకాశంనించి మాష్టారివైపు దూసుకురావడం పడింది. అప్పుడే కాదు వందలసార్లు మాష్టారి ఫోటోగ్రాఫ్‌తోబాటు మిరుమిట్లుగొలిపే కాంతి కిరణాలు మాష్టారివైపు దూసుకురాడం, తారాజువ్వల్లాంటి వెలుగుపుంజాలు యజ్ఞగుండాల చుట్టూ కందిరీగల్లాగా తిరుగాడడం, యజ్ఞగుండంలోంచి శక్తిరేఖలు వెలుగురూపంలో విరజిమ్మబడు తుండడం. వెలుగుతోన్న దీపాలలోంచి బ్రహ్మాండమైన కాంతిపుంజాలు నలువైపులా ప్రసరించడం వంటివే కాక కొన్ని కొన్ని చోట్ల జరిగిన వందలాదిమంది పాల్గొన్న సామూహిక దీపయజ్ఞాల్లో తీసిన ఫోటోల్లో ప్రతి ప్రమిదకు ఓ రేఖచొప్పున అంతరిక్షంనించి శక్తిప్రసారం జరుగు తున్నట్లు స్పష్టంగా పడ్డాయి. తెనాలి చుట్టుప్రక్కల చాలా గ్రామాలో ఈ దివ్యానుభవాన్ని ఎంతో మంది కళ్ళారా చూశారు. ముఖ్యంగా కొత్తపాలెం (రేపల్లె దగ్గర) లో ఈ అనుభూతిని ఊరివాళ్ళు తమ కెమెరాల్లో బంధించారు. నేటికీ అవూళ్ళో ఫోటోలు చూడవచ్చు. ఓసారి ఎవరో మాష్టార్ని అడగనే అడిగారు. అందుకు ఆయన 'ఏమో ఇలాంటి చమత్కారాలు మీకు చూపించాలనుకుంటున్నారేమో వాళ్ళు' అన్నారు మామూలుగా చిరునవ్వు నవ్వేస్తూ.

దివ్యాత్మ స్వరూపుడైన భగవాన్ శ్రీ మారెళ్ల శ్రీరామకృష్ణ నిర్వహించిన అనేకానేక మహత్తరమైన యజ్ఞక్రతువులు ఒక ఎత్తైతే, వారి దివ్య సంరక్షణలో అత్యద్భుతమైన వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో విశేషంగా జరుపబడిన కొన్ని యజ్ఞాలు మరో ఎత్తు. ఆ యజ్ఞాలలో మధ్యమధ్యలో వారు అక్కడి వారినుద్దేశించి ఇలా అనేవారు. "యజ్ఞ గుండాల దగ్గర కూర్చొని యజ్ఞాగ్నికి ఆహుతులు సమర్పించడం ఏదో మామూలు విషయమనుకోకండి. ప్రత్యేకించి ఈ యజ్ఞాల్లో మనమెంతో అప్రమత్తతతో మెలగాల్సి ఉంది. యజ్ఞానికి హాజరైన మిగతావారు

కూడా శ్రద్ధాభక్తులతో ఉండండి. మీ కాళ్ళు, చేతులు కదిల్చేటప్పుడు కాస్త జాగ్రత్తగా వ్యవహరించండి. ఎందరో మహాత్ములు, అశరీరధారులు మీమధ్యన కిక్కిరిసి కూర్చుని ఉన్నారు. ఇక్కడ జరుగుతున్న యజ్ఞాలు మామూలు యజ్ఞాలుకావు. ఉత్తరద్వారం వైపునించి కోలాహలంగా ఈ యజ్ఞానికి హాజరౌతున్న ఋషులకు, దివ్యాత్మలకు దారివ్వండి !'' అంటూ మధ్యమధ్యన హెచ్చరికలు చేసేవారు. శారీరకంగా ఎంతో నీరసంగా, బలహీనంగా ఉన్నప్పుడు కూడా పరిస్థితుల్ని గమనించు కుంటూ కనీసం కూర్చునేందుకు కూడా ఓపిక లేకపోయినా ఎలాగోలా అలానే వేదికమీదికొచ్చి ఈ ప్రత్యేక సూచనలు చేస్తుండేవారు భగవాన్ శ్రీ మారెళ్ళ.

కాబట్టి గురువులు అమరులు. వారు కనిపించాలనుకున్నప్పుడు కనిపించగలరు. మాట్లాడాలనుకున్నప్పుడు మాట్లాడగలరు. కనిపించ కుండా వినిపించగలరు. శరీరాలొదిలేసి వేల వేల సంవత్సరాలైనా మన మన పాత్రతలనుబట్టి మనపై అనుగ్రహ వర్షాన్ని కురిపిస్తుంటారు.

లాహిరీ మహాశయ ఒకసారి తనకు పరిచయమున్న అశరీర ధారిగురించి అతని స్నేహితులకి చెప్పారు. వాళ్ళు నమ్మకపోయే సరికి వారందరినీ ఓ విశాలమైన గదిలోకి ఆహ్వానించి తలుపులన్నీ వేసి అప్పుడు తనకు పరిచయమున్న ఆ అశరీరధారిని రమ్మని పిలిచాడు. ఇతరులను నమ్మించడం కోసం ఆయన చేసిన ఆ ప్రయత్నం సరియైనది కాదంటూ ఆనాటి నుంచీ ఆ అశరీరధారి "నువ్వు పిలిచి నప్పుడు నేను రాను, నాకు రావాలనిపించినపుడు నేనే వస్తాను" అంటూ ఆ అశరీరధారి తన ఒప్పందాన్ని మార్చుకోవలసి వచ్చింది. కనుక మనం కూడా అలాంటి పిచ్చిపనులు చేయకూడదు. నమ్మిన వాళ్ళు నమ్ముతారు. నమ్మనివాళ్ళు నమ్మరు. మరి అలా అనుకున్నప్పుడు ఇవన్నీ రాయడం దేనికి ? అనిపించవచ్చు. కాలప్రభావం వల్లనో మరిదేనివల్లనో ఆధ్యాత్మికతలో కూడా కాలుష్యం చోటుచేసుకుంది. అబద్ధమాడటం, అతిశయోక్తులు చెప్పడం చేతకానటువంటి మహి



మహితాత్ములను, వారి అమృత వాక్కులను సైతం అజ్ఞానంచేత సరిగా అర్థం చేసుకోలేకపోవడం వల్ల ఎందరో అమాయకులు అనేకసార్లు సందిగ్ధంలో పడుతూండడం జరుగుతోంది. మాష్టర్ EK గారన్నట్లు **"మనిషి సాటి మనిషితో ఎన్నిసార్లు మోసగింపబడ్డా కూడా మళ్ళీ మళ్ళీ మనిషినే నమ్మవలసిఉంది. ఇక వేరే దారి లేదు."**

అసలు నమ్మకం లేనివాళ్ళ జోలికి మనం పోవద్దు. ఆధ్యాత్మిక జగత్తులో ఈ కాలప్రభావంచేత అలముకోబడిన అనుమానాస్పద కారుమేఘాల చీకట్లనించి బయటపడలేక కొట్టుమిట్టాడుతోన్న సాటి వారికీ సమాచారం ఎంతో ఉపయోగపడవచ్చు. వారినెంతో ప్రోత్సాహ పరుస్తాయీ విషయాలు.

కాబట్టి అలాంటి అమరులైన గురువులు అప్పుడప్పుడు మనకు వారి ఉనికిని ఎరుకపరుస్తుంటారు. చిన్న చిన్న చమత్కారాల్ని చూపు తుంటారు. ఓ చోట Savings Bank Pass Book మీద Savings కు బదులు 'సాయి వింగ్స్' అనే అక్షరాలు పడ్డాయి. సాయి చూపించిన చమత్కారమది. దీనివల్ల ఆ సాయి భక్తుడు మరింత భక్తుడై, గొప్ప సాధకుడై పట్టుదలతో సాయికి శిష్యుడిగా మారగలడు లేదా అహం కారంతో, పిచ్చిగర్వంతో తనకు సాయి చూపిన చమత్కారాన్ని అసంఖ్యాక జనవాహినికి ప్రకటించుకొని శుద్ధ మూర్ఖుడుగా మారి సాయి అను గ్రహాన్ని సైతం బూడిదపాలు చేసుకోగలడు. కాబట్టి అలా సద్గురుని అనుగ్రహాన్ని చమత్కార రూపంలోనో, మహత్యాలుగానో, లీలలుగానో గుర్తించిన మనం అటుపైకైనా వెళ్ళగలం, ఇటు పతనమైనా అవగలం. మన పతనానికి గురువులు కారకులెన్నటికీ కాగూడదనే సదుద్దేశ్యంతో మామూలుగా సాధ్యమైనంతవరకు మనకు గురువులు చమత్కారాల వంటివి చూపించరు. సహజ ప్రేమమూర్తులైన ఆ దివ్యాత్మలు అడపా దడపా ఆనందం పట్టలేక ప్రేమ కురిపించినా, ఒకటి రెండు చమత్కారాలు మనక్కనిపించినా దానిపట్ల మన మానసికస్థితి వారాశించినట్లు పైపైపుకు ఉంటే పర్వాలేదు. అలా లేకపోతే ఇక వారి మహత్యాల్నీ, లీలల్నీ

మనక్కనిపించేట్టు చేయరు. ఈ విషయంలో వారెంతో అప్రమత్తంగా ఉంటారు. చేసే సాధన కొద్దిపాటిదైనా కొండంత చేస్తున్నట్టు ప్రకటించుకునే వారు కోకొల్లలుగా ఉన్నారీరోజుల్లో. అలాంటివారి సాధనలు ఫలించవు. అందుకే పూజ్య గురుదేవులు "నీవు సాధకుడవని ఎవరికీ తెలియనీయ నక్కరలేదు. అలాంటి వారి సాధనలు అమితాశ్చర్యకరఫలితాలనిస్తాయ"న్నారు. మన మధ్య మామూలు మనుషుల్లా సామాన్యంగా జీవిస్తోన్న ఎంతో మంది సాధకులున్నారు. అశరీరధారులతో స్నేహసంబంధాలున్న వారెందరో ఉన్నారు. వారు బయటపడడానికి ఇష్టపడరు.

లాహిరీమహాశయ దీనికి పెద్ద ఉదాహరణ. ఆయన గురించి మాష్టారు చెప్తూ వారు జగద్గురుస్థాయి వ్యక్తి అని కీర్తించేవారు. అంతటి మహోన్నత వ్యక్తి మిలటరీలో స్టోర్ కీపర్‌గా అతి చిన్న ఉద్యోగం చేస్తూ అందులో వచ్చే జీతం తన కుటుంబ పోషణకు సరిపోక ట్యూషన్స్ చెప్పేవారాయన. కుటుంబ బాధ్యతల నిర్వహణకి అంతలా కష్టపడితేనే గానీ సరిపోయేదికాదు. ఆధ్యాత్మిక జీవితంలో ఉత్కృష్టస్థాయికి చెందిన ఆ మహాశయుడు తను చేస్తోన్న చిన్న ఉద్యోగాన్ని నిర్లక్ష్యపరచలేదు. ఆయన ఓరోజు తన పైఅధికారి సంతకాల కోసం ఫైళ్ళను చేత్తో మోస్తూ ఆఫీసరుగారి గదిలోకెళ్ళాడు. అదే సమయానికి ఆఫీసరుగారి భార్య కూడా అక్కడే ఉంది. లాహిరీ మహాశయను చూసీ చూడటంతోటే సంభ్రమాశ్చర్యాలతో అరిచినంత పనిచేసింది. 'ఈయనే నేను చావు బతుకుల మధ్య ఉంటే నన్ను బతికించాడ'ంటూ భర్తతో చెప్పిందామె ఎంతో ఉద్వేగంతో.

పరమగురువుల అనుగ్రహం వల్ల సమర్థ సద్గురు వేదపీఠము ద్వారా అందించబడుతోన్న అమరత్వ విద్యకు సంబంధించిన అమూల్యాంశాలివి. వెంకయ్యస్వామి అంటుండేవారు 'మైసూరు మహారాజు మీఇంటి ముందునించి వెళ్తే ఏంటిట ?' అలాగే వారెవరికో ఫలానా లాభమొచ్చింది. ఐతే ఏంటిట వస్తే ? కుంకుడుకాయలు కొడుతూంటే పక్కనున్న గుండ్రాయి అలా గాల్లోకి పైకి లేచిందిట



అయితే ఏంటిట ? కాలిమీద పడకుండా చూసుకోవాలి అంటుంటారు మాష్టారు. గురువులు ఎలా ఆలోచిస్తుంటారంటే తను నేర్పుతోన్న విద్య శిష్యుడు నేర్చుకోలేకపోతే అంటే పరీక్షల్లో తప్పితే గురువుగా ఆయన తప్పినట్లే అనుకుంటారు. విద్యార్థికి అర్థమయ్యేట్లు తనే చెప్పలేకపోయానని అనుకొంటారు. ఎంతో బాధ పడతారు.

అదివరకు రోజుల్లో ఓ పాతికేళ్ళు, నలభైఏళ్ళు తపస్సులు, సాధనలు చేశాక అప్పుడు వారిని శిష్యులుగా స్వీకరించి ఈ విద్యను నేర్పేవారు. సాయికి 12 సంవత్సరాలు, వెంకయ్యస్వామికి 13 సంవత్సరాలు పట్టిందని తెలుసుకున్నాం కదా ! ఇంతవరకు ఇంత బాహాటంగా మీరీవిద్య నేర్చుకోండని చెప్పబడలేదు. జన్మజన్మల అదృష్టం వల్ల ఎవరికి వారు ఆస్థితికి ఎదిగితే ఎదుగుతారు లేకపోతే వారి ఖర్మ. అలా ఇదివరకటిలా అనుకునే పరిస్థితులు నేడు తారుమారయ్యాయి. ఆధ్యాత్మికతలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల్లో ప్రధానమైందిది. గురువులు మనల్ని అమరులుగా తీర్చిదిద్దడమే కాదు అమరత్వ విద్య మనకు నేర్పుతామంటూ బల్ల గుద్ది మరి చెప్తున్నారు. ఉద్యోగ మొస్తుందో రాదో తెలీదుగానీ లక్షలు పోసి సంవత్సరాల పాటు చదువుతున్నాం. మరి అలాంటి మనకు సమర్థ సద్గురు రహస్య ఆహ్వానం అందినా - 'ఖచ్చితంగా మీ జీవితాలు మారిపోయి, మీరు అమరులై పోతారు' - అని ఋషులు చెప్తోన్నా మనలో స్పందన కలుగకపోవడం నీచాతి నీచమైన మన మానసిక స్థితిని తెలియజేస్తోంది. ఆ దయామయులు మరో అమృతతుల్యమైన విషయాన్ని కూడా ప్రకటిస్తున్నారు. అత్యద్భుతమైన విలక్షణమైన ఆ అమరత్వాన్నిచ్చే చేతనత్వాన్ని పొందడం చాలా సులభం.

పతంజలి మహర్షి అబద్ధం చెప్పలేదు.

తీవ్రసంవేగానాం ఆసన్నః

తక్షణం పనిచేయగలిగే మానసిక స్థితి మిమ్మల్ని ఎంతో ఎత్తు కెదిగేలా చేస్తుంది.

మానవమాత్రుడుూహించని రోగాలు రాబోతున్నాయి. AIDS కి మించిన వేగంతో పాకిపోయే AICS రెండు దఫాలుగా కబళిస్తుంది. మొదటిదఫా స్ట్రోక్ మనపైన పడనే పడింది. దాని ప్రభావం వల్ల ఏది ముఖ్యమో దాని జోలికిపోము. ముఖ్యము కాని దానివైపు, ప్రమాదాన్ని కలిగించే దానికోసం వెంపర్లాడటం; మంచి అని తెలిసినా ఆచరించలేని పరిస్థితి; చెడు అని తెలిసినా మానుకోలేకపోవడం ఇవన్నీ AICS రోగ లక్షణాలని గురుదేవులు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్వాసమహావిజ్ఞానంతో పద్దెనిమిదిరకాల మహావ్యాధుల్ని సైతం పారిపోయేలా చేయగలరన్నారు. ఎన్నెన్నిసార్లు పుట్టినా మరిన్నిసార్లు చచ్చినా, ఎలాంటివారైనా, ఎవరైనా, ఎప్పటికైనా సరే నేర్చుకోవలసిన ఏకైక విద్యయిదే. పరిస్థితులు చేయి జారిపోయాక వెన్నులో బలం హరించి పోయాక చేయగలిగేదేమీ లేదు పశ్చాత్తాపపడటం తప్ప.

అందుకే సత్యసాయి తరచూ ఓ కథ చెబుతుంటారు. ఏ గుడిలోకో వెళ్ళబోతూ ఏ పక్కింటి వాళ్ళకో, ఏ కొబ్బరికాయలవాడికో కాస్త చెప్పులు చూస్తూండమంటే పెద్దగా ఇష్టం లేకపోయినా అలాగే వెళ్ళిరండంటారు. అదే శవాన్ని మోసుకెళ్తున్న నలుగురు "శ్మశానం చాలా దూరముంది. వీడెవడోగానీ బాగా బరువుగా ఉన్నాడు. చేతులు నొప్పెడుతున్నాయి. కాసేపు మీ పంచలో దింపుకుంటామ"ంటే ఎవరైనా ఒప్పుకుంటారా ? అంటే శ్వాస ఆగిపోయిన శరీరము చెప్పులకన్నా హీనాతిహీనమైంది. కాబట్టి ఈ శరీరంలో శ్వాస పరుగులు పెడుతున్నంత కాలంలోనే నీవు చేయ దలుచుకున్నదేమైనా ఉంటే చేసేయగలగడం తెలివైన పని.

కష్టపడకుండా అంత ఆషామాషీగా గురువులేదీ ఇవ్వరు. ఆధ్యాత్మికత పట్ల ఈ మధ్యకాలంలో అవగాహనా లోపం ఏర్పడింది. ఆశ్రమము అంటే కాలయాపన చేయడానికి అలవాటుపడిన కొంత మంది చవటలు సోమరిపోతుల్లా ఓ చోట చేరే సురక్షిత కేంద్రం అనే అభిప్రాయం బాగా ప్రబలిపోయేట్టు చేశారు. అందువల్లనే మన పిల్లల్ని



అలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలకి పంపించడానికి సిగ్గుపడుతున్నాం. భయపడుతున్నాము. అక్కడికెళ్ళి సోమరుల్లా తయారై పాడైపోతారని మన భయం. నిజానికి బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక సంస్థ ఉందని తెలిస్తే, ఈ అమృతమయ విద్య పట్ల సరియైన అవగాహన గనక మనకి ఉండి ఉంటే, మన పిల్లల్ని ఖచ్చితంగా అక్కడే వదిలేసాస్తాం. పూర్వ కాలంలో మహా మహా రాజులే చేశారాపని.

గురువుల దగ్గర ఏ విద్యైనా అంత ఈజీగా కొట్టెయ్యలేము. షిరిడీసాయి గానీ, రామకృష్ణపరమహంసగానీ, వివేకానందగానీ మరొకరుగానీ తమ శిష్యుల్ని సుకుమారంగా ముద్దుగా, పువ్వులా చూసుకోలేదు. చావగొట్టి చెవులు మూశారు. గురువుగా షిరిడీసాయి శిష్యుడైన ఉపాసనీ బాబాని సంవత్సరాలపాటు ఖండోబా మందిరంలో ఉంచాడు. ఎయిర్ కండిషన్ గుడేం కాదది. తేళ్ళు, జెర్రులు తిరిగేవక్కడ. ఎన్నోసార్లు కుట్టేవికూడా. దోమతెరలు, స్నానానికి వేణ్ణీళ్ళు గట్రా వంటివేమీ అరేంజ్ చేయబడలేదు. మరంత కష్ట పడ్డాక సాయి చేతనే 'నువ్వు నా అంతటి వాడవయ్యావ'నిపించుకో గలిగాడు. ఆధ్యాత్మిక జీవితంలో తేళ్ళు, జెర్రులు, దోమలు పీకుతూనే ఉంటాయి. చుట్టాలు, పక్కాలు, బంధువులు, మిత్రులు అదృష్టం ఇంకా బావుంటే ఇంట్లోవాళ్ళూ తేళ్ళల్లా, దోమల్లా పాకుతూ పీకు తుంటారు. రకరకాల విమర్శలు చేస్తుంటారు. నిజంగా మనకు గురువుల పట్ల, ఋషివాక్కుల పట్ల, ఆధ్యాత్మిక విద్యపట్ల విశ్వాసము, అభిరుచి ఉంటే మనం నమ్మినదాన్ని ఆచరిస్తోన్నప్పుడు ఎదురయ్యే సూటీపోటీ మాటల్ని పట్టించుకోం. "దద్దమ్మలు వాగుతున్నార్లే" అనుకుంటాం.

"పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య చెప్పినట్లు మనం మారుదాం యుగం మారుతుందన్నది గుర్తు చేసుకుంటుండాలి అని చెప్తూ మాష్టారు యుగం మారడమంటే అందరికీ మారదు. ఎవరైతే ఋషి ప్రణాళిక ప్రకారము గురువులకనుగుణ్యంగా తమ మానసికస్థితిని

మార్చుకున్నారో అలాంటివారికి స్వర్ణయుగము. చదువుకున్నవాడికి చదువొస్తుంది. యూనివర్సిటీలో చదువుతాడు. చదువురానివాడు చచ్చేంపోడు. చాలీ చాలని జీతంతో కుటుంబాన్నీడుస్తూండాల్సి వస్తుంది. అలాగే సమర్థ సద్గురువుల రహస్య ఆహ్వానాన్ని నిర్లక్ష్యపరచిన మానవులు రాబోవు రోజుల్లో శాంతి, సుఖము, సమృద్ధి అనే మూడు వరాలకు దూరమై రోగగ్రస్థమైన జీవనం సాగించాల్సి రావచ్చు" అన్నారు.

ఓరోజు మాష్టారు పనిచేస్తోన్న కాలేజీ స్టాఫ్ రూమ్‌లోకి అత్తర్లు, స్ప్రేయర్లు పట్టుకొని ఒకాయన లోపలికొచ్చాట్ట. ఓ లెక్చరర్‌కి ఏ సెంటో శ్యాంపిల్‌గా షర్టుమీద స్ప్రేచేసి బావుంటుంది తీసుకోండన్నాట్ట. స్ప్రే చేయంగానే మొత్తం గదంతా గుప్పుమని మల్లెపూల సువాసన గుబాళించిందిట. ఈలోగా మాటల్లోపడి కాసేపయ్యాక "ఏమయ్యా కొట్టినప్పుడు మంచి వాసనే వచ్చింది. ఇప్పుడసలు రావట్లేదేంటి నీ దగ్గర చవకబారు అత్తర్లే ఉన్నాయిలా ఉందే" అన్నారట లెక్చర్లంతా. దాని తర్వాత కాసేపయ్యాక ఓ లెక్చరర్ అప్పుడే లోపలికొస్తూ "అబ్బో ఇవాళ మన స్టాఫ్‌రూమ్ మల్లెపూల అంగడిలా గుబాళించిపోతోందేంటి ?" అంటూ తెగ పరవశించి పోయాడట. కానీ అక్కడున్న వాళ్ళకి మాత్రం వాసన తగలటల్లేదు. అత్తర్లమ్మేవాడు స్ప్రేచేసి చేయంగానే కాసేపు తాత్కాలికంగా వచ్చిన ఆ సువాసన మళ్ళీ లేదు. మరి బయటినించి అప్పుడే వచ్చిన అతనికెక్కడనుంచి వచ్చింది సువాసన ? అంటే అక్కడి వాళ్ళందరి ముక్కులు ఆ సువాసనకు అలవాటు పడిపోయాయి. అప్పుడే ఆ గదిలోకొచ్చిన ఇంకో అతనికి మాత్రం సువాసన గుప్పు మనిపించింది.

అదే మాదిరిగా భారతదేశము పృథ్వికే తలమానికమైనది. ఇక్కడున్న హిమాలయాల వల్ల, షిరిడీ, పుట్టపర్తి, తిరుమల వంటి మహోన్నత సిద్ధక్షేత్రాల వల్ల ఓ అత్యద్భుతమైన పరమళం గుబాళింపు నిస్తోంది. విదేశాల నుంచి కొంతకాలం తరువాత మన భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు భారతభూమి దగ్గరయేప్పుడు ఓ అపురూపమైన,



అరుదైన సువాసన పులకింపజేస్తుంది. ఎంతోమంది ఆ సువాసనా మాధుర్యానికి పులకించి పోయినవారున్నారు. భారతదేశంలో అడుగు పెట్టీపెట్టగానే అలా పులకింతతో ఆనందపడిపోయిన ఓ రష్యన్ వనిత మేడమ్ బ్లావెట్స్కీ. ఎంతో పులకించిపోయిందట ఆవిడ భరతభూమిపై అడుగుపెట్టగానే. మరి మనం ? ఈ సువాసనకీ ఇక్కడి వాతావరణానికీ బాగా అలవాటు పడిపోయాం. భరతభూమి సువాసనలు వెదజల్లడ మనేది మామూలు మనుషులు కూడా గ్రహించగలిగే విషయమే.

అయితే ఇక్కడున్న సిద్ధక్షేత్రాలు ఎంతో శక్తివంతమైనవి. అలాంటి సిద్ధక్షేత్రాల్ని కొంతమంది గురువులు క్యాటలైజ్ చేశారు. దాని శక్తిని అనేక రెట్లు పెంచారు. ఉదాహరణకి మన ఆంధ్రాలోని తిరుమల కొండల్లోనే మూడొందల అరవై సిద్ధక్షేత్రాలున్నాయి. రోజుకి ఒక్కొక్క సిద్ధక్షేత్రాన్ని దర్శించుకుంటూ సాగిపోతే సంవత్సరం పడుతుంది తిరుమలయాత్ర. సాధారణంగా ఒక్కో సిద్ధ క్షేత్రంలో ఒక్కో టెక్నాలజీని ఋషులు ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా ఒకే ఫలితం రాదు. ముఖ్యంగా ఈ సిద్ధక్షేత్రాల్లో మన షట్చక్రాలు యాక్టివేట్ అవుతాయి. ఆ క్షేత్ర స్థల మహత్యం మనకు తెలిసినా తెలియకపోయినా మన వెన్నుపూస లోని శక్తులు మేలుకుంటాయి. ఆయా క్షేత్రాల్లో ఋషులచేత నిక్షిప్తం చేయబడిన శక్తి మన కోరికలు తీరుస్తుంది. అనారోగ్యాన్ని పోగొడు తుంది. అలాంటి సిద్ధక్షేత్రాలకు మనం రానూ పోనూ బండి మాట్లాడు కుని వెళ్తుంటాం. అది పరమ మూర్ఖత్వం.

పరమ దయామయులైన షిరిడీసాయి షిరిడీని ఓ అద్భుతమైన (వైద్యశాలగా) శానిటోరియంగా రూపొందించారు. ఆయన చివరి ఎనిమిది సంవత్సరాల జీవితం పరిశీలిస్తే అర్థమౌతుందది. షిరిడీలోని చావడి వద్దకు ప్రతి రాత్రీ వెళ్ళి నిద్రపోయేవాడాయన. మూలాధారానికి ప్రతీక అది. మన అలవాట్లు, బలహీనతలు అక్కడ మనం పోగొట్టు కోవచ్చు. ద్వారకామాయి స్వాధిష్టానచక్రానికి నమూనా. మన కోరికలు, అభిరుచులు అక్కడ తీరిపోతాయి. అదే మణిపూరక చక్రముకూడా. అక్కడో తిరగలి ఉంటుంది. అక్కడే అగ్ని ఉంది. ధుని. సమస్త రోగాలూ అక్కడ నయమౌతాయి.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

(భ.గీ. - 15వ అ. - 14వ శ్లో.)

అక్కడ అరవై సంవత్సరాలపాటు కదలకుండా కూర్చున్నాడా మహనీయుడు. రాబోవు అతి సమీప కాలంలో షిరిడీ ఓ అద్భుతమైన శానిటోరియంగా రూపొందుతుంది. ఓ అత్యద్భుత రోగ నివారణ కేంద్రంగా ప్రసిద్ధికెక్కుతుంది. పుట్టెడురోగాలతో వచ్చిన పరమ వ్యాది గ్రస్థుడైనా సరే అలా షిర్డిలో తిరిగేసి సమస్త రోగాల్నీ వదిలించేసుకుని చక్కా వెళ్ళిపోతాడు. మనమంతా అతి సమీప కాలంలో ఈ విషయాన్ని స్పష్టంగా చూస్తాం.

మనకున్న పొట్టకు సంబంధించిన సమస్తరోగాలూ, అనేక సమస్యలు ద్వారకామాయిలో కూర్చుంటే మటుమాయమైపోతాయి. అలాగే మానసిక ఆందోళనలు, హిస్టీరియా, పిచ్చి, జీవితంలో స్థిరత్వం లేకపోవడం, డిప్రెషన్, అశాంతి, దిగులు ఉన్న వాళ్ళు గురుస్థానం దగ్గర ఎంతో లాభం పొందుతారు. అది ఆజ్ఞాచక్రం. నందదీపం. విశుద్ధి చక్రానికి సంబంధించిన శక్తి కేంద్రమది. వాక్శుద్ధి కోసం, వాక్సిద్ధి ఆశించేవారికి మంచి ఫలితాలొస్తాయి. నత్తి, నంగి, మూగ వంటి వాటిని అక్కడ సరిజేసుకోవచ్చు. సహజంగా కుండలినీ శక్తి పురుషుల్లో కంటే స్త్రీలలోనే ఎక్కువుంటుంది. కనుక స్త్రీలు చావడికి వెళ్తే ఆ శక్తి ఎక్కువైతే వాళ్ళకి చికాకులొస్తాయని ఆడవాళ్ళు చావడికెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. అంతేగానీ అగౌరవంతో కాదని గ్రహించాలి. లెండీ వనం అనాహతానికి సంబంధించినది. అక్కడ కళ్ళకి సంబంధించిన, చర్మ రోగాలకి సంబంధించిన వాటిని పోగొట్టు కోవచ్చు. ఈ షట్చక్రాలన్నీ కలిసే శక్తికేంద్రం సాయి సమాధి మందిరం. సహస్రానికి సంబంధించినది. "నేను లేకపోయినా నా సమాధి మాట్లాడుతుంది" అనడంలో సాయి ఉద్దేశం 'నా శక్తినక్కడ నింపిఉంచాను. ఉపయోగించుకోగలిగితే ఉపయోగించుకో' మన్నాడాయన. ఈ విషయం ఎందరు గ్రహించారో ఆయనకే ఎరుక.



కాబట్టి సిద్ధక్షేత్రాల్ని ఏదో మొక్కుబడిగా తిరిగి రావడం కాకుండా జీవితాలు మారిపోయేలాగా వాటినుపయోగించుకోవాలి. ఆయా క్షేత్రాల్లో జగజ్జనని శ్రీ మహాయోగేశ్వరీదేవి పనిచేస్తుంటుంది. ఆ శక్తే లేకపోతే ఆయా తీర్థక్షేత్రాలకు విలువేలేదు. జగద్గురువు శ్రీకృష్ణుడంతటి వాడే ఆ శక్తినుపయోగించుకొని అనేక చమత్కారాలు చేశాడు. అసలైన సాధకులు ఆయా సిద్ధక్షేత్రాల్లో నిక్షిప్తం చేయబడిన శక్తిని ఉపయోగించుకునేందుకు కొన్ని ప్రత్యేక సాధనల్ని చేయగలిగితే అదృష్టవంతులు.

ఓంకారం చేస్తే నపుంసకత్వం పోతుంది. సైంటిస్టులు ఎనిమిది వందలమంది జంటల్ని (పిల్లలులేని వాళ్ళని) ఎంచుకొని ఓ ప్రయోగం చేశారట. ఆశ్చర్యకర ఫలితాలొచ్చాయని పేపర్లో వేశారు. ఓ రకంగా మనందరం నపుంసకులమే. మంచిదని తెలిశాక కూడా దాన్ని చేయలేం. ఫలానావాళ్ళు తప్పుచేస్తున్నారని తెలిసినా ఏమనలేం. సమస్త రోగాలకీ చింతపండు, మిరపకాయ, నూనె ఈ మూడే మూడు వస్తువులు కారణమౌతున్నాయంటే ఆ మూడింటినీ వదలనే వదల్లేము.

ఇదంతా నపుంసకత్వమే. చేతకానితనమే. పతంజలి మహర్షి 'గురువులందరికీ గురువు ఓంకారమ'న్నాడు.

త స్య వా చ కః ప్ర ణ వః

ప్రణవమే ఆయన పేరని చెప్పాడు. 'ఓం' ఆ పేరుతో పిలిస్తే ఆయన పలుకుతాడు. అనేకమందికి పలికాశని చాలా స్పష్టంగా ఋజువులు, సాక్ష్యాలు ఉన్నాయి. ఋషులు ప్రతి మంత్రానికీ ముందు ఓంకారం చేర్చారు. ఓంకారానికి తరువాత వచ్చే మంత్రం సంగతి అటుంచి ముందున్న ఓంకారం మాత్రం త్వరగా పలుకుతుందని వారుద్దేశ్యం.

ఓంకారాన్ని మూడు రకాలుగా ఉచ్ఛారణ చేస్తుంటారు. ఆయన పేరుని సాగదీసి పలికినా, ఖండించి పలికినా ఆయనకి చక్కగా అర్థమౌతుంది అది తన పేరేనని. హరి సత్యనారాయణ గారింటికోసారి

ఓ పాలేరొచ్చాడు. అతనికి ఉచ్చారణ సరిగారాదు. "అరిచ్చచ్చినాయన ఉన్నాడాండీ" అనడిగాడు. అందుకు హరిసత్యనారాయణ 'ఆఁ నేనేతే చెప్పు ! ఏం కావాలి అనడిగాడు. మామూలు మనుషులమే మనపేరు మనం గుర్తించగలిగితే గురువులకే గురువు ఆ ఓంకార స్వరూపుడు ఎందుకు పలుకడు ? ఓంకారంతో అద్భుతాలు చేయచ్చని నిరూపిస్తున్న విదేశీయుల గురించి తెలుసుకున్నాం, సహస్ర శీర్ష హౌసెస్ గురించి విన్నాం. ఓంకారంతో అలవాట్లే కాదు జీన్సే మారిపోతాయి. స్థూల, సూక్ష్మ కారణ జగత్తులే మారిపోతాయి. ఋషుల యొక్క అనుభవం అది.

ఇప్పుడు అసలు విషయానికొస్తూ కాస్త లోతుకెళ్దాం. థియరీ అయిపోయాక ప్రాక్టికల్స్ చేస్తే విద్య పూర్తవుతుంది. 'స్టౌమీద వేణ్ణీళ్ళలో కాఫీ పొడో, టీపొడో వేసి మరిగాక ఆ డికాక్షన్‌లో పాలుపోసి పంచదారేసుకొని తాగితే బావుంటుంద'ని ఎక్కడోచదివి రోజూ అప్పుడప్పుడు దాన్నే అలాగ చదువుకుంటుంటే వేడి వేడి టీ తాగిన అనుభవం వస్తుందా ? రాదు కదా ! మరి అసలే ఇది అమృతత్వ విద్య. పారాయణలు చేస్తే వచ్చేది కాదు. సాధన చేయాలి. నిటారుగా కూర్చోవాలి. ఏ గురువయినాకూడా, ఏ సాధనా, తపస్సు లేకుండా ఏమీ ఇవ్వడు. అసంభవమది. మోసగాళ్ళు మాత్రం ఇచ్చేస్తుంటారు. గురువులు మాత్రం మనలోని ఆర్తిని చూస్తారు జిజ్ఞాసను చూస్తారు. ఈ అమృతత్వ విద్యని "దేవ సంస్కృతి" అని కూడా అంటుంటారు. మన శరీరంలో ఉన్న దైవీశక్తుల్ని గుర్తించి ఉపయోగించుకోవడం దేవ సంస్కృతి అంటే. అలాంటి అమోఘ ప్రదమైన అమృతత్వ విద్య నేర్చుకోబోతున్నాం.

'ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం'.

ముగ్గురు మహా మహిమోపేత సర్వసమర్థ శక్తివంతులు మనల్ని పైకి లాగేసేందుకు ఆరాటపడుతున్నారనీ మనం మన పాత్రతను పెంచుకోవడమే ఆలస్యమనీ తెలుసుకోవాలి. **సమర్థ సద్గురు సాయినాథుడు - తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడు - శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య**



గురువుల మధ్య తారతమ్యతలు కొలతలు వేస్తుంటాం. సద్గురువుకు మరణం లేదు. తమ దగ్గరకు వచ్చిన భక్తుల్ని శిష్యులుగా మార్చుకోవడం కోసం తన జీవితాన్నే ఫణంగా పెట్టి ఎన్నో విషయాలు బోధిస్తాడు. ఆయన దగ్గరకొచ్చిన వాళ్ళందరూ శిష్యులు కాలేరు. కనీసం భక్తులుగానైనా ఉండేందుకు సరితూగని చాలామంది మధ్యలో వేరే గురువును వెతుక్కొని వెళ్ళిపోతుంటారు. వెళ్లిపోయిన వాళ్ళు వెళ్ళిపోగా మిగిలిన వాళ్ళంతా ఓ వర్గంగా ఏర్పడతారు. ఇక అక్కడనుంచి గురువులకి మరింత ఇబ్బందికరంగా తయారవుతుంటారు. గురువులు చెప్పే విషయాల పట్ల పెద్దగా ఆసక్తి కనబరచరు. ఆయన బోధనల్లో ఉన్న ఆచరణీయ అంశాల గురించి పెద్దగా పట్టించుకోరు. ఆ మహనీయుడు ఇన్నేళ్ళపాటు బోధించిన అనేక అంశాల్ని ఆచరణలోకి తెచ్చుకునేందుకు ఏ మాత్రం ప్రయత్నించరు. ప్రయత్నించకపోగా తమ వర్గం వారు ఇతర వర్గం వారి కంటే గొప్పగా ఉండేందుకు పరిపరి విధాల ఆలోచనలు చేస్తుంటారు. అప్పుడప్పుడు గురువులకు కూడా "మీరిలా ఉండండి.... ఇలా చేయండ"ంటూ సలహాలివ్వడానిక్కూడా సిద్ధపడుతుంటారు. ఇదిగో ఈ విధమైన ప్రవర్తన గురువులకు ఇబ్బందిగా ఉంటుంది. తను చెప్పే విషయాల పట్ల ఆసక్తి కనబరచకపోవడం, అంతవరకు తను చెప్పిన పలురకాల సాధనలను, ఆలోచనలను ఆచరణలో పెట్టకపోవడం చేత ఇక తను ఉండీ చేయగలిగేది ఏమీ లేదనుకొని నిర్ధారించుకున్నాక శరీరాన్ని వదలి తెర వెనక్కి వెళ్ళిపోతారు తప్ప సద్గురువుకు మరణం లేదు. చనిపోయినట్టు నటిస్తారంతే. సర్వ సమర్థత కలిగిన ఆ మహనీయులు నటించడం మొదలెడితే మన బోటివారు అది నటనని కనిపెట్టేయ గలగడం పిచ్చిమాట. మహాభ్రమ. దయామయులైన ఆ దివ్యాత్ములు పాపం ఎంత అమాయకులో అనిపిస్తుంటుంది. వారు శరీరంతో ఉన్నప్పుడు తమ శిష్యులకు చెప్తూనే ఉంటారు. "నేనీ ఐదున్నర అడుగుల శరీరంలోనే ఉంటానను కుంటారేమో - నా సమాధి అనంతరం కూడా

మీ సందేహాలకు సమాధానాన్నిస్తాను. నేనప్పుడూ ఉన్నాను - ఇప్పుడు ఉన్నాను - ఎప్పుడూ ఉంటాను. ఎప్పుడో ఒకప్పుడు నేను శరీరం వదిలేయటం వల్ల అందరిలాగా చచ్చిపోయానని అనుకుంటారేమో నాయనలారా !" అంటూ అసలు విషయాలు అమాయకంగా చెప్పేస్తుంటారు. "శ్రీరామకృష్ణ పరమహంసగా, సమర్థరామదాసుగా అప్పుడు నేనే వచ్చాను. అంతకు ముందు కబీర్‌దాసుగా వచ్చాను. అసలు వీటన్నిటికంటే ముందు వేల సంవత్సరాల క్రితం మీకు తెల్సిన దధీచి మహర్షిని నేనే" అంటూ గురుదేవులు ప్రకటించుకున్నారు. తమ ఆత్మకథలో స్వయంగా కొన్ని కొన్ని వ్రాసుకున్నారు కూడా.

ఒక గురువు వస్తాడు. ఆయన జీవితకాలంలో ఆయన చెప్పాల్సింది చెప్తాడు. శిష్య బృందాన్ని తయారుచేస్తాడు. 'నా జీవితమే సందేశంగా తీసుకొని ఎలా జీవించాలో తెలుసుకోండ'ని చెప్పి వెళ్ళి పోతాడు. అలా వెళ్ళినాయన కాలగమనంలో ఇంకో రూపంలో వచ్చి, ఇంకొక బృందాన్ని తయారుచేసి వాళ్ళక్కూడా ఎలా జీవించాలో నేర్పి, నేను జీవించినట్లు మీరూ జీవించండని అక్కడనుంచి కూడా వెళ్ళిపోతాడు. అయితే వచ్చిన చిక్కల్లా మనలోనే. ఒక సంస్థలో వాళ్ళకి ఇంకో సంస్థలో వాళ్లకీ పడదు. వీళ్ళు వాళ్ళతో కలవరు. వాళ్ళు వీళ్ళతో కలవరు. ఇది గురువులకు తీరని వేదన కలిగిస్తోందన్న కనీసపు ఆలోచన మనకు తరతరాలనుంచి తట్టడం లేదు. దాన్ని సవరించుకోవాలనిపించడం లేదు. ఇది మరీ దురదృష్టకరం కాదా ?

**అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం ।**
**యత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురువేనమః ॥**

అసలు ఉన్నది ఒకే 'గురు చేతనత్వం'. అలాంటి ఒకే ఒక్క గురుచేతనత్వంలోంచి అనేక మంది గురువులు రకరకాల రూపంలో మానవజాతిని ఏకం చేసేందుకు, కుల, మత, వర్గ విభేదాలనే గోడలు కూల్చేందుకు జీవితాల్నే ఫణంగా పెట్టి మన మధ్యకొస్తుంటారు అనే పరమసత్యాన్ని మన మూర్ఖత్వం వల్ల అర్థం చేసుకోలేక శ్రీరామకృష్ణమఠం వాళ్ళు శ్రీరామశర్మ ఆచార్య స్థాపించిన 'గాయత్రీ పరివార్'తో కలవరు. మరో ఆర్య సమాజం వాళ్ళు ఇంకో సంస్థతో ఏకీభవించరు. అహంకారాలు, గొప్పదనాలు, వారి వారి గురువుల స్థాయిలు బేరీజు వేసుకుంటూ కాలక్షేపం చేసేస్తూంటారు. ఈ గందరగోళంలో పాపం ఆ గురువు ఏం చెపుతున్నాడో బుర్రకెక్కదు. ఒకవేళ బుర్రకెక్కినా ఆచరించబుద్ధికాదు. ఎందుకంటే అనేక పన్లుంటుంటాయి మనకు. గురువుమాత్రం ఏ పనీపాటా లేకుండా ఖాళీగా ఉన్నట్టనిపిస్తుంది. కానీ దయామయులైన ఆ మాతృహృదయులు మన మూర్ఖ ప్రవర్తన పట్ల కోపగించుకోరు. నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా శరీరాన్ని వదిలి మరో రూపం దాలుస్తారు. అంతే తప్ప సద్గురువు మనకిమల్లె మరణించడం లేదు. గురువు అమరుడు.



పూజ్యగురుదేవులు ఓ సందర్భంలో ఇలా అన్నారు "మిమ్మల్ని మాయ అవహించి ఉన్నది. ఈ విశేషమైన, అపురూపమైన సమయాన్ని గుర్తించలేకుండా ఉన్నారు. ఋషుల ఆవేదనాపూర్వక సందేశం కూడా మీకు స్పందన కలిగించక పోవడం విచిత్రమేం కాదు. కేవలం మాయపొరల చేత కప్పబడిన కారణంగా అలా జరుగుతోంది. శ్రీకృష్ణుడు వాళ్ళమ్మకు (యశోదకు) విశ్వరూపం చూపించినా కొన్నాళ్ళకు మర్చిపోయి తన బిడ్డ జగద్గురువని గుర్తించలేక రోటికట్టేసింది. సీతమ్మలాంటి మహాపతివ్రత కూడా అశోకవనంలో తన ఎదుట నిలబడిన హనుమను కూడా చాలాసేపు గుర్తించలేక పోయింది. కాబట్టి మీరు ఆట్టే బెంగపడకండి. అలా అని జన్మ జన్మలుగా మీరు చేస్తున్న పాపపు పనులే ఇంకా ఇంకా చేసుకుంటూ వెళ్ళిపొండని కాదు. ఎప్పటికీ ఇలానే మూర్ఖంగా, నిర్లక్ష్యంగా ఉండిపొమనీ కాదు. ఇంగిత జ్ఞానాన్ని పయోగించి ఇక నుంచైనా ఋషుల ఆవేదన పట్ల ఈ విశేషకాల ప్రభావం పట్ల కాస్తంత స్పందన తెచ్చుకోలేకపోతే రాబోయే రోజుల్లో ఘోరప్రమాదానికి గుర్రై మీ జీవితనౌకకు దారితెన్నూ కనపడక తీవ్ర పశ్చాత్తాపానికి లోను కావలసిఉంటుంది. నేడు కాకపోతే రేపు ఎవరెవరు

ఎంతటివారైనా, ఎలాంటివారైనా సరే, అలాంటి వారు కూడా యోగికులంలో చేరవలసిన పరిస్థితి నూటికి నూరుపాళ్లూ ఎంతైనా ఉంది" అన్నారు.

అలా ఋషులవైపు అడుగులు వేయడం - యోగి కులంలో చేరడం ఇదంతా ఏ అక్కరాజు వేంకటేశ్వర ప్రసాదు కోసమో, అతని భార్య సురేఖ కోసమో, వారి గురుదేవులకోసమో కానేకాదు. ఎవరికోసం వారే. ఇలాగే నిర్లక్ష్యభావంతో శ్రీగురుని ఆహ్వానానికి స్పందించక ఇలానే ఉంటే కొద్దికాలం తరువాత మనంతట మనకే అనిపిస్తుంది. "ఈ దుర్భరమైన జీవితం జీవచ్ఛవంలా గడపడంకంటే బలవంతంగా చచ్చిపోవడం మేలని" ఈ విషయంలో గురుదేవులేమి చెబుతున్నారంటే "రాబోవు అతి సమీపకాలంలో ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో ఓ విచిత్రతను కళ్ళారాచూస్తారు. వారికి కొంతమంది వ్యక్తుల జీవన సరళి అమితాశ్చర్యాన్ని కలిగిస్తుంది. 'వీరు ఇంత ఉత్సాహంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఎలా జీవించగలుగుతున్నారు ?' అనుకుంటూ అలాంటి వ్యక్తుల్ని చూడడం కోసం జనం గుంపులు గుంపులుగా వెళుతుంటారు" అని పూజ్యగురుదేవులు ఓ సందర్భంలో చెప్తూ "అలాంటి మహావ్యక్తులు తయారు కాబోతున్నారు. అలాంటి వారిలో మీరు కూడా ఉండాలో వద్దో మీరే నిర్ణయించుకోండి ! యథేచ్ఛసి తథాకురు" అన్నారు.

ఈ క్రింద తెలియజేయబడుతోన్న అతి గోప్యమైన కొన్ని అంశాల్ని ఓసారి కాస్త శ్రద్ధగా పరిశీలించాల్సిఉంది. మనలో స్పందన కలిగించడం కోసం పరమ వాస్తవాలైన కొన్ని సంఘటనల్ని గురుదేవులు మనకు తెలియజేస్తున్నారు. ఈ రహస్యమయ అంశాల్ని ఒకటికి పదిసార్లు చదివి అర్థం చేసుకోవాల్సి ఉంది. ఇలా అనేక పర్యాయాలు దీన్ని అధ్యయనం చేయడం వల్ల మనకి స్పందన కలగడమే కాదు ఆర్తి కూడా కలుగుతుందనడంలో సందేహం లేదు. చూద్దాం !

శ్రీకృష్ణ నిర్యాణమై అప్పటికి 20 రోజులైంది. పవిత్ర గంగానది ఒడ్డున ఓ ఋషి ఆశ్రమంలో రోజూలా యజ్ఞం జరుగుతోంది. వ్యాసమహర్షి, దుర్వాస మహర్షి ఆరోజు ఆ యజ్ఞానికి శిష్య సమేతంగా



ఆశ్రమానికొచ్చారు. మామూలుగానే యజ్ఞం పూర్తయ్యాక ఆరుబయట విశాలప్రాంగణంలో వారంతా ఆసీనులయ్యారు. ఆ ఆశ్రమ పెద్ద ఆ యిద్దరు మహర్షుల్నీ, వారి శిష్య సముదాయాల్నీ ఉద్దేశించి "ఈ పృథ్వి యొక్క భవిష్యత్ కార్యక్రమం ఎలా వుండాలో నిర్ధారించి దానికి సంబంధించిన ప్రణాళికలు వేసుకొచ్చినట్లే కదా !" అనడిగారు. అందుకు ఈ యిద్దరు ఋషులు సానుకూలంగా తలూపారు. ఆ తరువాత వారు తయారు చేసిన ప్రణాళికాంశాల్ని చర్చించుకొని అక్కడున్న 1568 మంది శిష్యబృందంలో నుంచి 221 మందిని ఎంపిక చేశారు. వారిని ఈ ప్రణాళికకు అగ్రనేతలుగా తీర్మానించారు.

అక్కడ జరిగిన ఈ విశేషాల్నీ, అందరి సంసిద్ధతనూ హిమాలయాల్లో వున్న ఋషి కూటమి ద్వారా సంపూర్ణ సౌరమండలానికీ, విశిష్ట నక్షత్రంలోని 'గ్రేట్ వైట్ లార్డ్స్' ద్వారా శాసించబడుతోన్న ఓ ఆశ్రమానికీ తెలియజేశారు. అక్కణ్ణించి వారి అనుమతిని కూడా పొందారు. చీకటి పడే వరకూ దానికి సంబంధించిన చర్చలు జరిగాయి. ఆ చర్చ ముగిశాక ఆశ్రమపెద్దతో బాటు యిరువురు మహర్షులూ ఆ 221 మందిని ఓచోటకు చేర్చి ఓ విశిష్టమైన దీక్షనిస్తూ దాన్ని రాబోయే 5000 సంవత్సరాలపాటు కొనసాగించమని ఆదేశించారు. ఈ 221 మంది ఈజిప్టు, ఆర్యావర్తము ప్రధానంగా ఈ రెండు ప్రదేశాల్లో తమకివ్వబడిన ప్రణాళిక ప్రకారము సప్తర్షిమండల ఆదేశాల మేరకు సూక్ష్మ జగత్తులో తమ తమ కార్యక్రమాల్ని నిర్వర్తిస్తూ, భౌతిక జగత్తుతో సంబంధ బాంధవ్యాలు పెంచుకుంటూ, 1995 నవంబరు నుంచీ మూడు లోకాల్లోనూ ఒకేసారి జరగనున్న ఓ అద్భుత మహాభారతాన్ని జరిపించ డానికి తగిన మానవ వనరుల్ని సమీకరిస్తూ వచ్చారు. ఆనాడు ఆ 221 మందీ పూనుకొని తయారు చేసిన వ్యక్తుల సంఖ్య నేడు లక్షలు దాటుతోంది. అలా వీరందరూ స్పందించే మూడు సంఘటనల్ని పరమ పూజ్యగురుదేవులు వారి పైవారి ఆదేశంతో ఇలా తెలియజేస్తున్నారు.

ఒకటవ సంఘటన :- అది ఈజిప్టులోని ఒక మహానగరం. దానికి ఓ మూల అతిసుందరమైన ఉద్యానవనంలో ఓ నడివయస్కుడు ప్రశాంతంగా కూచోనున్నాడు. ఆగి ఆగి తాకుతోన్న గాలి తెమ్మెరలు అతని మనసుకు మరింత ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. అతని ముందు యుక్తవయసులో వున్న ఇద్దరు ముగ్గురు శిష్యులున్నారు. వారి నుద్దేశించి వారి గురుదేవులు ఉత్సాహంగా ఇలా తెలియజేశారు. "మీరు గనక మీమీ సమూహాలతో బయలుదేరేందుకు ఉత్సాహం చూపిస్తే మిమ్మల్ని ఇతర గ్రహాలకు పంపించి అక్కడ త్వరలో జరగనున్న ఓ విచిత్ర యుద్ధంలో పాలుపంచుకునే అర్హతని రాబోయే పది సంవత్సరాల్లోనే మీకు కల్పిస్తాను" అంటూండగా ఆ యువకుల దృష్టి అక్కడ మొక్కలకున్న అందమైన పూలమీద, మరింత అందమైన రంగురంగుల రెక్కలతో ఎగురుతోన్న సీతాకోకచిలుకల మీద పడ్డది. వారు వాటివంక కాసేపు చూసి తిరిగి వారి గురుదేవులతో "ఆఁ ఏమన్నారూ ?" అనడిగారు. అందుకు వారి గురుదేవులు కాస్తంత బాధతో తనలో తనిలా అనుకున్నారు. 'కాల ప్రభావం మానవులకి ఎలాంటి సువర్ణావకాశాల్ని చేజేతులారా జారిపోనిస్తోందో కదా !' ఎంతో నిరాశగా నిట్టూరుస్తూ ధ్యానమగ్నులయ్యారు.

రెండవ సంఘటన :- 18వ శతాబ్దపు తొలిరోజులవి. భూమ్మీదున్న ఋషికూటమి సప్తర్షి మండలానికి ఓ sos (అత్యవసర రహస్యమయ సందేశం) పంపింది. 'జరగాల్సిన కార్యక్రమానికి సమయం దగ్గర పడింది. ఇంకా చాలా ఏర్పాట్లు చేయవలసి ఉంది.' దానికి జవాబుగా సప్తర్షి మండలం నుంచి భూమ్మీద ఓ విశేష మానసిక స్థాయి కల్గిన వ్యక్తులు ఎక్కడెక్కడున్నారో వారందరికీ అందుబాటులో ఉండేట్లు ఓ అత్యంత శక్తివంతమైన కిరణం భూమిపై కొచ్చింది. పృథ్వీగ్రహ చరిత్రలో ఆ కిరణము అంతకు ముందు ఇంతవరకు అంతరిక్షంతోనే ప్రవహించేది. ఇప్పుడది భూమిపై కొచ్చింది. ఋషికూటమికి, వారి కార్యక్రమాలకు సాయపడే వ్యక్తుల కోసం సప్తర్షి మండలంలోని వారు



ఆ కిరణాన్ని పంపారు. అయితే దురదృష్టవశాత్తూ భూమ్మీదున్న ఏఒక్క సాధకుడూ కూడా దాన్ని పట్టించుకోలేక పోయారు. పట్టుకొని ఉపయోగించుకోలేకపోయారు.

ఐతే ఆ శక్తివంతమైన కిరణాన్ని శాస్త్రజ్ఞులు పట్టుకోగలిగారు. దాన్ని విద్యుదయస్కాంతశక్తిగా గుర్తించారు. కానీ ఏం లాభం ? ఆ కిరణానికి సంబంధించిన ఎందుకూ పనికిరాని ఓ స్వల్పమైన, అతి స్థూలమైన ఓ పొరను మాత్రమే వాళ్ళు వినియోగించి నేటి యాంత్రిక జగత్తులో ఎన్నెన్నో చమత్కారాల్ని చేస్తున్నారు. ఈనాటి మొబైల్ ఫోన్లు, రవాణా సౌకర్యాలు, వెబ్‌సైట్లు ఇవన్నీ దాని ప్రభావమే. అత్యంత కీలకమైన ఆ కిరణ సూక్ష్మప్రభావం గురించి వారికి నేటికీ అవగాహన అవడం లేదన్నది కడు విచారించదగ్గ అంశము. పరమ దురదృష్టకర విషయము. ఇక ....

మూడవ సంఘటన :- 20వ శతాబ్దం ప్రారంభమైన కొత్తల్లో మళ్ళీ హిమాలయాల్లోని ఋషికూటమి సప్తర్షి మండలానికి ఓ sos పంపింది. 'రెండు శతాబ్దాల క్రితం మీరు భూమ్మీదకు పంపిన అద్భుత శక్తిని అక్కడున్న ఆధ్యాత్మిక వ్యక్తులు దాన్ని గ్రహించలేకపోయారు' అని.

దాంతో వారి సందేశాన్ని ఇలా పంపారు. "అలనాడు భగీరథుడు తాను బ్రహ్మాండమైన తపశ్చర్యల ద్వారా ఆకర్షించుకున్న అనేక శక్తి తరంగాలున్నాయి. వాటిని ఉపయోగించుకొని ఈనాడు మీరను కుంటున్నట్టు నవయుగాన్ని నిర్మించండి ! అది పూర్తి చేసేంతవరకు భూమ్మీదకు వాటిని అలా పంపుతునే వుంటాము' అంటూ కొన్ని విశేష శక్తి తరంగాల్ని భూమ్మీదకి పంపారు. ఈసారి కూడా మళ్ళీ శాస్త్రజ్ఞులే ముందుగా పట్టుకోగలిగారు. శాస్త్రజ్ఞులు పట్టుకున్న ఆ శక్తి తరంగాల్ని రేడియో ధార్మిక కిరణాలుగా, పరమాణు శక్తిగా గుర్తించి, దాన్ని ఓ నిష్ప్రయోజనమైన, అతిస్థూలమైన పనులకు వినియోగించారు. ఇప్పటికీ వినియోగిస్తూనే ఉన్నారు.

విద్యుచ్ఛక్తి వేగం కంటే ఈ పరమాణు శక్తి ఎన్నోరెట్ల శక్తి గలిగిన ఓ విచిత్రశక్తి యొక్క భౌతిక స్వరూపము. ఈ శక్తినే శ్రీ శంకరులవారు తమ సౌందర్యలహరిలో ఇలా వివరించారు.

అవిద్యానా మన్తస్తిమిర మిహిర ద్వీపనగరీ
జడానాం చైతన్య స్తబక మకరన్ద శ్రుతిర్ఝరీ ।
దరిద్రాణాం చిన్తామణి గుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి ॥

'చీకట్లను తొలగించే సూర్యులు నివసించే నగరంగా, చైతన్య మనే పూలగుత్తుల నుండి స్రవించే మధువుగా, చింతామణులతో, పరశువేదులతో పొదగబడిన ఓ అపురూప హారము'గా వర్ణించారు .

సహజీవనము, సహవాసము, సామూహికత, సంజీవనీ విద్య మొదలైన ఆధ్యాత్మిక జగత్తుకు సంబంధించినవన్నీ ఆ శక్తిధారల్లో నుండి ఆవిర్భవించేవే.

ఈసారి మళ్ళీ వెంటనే సప్తఋషి మండలంలో నుంచి శక్తి ధారాలు పంపబడ్డాయి. అదృష్టవశాత్తూ వీటిని ఈసారి భూమ్మీద ఏడు చోట్ల ఉన్న సప్తఋషి మండల ఆశ్రమాధిపతులు పట్టుకోగలిగారు. అంతేకాదు. వారు ఆ విశేష శక్తిధారల్ని నిక్షిప్తం చేసే విధానాన్ని కనుగొన గలిగారు కూడా. ఆనాటి నుంచి అంటే 20వ శతాబ్దపు తొలిరోజులనించీ ఆయా ఆశ్రమాధితులు తాము కనుగొన్న చిత్ర విచిత్రశక్తిని వివిధ దేశాల్లో వివిధ సంస్థల ద్వారా అందిస్తూనే వచ్చారు. విదేశాల్లో ఇది థియోసాఫీగా రూపొందితే - భారతదేశంలో ఆ విచిత్రశక్తి ఏడు కిరణాలుగా - 7 గురుసాంప్రదాయాలుగా విభజింపబడి అందివ్వబడు తోంది.' సౌర మండలం మొత్తాన్నీ వ్యవస్థీకృతం చేసే ఆ శక్తి యొక్క ఆదేశానుసారము పరమ పూజ్య గురుదేవులచే అందింపబడిన ఈ రహస్యాంశాల్ని జాగ్రత్తగా మనం మననం చేసుకుంటుంటే 'ఋషి ప్రణాళికలో మనపాత్ర మనకర్థమవుతుంది.



ప్రతినిత్యము సూర్యుని యొక్క ఏడు కిరణాలతో పాటు ఈ చిత్ర విచిత్రశక్తి యొక్క ఏడు రూపాలు భూమ్మీదకి దిగి వస్తున్నాయి. వాటిలోని మూడు శక్తిధారల్ని తాము నిర్మించిన గాయత్రీ మంత్రంతో ఉపయో గించుకోడానికి విశ్వామిత్ర, వశిష్ఠ మహర్షులందరూ అంగీకారం తెలిపారు. దానిపై ఉన్న సమస్త అంక్షలూ తొలగించివేయబడ్డా యన్నారు. భారతదేశంలో గాయత్రీ సాధనగా అందించబడ్డ ఈ అద్భుత శక్తిధారలే విదేశాల్లో థియోసాఫీగా ప్రచారం పొందుతోంది. సూర్యకిరణాల ద్వారా మొత్తము పృథ్వీని తడపడం చేత ఈ గాయత్రీ మంత్రశక్తి అలనాడు విశ్వామిత్రుడు ఉపాసించిన దానికంటే అనేకరెట్లు శక్తి వంతమైన ఫలితాలనిస్తోందందుకే.

ఈ రహస్యమయ విశేషాల్ని తెలుసుకొని మనం ఇకనించీ గాయత్రీ ఉపాసన చేస్తున్నపుడల్లా దానికి తగిన మానసిక స్థితిని పెంచు కోడానికి ప్రయత్నం చేయాలి. శ్రీకృష్ణుడు తన తదుపరి పదో అవతారమైన కల్కి అవతారంగా ప్రపంచంలో అవతరించినపుడు ఎటు వంటి విషయాల్ని మానవజాతికి అందించాలో వాటిని జ్వాలాకూల్ మహర్షికి, ఆయనకు సంబంధించిన కొంతమందికి చాలా స్పష్టంగా అందించాడాయన.

శ్రీకృష్ణుడి కంటే కూడా వేయి సంవత్సరాల ముందు నించీ ఉన్న ఓ రహస్య సంస్థలో ఈనాటికీ ఈ విషయాలు చర్చించబడుతూనే ఉన్నాయి. మొదటి ప్రపంచయుద్ధంలోను, రెండో ప్రపంచ యుద్ధం లోను ఆ రహస్య సంస్థ చాలా యాక్టివ్‌గా పనిచేసింది. ఇప్పుడు కూడా అంతే ఉత్సాహంతో తమ కార్యక్రమాల్ని ఆ సంస్థ కొనసాగించుకుంటూ పోతోంది. ఆ సంస్థకు సంబంధించి సభ్యులనేక మంది దాదాపు ప్రతి ఊళ్లోనూ ఉన్నారు. వారిని చూసేందుకు మనకర్హత లేకపోతే అలాంటి వారిని మనం గుర్తించలేం. ఏ మాసిన బట్టలతోనో, వెకిలితనంగానో, పిచ్చి వాళ్ళలానో కనిపిస్తుంటారు. మనంతట మనం అర్హత పొందితే లోకులకు పిచ్చివాళ్ళలా కనబడే వారే మనవద్దకొచ్చి అన్ని విషయాలు

బోధపరుస్తారు. స్నేహ సంబంధాలు పెట్టుకొంటారు కూడ. ఆ దయామయుల ప్రేమ అలాంటిది.

ఇప్పటివరకు ప్రపంచానికి ఈ విషయాలు చెప్పబడలేదు. వీటిని సరియైన అవగాహనతో గ్రహించి ఋషి ప్రణాళికకు తోడ్పడగలగడం ఋషి సంతతియైన మనకు గల కనీస బాధ్యత. ఇకపై ప్రస్తావించబడే కొన్ని విషయాలు కూడా ఇంతవరకు గుప్తంగా దాచిపెట్టబడినవే. వాటిని గూడ పరిశీలిద్దాం!

ప్రస్తుతం ప్రపంచంలో మూడు రకాలైన విశేష శక్తిధారలు ప్రవహిస్తున్నాయి. వాటిలో మొదటిది 'షంబాలా' శక్తి. హిమాలయాల్లో ఉన్న ఓ అత్యద్భుతమైన ఆధ్యాత్మిక శక్తి కేంద్రమిది. పరమగురువుల ప్రణాళికకు మూలకేంద్రమిది. ఇది సూక్ష్మ జగత్తులో ఉంది. ఇక రెండవది సప్తఋషుల నుంచీ వచ్చే శక్తిధార. మూడవది భౌతిక జగత్తునించీ వచ్చే శక్తిధార. వీటి నుపయోగించుకోవాలంటే గురువులు మనకు సహాయం చెయ్యాలి. గురువులు నీకు సహాయం చెయ్యాలంటే 'నీవు నీ క్రింది వారికి సహాయం చెయ్యాలి' అన్నారు. 'నీవెన్ని పుస్తకాలు చదివినా, నీవెంత జ్ఞానివైనా, ప్రకాండ పండితుడవైనా కూడా నీవల్ల ఏమీ ప్రయోజనం లేదు. నీవు గురువులకు పనికిరావు. నీకు తెలిసిన, నీవు నమ్మిన జ్ఞానాన్ని నీకంటే క్రింది వారికి అందిస్తేనేగానీ ఎన్ని జన్మలెత్తినా కూడా ఆ గురువుల సహాయం నీకందదు.' చాలా స్పష్టంగా తెలియజేయబడిందీ విషయం.

ఈ విషయాలపట్ల స్పందన మనలో కలగకపోతే మనల్ని ఇంకెవరు బాగుచేస్తారు ? మనం ఈ విషయాల పట్ల స్పందించి ఋషి ప్రణాళికలో కనీసం ఉడతాభక్తిగానైనా పాలు పంచుకొనలేకపోతే మనంత దురదృష్టవంతులిక ఉండబోరు. ఇది పరమసత్యము.

1872వ సంవత్సరం ఆగష్టు 15వతేదీ కలకత్తాలో ఓ వ్యక్తి జన్మించాడు. విదేశీయుల నాగరికతపై మోజున్న అతని తండ్రి ఆ పిల్లవాణ్ణి భారతీయ సంస్కృతికి దూరంగా పెంచాలని ఇంగ్లాండ్‌లో



పెంచసాగాడు. అక్కడే చదువు సంధ్యలు సాగించాడు. IPS కూడా పాసయ్యాడు. అక్కడే వివాహం కూడా చేసుకున్నాడు. అలాంటి పరిస్థితుల్లో ఓసారి ఓ మిత్రుని వివాహ సందర్భంగా ఇండియావచ్చాడు. అకారణంగా తమ మిత్రుణ్ణి అక్కడి పోలీసులు హింసించి చంపడం పట్ల కోపోద్రిక్తుడై పోలీసులపై బాంబులు విసిరాడతడు. ఆ ఘర్షణలో ఇతనితోపాటు మరో ఇద్దరు కూడా పోలీసులకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అలా పట్టుబడ్డ అతను ఆలీపూర్ బాంబ్ కేసులో ఇరుక్కుపోయి జైలు శిక్ష అనుభవించసాగాడు. అతనితో పాటు శిక్షను భవిస్తోన్న మిగతా ఇద్దరికీ ఉరిశిక్ష పడింది. ఇక మిగిలిన ఇతన్నొక్కడినీ కోర్టులో హాజరు పరచాల్సిన సమయమాసన్నమైంది. అప్పుడున్న పరిస్థితుల్ని బట్టి అతనికి కూడా ఉరిశిక్ష పడడం ఖాయమని అందరూ అనుకోసాగారు. ఆ సంగతి అతనూ గ్రహించాడు. తెల్లారితే కోర్టులో హాజరు పరుస్తారు. తనతోబాటు పట్టుబడ్డ మిగతా ఇద్దరి లాగానే తనకు కూడా మరణశిక్ష పడబోతోందని అర్థమైంది. అప్పటి వరకు అతనిక్కూడా తెలియదు తను శ్రీ అరవింద మహర్షిగా లోకానికి కోటి సూర్యుల వెలుగందిస్తాడని. స్వతహాగా ధైర్యస్థుడు కావడం వల్ల ఎంతైనా తెల్లారేక చనిపోబోయే తనపట్ల తనకే ఓవిధమైన ఉదాసీనత ఏర్పడి హింస, క్రౌర్యాత్మక భావాలు చప్పబడిపోయి నిర్లిప్తంగా గోడకు జారగిలబడి కూర్చుండిపోయాడాయన.

సరిగ్గా ఆ సమయంలో సుమారు రాత్రి 11 గంటల ప్రాంతంలో తనకు వివేకానందుని దివ్యస్వరం వినిపించింది. ఓ సాధన చేయమని ప్రేరేపించింది. అలా రాత్రి 11 గంటలకు వివేకానందుని గొంతుకకు స్పందించిన అరవింద్ రాత్రికి రాత్రే ప్రశాంత గంభీర తేజోమూర్తిగా మారిపోయారు. తెల్లారింది. మరుసటి రోజు న్యాయస్థానంలో అరవిందుని హాజరుపరిచారు. ఈ మహాయోగి విప్లవకారి కాజాలడనీ, నిర్దోషి అనీ ప్రకటిస్తూ కేసు కొట్టేశారు. బంధ విముక్తుణ్ని చేశారు. అరవిందులు పాండిచ్చేరికి మకాం మార్చి ఓ చిన్న ఆశ్రమాన్ని నెలకొల్పారు.

వివేకానందుని గొంతుకకు స్పందించిన మామూలు మనిషి మహర్షియై తనచే నిర్మించబడిన ఆ చిన్ని ఆశ్రమమే ఈనాడు ఓ అత్యద్భుతమైన అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.

అసంభవాల్ని సంభవాలుగా మార్చగలిగే శక్తి కలిగిన గురువుల ఆహ్వానానికి స్పందించగలిగితే ఏకంగా మన జీవితాల్ని ఉన్న ఫళంగా అమోఘమైన మలుపులు తిప్పగలరు. మనపై ఆ గురువులకు ఉండే ప్రేమను మనం కనీసం ఊహించనైనా ఊహించలేం. ఓ విషయాన్ని చాలా స్పష్టంగా తెలియజేస్తున్నారు. మన కోసం వారు సముపార్జించి పెట్టివుంచిన శక్తి భండాగారంతో పోల్చి చూస్తే మనం సాధనల ద్వారా సంపాయించగలిగే శక్తులు చాలా తక్కువగా ఉంటాయి. గురువుల్ని మనం మన అంచనాలతో లెక్కిద్దామని ప్రయత్నించకూడదు. గురువనుగ్రహంలో శిష్యుడున్నప్పటికీ ఆయన అనుగ్రహాన్ని శిష్యుడు పొందడానికి అర్హత, సమర్థత. పాత్రత పొందేవరకు శిష్యుడికి ఆయన అనుగ్రహాన్ని అనుభూతిలోకి రానీయడు. శిష్యులం కావాలనుకొనే మనం మాత్రం పాత్రత పొందే ప్రయత్నం చేయాలే తప్ప మరే విధమైన వాటికోసం ప్రయత్నించకూడదు. ఎలాంటి వాటినీ ప్రయత్నపూర్వకంగా, మనకు మనంగా ఆశించకూడదు.

ఇవన్నీ తెలుసుకొన్న మనం ఆధ్యాత్మిక జగత్తులోకి తక్షణం ప్రవేశించాల్సి ఉంది. దాని కంటే ముందు మనం కొన్ని విషయాల్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం కూడా వచ్చింది. ముఖ్యంగా మనం చేస్తోన్న పూజులు, దీక్షలు, ఉపాసనలు, యోగాసనాలు, ప్రాణాయామాలు, ధ్యానాలు, సంధ్యావందనాలు, మంత్రజపాలు, యజ్ఞయాగాదులు ఇవన్నీ ఆధ్యాత్మిక జగత్తులోకి తీసుకెళ్ళేందుకు ఉపకరించేవే. 'అవన్నీ ఆధ్యాత్మికపరమైన ఆహరం మాత్రమే' అన్నారు. ఇవి లేకుండా మనం ఆధ్యాత్మిక జగత్తులోకి అడుగుపెట్టలేం. మూడు, నాల్గురోజులు భోజనం చేయకపోతే నీరసించిపోయి అడుగుతీసి అడుగువేయలేం కదా! అలాగే ఆసన ప్రాణాయామాలు - ధ్యాన, సంధ్యావందనాలు ఇవేవీ మనం వదలకూడదు. వీటిలో ఏది వదిలినా ఆ మేరకు మనం ఎంతో కొంత కోల్పోతుంటాం.



అలాగే గురుదేవులు ఎంతో స్పష్టంగా చెప్తోందేమంటే 'ఏ మంత్రం చేసినా ఒకటే. 'మననాత్ త్రాయతీ యితి మంత్రః' మననం చేత అది మంత్రమౌతుంది. ఆకలేస్తోంది. హోటల్‌కెళ్ళాం. అక్కడున్న రుచిరకమైన పదార్థాల్లో మనం ఏది తీసుకున్నా ఆకలి తీరుతుంది కదా! అదేవిధంగా మనం రోజుకో మంత్రాన్ని మార్చుకోవచ్చు. ధ్యాన విధానాల్నీ మార్చుకోవచ్చు. తప్పేమీలేదు. ఎటొచ్చీ ఆ మంత్రం పట్ల ఏకాగ్రత, భావనాత్మక దృష్టి ముఖ్యం. ఉదయాన్నే లేచి ఓరోజు గుంజీలు, ఓరోజు బస్కీలు, మరోరోజు దండీలు, ఇంకోరోజు స్కిప్పింగ్ ఇవన్నీ కాకుండా వరుసగా ఓ వారం రోజులు రన్నింగు, ఆ తర్వాత ఓ నాల్రోజులు ఏ బ్యాట్‌మింటనో, ఫుట్‌బాలో ఆడతామనుకోండి ! అదంతా శారీరక వ్యాయామం కిందకే వస్తుంది కదా ! రోజూ ఒకే ఆటనో లేదా ఒకే విధమైన దండీలు మాత్రమే తీయాలనేమీ లేదుగదా ! ఏదైనా శారీరక వ్యాయామమే కదా ! కాబట్టి అదే విధంగా మంత్రజపం కూడా. ఇది మానసికస్థితికి సంబంధించినది. మంత్రమ్మీద ఏకాగ్రత చూపిస్తూ మననం చేసుకో గలిగితే అది మన ఏకాగ్రతను బట్టి శబ్దాతీత స్థితికి తీసుకెళ్తుంది. అలా వాక్కుకు (శబ్దానికి) అతీతమైన స్థితికి వెళ్ళాలి. అదీ మన లక్ష్యం. మంత్రంవల్ల-మంత్రజపసాధనతో లోనికి చొచ్చుకు పోగలిగే శక్తి వస్తుంది. అయితే ఇవన్నీ ఆధ్యాత్మిక సాధనలనే భ్రమలోంచి ముందు బయటపడాలి. ఇవి ఆధ్యాత్మిక సాధనలు కానేకావు. ఆధ్యాత్మిక జగత్తులోనికి ప్రవేశింప చేసేందుకు ఉపకరించేవి మాత్రమే. ఈ విషయాన్ని పూజ్యగురుదేవులు ఎంతో స్పష్టంగా తెలియజేశారు. దీన్ని మనం కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి !

అలాగే మన కుటుంబ సభ్యులు మనం చేయాల్సిన బాధ్యతల్ని గుర్తుచేయాల్సిన పరిస్థితి వస్తే మన ఆధ్యాత్మిక జీవితం అంత నీచ స్థితిలో ఉందని అర్థం చేసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా మీ కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరూ కూడా నీ వల్ల నేను ఫలానా ఇబ్బందికి గురౌతున్నాను అనో, ఫలానా విధంగా పాడైపోయాను అనో అనకూడదు.

అలా అని వాళ్ళ అడుగులకి మడుగులొత్తక్కర్లేదు. కామన్‌సెన్స్‌తో మెలగాలి ! "పది మంది ఏదైనా ఓ విషయాన్ని గురించి ఓ విషయంలో నీ తప్పు ఎత్తిచూపిస్తే దాన్ని ఓ హెచ్చరికగా తీసుకొని నీ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేదేమో ఆత్మసాక్షిగా పరిశీలించుకో ! మీ అంతరాత్మలోకి తొంగి చూసుకోండి ! మిమ్మల్ని మీరు మోసగించుకోకండి ! పరీక్షలు దగ్గర పడుతున్నప్పుడు కూడా పుస్తకాలు ముందేసు కూర్చొని చదువుతున్నట్లు నటించే బాల నటుల్ని గురువులు (టీచర్స్) బెత్తంతో నెత్తిమీద ఒక్కటిస్తారు. అదే విధంగా ప్రకృతి మనకిచ్చిన శిక్షను శిక్షణగా భావించాలి. **ప్రతి కష్టాన్నీ ఉపయోగించుకోవాలి.** కుంతీదేవి అందుకే కృష్ణుడితో 'నాపై నీకేమాత్రమైనా ప్రేముంటే నన్ను కష్టాల్లోనే ఉంచు' అని అడిగింది." ఆ దమ్ము మనకు రావాలి. అప్పుడే మనం ఆ గురువులకు పనికొస్తాం. మనమేమీ ఖంగారు పడక్కర్లేదు. క్రమ క్రమంగా మనల్ని గురువే ఆ స్థితికి ఎదిగేట్టు చేస్తాడు.

**'గయాన్ త్రాయితి యితి గాయత్రి.'**

**మన ప్రాణమును రక్షించేది గాయత్రియే.** మన ప్రాణాన్ని రక్షిస్తోందేది ? మన ఊపిరి, మన శ్వాస. ఈ శ్వాస మహావిజ్ఞాన్ ఒక్కరోజులో వంట బట్టేది కాదు. గాయత్రీమంత్రానికీ శ్వాసకీ ఉన్న సంబంధం అర్థమైతే ఇక వారికి మృత్యువుండదని ఉపనిషత్తులు చెప్తున్నాయి. భౌతికమైన ఏ ఇంజనీరింగో చేయాలంటే ఎన్నేళ్ళు పడుతోంది ? సుమారు ఓ 25 ఏళ్ళు కష్టపడ్డాక మనపేరు చివర B.E. అనే రెండక్షరాలు పెట్టుకోడానికి అర్హత వస్తోంది. మరి అలాంటిది అమరత్వాన్నిచ్చే అమృతత్వవిద్యని **శ్వాసమహావిజ్ఞాన్** పేరుతో దివ్యాత్మ లందిస్తున్నారు. మరి ఆ మహా విజ్ఞానం అంత ఆషామాషీగా వచ్చేస్తుందను కోకూడదు కదా ? అయితే ఇక్కడ దివ్యాత్మలు ఓ విషయాన్ని దయతో మనకు తెలియజేస్తున్నారు. మీలో అనేకమంది ఈ శ్వాసమహావిజ్ఞాన మనే ప్రక్రియలను అనేక జన్మలబట్టీ నేర్చుకుంటూనే ఉన్నారు. **మీలో చాలామంది ఈ జన్మల పరంపరల మధ్యలో మార్గము తప్పారు.** బహుశా మీకందరికీ ఇది

mission RK
SSS-Hyderabad.
Phone: 2334..7



అమోఘ ప్రదమైన సమయం కావడం వల్ల దారితప్పిన వారిలో ఇంతకు ముందే ఈ విజ్ఞాన ప్రక్రియల్ని అభ్యసించిన వారున్నారు. ఇంతక్రితమే దీనిలో నిష్ణాతులైనవారూ ఉన్నారు. అయితే సహజమైన మరుపుచేత, మాయచేత వారంతా మామూలుగానే తెలీనివారిలానే ఉన్నారు.

వివేకానందుడు పుట్టినప్పుడు పాపం వాళ్ళమ్మ అనుకుందిట "నేను కాశీవిశ్వనాథుని పూజచేసి తన అంశని పుత్రుడిగా ప్రసాదించ మన్నాను కదా !" అనుకొని తృప్తిపడేది. కొన్నేళ్ళు గడిచాక "నేను వేడుకున్న దైవం నన్ను కనికరించలేదు. తన అంశకు బదులు ఈ పిశాచాన్ని పంపించాడు. వీడితో వేగలేక ఛస్తున్నాను" అనుకొనేది. వివేకానందుని కన్నతల్లి ఆ రోజుల్లో తన బిడ్డను ఇతనో పెద్దఋషి అని అనుకోలేదు. నరేంద్రుడు కూడా తానో పెద్ద స్వామీజీగా తయారై ప్రపంచాన్నే ఓ వూపు వూపుతాననీ అనుకోలేదు. అదీ మాయంటే.

నేడు ఈ సంపూర్ణ మానవజాతి గాఢనిద్రలో ఉంది. అదెలా వుందంటే..... సీతను వెతకాలంటే మహాసముద్రం దాటాలి. జాంబవంతుడు మొదలైన ప్రముఖులంతా ప్లానులమీద ప్లానులు వేస్తున్నారు. గందరగోళం పడుతున్నారు. ఈ పనెవరు చేస్తారని ? సమర్థుడి కోసం వాళ్ళల్లో వాళ్ళు తర్జనభర్జనలు పడుతుండగా వాళ్ళకు దూరంగా కూర్చొని ఉన్న హనుమంతుడు కనిపించాడు. ఆయన ఇవేమీ పట్టించుకోవట్లేదు. తన లోకంలో తనున్నాడు. వీళ్ళంతా ఆయన దగ్గరికెళ్ళి "నీవు తప్ప ఈ పనికి సమర్థులెవరూ లేరయ్యా" అంటూ ప్రాథేయపడ్డారు. ఎవరైనా వచ్చి జ్ఞాపకం చేస్తే తప్ప తన సమర్థత తనకు గుర్తురాదు పాపం హనుమకు. **అలాంటి హనుమంతుడు మన ఆంధ్రుడే అవడం ఓ విశేషం. మన అదృష్టం కూడా. అందుకే మనకు మరుపు అనే ఆ వారసత్వం సంక్రమించిందేమో.** 'ఎవరైనా లేపితేకానీ లేవం' అంటుంటారు మాష్టారు. దివ్యాత్మల భవిష్యవాణి ప్రకారం **"భారతదేశము జగద్గురు పీఠాన్ని అతి త్వరలో అధిష్ఠించబోతోంది. దానికి సంబంధించిన దిశా నిర్దేశము ఆంధ్రప్రదేశ్ ద్వారా జరుగనున్నది."**

యానిశా సర్వ భూతేషు తస్యాం జాగర్తి సంయమి ।

(భ.గీ. - 2వ అ. - 69వ శ్లో.)

యావత్ ప్రపంచము నిద్రిస్తున్న సమయంలో యోగులు, ఋషులు మాత్రమే మేలుకొనుంటారు. నిద్రపోతోన్న వ్యక్తి ఎంత సమర్థుడైనా దేనికీ పనికిరాడు కదా ! ఋషుల సత్యవాక్కులకు స్పందించిన మనం వారి ప్రణాళికకు అనుగుణంగా మన జీవితాల్ని సవరించుకోవాల్సి ఉన్నది. మనం ప్రయత్నపూర్వకంగా మేలుకోవలసి వున్నది.

నేడు సైన్స్ ఇంత అభివృద్ధి చెందడానికి కారణమేమిటంటే ముందు థియరీ బాగా చెప్తారు. ఆ తరవాతే ప్రాక్టికల్స్. ఐదో తరగతి నుంచి ఈ థియరీ చెప్పడం మొదలుపెట్టి ఏ ఇంటర్మీడియట్‌లోనో ప్రాక్టికల్స్. ఐదో తరగతి నుంచి ఈ థియరీ చెప్పడం మొదలుపెట్టి ఏ ఇంటర్మీడియట్‌లోనో ప్రాక్టికల్స్ కోసం ల్యాబ్‌కి తీసికెళతారు. దాదాపు పద్దెనిమిదేళ్ళు పడుతోంది. ఇంతా చేస్తే ఆ చదివిన చదువు ఈ జన్మకి మాత్రమే ఉపయోగపడేది. దివ్యాత్మలు ఈ శ్వాసమహావిజ్ఞానా న్నందిస్తూ దానిపట్ల సామాన్యుడిక్కూడా ఆసక్తి కలిగించేందుకు, ఆపై అమరత్వాన్నిచ్చేందుకు ఎంతో తాపత్రయ పడుతూ, మనల్ని ఆ వైపుకు లాగేందుకు నిజంగా మహా ఆరాటపడుతున్నారు. మొదట్లో ఒకటి రెండు భాగాలే అవుతుందనుకున్న ఈ అత్యవసర రహస్యమయ విజ్ఞానం వారి ఆశీర్వాదానుగ్రహాలతో అంచెలంచలుగా ఇలా ఐదో భాగానికి చేరింది. ఎక్కడాకూడా ఒక్క పుస్తకాల షాపులోనైనా పెట్టకుండానే వేలాది పుస్తకాలు అమ్ముడౌతున్నాయి. ఈ ఐదింటినీ కలిపి పుస్తకరూపంలోకి మార్చాలనే సంకల్పం నెరవేర్చడం కోసం చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ఈ రహస్యమయ అమూల్యాంశాల్ని ప్రజల్లోకి మోసుకెళ్ళేందుకు కొందరు కార్యకర్తలు కూడా మాకు తమ సహాయ సహకారాలందిస్తున్నారు. వ్యాపార దృక్పథంతో చూసిన కొందరు తెలీక మొదట్లో ఒకటో అరో స్వల్పమైన విమర్శలు చేసినా రానురాను ఆ సంఖ్యకూడా బాగా



తగ్గింది. 'మొత్తం కలిపి ఒకే భాగంగా ముద్రించ వచ్చుగదా ?' అంటూ కొందరు మా కార్యకర్తలకు సూచించారు. అయితే ఆర్థికపరంగా ప్రతి తక్కువ స్థాయి సాధకుడికీ అందాలంటే ఇప్పుడు దివ్యాత్మల ప్రేరణచే వెలువడుతోన్నట్లు ఇదే (విడివిడిగా 5 భాగాల్లోనే) సరియైనది. దీన్ని సహృదయతతో అర్థం చేసుకొని మీరంతా ఆదరించి మాకు మీ సహకార ప్రోత్సాహాల్ని అందించాలని మనసారా కోరుకుంటున్నాం. తద్వారా దివ్యాత్మల మహావాణిని ప్రజల్లోకి మరింత వేగంగా తీసుకు వెళ్ళగలము.

ఇక ఇప్పుడు చెప్పబోయే మహత్తరాంశాన్ని కాస్త ఏకాగ్రతగా పరిశీలించాల్సిఉంది. ఇంగితజ్ఞానాన్ని మాటిమాటికీ ఎవరికి వారు గుర్తుచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనిషి ఎంత అభివృద్ధి సాధించాడో అంతగా ఇంగితాన్ని కూడా మర్చిపోయాడు. గుడ్డిగా అలా చేసినవే చేసుకుంటూ ఎలా ఉన్న వాళ్ళం అలానే ఉంటూ రోజులు రోజులు వెళ్ళదీసేయడం కాదు' అని చెప్తూ గురుదేవులిలా అన్నారు. "ఓ గురువుగారు కొంత సామానేదో ఓ బండి కెత్తించి వెనక శిష్యుల్ని 'జాగర్తగా చూస్తూనడవ'మన్నారు. పాపం శిష్యులు కూడా గురువుగారి మాట తూచ తప్పకుండా ఆ బండి వెనకే చక్కగా నడుస్తూ వెళ్ళాల్సిన చోటకి చేరుకున్నారు. అయితే బండిలో మాత్రం ఒక్క సామానుకూడా లేదు. దాంతో గురువుగారు ఈ విషయం తెలుసుకొని 'నేను జాగర్తగా చూస్తూరండంటే కిందపడ్డ వస్తువుల్ని కూడా చూస్తూ రావడం కాదు. సామాన్లు కింద పడ్డప్పుడు చూసినా కూడా దాన్ని బండిలో వేయకుండా అలా చూసి వదిలేయడం కాదు' అని చెప్తూ ఆ గురువు వాపోయాట్ట.

అలాగే గురుదేవులు ఈ మహావిజ్ఞానాన్ని మనకందిస్తూ వారి భావనాత్మక సందేశాల్ని కూడా జత చేస్తున్నారు. అందుకే వారి అమృతమయ భావనలు కూడా వంటబట్టించు కునేందుకు ఈ శ్వాసమహావిజ్ఞాన్ పుస్తకాల్నీ, రహస్యవాణి, రహస్యకిరణాలు వంటి ఇతర పుస్తకాల్ని చదువుతున్నంతసేపు శ్వాసను లోతుగా తీసుకొని,

అలా తీసుకున్న శ్వాసంతా బయటికి వదులుతూ లేదా శ్వాసమీద దృష్టి ఉంచుతూ చదవగలిగితే ఈ పుస్తకాల ద్వారా పరమపూజ్య గురుదేవులందించ దలచుకున్న మహాప్రసాదాన్ని నూటికి నూరుపాళ్ళూ అందుకోగల్గుతాం.

మనం పుట్టిన దగ్గరనుంచీ ఇప్పటివరకూ ఎన్నో ఆధ్యాత్మిక సాధనల గురించి తెలుసుకొనుంటాం. వాటిలో కొన్ని సాధనలపట్ల ప్రేరణ పొందిన మనం వాటిని ఆచరిస్తూ వచ్చాం. ఆసనాలు కావచ్చు. ప్రాణాయామానికి సంబంధించినవి కావచ్చు. మంత్రజపాలు కావచ్చు మరోటి కావచ్చు. గురుదేవులేమంటున్నారంటే "నీ ఆధ్యాత్మిక సాధన ప్రతిసారీ, ప్రతిరోజూ ఎంతో కొంత ఫలితాలిస్తుంటుంది. దానిద్వారా మన శరీరంలోనైనా, మన ఆలోచనలోనైనా, మన వాక్కులోనైనా ఏమైనా మార్పులొస్తున్నాయా ? అని గమనించుకోవాలి. కొంచెం ఇంగితాన్ని ఉపయోగించి ఫలానా సాధనవల్ల నాలో ఫలానా విధంగా మార్పు వచ్చింది. అది సరియైనదేనా ? ఇలా పరిశీలించుకోవాలి. ఇది ఎవరికి వారే చేసుకోవాలి. కానీ ఏమాత్రం మనం ఆజాగ్రత్తగా ఉన్నా మనం ఈ సాధనలతో ఎంతో ఎత్తుకు ఎదిగిపోయామనే భ్రమల్లో ఉండేందుకే ఎక్కువ అవకాశం ఉంది. ఆధ్యాత్మికత పట్ల సరియైన అవగాహనలేని కొందరు కొన్ని భ్రమల్నీ, భ్రాంతుల్నీ ప్రవేశపెట్టారు. రూపాయి పావలాతో గోదాన ఫలితం వచ్చేస్తుందని అసత్యపు మాటలు చెపుతున్నారు కొందరు. ఇంకా వైతరణిని కూడా ఇట్టే దాటించేస్తామనీ కొందరు చెప్పటం మనం వింటున్నాం. ఇది మరీనూ. చీము, నెత్తురు, కుళ్ళు వంటి కడుపులో తిప్పేటువంటివి ఏవైనా ఉంటే అలాంటి వాంతి కలిగించే వాటితో ఏరులై పారుతొన్న వైతరణి నదిని దాటించేందుకు ఓ నాలుగరటి పళ్ళు, కాసిని బియ్యం, జాకెట్ముక్క దక్షిణతో సమర్పిస్తే చాలట. ఇలాంటి బూటకపు విధానాలు మనకు బాగా వంట పట్టించారు కొందరు.

అయితే ఇక్కడ కాస్త మనం వివేకాన్నుపయోగించి ఈ విషయాల్ని గ్రహించాల్సిఉంది. మామూలు భౌతిక విద్యకే (పిచ్చి చదువులకే) పిల్లల్ని రాచి రంపాన పెట్టాల్సి వస్తుంటే మరి ఇలాంటి అమరత్వాన్నిచ్చే అమృతత్వ విద్య అంత ఆషామాషీగా వచ్చేస్తుందను కోకూడదు. అయితే ఇక్కడ ఓ విశేషాన్ని మనం గమనించాల్సిఉంది. మన అదృష్టంకొద్దీ ఈ పృథ్వీ గ్రహము యొక్క చరిత్ర మారిపోయింది. ఓ నీచగ్రహంగా ఉండే పాపభూయిష్టమైన ఈ పృథ్వి ఇటీవల గురువుల సాధనాబలంతో, అమోఘమైన వారి సంకల్పంతో పవిత్రంగా మారి పోయింది. ఓ విశేష దీక్ష కూడా ఈ భూమాత తీసుకోవడం జరిగింది. దాని ఫలితంగా అసంభవాల్ని సంభవాలుగా మార్చగల సర్వసమర్థులు అందిస్తోన్న ఈ విద్య ఇకపై సామాన్యులమైన మనల్ని అమరులుగా చేయబోతోంది. మనంతట మనం అనుకొని ఈ శరీరాన్ని వదిలే యాల్సిందే తప్ప చనిపోవడమంటూ ఉండదు. ఈ మార్పు మన శరీరాల్లో వచ్చిందిగాదు. భూమ్మీదే వచ్చింది. పృథ్వీ గ్రహమ్మీద వచ్చింది. అరవిందో దీన్ని తేదితో సహా పేర్కొన్నారు. ఒకప్పుడు ఋషుల వద్ద మాత్రమే ఉండే ఈ అమృతత్వ విద్య నేడు దయామయుల దివ్యానుగ్రహంతో అడిగిన వారికల్లా (ఇక్కడ ఈ పదాన్ని గమనించాలి) ..... అడిగిన వారికల్లా పంచబడుతోంది.



ఇంతకు ముందు నీవెంత పెద్దవాడవైనా బానిస బ్రతుకే బ్రతికావు. ఇక అలా నీచపు బ్రతుకు బ్రతకనక్కరలేదు. ఇక్కడ బానిస అని ఎందుకంటున్నారంటే నువ్వుండే రాజ్యాన్ని (దేశాన్ని) ఇంకోళ్ళెవరో పరిపాలించాలి. వాడి ఆధీనంలో ఉంటూ వాడు చెప్పినట్లు వినాలి. నీవు పనిచేసే ఉద్యోగం ఇంకోడెవ్వడో ఇవ్వాలి. నీకిచ్చే జీతం వాడెవడో ఇవ్వాలి. నీ డబ్బుతో నీవు ఇల్లు కట్టుకోవాలంటే వాడెవడో అనుమతివ్వాలి. నీ పిల్లలు ఎంతగా చదువుకున్నా వేరెవరినో ఉద్యోగం వేయించమని అడుక్కోవాలి. అలా బానిసగా ఇక బ్రతకక్కర్లేదు. స్వతంత్రంగా బ్రతకొచ్చు. అసలు మనం పుట్టిందే స్వతంత్ర భారతదేశంలో. అసలు పృథ్వీగ్రహానికే ఇంతవరకు స్వేచ్ఛ దొరకలేదు. మరలాంటిది ఇప్పుడు పృథ్వీగ్రహం యావత్తూ పవిత్రత పొందింది. 1947కి పూర్వం మన

స్వతంత్ర భావాల్ని బయటపెట్టేందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది. స్వతంత్ర్యంగా బ్రతకడం అసంభవమనిపించేది. మరిప్పుడు ? నువ్వు స్వతంత్రుడివే అని తెలుసుకుంటే చాలుకదా ! ఇదే తేడా. ఇలాంటిమార్పే ఆధ్యాత్మిక సాధనా విధానంలో కూడా వచ్చింది. ఇందికా ప్రపంచానికి ఇంతవరకు తెలీదు. మనం చెప్పాలి. ఆ మార్పును గమనించవలసిన పరిస్థితులొచ్చాయి.

మనకెలాగైతే శరీరంలో ఏడు చక్రాలున్నాయో అలాగే భూమి క్కూడా ఉన్నాయి. అంతేకాదు ఆ సూర్యుడికి కూడా అంతే. అదే మాదిరి ఈ దేశానికి కూడా చక్రాలున్నాయి. అలా ప్రతి గ్రహానికి కూడా ఉంటాయి. ఎలాగా ? ఎక్కడ ? ఏమిటి ? అంటూ మనమవన్నీ ఇప్పుడు తెలుసుకోబోవటం లేదు. మనం పృధ్వీమీద ఉన్నాం కాబట్టి ఈ భూమి యొక్క ఏడు చక్రాలు గురించి కాస్త తెలుసుకుందాం.

తిరుమలలో ఉన్న ఏడుకొండలు ఈ భూమియొక్క తేజో వంతమైన ఏడు చక్రాలు. మన శరీరాన్ని మొత్తాన్ని మనలోని ఏడు చక్రాలు ఎలా నియంత్రిస్తున్నాయో అలాగే ఈ తిరుమలకొండలు యావత్ పృథ్విపై ఉన్న ఏడు ఖండాలనూ కూడా నియంత్రిస్తున్నాయి. తిరుమలలోని కొండలు మామూలు కొండలు అనుకోకూడదు. అవి పృథ్విగ్రహాన్నే నడిపించే శక్తిమయ చక్రాలు. ఈ ఏడుకొండల్లోని శక్తి మొత్తం పృథ్విని నియంత్రిస్తోంది. ఆ శక్తినే గురువులంతా ఉపయోగించుకుంటున్నారు. ఈ తిరుమల కొండలలో ఎన్నెన్నో శక్తిమయ శరీరాలు తిరుగుతుంటాయి. ఆ పరిసరాలకొచ్చినటువంటి మనబోటివారి అశక్తతను పోగొడతాయి. మన సమస్యల్ని, రోగాలను ఆ దయామయులే నివారిస్తుంటారు. భూమ్మీద ఈ తిరుమలలోని ఏడుకొండలు హిమాలయాలంతటి శక్తి కలిగినవి, ప్రఖ్యాతి కలిగినవి కూడా.

తిరుమలలోని ఏడుకొండలే కాక తిరుమల నుంచి శ్రీశైలం వరకు మరో ఏడుకొండలున్నాయి. ఇవికూడా అత్యంత విశేషమైన శక్తిధారలనందించే కీలకమైన శక్తి కేంద్రాలు. "సప్తఋషుల ప్రకటీకరణ"



అనే పుస్తకం శ్రీ జ్వాలాకుల్ మహర్షి చేత అందింపబడింది. అందులో ఉన్నాయి ఈ విశేషాలన్నీ. ఇన్నెన్ని విశేషాలున్న ఈ శక్తి కేంద్రాలు మన ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం మన అదృష్టమైతే వాటిని ఉపయోగించకో లేకపోవటం మన దురదృష్టం. అంతేకాకుండా ఈ తీర్థక్షేత్రాలు శక్తిమయ కేంద్రాలనే ఓ కనీసపు అవగాహన కూడా మన ఆంధ్రులకు లేకపోవడం పరమ పరమ దురదృష్టకరం. ఋషులు వారి శక్తి సామర్థ్యాల్ని ప్రతిభా పాటవాలను ఉపయోగించి మన శ్రేయస్సు కోసం, మన రోగాల్ని పోగొట్టడం కోసం, మన సమస్యలు నివారించడం కోసం ఆ కొండలలో, ఆ తీర్థక్షేత్రాలలో రకరకాల టెక్నాలజీలు రూపొందించారు. అలాంటి సిద్ధక్షేత్రాలకు భక్తి శ్రద్ధలతో కాలినడకన నిదానంగా చేసే సాధనాపరమైన యాత్ర సఫలమై అనంతమైన ఫలితాలిస్తుంది తప్ప రానుపోను బస్సు మాట్లాడుకొని ఇలా వెళ్లి అలా వచ్చేస్తే తిరుమల వెళ్లినా ఒక్కటే, తిరునాళ్లకు వెళ్లినా ఒక్కటే. కొందరు ఈ విషయాలను చదివి 'అరె..... మాకివన్నీ తెలీదే' అంటూ నిజాయితీగా స్పందిస్తే కొందరు ఇవన్నీ తమకు ఎప్పుడో తెలుసన్నట్లు నటిస్తారు. తమకు తెలిసిన పవిత్రమైన విషయాన్నో, రహస్యాన్నో తెలీనట్లు నటిస్తారు. ఇంకొంత మంది ఉంటారు. ఇవన్నీ తెలిసినప్పటినుంచీ ఎందుకొచ్చిన గొడవని తెలియనట్టే తటస్థగా ఉంటారు. ఋషుల ఆవేదనా పూర్వకమైన అంశాల పట్ల నొచ్చుకుంటూ అయ్యో పాపం అంటూ జాలి కురిపించే పదాల్ని వాడుతూ నటిస్తుంటారు కొందరు. ఆధ్యాత్మికతలో నటనకు తావులేదు. కళ్ళవెంట నీరు కారుస్తూ మనల్ని రాబోవు రోజుల్లో ఆయురారోగ్యాలతో ఉంచేందుకు ఋషులు తాపత్రయపడుతూ రహస్య ఆహ్వానాన్ని అందించటంపట్ల కూడా మనం మన సహజ నటన ప్రదర్శించటం నిజంగా పరమ వినాశకర హేతువు అవుతుంది. మన నటనకు 'నటోత్తమ' అనో, 'నట ఘన' అనో ఎవరూ బిరుదులివ్వబోవటం లేదుగాని రాబోవు రోజుల్లో మీ అమాయకత్వపు నటన మిమ్మల్ని, మీ వాళ్ళని అనారోగ్యం పాలు చేస్తుందని మాత్రం

చెబుతున్నారు. నిజంగా మనకు గురువుల, ఋషుల పట్ల ఏ మాత్రం ప్రేమ, అభిమానం, భక్తి వంటివి ఉన్నా, ఈ సందర్భంగా మనం తెలుసుకుంటోన్న ఈ రహస్యాంశాల్ని మన సాటివారికి, తోటివారికీ తెలియజేయాల్సిఉంటుంది. దాని వల్ల మనం ఋషి ప్రణాళికలో మనవంతు భాగం పంచుకున్నట్లౌతుంది కూడా.

ఓసారి ప్రముఖ హాస్యనటుడు ఛార్లీ చాప్లిన్ ఏదో ఊరెళ్ళాడట. సాధారణంగా అతన్ని ఏ రోడ్లపైనో ఏ రెస్టారెంట్లలోనో చూసిన జనం వేలం వెర్రిగా అతని చుట్టూ మూగి అతన్ని చూసి తెగ నవ్వుకొంటూ పొట్టచెక్కలయ్యే వరకు అతన్ని వదలరట. అలాంటిది ఆ ఊళ్ళో 'అనుకరణ పోటీలు (మిమిక్రీ పోటీలు) జరుగుతూంటే ఈ మహా నటుడు ఛార్లీఛాప్లిన్ కూడ ఆ పోటీల్లో పాల్గొన్నాడట తనెవరు అన్నది ఇతరులకు తెలీనీకుండా జాగ్రత్తపడుతూ. అందరూ ఆ పోటీల్లో తమకు చేతనయినట్లు మహానటుడు 'ఛార్లీఛాప్లిన్'ను అనుకరించారు. పోటీలు పూర్తయ్యాయి. ఆ మిమిక్రీ పోటీల్లో స్వయంగా ఛార్లీఛాప్లిన్ తనే పాల్గొన్నా కూడా అతనికి ఫస్ట్‌ప్రైజ్ కాదు కదా రెండో ప్రైజ్ కూడా రాలేదట ఏ కన్సొలేషన్ ప్రైజో వచ్చిందట. అంతగా అతన్ని చూసి మిగతా వాళ్ళు అతనిలా నటించారన్నమాట. ఇది నిజంగా జరిగిన సంఘటనే.

అలాగే మనం కూడా గురువులను అనుకరించే తీరునూ ఆధ్యాత్మికతలో మనంకూడా నటించడాన్ని గమనిస్తున్న దివ్యాత్మలు మనల్ని చూసి ఎంతో జాలి పడుతున్నారు. అంతటితో ఆ దయామయులు ఊరుకోకుండా మనల్ని ఇలా ప్రాధేయపడుతున్నారు. "నటన-అనుకరణ కాదు నాయనలారా మీరు మహాత్ముల్ని, గురువులను అనుసరించాలి. ఆచరణలో వారి వాక్యాల్ని జీవించి చూపించాలి. అంతేగాని పైపైన వారిలా నటిస్తూ అనుకరించటం కాదు" అంటున్నారు.

సాధారణంగా మనం సహస్రారచక్రాన్ని ఉపయోగించుకోము. అదే మనల్ని ఉపయోగించుకుంటుంది. ఈ 2000 వ సంవత్సరం తరువాత మనలోనూ, బయటా కూడా విప్లవాత్మకమైన మార్పు



లొచ్చాయి. పృథ్వీగ్రహం ఎలా స్వతంత్రమై, పవిత్రత పొందిందో భూమ్మీదున్న అన్ని దేశాలూ క్రమక్రమంగా స్వతంత్రం పొందుతున్నాయి పొందబోతున్నాయి.

ఆధ్యాత్మిక సాధనల్లో మూడు చక్రాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. సహస్రారము, అనాహతము, విశుద్ధిచక్రాలు.

'సాయి' అనే దివ్యమైన నామము సహస్రారానికి సంబంధించినది. సహస్రారం దగ్గర సాధనలేం ఉండవు. అందుకే షిర్డీసాయి ఏ సాధనలూ చేయమని చెప్పలేదు. ఎవరైనా చేస్తామన్నా వద్దనే వాడాయన. ఆ వాతావరణంలో ఉంటే చాలు. అంతటి శక్తివంతమైన రాజాధిరాజు, యోగిరాజు, పరబ్రహ్మ, సచ్చిదానంద సద్గురు సాయి నాథుడు పృథ్వి యొక్క సహస్రారానికి ప్రతిబింబము.

ఇక శ్రీవేంకటేశ్వరుని గురించి కాస్త తెలుసుకుందాం. తిరుమల గిరులలో ఉన్న ఆ శ్రీ వేంకటేశ్వరుడే ఓ సమర్థ సద్గురువు. ఆయన భగవంతుడు కాదు. ఈ విషయం శ్రీ వేంకటేశ్వరుని భక్తులకు కోపం తెప్పిస్తుందేమో. సద్గురువనే వాడు భగవంతుని కంటే ఎంతో గొప్పవాడు. ఈ రహస్యం తెలీక కోపం వస్తుంది భక్తులకి. భగవంతునికోపం వస్తే సద్గురువు రక్షించగలడు. మరి ఆ సద్గురువుకే కోపం వస్తే ఇక ఎక్కడా రక్షణ లభించదు. శ్రీ వేంకటేశ్వరుని భక్త మహాశయులు ఏటేటా తిరుమల తిరుపతి యాత్రలు చేయడం వల్ల ఎంతో అమోఘప్రదమైన ఆశీర్వాదాన్ని పొందుతున్నారు. అయితే ఆ వేంకటేశ్వరుడి చరిత్రనోసారి పరిశీలించడం భక్తమహాశయులకు మరింత ఆనందాన్నిస్తుంది. వారి భక్తి మరికాస్త పెరుగుతుంది కూడా. శ్రీ వేంకటేశ్వర స్వామివారి చరిత్ర సరిగ్గా చదివితే మనకెన్నో రహస్యాలు బోధపడతాయి. ఆయన హృదయస్థానానికి సంబంధించినవాడు. అనాహత చక్రానికి సంబంధించినవాడు. ఓ ఋషి తన్నిన దెబ్బ ఆయన హృదయస్థానానికి తగిలింది. ఆ మహనీయుడు ఆంధ్రదేశంలో పలుచోట్ల పర్యటించాడు సశరీరంగా. ఇక్కడే వివాహం కూడా చేసుకున్నాడు. తన వాళ్ళందరికీ

సహాయం చేశాడు. పరాయివాళ్ళని దండించడానికి ప్రయత్నించాడు. చివరికి సమాధి అయ్యాడు. తిరుమలలోని ఆ సమాధి విగ్రహానికే మనం పూజలు చేస్తున్నాం.

ఇంచుమించు షిర్డీ సాయి చరిత్ర కూడా ఇలానే ఉంటుంది. షిర్డీలో ఆయన సమాధిమీద పాలరాతి విగ్రహం భక్తులు చేయించారు. అయితే తిరుమల గిరులలో శ్రీవేంకటేశ్వరుని రాతి విగ్రహము స్వయంభువుగా వెలిసింది. తిరుమల కొండలలో హథీరాంబాబావారి జీవ సమాధి ఉంది. ప్రతి ఒక్క భక్తుడు ఆ బాబా దర్శనం చేసుకు తీరాలి. అక్కడ శ్రీ వేణుగోపాలస్వామి వెలిశాడు. అత్యద్భుతమైన శక్తి తరంగాల్ని అనూహ్యంగా పంచుతుంటుంది హథీరాంబాబా సమాధి మందిరం. అసలీ మందిరాన్ని దర్శనం చేసుకోకుండా తిరుమల యాత్ర ముగించుకోవడం ఒట్టి దురదృష్టమని చెప్పాలి. అసలక్కడ ఆ మహనీయుని జీవసమాధి మందిరం ఉన్నట్టు తెలీనే తెలీని భక్తాగ్రగణ్యులున్నారు.

శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య అనే ఓ అద్భుతమైన గురువు మానవ శరీరధారియైన వాడు తన జీవితాన్నెలా యజ్ఞమయం చేసుకోవచ్చో చెప్పాడు. ఈయన విశుద్ధి చక్రానికి సంబంధించినవాడు. సాయి వేంకటేశ శ్రీరాం సహస్రార అనాహత విశుద్ధిచక్రాల చక్కటి సమన్వయాన్ని కల్గించే అద్భుత మంత్రరాజమిది.

ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం

మొదలు చివరలలో ఉన్న ఓంకార శబ్దతరంగాలు అమోఘమైన శక్తిని ధారణ చేసుకునేలా చేస్తాయి. ఈ సహస్రార విశుద్ధి అనాహత చక్రాలు మూడూ అత్యద్భుతమైన శక్తి కేంద్రాలు. హిమాలయాలల్లో ఓచోట మన పురాణ పురుషులు సనత్కుమారులు మొదలైన వాళ్ళుంటూ భూమ్మీద జరిగే ప్రతీ కార్యక్రమాన్నీ నిర్దేశిస్తూ, సవరిస్తూంటారు. హిమాలయాల్లోని ఆ పురాణపురుషుల స్థానమే 'శంబల' అన్నారు. 'సాయి' అనే పదం ఆ శంబలాస్థితికి సంబంధించినది. సహస్రారమన్నా



- శంబల అన్నా - సాయి అన్నా ఇచ్ఛాశక్తికి సంబంధించిన పదాలు. మనలో ఆ ఇచ్ఛాశక్తి చాలా బలహీనంగా ఉంది. దాన్ని మనం బలోపేతంగా చేసుకోవాలి. చదువుకోవాలనున్నా చదువుకోలేకపోవడం; మానుకోవాలని వున్నా మానలేకపోవడం ఇవన్నీ ఇచ్ఛాశక్తి బలహీనంగా ఉండడం వల్ల జరుగుతూంటుంది. చేస్తోన్నది తప్పు అని తెలిసినా అది చేయకుండా ఉండలేకపోవడం. ఇదంతా ఇచ్ఛాశక్తి బలహీనంగా ఉండటంవల్లనే. ఈ ఇచ్ఛాశక్తినే దైవీసంకల్పం అంటారు. ఈ సృష్టిమొత్తం దానిమీదే ఆధారపడి నడుస్తోంది. ఈ దైవీ సంకల్పమేంటో మనకు తెలీదు. అంచేత గురువులు మనకీ దైవీ సంకల్పాన్నందజేస్తూ ఆయా పరిస్థితులకు, వాతావరణానికి తగిన నియమాలు తెలియజేస్తుంటారు. ఈ గురు పరంపర అనాహత చక్రానికి సంబంధించింది.

మహా భారత యుద్ధానికి ముందు పృథ్విని పాలించే రాజులు ఇతర గ్రహానికి సంబంధించినవారు. వారికి దేవతాశక్తు లుండేవి. మానవేతరగ్రహానికి సంబంధించిన వ్యక్తి అతను. తొంభైఐదు వేల సంవత్సరాల క్రిందట 'అట్లాంటియా పీరియడ్'లో ఓ సంఘటన జరిగింది. ఓ అద్భుత ప్రయోగం అది. మానవేతర గ్రహంనుంచి వచ్చిన వ్యక్తి కాకుండా పృథ్వి మీదున్న మనుషులే ఎందుకు రాజులు కాకూడదు ? పరిణామక్రమంలో మానవులు ఆ స్థాయికి వచ్చారు కదా ! అనే ధోరణిలో అప్పటి గురుపరంపర ఆ ప్రయోగం చేసింది. కానీ కొన్ని విశేష కారణాల వల్ల అది అసంపూర్ణంగా మధ్యలోనే ఆగిపోయింది. అది ఇన్ని వేల సంవత్సరాల అనంతరం తిరిగి ఇప్పుడు ప్రయోగింపబడుతోంది. ఓ ఐదు సంవత్సరాల క్రితం తమ ప్రయోగం విజయవంతమౌతుందని వారు భావించినట్లే సఫలమైంది కూడా ! దానివల్లనే ఈ రహస్యమయ, గోప్యాతి గోప్యమైన విషయాలు మనవరకు వస్తున్నాయి. అందుకొంటోన్నవారు నిజంగా అదృష్టవంతులు.

ఎక్కడనించి ఆ దైవీసంకల్పం ఆవిర్భవిస్తోందో అదే శంబల. ఆ కేంద్రంనించి వస్తోన్న ఆ దైవీసంకల్పం వల్లనే మనం జీవించి

ఉన్నాం. ఆ బ్రహ్మనుంచి క్రిమి, కీటకాల వరకు పరిణామక్రమంలో ముమ్ముందుకు సాగిపోతున్నది ఆ దైవీసంకల్పం వల్లనే. మనలో ఉన్నటువంటి ఇచ్ఛాశక్తి దానివల్లే పనిచేస్తుంది. కరెంటు ఉత్పత్తయ్యే చోట హైఓల్టేజి ఉంటుంది. అలా అక్కడ లక్షల ఓల్టుల్లో ఉన్న పవరు మనింటికొచ్చేసరికి తగ్గుతూ వస్తోంది. అలా తగ్గుతూ తగ్గుతూ వచ్చిన తొమ్మిది ఓల్టులు, ఆరు ఓల్టుల కరెంటును మనంచేత్తో పట్టుకోవచ్చు. షాక్ కొట్టదు. అలాగే మనలోఉన్న ఇచ్ఛాశక్తి ఉన్నత స్థితికెళ్ళాలి. సాయి అంతటి శక్తివంతులమవ్వాలి. అదీ మన లక్ష్యం.

ఓచోట భార్యాభర్తలిద్దరు మాట్లాడుకుంటున్నారు తమ నౌకర్ని ఏ వైజాగో పంపిద్దామని ఫలానా పనిమీద. తెల్లారాక ఆ దంపతులకి వాళ్ళింట్లో పనిపాటలు చేసిపెట్టే ఆ నౌకరు జాడ కనిపించలేదు. అన్నిచోట్ల వాకబు చేశారు. ఫలితం లేదు. 'ఎక్కడికెళ్ళుంటాడబ్బా' అనుకున్నారు. మంచి నమ్మకమైనవాడు చకచకా చెప్పినపని చెప్పినట్టు చేసుకెళ్ళేవాడు. ఏమైపోయాడో అర్థంకాలేదు వాళ్ళకి. మూడ్రోజుల తర్వాత ఠపీమని ఊడిపడ్డాడెక్కణ్ణించో. 'హమ్మయ్య !' అనుకున్నారు. తర్వాత 'ఎక్కడికెళ్ళావురా నాయనా !' అనడిగారు. "మీరేగదా ఆ రోజు రాత్రి నన్ను వైజాగ్ పంపిద్దామనుకుంటున్నారు. అనేక బాధ్యతలతో బిజీగా ఉండే మీరు మళ్ళీ నాకు ఆ విషయం చెప్పేవరకు దేనికని మీరనుకున్నట్టు వైజాగ్ వెళ్ళొచ్చేశా"నన్నాట్ట.

పాపం బ్రహ్మదేవుడు మనల్ని సృష్టించి భూమ్మీదొదిలాడు. మనవల్ల జరగవలసిన కార్యాల్ని పూర్తిచేసుకొని రమ్మన్నాడు. సరేనని వచ్చినవాళ్ళం ఇక్కడ చేయాల్సిన పనులు చేయకుండా ముక్తికోసం, మోక్షం కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తుంటాం. అది గమనించిన ఆ బ్రహ్మ అంటాడు కదా "నిజమే. నేడోరేపో నీవొచ్చిన పనులన్నీ చక్కబెట్టాక నీవల్ల కావలసిన పనులన్నీ పూర్తయి ప్రకృతి ఇచ్చిన అన్ని బాధ్యతలూ సక్రమంగా పూర్తి చేశాక ముక్తి అనేది నీవడక్కుండానే వస్తుంది నాయనా" అంటూ చెప్పీ చెప్పీ విసిగిపోయాడాయన



బ్రహ్మగారు పాపం. మనం అలా చేయకుండా ఇంకోలా చేస్తున్నాం. దాన్ని సరిచేసుకోవాలి. దైవీసంకల్పానికి అనుగుణంగా మనం స్పందిస్తూ ఇచ్ఛాశక్తిని పెంపొందించుకొని, దైవీసంకల్పానికి అనుగుణంగా మన జీవితాల్ని క్రమబద్ధీకరించుకోవాలి. సాయి దివ్యనామం దాన్ని తెలియజేస్తూంటుంది. ఆ సాయినామం అంతటి శక్తిని ఇస్తుంది. సాక్షాత్తూ సాయికంటే కూడా సాయినామమే ఎంతో శక్తివంతమైనది. ఈ సూత్రము మనకు ఏ గురునామానికైనా, భగవన్నామానికైనా వర్తిస్తుంది.

ఇక రెండోది జ్ఞానశక్తి. మనలో జ్ఞానశక్తి ఉన్నంతగా జంతువుల్లో లేదు. ఆ మాట కొస్తే మరే జీవిలోనూ లేదు. కేవలం మానవ శరీరధారికే వ్యవస్థీకృత జ్ఞానశక్తిని సంపాదించుకునే శక్తి ఉంది. జ్ఞానమనే పదాన్ని మనం కాస్త సరిగా అర్థం చేసుకోవాలి.

జపాన్‌లో ఓ పక్షి ఆకాశంలోనో, ఆ పరిసరాల్లోనో కనిపించడం మానేస్తే తక్షణం అక్కడి ప్రజలు ఖంగారుగా ఇళ్ళల్లోంచి బయటి కొచ్చేస్తారు. ఎందుకంటే ఆ పక్షి కనిపించడం మానేసిన 24 గంటలకి ఆ ప్రాంతంలో భూకంపం వస్తుంది. సిస్మో గ్రాఫ్‌ల వంటి పరికరాల అవసరం లేదు వారికి. అయినా ఆ పరికరాలు భూకంపం వచ్చేశాక చెప్తాయి ఏస్థాయిలో వచ్చిందనేది. రాకముందు చెప్పలేవవి. కానీ అక్కడి మామూలు పక్షులకే ఆ అతీంద్రియ శక్తి ఉంది. 24 గంటల ముందే తెలిసిపోతుంది వాటికి. దాన్ని జ్ఞానమనవచ్చా ? అవేమైనా సిద్ధి పొందాయా ? ఇలా చెప్పుకుంటూ పోతే చాలా జంతువులకి అతీంద్రియ శక్తులున్నట్టు తెలుస్తుంది. ఇది జ్ఞానం కాదు.

ఇద్దరు మహాత్ములుండేవారు. రబియా అనే స్త్రీ - హసన్ అనే అతను. ఇద్దరూ సూఫీలు. వారిలో హసన్ అనే వ్యక్తికి నీళ్ళమీద నడిచే శక్తి ఉంది. దాన్ని రబియా దగ్గర ప్రదర్శించాలనుకొని 'మనం అలా నీళ్ళమీదకెళ్ళి కూర్చొని మాట్లాడుకుందాం పద' అన్నాడు. రబియాకర్థమైంది. అతను తన దగ్గర పోజు కొడుతున్నాడని. అందుకామె 'నీళ్ళమీద వద్దు. అలల గలగలల్లో మనం సరిగా మాట్లాడుకోలేం. అలా పైకెళ్ళి

ఆకాశంలో కూర్చొని మాట్లాడుకొందాం పద' అంది. దానికతను తన దగ్గర అంత శక్తి లేదనీ, రబియా తనకంటే శక్తి గలదని తెలుసుకొని సిగ్గుపడ్డాడు. అప్పుడు రబియా అంది 'ఈ విషయంలో మనిద్దరం సిగ్గుపడాలి హసన్. ఆకాశంలో ఎగురగల్గడం సిద్ధి అనుకోవడం మన మూర్ఖత్వం. చాలా జంతువులు నీళ్ళలో ఈదుతుంటాయి. అవన్నీ సిద్ధిపొందినట్టా ? సిద్ధి పొందడమంటే దైవీసంకల్పానికనుగుణంగా దైవీశక్తిని ధారణ చేసుకునేందుకు శరీరాన్ని సిద్ధం చేసుకోవడం. సిద్ధి అంటే అది. దానికోసం మనం బాగా సాధన చేయాలి ! గురుపరంపర అందించే ప్రేరణను అందుకోగలగేట్టు మన జ్ఞానశక్తిని పెంపొందించుకోవాలి ! సాధకులుగా మనం దాన్ని సాధించాలి ! సాధకులందరికీ ఈ లక్ష్యాన్ని తెలియజేయాలి !' అని అందిట రబియా.

శ్రీ వేంకటేశుని అనుగ్రహం వల్ల జ్ఞానశక్తిని పెంపొందించుకోవచ్చు. గురుపరంపర మనకందిస్తోన్న ప్రేరణను అవగాహన చేసుకోవచ్చు. ఈనాడు ప్రపంచంలో అందరికీ జ్ఞానం బానే ఉంది. ఎటొచ్చీ క్రియాశక్తి లోపించింది. అటు సంకల్పశక్తీ ఉంది. జ్ఞానశక్తీ ఉంది. ఇటు క్రియాశక్తి లేదు. సంకల్పశక్తి అంటే ఏంటంటే 'ఈ రోజునించీ నేను ఏ కాఫీనో, టీనో తాగను' అనుకుంటాం. ఫలానా దురలవాటు మానుకోవాలనుకుంటాం. జ్ఞానముంది. ఫలానా దురలవాటువల్ల ఏ మేరకు నష్టం జరుగుతోందో బానే తెలుసు. కానీ ఆచరణ శక్తి లేదు. అది క్రియాశక్తి. శ్రీశ్రీరామశర్మ ఆచార్యుని అనుగ్రహం చేత ఆ క్రియాశక్తిని పుష్కలంగా పొందగలము.

ఆ పరమ పూజ్యుని గురించి కాస్త ఆలోచిస్తే రోజుకి ఎనిమిది గంటల గాయత్రి మంత్ర జపం చేశాయడాయన. ఎన్నేళ్ళపాటు ? 24 సంవత్సరాలపాటు. మరి ఆహారం ? ఓ రెండు గుప్పెళ్ళు జొన్నలు గోవుకు తినిపించి, ఆ గోవు స్వీకరించిన ధాన్యాన్ని అరిగించుకున్నంత వరకు అరిగించుకోగా మిగిలిన గింజల్ని ఆవు పేడనించి సేకరించుకొని, వెలికితీసి, బాగు చేసుకొని, పిండి విసురుకొని, రొట్టెలు చేసుకొని



వాటిని ఆహారంగా తీసుకున్నాడు. ఈ పన్లన్నీ ఆయనే స్వయంగా చేసుకునేవారు. గోసంస్కారిత ఆహారమంటారు దాన్ని. అలా ఎన్నాళ్ళపాటు ? 24 సంవత్సరాలపాటు. ఇంకా ఏం చేసే వారాయన ? స్వాతంత్ర్య సంగ్రామంలో స్వయం సేవకుడిగా పనిచేసేవారాయన. చకచకా, చలాకీగా, చెప్పిన పని చెప్పినట్టు చేసుకుపోతుంటే ఆ చిన్న (శ్రీరామశర్మకు) కుర్రాడికి పెద్ద పెద్ద పనులు వప్పచెప్పేవారప్పుడు. (ఆయన చిన్నప్పుడు) ఎంతెంతో దూరాల్లో ఉన్న వాళ్ళకి రహస్య సమాచారాన్నందించే పన్లుంటుండేవి. ఇవన్నీ కాకుండా స్వాధ్యాయం చేసే వారాయన. అది ఆయన మానుకోలేనంతగా అలవాటయిపోయిందన్నారు. ఇవన్నీ చిన్న కుర్రాడైన శ్రీశ్రీరామశర్మ ఆచార్యకు ఆయన గురువుగారు చెయ్యమని చెప్పారు. జ్ఞానశక్తి పుష్కలంగా ఉన్న శ్రీరామశర్మ ఆచార్య గురుప్రేరణననుసరించి ఆచరణలో మహత్తరమైన పనులు చేసి చూపారాయన. మహా మహా కష్టాలన్నీ తామనుభవించి, ఆచరించి సంపాదించిన సాధనాబలంతో వారి అమృతవాక్కులతో చిన్న చిన్న సాధనలు, స్వల్పమైన పనులు మనకి చెప్తున్నారు. గురుపరంపర మననుంచి ఏమి ఆశిస్తోందో అర్థం చేసుకోవాలి. దానికనుగుణంగా మన ఆధ్యాత్మిక సాధనలుండాలి.

గురుపరంపరలో మనకి ఏడు రకాలైన గురువుల లభిస్తారు. జ్వాలాకుల్ మహర్షి అందించిన ఇరవైనాలుగు మహాగ్రంథాల్లో రెండవదైన 'ద ఎక్స్‌టర్నలైజేషన్ ఆఫ్ హైరార్క్' (The Externalisation of Higher Arc) లో గురుపరంపర ఏడు రకాలుగా ఉంటుందన్నారు. గతంలో మనం అనేకమంది గురువుల దగ్గర శిష్యరికం చేసి ఉన్నాం. కబీరుదాసు, శ్రీరామకృష్ణ పరమహంస, లాహిరీ మహాశయ, పరమహంస యోగానంద, అరవిందో, మాతామిర్రా, బ్లావెట్‌స్కీ, CVV ఇలాంటి వాళ్ళ దగ్గర గతంలో మనం శిష్యరికం చేసి ఉన్నాం. అదే నిజం కాకపోయివుంటే మనకు ఈ విషయాలు అందజేయబడివుండేవి కావు. అందినా మనకు ఈ విషయం పట్ల పెద్దగా ఆసక్తి ఉండి ఉండేది

కాదు. అయితే కొందరు శిష్యులు మార్గమధ్యంలో దారి తప్పారు. సర్వజ్ఞులైన గురువులు గుర్తించారది. కొన్ని కొన్ని విషయాలు, అలవాట్లు మనల్ని జన్మజన్మలుగా వెంటబడి వస్తుంటాయి. ఈ శరీరం వదిలేసినా మరో శరీరంతో మనం మళ్ళీ పుట్టినా ఆ అలవాట్లు, ఆ పద్ధతులు, అప్పుడు మనం నేర్చుకొన్న ఆధ్యాత్మిక విద్యలు ఈ జన్మలో కూడా ఉన్నట్టుండి ఏదో ఒకరోజు ఠక్కున గుర్తుకొచ్చేస్తాయి. ఈ జన్మలో కూడా దాన్ని మనం అంతగా కష్టపడి నేర్చుకోనక్కరలేదు. ఉదాహరణకు డ్రైవింగ్, ఈత, సైకిల్ తొక్కడం, ఏదైనా మిషన్ నడపడం ఇలాంటివి మనకు ఇదివరకే తెల్సివుంటే చాలా ఏళ్ళ తర్వాతైనా సరే, మధ్య కాలంలో ఆ పనులు ఏళ్ళతరబడి చేయకపోయినాసరే ఏ సైకిలో ఐతే నడిపెయ్యగలం, అలాగే ఈత కొట్టేయ్యగలం. కాకపోతే కొద్ది పాటి బెరుకు, కొత్త ఉంటాయి. అది సహజం.

గుర్తుచేసే వాడిని గురువు అంటారు. గుర్తుచేయడం వారి బాధ్యతైతే, గుర్తొచ్చాక కూడా అది వరకటిలానే ఉండిపోకూడదు మనం. గురువులవైపు అడుగులేయాలి. అది మన కర్తవ్యం. గురువుల యొక్క తత్వాన్ని గురించి చెప్తూ దివ్యాత్మలు "మనం గురువు వైపు ఒక అడుగు వేస్తే ఆయన మనవైపు పది అడుగులు వేస్తాడు." అంటారు. ఇది అందరికీ తెలిసిందే. అయితే ఈ విషయం గురించి ఆలోచిస్తూ ఏ కష్టాలో వచ్చినప్పుడు 'ఇన్నాళ్ళబట్టి ఆ గురుని సేవ చేసుకుంటున్నానే అయినా ఆయనకి నాపై దయ కలగలేదేంటి' అనుకుంటుంటారు చాలామంది. ఆయనవైపు మనం ఒక అడుగు వేస్తే మనవైపు ఆయన పదిఅడుగులు వేస్తాడు. నిజమే. అయితే మనం ఒక అడుగు వెనక్కేస్తే? పది అడుగులు ఆయనకు దూరమైనట్లెగదా ! ఆ విధంగా ఎన్నిసార్లు మనం వెనక్కడుగులు వేశామో. దీన్ని బట్టి ఆయన్ను ఎంతగా దూరం చేసుకున్నామో కదా ! మననించి ఆయన దూరమవడానికి కారకులం మనమే. నిజానికి వెనక్కి వెనక్కి అడుగులేసుకుంటూ వెళ్ళిపోయింది మనమే అయితే కరుణాసాగరులు, దయామయులు అయిన దివ్యాత్మల



సద్గురువుకు సర్వసమర్పణ చేసుకోవడం వల్ల నీ జీవితంలో చాలా అద్భుతమైన మార్పులు కనిపిస్తాయి అన్న రహస్యాన్ని తెలియజేశారు. సర్వసమర్పణ అనగానే మనకున్న భౌతికపరమైనవన్నీ ఆయనకు అర్పించడం కాదు. మన కనుబొమ్మల మధ్యన దృష్టి ఉంచి జీవించడం. ఆజ్ఞాచక్రంలో మనసును ఉంచి అన్ని పనులు చేసుకోగలగడం. ఏకలవ్యుడదే చేశాడు. భౌతికంగా ఉన్న గురువుకంటే ఎన్నోరెట్ల సామర్థ్యాన్నిచ్చి విలువిద్యలో నిష్ణాతుణ్ణి చేశాడు అతని లోపలవున్న సద్గురువు.

ద్రోణాచార్యుడు తన శిష్యులైన అర్జునుడు మొదలైన వారిని వెంట తీసుకుని వేటకనే మిషతో అడవిలోకి బయలుదేరారు. అప్పటికి ద్రోణాచార్యుడి దగ్గర అన్ని విద్యలూ పూర్తిచేసుకొని శిష్యులంతా తిరిగి వారి వారి స్వస్థానాలకు వెళ్ళిపోబోయే సమయం ఆసన్నమైంది. సాధారణంగా వేటకెళ్ళేటపుడు వేటకుక్కల్ని ముందు పంపిస్తారు. వెనక వీళ్ళు వెళతారు. ఇక్కడకూడా అలాగే జరిగింది. వేటకుక్కలు ముందు వెళ్ళాయి. గురుశిష్యులంతా ఏదో మాట్లాడుకుంటూ నడుస్తూండగా వేటకుక్కల అరుపులు వినిపించాయి. ఉన్నట్టుండి వాటి అరుపులు ఆగిపోయాయి. కాసేపటికి నడుస్తూ వస్తోన్న గురుశిష్య బృందానికి తోకాడించుకుంటూ ఎదురయ్యాయవి. అందరి దృష్టి వాటిమీద పడింది. అవాక్కయిపోయారు శిష్యబృందమందరూ. ఆశ్చర్యంగా చూస్తున్నారు కుక్కల వంక. వేటకుక్కల నోళ్లు తెరవబడి ఉన్నాయి. నోటిలో బాణాలు గ్రుచ్చబడి ఉన్నాయి. అమితాశ్చర్యకరమైందేమిటంటే ఒక్క బొట్టు రక్తం కూడా చిందకుండా నోటిలోకి బాణాలు వేయ బడ్డాయి. అనుమానంగా, ఆశ్చర్యంగా ద్రోణాచార్యుని వైపు చూశారు వారంతా. గురుదేవుల ప్రశాంత మందహాసపు మోము వారిని మరింత అయోమయంలో పడేసింది. ద్రోణాచార్యుల వారు శిష్యులకు వెంట రమ్మని సైగచేస్తూ అక్కడికి దగ్గర్లో ఉన్న ఓ పొద వెనక్కి వెళ్లారు. అక్కడున్న విశాలమైదానంలో కళ్లగంతలు కట్టుకొని విలువిద్య ప్రాక్టీస్ చేస్తున్నాడో వ్యక్తి ఎదురుగా ఓ ప్రతిమను

పెట్టుకుని. ద్రోణాచార్యుని గురువుగా భావించి ఆయనకు బదులు ఆయన ప్రతిమ నుంచుకొని భక్తితో విలువిద్యాభ్యాసం చేస్తున్నాడు ఏకలవ్యుడు అడవిలో.

దృష్టి కనుబొమల మధ్య-శ్రీగురుని చెంత ఉంచి చేసిన ఏ అభ్యాసమైనా ఎంత అద్భుతంగా ఫలితాన్నిస్తుందంటే సాక్షాత్తూ భౌతిక శరీరధారియైన సద్గురువు ఎదుట వుండి నేర్పించిన దానికంటే ఎన్నోరెట్లు గొప్పది కాగలదు. అందుకే గురుదేవులంటుంటారు 'భౌతికంగా ఉన్న గురువుని పట్టుకు వేళ్ళాడటం కంటే నీ లోపలున్న గురువు దగ్గరకు వెళ్ళు. ఆయన్ను పట్టుకో. భౌతిక శరీరధారియైన ఈ బైట గురువు మిమ్మల్ని మీ లోపలున్న గురువు దగ్గరకు తీసుకెళ్ళే వరకే. ఆ తరువాత మీరాయనతో సంబంధం పెంచుకోవాలి. బయటున్న గురువుకంటే మీ లోపలున్న గురువే ఎక్కువ లాభాలిస్తాడు'అంటుంటారు. కనుక మనం ఆయనకి సర్వసమర్పణ చేసుకోవాలి. అంటే మనము ఏ పని చేస్తున్నా మన దృష్టి ఆయనమీదే ఉండాలి. ఏకలవ్యుడు చేసిందదే. గురువుకు - గురువుయొక్క చిత్రపటానికి (మూర్తికి) - గురువు యొక్క నామానికి - గురువు యొక్క శరీరానికి మధ్య ఎలాంటి తేడాలు ఉండవని నిరూపించాడు ఏకలవ్యుడు. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడైన గురువుకు మనం లొంగిపోగలగాలి. ఏ పని చేస్తున్నా ఎక్కడున్నా, ఎలా ఉన్నా అలా ఆజ్ఞాచక్రస్థానంలోని గురువు మీద మనసుంచుకోవాలి. అలా కనుబొమల మధ్యన మనసునుంచుకొని అన్ని పనులూ చేసుకోవచ్చు. అలాఉండేటట్లు అభ్యాసం చేయాలి.

> పానీయంబులే ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్
> హాసలీలా నిద్రాదులు చేయుచున్ తిరుగుచున్ లక్షించుచున్
> సంతత శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాద
> సంధానుడై మరచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా ॥

మహా భాగవతంలోని పద్యమిది.



దురదృష్టవశాత్తూ ఆధ్యాత్మికతలో కొన్ని ముఖ్యాంశాల్ని మర్చిపోయాం మనం. తప్పుగా అర్థం చేసుకోన్నాం. నిరంతరం హరిచింతన చేయడం కాదు సాధన చేయడమంటే. సాధనంటే మనం ఏ పని చేస్తున్నా మనం అదే అయి పోగలగాలి. ఓ ఇంజనీరింగ్ చదివే పిల్లాడు ఓ రోజు అతని స్నేహితులతో కలిసి సినిమాకెళ్ళాడనుకుందాం. అక్కడతని దూరపు బంధువు కనిపించి 'నాయనా నువ్వేం చేస్తున్నావ' నడిగాడు. వెంటనే ఆ పిల్లాడు 'ఇంజనీరింగ్ చేస్తున్నానంటాడు. నిజానికతను సినిమాకొచ్చాడు. మరెందుకలా చెప్పాడు ? అతనిలో అతడు నేర్చుకొంటున్న విద్య (చదువు) జీర్ణమై పోయింది. ఆ పిల్లాడికున్న కనీసపు అవగాహన కూడా ఆధ్యాత్మిక సాధనలు చేస్తున్న మనకు లేదేమోననిపిస్తుంది.

ఈ దుర్దశకు కారణం మనం సంస్కారాలను మర్చిపోవడమే. భవిష్యపురాణంలో 48 సంస్కారాలు చెప్పారు. అయితే వాటిలో 16 సంస్కారాలు ప్రస్తుతం గుర్తుంటే చాలు. అట్లాంటిది ఒక్క సంస్కారం మాత్రం మనం ఘనంగా చేసుకుంటాం. అదే వివాహసంస్కారం. గర్భాదాన సంస్కారంతో మొదలవుతాయి ఈ సంస్కారాలు. కడుపుతో ఉన్న తల్లి గర్భంలో ఎలాంటి సంస్కారాలు ఉన్న ఆత్మ ప్రవేశించాలి అన్న దానికి సంబంధించిన సంస్కారం అది గర్భాదాన సంస్కారమంటే.

అంతకంటే ఓ విచిత్ర రహస్యమేంటంటే చాలా మందికి తెలియదు. 'నవమాసాలు మోసే తల్లికి తెలుసు ఆ బరువేంటో ఈ మగవాళ్ళకేం తెలుసు ఆ భారం, ఆ కష్టం. మీరు మోస్తే తెలుస్తుంది' అంటూంటారు కొందరు వాస్తవము తెలీక. అయితే నిజానికి తల్లి గర్భంలో ప్రవేశించబోయే ఆత్మని మగవాడు (కాబోయే తండ్రి) ఒక సంవత్సరం పాటు (ఆ ఆత్మని) మోస్తాడు. ఇది వాడికీ తెలీదు. ఆ తరువాతే తల్లి గర్భంలోకి ప్రవేశిస్తుందది. కీలకమైన రహస్యమయ విశేషాల్ని తెలుసుకోకుండా అంటే థియరీ తెలీకుండా నేరుగా ఆధ్యాత్మిక జగత్తులో ప్రవేశిస్తే అక్కడంతా నిరాశాజనకంగా ఉంటుంది. మళ్ళీ బయటపడి

పోవాలనిపిస్తుంటుంది. చాలామందికి తమ పిల్లలు ఆధ్యాత్మికతలోకి వెళ్ళిపోతారేమోనని బెంబేలు పడిపోతుంటారు.

తల్లి గర్భంలో ఉన్న తొమ్మిదినెలల్లో ఏం జరుగుతుందో బ్రహ్మంగారు చెప్పారు. భాగవతంలో కపిలుడు చెప్పాడు. ఇంకా చాలా మంది చెప్పారు. రకరకాల కోరికలతో ఉన్న ఆత్మను సంతృప్తి చెందేట్టు చేయడం కోసం తల్లికి కావలసినవన్నీ అందిస్తారు. తల్లి తను మానసిక తృప్తితో ఉంటే పుట్టబోయే బిడ్డకు చాలా కోరికలు తగ్గిపోతాయి. అప్పుడే (తల్లి కడుపులోనే) తీరిపోతాయి. గర్భిణీస్త్రీలు అసలు ఇళ్ళలో ఉండకూడదు. గురుకులాల్లోనో, ఆశ్రమాల్లోనో ఉండాలి. సీతాదేవి వాల్మీకి ఆశ్రమానికి చేర్చబడ్డది. అలాగే లీలావతి కూడా. అందువల్లనే మహా భక్తుడైన ప్రహ్లాదుడు జన్మించాడు. మన పురాణకథల్లో మనం చదివేవి కట్టుకథలు కావవి. కాకమ్మ కబుర్లు అంతకన్నా కావు. స్త్రీశక్తి ఎంత గొప్పదంటే వారు కోరుకున్నట్లుగా కోరుకున్న సంతానాన్ని పొందగలరు. ఆధ్యాత్మిక విద్యపట్ల సరియైన అవగాహన లేకపోడం చేత స్త్రీలకు కష్టకాలం దాపురించింది. సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగిన అత్యద్భుత సామర్ధ్యం వాళ్ళలో ఉన్నాకూడా అది ఉపయోగించుకోలేని దుర్దశలో జీవనం సాగిస్తున్నారు. వివేకానందుడు అభిప్రాయపడ్డట్టు ఏదైనా ఓ విషయాన్ని ప్రతి ఇంటి డ్రాయింగ్‌రూమ్ వరకు తీసికెళ్ళడం కంటే వంటింటి వరకు తీసుకెళ్ళగలిగితే ఈ సమాజంలో అనూహ్యమైన మార్పులొస్తాయన్నారు. అలాంటిది స్త్రీలకు సరియైన అనుకూలత ప్రాధాన్యత లేకపోవడం చేత వంటింట్లోనే ఉంటూ వంటతో పాటు తామూ ఉడికిపోతున్నారు. వంటింటి కుందేల్లుగానే మిగిలిపోతున్నారు. మరి కొంతమంది విప్లవాత్మకమైన భావాలతో ఏదేదో ఊహించు కుంటూ అమాయకపు చేష్టలతో చిందు లేస్తున్నారు.

అసలు రహస్యం స్త్రీలు వంట చేయడంలోనే ఉంది. వివేకానందుని భావనది. తాము కోరుకున్న సంతానాన్నే పొందగలగడం మాత్రమే కాదు. స్త్రీలకు జన్మతః ఇవ్వబడ్డ వరం మరొటుంది. తాము కోరుకున్న



సానుకూల వాతావరణం ఇంటిల్లిపాదిలో తన చేతివంట ద్వారా తను కోరుకున్నట్లుగా చేయగలదు. 'భర్త నా మాట వినడం లేదు. పిల్లలు నన్ను లక్ష్యపెట్టట్లేదు. అత్తమామలు నాపట్ల నిర్లక్ష్యంగా ఉన్నారు. ఇలాంటి వాటన్నింటికీ కారణం ఆవిడ చేతిలో ఉన్న విద్యను ఉపయోగించుకోలేకపోవడమే. నిజానికి వంటచేసి వడ్డించడం ద్వారా ఆడవారైనా, మగవారైనా తాము కోరుకున్న మార్పులు తెప్పించవచ్చు. పరిస్థితులు సానుకూలపరచుకోవచ్చు.

పెద్దపెద్ద వ్యాపారవేత్తలు తోటివారిని, ఉన్నతాధికారుల్ని లేక రాజకీయ వేత్తల్ని డిన్నర్‌కి ఆహ్వానిస్తుంటారు. తెలిసో, తెలీకో చేస్తోన్న ఆ పని అనూహ్యమైన మార్పులిస్తుంది. ఓ ఉన్నతధికారి ఎంత రిజర్వుడుగా ఉన్నా, తన మనస్తత్వం ఇతరులకు తెలీకుండా ఉంటానికి ఎంతగా దాచిపెట్టుకున్నా అతని ఆహారపుటలవాట్లు గమనించి చాలావరకు అతని మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చు. ఓసారి పి.వి. నరశింహారావుగారు ప్రైమ్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఆయన వంటవాడ్ని పనిలోనించి తీసేశారు. దానికి కారణం అతను ఆ రోజు వండబోయే పదార్థాల వివరాల్ని ఏ విలేఖర్లకో, ఎవరికో చెప్పాట్ట. అదీ కారణం. ఉద్యోగంలోంచి పీకిపారేశారు.

ఇవాళ టి.విలు చూడకుండా ముద్ద మింగుడు పడటం లేదు. ఇక మీదట టి.వి.లు చూస్తూ, పక్కవాళ్ళతో మాట్లాడుతూ, పేపరు చదువుతూ భోజనం చేసే పరమ ప్రమాదకరపు అలవాట్లను మనుషులు తక్షణం మార్చుకోకపోతే రాబోయే అతి సమీపకాలంలో అలాంటివారు మందుల్లేని రోగాలతో బాధపడాల్సి ఉంటుంది. అకారణ కలహాలతో బజారున పడాల్సి వస్తుంది' అని చెబుతున్నారు. వంట చేసేప్పుడు భగవన్నామం చేసుకోవడం ఉత్తమోత్తమం. కనీసం మౌనంగా ఉంటూ శ్వాసను గమనించుకుంటూ వంట చేయలేకపోతే వారు వండుతోన్న పదార్థాలు విషపూరితమవగలవు. అలాగే వడ్డించేప్పుడు, పిల్లలకి తినిపిస్తోన్నప్పుడు పుణ్యప్రదమైన పురాణగాథలో, సద్గురుని దివ్యనామమో మనసులో

ఉండాలి తప్ప చిరాకుపడుతూనో, తిట్టుకుంటూనో, కోప్పడుతూనో, టి.వి.లు చూస్తూనో పెట్టకూడదు. వడ్డించేవారు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిందేంటంటే ఏ భావనతో, ఏఏ ఆలోచనలతో వంటావార్పూ చేస్తారో అలాంటి సంస్కారాలే ఆ వంట తిన్నవాళ్ళకు వస్తాయి. ముఖ్యంగా మన ఆర్థిక ఇబ్బందులకు ప్రధానకారణం రకరకాల ఆలోచనలతోనో, టి.వి.లు చూస్తూనో, పక్క వాళ్ళతో మాట్లాడుతూనో వంట చేసి వడ్డించడం ఆ వడ్డన తింటూ మౌనంగా ఉండకుండా రకరకాల ఆలోచనలు చేసుకుంటూనో, పేపరు చదువుతూనో, వాదోపవాదాలతోనో అన్నం తినటం. దీనికన్నా మరో ప్రమాదకరమైనదేమంటే స్నానాదులు లేకుండా వంట చేయడం. కోపంతో వంటచేయడం, వడ్డించడం, భోజనం చేయడం. ఎంత చదువు చదువుకున్నా ఉద్యోగాలు లేక పోవడం, జీతాలు చాలీచాలకుండా ఉండటానికి కారణం ఇలా మౌనంగా తినకపోవడమేనని గ్రహించాలి. ఈ దురలవాటు ఇలాగే కొనసాగిస్తే మొత్తం కుటుంబమంతా అనారోగ్యం బారినపడ్డం ఖాయం అంటున్న వారి ఆవేదన అర్థం చేసుకోవాలి. ఇలాంటి వారు అనేక రకాల కోర్టుకేసులు, పోలీసు గొడవల్లో ఇరుక్కుపోవాల్సి వస్తుంది. ఇదంతా భవిష్యవాణిగా తెలియజేయబడుతోంది. భోజనం చేయడమంటే ఎలాగో తెల్సుకోవాలి మనం ముందు. ('అసలు రహస్యం' అనే పుస్తకంలో మరిన్ని వివరాలున్నాయి.)

భారతీయ ఋషులు మనకందించిన సంస్కారపద్ధతి చాలా గొప్పది. నామకరణ సంస్కారం, కేశఖండన సంస్కారం, విద్యారంభ సంస్కారం, ఉపనయన సంస్కారం మొదలైన పదహారు సంస్కారాలు మనల్ని సంస్కరింపజేయడం కోసం మన ఋషులందించారు. సంస్కరింపజేయడమంటే అగ్ని సమక్షంలో తక్షణం మనలో మార్పు తెస్తాయని. పద్దెనిమిదేళ్ళు ఓ చోట పెరిగి వివాహసంస్కారం పేర కేవలం రెండు మూడు గంటల వ్యవధిలో అంతకుముందు ఎలాంటి బంధుత్వం లేనివారు సైతం ఆత్మబంధువులుగా మారిపోవడం చూస్తున్నాం పెళ్ళిళ్ళల్లో.



శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్ ॥

(భ.గీ. - 6 అ. - 11 శ్లో.)

శుచి అనగానే మనకి శుభ్రంగా ఉండడం గుర్తొస్తుంది. కానీ ఋషులు చెప్పిందది కాదు. 'అగ్ని'. అగ్ని మూడు రకాలు. పావక, పవమాన, శుచి. ఈ త్రేతాగ్నుల్ని మనం సవ్యంగా ఉపయోగించుకొని గురుస్థాయిని అందుకోగలగాలి. సృష్టిలో ఈ మూడు అగ్నులు నిరంతరం పనిచేస్తున్నట్లే ఈ మూడు మన శరీరంలో కూడా నిరంతరం పనిచేయాలంటే సాధన అవసరం. అగ్ని లేకపోతే సంపదలు రావు. తీర్థ ప్రదేశాలన్నీ 'శుచి' గల ప్రదేశాలే అన్నారు. చాలామంది విదేశీయులు కాశీ గురించి 'ద వెరీ డర్టీప్లేస్ ఇన్ ఇండియా' అని రాస్తుంటారు. 'శుచి' అంటే 'అగ్ని'. ఆ తీర్థక్షేత్రాలకెళ్ళినపుడు అక్కడున్న అగ్నిసంపర్కం వల్ల మనం పవిత్రతం పొందుతాం. ఆ అగ్ని సంపర్కం చేత మనలోని జన్మజన్మల సంస్కారాలు దగ్ధం చేయబడతాయి. షట్చక్రాలు శక్తివంతమౌతాయి. ఇనుమును బ్లాస్ట్ ఫర్నెస్ (కొలిమి)లో వేసినపుడు దాని మాలిన్యాలన్నీ పోయి ఇనుము దాని స్వస్వరూపంతో బయటకొస్తుంది. మనల్ని మనం అగ్నిలో వేసుకుంటే కూడా మన స్వస్వరూపం వ్యక్తమౌతుంది. అగ్ని సంస్కారం తరవాత మిగిలేదంతా స్వస్వరూపమే. సంస్కారాలన్నీ అగ్నిముఖంగానే చేయించబడతాయి. అగ్ని లేకుండా ఏ సంస్కారమూ లేదు. మహామహా సాధనలు, అసాధ్యమైనవీ కష్టతరమైనవన్నీ సహజ ప్రేమమూర్తులు పూజ్య గురుదేవులు చేసేశారు. సులభాతి సులభమైనవీ, శక్తివంతమైన వాటినీ సాధనలుగా మనకు తెలియజేస్తున్నారు. ఇక ఈ మాత్రం సాధనలు కూడా చేయటానికి ఉత్సాహం చూపించకపోతే మనలో అగ్నే లేదని అర్థం. అగ్ని మనలో లేనేలేదని గ్రహించాలి. ఆగ్నేయచక్రంలో (అజ్ఞాచక్రం) ఆ అగ్నిలో నిన్ను నీవు సమర్పించుకోగలగాలి.

యజ్ఞాగ్నికి ఓ అద్భుతమైన శక్తి ఉంది. మనమేది సమర్పించినా అది స్వల్పమైనప్పటికీ ఎన్నో రెట్ల కొద్దీ పెరిగి పెరిగి తిరిగి మనకి ప్రసాదింపబడుతుందంటారు. కళ్ళు మూసుకొని కనుబొమల మధ్య దృష్టినుంచమన్నారు. ఇంతకుముందు మనకు చెప్పినట్టు 'చూస్తుండ మంటే చూస్తూండడం' కాకుండా మన మనసుని ఒక వంక గమని స్తుండాలి. దాన్ని పరి పరి విధాల పోనీయకుండా అగ్నేయచక్రంలో ఉన్న అగ్నితో సంపర్కం పెట్టుకోనీయాలి. అంటే ఏ విధమైన ఆలోచనలు మనసులో మెదలకుండా జాగ్రత్త పడాలి. మొదట్లో కాస్త కష్టమని పించవచ్చు. అందుకు మనకు మనంగా ఏ ఆలోచనా చేయ కూడదు. దృష్టి ఆజ్ఞాచక్రమందే ఉంచుకుంటూ ఆ కనుబొమ్మల మధ్యన అగ్ని స్థాపన చేయబడిన యజ్ఞగుండాన్ని ఊహించుకోవాలి. కళ్ళు మూసుకొని కనుబొమల మధ్యన దేదీప్యమానంగా ప్రజ్వరిల్లు తున్న.యజ్ఞాగ్నిని చూడాలి. "మన మనసు ఎలాంటి ఆలోచనలు లేని స్థితిలో ఆ అగ్నిలో అగ్నిగా ప్రకాశిస్తోంది' అనే భావన చేసుకోవాలి. ఈ ఆలోచనా రహిత స్థితిలో ఎంతసేపుండగలిగితే అంతసేపుండగలిగి మెల్లిమెల్లిగా కళ్ళు తెరవాలి. కళ్ళు తెరచినా మన మానసిక స్థితి చెదిరి పోకూడదు. ఆ నిశ్చలస్థితిలోనే ఉండాలి. కళ్ళు తెరిచిన మనకెదురుగా అనేక వస్తువులు కనపడుతున్నా మనసు వాటి మీదకు పోకూడదు. పలురకాల వాసనలు మన మనసుని చలింప చేయనీకూడదు. రకరకాల శబ్దాలు మన మనో ఏకాగ్రతని భంగం చేయకూడదు. వేడి, చలిగాలుల వంటి స్పర్శ కూడా మన మానసిక స్థితిని భగ్నం చేయ కూడదు. పలురకాల రుచులు, అభిరుచుల వైపు మనసును పోనీయకూడదు. అలా ఎంతసేపుండగలిగితే అంతసేపుండాలి. ఆ అగ్నిలో వేసింది స్వల్పమైనా తిరిగి ఎన్నోరెట్లుగా ప్రసాదింపబడుతుంది గదా ! ప్రాథమిక దశలో ఆజ్ఞాచక్రంలో కొద్ది సెకండ్లే ఉండగలిగేవారున్నారు. అయినా నిరాశ చెందవలసినపనిలేదు. మాటిమాటికి ప్రయత్న పూర్వకంగా దీన్నే అభ్యాసం చేస్తూండడం వల్ల త్వరిత కాలం లోనే నిశ్చలస్థితిలో మనసు



నుంచుకోగల్గుతాము. విసుగూ, విరామంలేకుండా ప్రతిసారీ చక్కని పట్టుదలతో ఓర్పుగా ఇలాగే ప్రయత్నిస్తుండాలి. భగవద్గీతలో జగద్గురువు చెప్పిందిదే.

విద్యుచ్ఛక్తి ఎవరు కంట్రోల్‌లో ఉంటుంది ? ఎలక్ట్రికల్ ఇంజనీరు కంట్రోల్‌లో ఉంటుంది. విద్యుత్ అనే శక్తికి ఎలక్ట్రికల్ ఇంజనీరు గురువనమాట. అలాగే దేవతాశక్తుల్ని కంట్రోల్ చేయగలిగేటటువంటి వాడు గురువు. స్కూలునించి ఇంటికొచ్చిన ఓ బాలుడు "నా గురువాజ్ఞ తోనే చదువును మానేస్తున్నాన"న్నాడు. 'మానస భజరే గురుచరణం' అంటూ పాడుకోసాగాడు. దినదినాభివృద్ధి చెందుతూ ఎన్నో లీలల్ని ప్రదర్శించేవాడు. ఎవరో అడగనే అడిగారు "నాయనా ! నీవెవరి వని ?" చేతులోని మల్లెపూవుల్ని అలా విసిరాడా బాలుడు. సుమారు 1932 ప్రాంతాల్లో జరిగిందిది. మనందరికీ తెలిసిన సంఘటనే. నేలమీద విసరబడ్డ మల్లెపూలు "షిరిడీసాయి" అనే అక్షరాలుగా రూపొందాయి. పుట్టపర్తి సాయిబాబావారి బాలా లీలా వినోదమిది. అప్పటి పుట్టపర్తి లాంటి శుద్ధ పల్లెటూరిలోని జనానికి, షిరిడీ అనే ఇంకో శుద్ధపల్లెటూరు ఒకటుందనే విషయం తెలీనేతెలీదు. అందాకా ఎందుకు ? ఇప్పటికీ చాలా పల్లెటూళ్ళల్లో, చాలా చోట్ల షిరిడీ గురించే తెలీదు.

'షిరిడీ సాయినే నేను' అంటూ ఎంతో స్పష్టంగా చెప్పిన మరో సంఘటన కూడా మనకు తెలుసు. శ్రీ సత్యసాయి ఓ రాయిదగ్గర ఉండగా ఫోటో తీస్తే ఆ రాయి షిరిడీసాయి అకృతిలో పడింది. మనం ఎంత మూర్ఖాగ్రేసురులమంటే గురుపరంపరలోని వారు ఒకళ్ళకొకళ్ళు తమ జీవితాలను ఓ నిర్దుష్ట ప్రణాళికా బద్ధంగా రూపొందించుకొని శరీరాలు వేరైనా ఒకే లక్ష్యం కోసం పనిచేస్తుంటారని తెలుసుకోకుండా 'షిరిడీసాయే సత్యసాయిగా వచ్చాడంటారు నిజమేనంటారా ?' అంటూ మనబోటి తుచ్ఛమైన జీవితాల్ని ఎలాగోలా బతికేస్తోన్న ఇంకో మూర్ఖా గ్రేసరుణ్ణి అడుగుతూ చాలా తెలివైన వాళ్ళమనుకుంటాం. ఆయన షిరిడీసాయో, కాదో వాళ్ళ సంస్థాన్ వాళ్ళకే సరిగా తెలీదు. వాళ్ళకీ,

వీళ్ళకీ పెద్దగా పొత్తు కుదరదు. షిరీడీసాయి సత్యసాయిగా పునర్జన్మ తీసుకొని ఆ దయామయుడే తిరిగి తరువాతి జన్మలో తనే ప్రేమ సాయిగా అవతరిస్తానన్నారు. అప్పుడు కూడా ఇలాగే ప్రవర్తించి ఆ ప్రేమమయుణ్ణి గుర్తించక, మనలోమనం వర్గాలుగా, ముఠాలుగా ఏర్పడి అందరం కలవకపోతే ఆ ప్రేమసాగరుడెంతగా వ్యథచెందుతాడో ఒక్కసారి ఆలోచిద్దాం !

సుమారు ఏడెనిమిది వందల సంవత్సరాల క్రితం ఒకే ఒక్కడు, ఓ సర్వసమర్థత కలిగిన దివ్యాత్మ స్వరూపుడు, దిగజారిపోతున్న భారతీయ సంస్కృతిని, గురుసాంప్రదాయాన్ని పునఃప్రతిష్ఠించేందుకు ఆవేదన చెందాడు. నడుం కట్టాడు. హిందూ, ముస్లింలు కలిసి జీవించ లేకపోవడాన్ని తట్టుకోలేకపోయాడు. అప్పుడే ఆ ఒంటరి ఆత్మ మహత్తరమైన మూడు సంకల్పాల్ని తీసుకుంది.

**1. భూమిని స్వర్గంగా మార్చడం.**
**2. వేదవిజ్ఞానానికి అనుగుణ్యంగా సమస్త మానవాళినీ జీవింప చేయడం.**
**3. అందరికీ శాంతి, సుఖము, సమృద్ధి అందేలా చూడడం.**

1250 లో పుట్టిన ఆ దివ్యాత్ముడు కబీర్‌దాసుగా తన చిట్టచివరి శ్వాస వరకూ ఒంటరిపోరాటాన్ని సాగించాడు. కలాన్నిగానీ, కాగితాన్ని గానీ నాచేత్తో నే ముట్టుకోలేదన్నాడు. అలాంటి చదువురాని ఆ మహాత్ముడిపై ఇవాళ మహా మహా పండితులే పి.హెచ్.డి. చేస్తున్నారు. అంతటి మహితాత్ముణ్ణి పోలిన దివ్యాత్మ మనకెక్కడా కనిపించదు. ఏ పుస్తకాల్లోనూ దొరకదు.

శరీరం వదిలేశాక కబీర్‌దాసు ఓ వంద సంవత్సరాల అనంతరం మహారాష్ట్రలో సమర్థరామదాసుగా పుట్టాడు. అటు తరువాత మధ్యలో అతి సామాన్యమైన జన్మల అనంతరం రామకృష్ణ పరమహంసగా అవతరించినా గతంలోని వారి లక్ష్యాన్ని మరవలేదు. మనుషుల్ని దేవతలుగా తయారుచేయడం అంటే
భూమ్మీద స్వర్గాన్ని తయారుచేయడం



వేద విజ్ఞానానికనుగుణ్యంగా మనుషుల్ని జీవింపచేయడం అంటే
సహజ జీవిత విధానం -
ఒక వరుస క్రమంలో అందరికీ శాంతి, సుఖము, సమృద్ధి అందించడం.

శ్రీ రామకృష్ణపరమహంస మనిషిలోని మానసిక అల్పజ్ఞత్వానికి, స్వార్థపూరిత ఆలోచనలకు ఎంతో కలత చెందాడు. ఇలాంటి వాళ్ళను దేవతలుగా మార్చడమెలాగా ? వేదమయ జీవితవిధానాన్ని నేర్పించడ మెలాగ ? శాంతి, సుఖము, సమృద్ధి వంటి వాటిని ఈ మానవాళికి అందించడమెలాగా ? అని తీవ్ర ఆందోళన చెందాడాయన. అప్పుడా దివ్యాత్ముడికి ఓ అద్భుతమైన ప్రణాళిక స్ఫురించింది. మనుషులు మారాలంటే దేవతా శక్తులవసరం. బలహీనమైపోయివున్న ఆనాటి దైవీశక్తి ఆయన్ని మరింత కలవరపాటుకు గురిచేసింది. అంచేత ముందు దేవతా శక్తులన్నిటినీ పునః స్థాపితం చేయాల్సిఉంది. ఆ అజేయమైన ఒంటరి ఆత్మ, అద్వితీయ సాధకుడైన శ్రీ రామకృష్ణ పరమహంస తన సాధనా బలంతో అంతరిక్షంలో ఉన్న సమస్తదేవతా శక్తుల్ని, భూమిపైకి దింపారు. అలా తను నిర్విరామంగా తమ తపో బలంతో దేవతాశక్తుల్ని భూమ్మీదకి ఆవిష్కరింపజేస్తుంటే స్వార్థపూరిత అల్పమైన కోరికలతో ఉన్న మనుషులు ఆ దేవతాశక్తుల్ని మరో పక్కనించి లాగేసుకుంటున్నారు.

ఓ తండ్రి తన పిల్లవాడికి ఏ ఇంజనీరింగ్ కోసమో ఫీజులు సమకూరుస్తూంటే మిగతా కుటుంబ సభ్యులంతా నాకదికొనిపెట్టు. ఇది కొనిపెట్టంటూ, ఆ తండ్రి కష్టపడి కూడబెడుతోన్న ఆ పైకాన్ని అర్థం పర్థం లేని వాటికోసం ప్రాణం తీసేస్తూంటే ఎలా ఉంటుందో అలాంటి సంకటస్థితిలో ఆ ప్రేమసాగరుడు ఇరుక్కుపోయి విలవిల లాడసాగాడు. అయినా ఆ దయామయుడు ఎవ్వర్నీ కాదనలేదు.

ప్రతి గురువుకు వెనుక సంతతధారగా, నిరంతరం ఓ అద్భుత మైన దివ్యశక్తి పనిచేస్తుంటుంది. దానికి సీక్రెట్ డాక్ట్రిన్‌లో 'షంబాలా' శక్తి అని మేడమ్ బ్లావెట్స్కీ ఓ కోడ్ ఇచ్చారు. అక్కడి పరమ గురువులు

శ్రీరామకృష్ణ పరమహంస యొక్క బాధను గమనించారు వాళ్ళు. షిరిడీసాయిని sos ద్వారా ఉన్న ఫళంగా పిలిపించారు. హిమాలయాల్లో ఉన్న శంబలా క్షేత్రానికి రమ్మని ఆదేశం పంపారు. ఆ సందర్భంగా షిరిడీసాయి వదిలివెళ్ళిన భౌతిక శరీరాన్ని మూడ్రోజులు కాపలా కాశారు. "ఈ మానవాళికి కావలసిన అన్ని కోరికలు నేను తీరుస్తాను. మీ మూడు సంకల్పాలు దిగ్విజయంగా పూర్తిచేయడం కోసం మీ ప్రయత్నాలు మీరు చేయండి' అని ఓ ఒప్పందం జరిగిందక్కడ. షిరిడి సాయి మూడురోజుల అనంతరం తిరిగి తన శరీరంలోకి వచ్చేశారు. ఆనాడు ఆ ఒప్పందం జరిగింది కాబట్టి షిరిడీసాయిని మనమేదైనా అడిగేయొచ్చు. మన 'ఎకౌంటులో' కోరికలు తీర్చగలిగే బలం ఉంటే ఖచ్చితంగా తీర్చేస్తాడు శ్రీసాయి. అందులో ఏమీ సందేహం లేదు. ఎకౌంట్సులో జంబ్లింగ్ అంటారు. చార్టెడ్ ఎకౌంటెంట్స్‌కి బాగా తెలుస్తుందది. Taxivation అంటారు దాన్ని. ఈ విషయంలో మనం అర్థం పర్థంలేని పిచ్చి పిచ్చి కోరికలతో ఆయన్ను వేధించకుండా కాస్త ఇంగితాన్ను పయోగించగల్గితే శిష్యులమనిపించుకుంటాం. అది వేరే విషయం.

క్రితం జన్మలో తనతోపాటు పనిచేసిన ఛత్రపతి శివాజీ ఈ జన్మలో ఏ పూనా దగ్గరో ఓ ఊర్లో ఉంటూ చదువుకుంటున్నాడు. రామకృష్ణ పరమహంస క్యాన్సర్‌తో బాధపడుతూ కూడా అతనికి సందేశం పంపుతుండేవాడు. ఏ ఇంటర్మీడియేట్ చదువుతున్న ఆ పిల్లాడికి ఈ జన్మలో శివాజీకి బదులు ఇంకేదో పేరు పెట్టబడింది. శ్రీ రామకృష్ణ పరమహంస గురుదేవులు పంపుతోన్న సందేశానికి ఆ పిల్లాడు స్పందించడం లేదు. సమాధానమూ ఇవ్వడం లేదు. 'హజరత్ బాబా జాన్' అనే యోగిని ఉండేది ఆ పిల్లాడు స్కూలుకెళ్ళే దోవలో. ఈసారి శ్రీరామకృష్ణులు సందేశాన్ని ఆవిడకి పంపారు 'కాస్త మావాడికి నా సంగతి గుర్తు చేయమని'. వెంటనే ఆ పిల్లాణ్ణి ఆమె దగ్గరకు పిలిచి ఆజ్ఞాచక్రం మీద ముద్దుపెట్టుకుంది. దాంతో ఆ తల్లి స్పర్శకు మొత్తం గుర్తుకొచ్చింది. పిచ్చెక్కింది. తల గోడకేసి బాదుకునేవాడు. రక్తం కారేలా దెబ్బతగిలినా ఎంతో ఆనందం అనుభవిస్తుండేవాడు. అయినా అతని కింకా కర్తవ్యం బోధపడలేదు. అలా పిచ్చాళ్ళా తిరుగుతూ షిరిడీసాయి దగ్గరకొచ్చాడు. ఆయనే మెహర్‌బాబా.



అక్కడ ఉపాసనీ బాబా అనే ఓ మహాత్ముడుండేవాడు. షిరిడీ సాయితో 'నీవు నా అంతటి వాడవయ్యావు' అని అనిపించుకున్న మహావ్యక్తి ఉపాసనీ బాబా. ఆయన మెహర్‌బాబాని గమనించి దూరంగా ఉన్న అతనిపై ఓ ఇటుకరాయి విసిరికొట్టాడు. అది హజరత్ బాబాజాన్ ముద్దు పెట్టుకున్న చోటనే తగిలింది. దాంతో అతనికి పట్టిన పిచ్చి వదిలి పోయింది. మామూలు స్థితికొచ్చాడాయన. ప్రశాంతంగా, మౌనంగా పరిస్థితిని అంచనా వేసుకుంటున్న మెహర్‌బాబాకు ఓ విషయం స్పష్టంగా అర్థమైంది. 'ఈ మనుషుల్ని మార్చడం అంత తేలికైన విషయం కాదు. మౌనంతోనే ఈ మానవజాతికి పట్టిన వ్యాధికి చికిత్స చేయాలి' అని తీర్మానించుకొని ఓ శక్తివంతమైన మౌనసాధన ప్రారంభించాడు. మెహర్‌బాబా జీవితచరిత్ర చదవగలిగితే ద్వాదశరాశి చక్రాలు - ఈ పన్నెండు రాశుల్నీ పన్నెండు మంది స్త్రీల మీద ఆరోపణ చేయడం, అలా చేసుకుంటూ కాలాన్ని మారుస్తూ మనుషుల మానసిక స్థితి సరిచేయగలిగే అమోఘమైన సాధనా విధానాలు తెలియజేయబడ్డాయి. ఆయన అద్భుతమైన జీవిత చరిత్ర ఆ దృష్టికోణంతో చదివితే అర్థమౌతుంది.

సరే... అక్కడ శ్రీరామకృష్ణ పరమహంసకి బెంగపట్టుకుంది. తన సాధనా బలంతో "భూమ్మీదకి దింపిన దేవతా శక్తులకు ఆహారము అందించడమెలాగా ?" అని చాలా ఆందోళన చెందారాయన. "ఆధ్యాత్మిక జగత్తులో కూడా కలుషితం పేరుకుపోయిన పరిస్థితుల్లో, భగవంతుడి పేరు చెప్పుకొని అడుక్కు తినేటువంటి ఈ వాతావరణంలో, ఆధ్యాత్మికాన్ని వ్యాపారానికి సైతం వాడుకొంటున్న దురదృష్టకర దుర్దశలో, ఇలాంటి మనుషులతో దేవతలకాహారం ఎలా అందించ గలగాలి ? యజ్ఞ విధానంతో తప్ప దేవతలకు ఆహారం అందదే... ఎలాగా ?' అను

కుంటూ ఆందోళన చెందుతూ తనే తిరిగి జన్మించేందుకు నిర్ణయించుకొన్నారు. ఓ పథకం ప్రకారం హిమాలయాలకు దగ్గరగా పుట్టారు. శ్రీరామశర్మగా గాయత్రీ పరివారాన్ని తయారుచేసి, అలా యజ్ఞవిద్యను ప్రపంచానికందించారు. యజ్ఞవిద్యలో పరాకాష్ఠ అయిన అశ్వమేధ యజ్ఞం వరకూ తీసుకొచ్చారు.

అయితే తాము శ్రీరామకృష్ణ పరమహంసగా షిరిడీసాయితో ఉన్న సమయంలో మనందరి యోగ క్షేమాలకోసం ఓ అత్యద్భుతమైన ప్రణాళిక రూపొందించారు. ఆ దివ్యాత్ములిద్దరూ కలిసి (షిర్డిసాయి, శ్రీరామకృష్ణ పరమహంస) వారి గురువుకి ఓ విశేషమైన సందేశం పంపించారు. "ఈ మనుషుల్లో ఇప్పుడే నమ్మకం పోయింది. శ్రద్ధ కూడా లేదు. గురువుల పట్ల, దేవతా శక్తుల పట్ల విశ్వాసం లేదు. నటించడానికి అలవాటు పడ్డారు. అనుకరణకు ప్రాధాన్యతనిస్తున్నారు గానీ అనుసరించడం చేతగావడం లేదు. వీరికి పెద్దలు, గురుస్థాయిలో ఉన్న వారు కూడా తమ అనుభవాల్ని అనుభూతితో చెప్పలేకపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పోను పోను వీరి విశ్వాసరాహిత్యము ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తుంది. ఆధ్యాత్మిక శక్తిని అనుభవంలోకి తెచ్చుకోలేని కొందరు తమ నటనా చమత్కృతితో, మాటల గారడీతో మిగిలిన ప్రజానీకాన్ని సమయానుకూలంగా వాడుకుంటూ మొత్తం సమాజాన్నీ మరింతగా కలుషితం చేసేస్తున్నారు. ఇది మరి ఆవేదనా భరితమైనదిగా పరిణమిస్తోంది. మిడిమిడి జ్ఞానంతో గురువులుగా చలామణీ అవుతోన్న వీరివల్ల ఆధ్యాత్మిక జగత్తు ఓ చాదస్తపు, పనికి మాలిన, సోమరిపోతుల కేంద్రంగా రాబోయే రోజుల్లో అవహేళనపాలు కావల్సిఉంటుందేమో"నని తమ ఆవేదనా పూర్వక అత్యవసర సమాచారాన్ని షంబలలోని హిమాలయన్ మాస్టర్స్‌కి పంపించారు.

అప్పుడు ఓ మహత్తరమైన విశేష యోగ సాధన తయారు చేయబడింది. కేవలం శ్వాసకు సంబంధించిన పరమాద్భుత రహస్య సాధన అది. ***అత్యంత త్వరితగతిన ఆశ్చర్యకర ఫలితాలనందించే***



***అతిశక్తివంతమైన యోగ సాధనది. విశ్వాసంతో పనిలేకుండా ఎప్పటికప్పుడు ఆత్మిక ప్రగతినీ, అనంతశక్తినీ అవలీలగా ఇచ్చేయగలదది.*** లాహిరీ మహాశయ-పరమ హంస యోగానందల అత్యద్భుత వరదానంగా మనకందించబడిన ఆ విశేష యోగ సాధన క్రియాయోగం పేరుతో ప్రసిద్ధికెక్కింది. (తర్వాతి పేజిల్లో ఆ శ్వాసాధన ఇవ్వడం జరిగింది.) ఈ క్రియాయోగానికి మించి అనంత ఫలితాలందించే సావిత్రీ సాధన కూడా దయామయుల దయవల్ల మొట్టమొదటిసారి మనకందించబడింది.

*యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః*
*యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥*

**(భ.గీ. - 6వ అ. - 22వ శ్లో.)**

ఇంతకన్నా లాభదాయకం బహుశ ఇంక ఉండబోదేమో అనని పించేంత లాభాలను ఇవ్వగలరు గురువులు. అయితే అలా ఇచ్చేది ఎప్పుడు ? వారు చెప్పింది అచరణలో పెట్టినప్పుడు. వివేకానంద భారతీయ సంస్కృతి పట్ల, ఆధ్యాత్మిక శక్తి పట్ల అచంచల విశ్వాసము, అమితమైన అభిమానం కలవాడు - భారతదేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తూ తన సంకల్పాల్ని కార్యరూపంలో పెట్టగల సత్తాగల అరవిందోని ఎన్నుకున్నాడు. ఇంతాజేసి వివేకానంద అరవిందో చేత చేయించింది శ్వాస సాధనే. ఆ సాధనా వివరాలు తరువాతి పేజీల్లో స్పష్టంగా వివరించబడ్డాయి. భారతీయ ఆధ్యాత్మికతకు ప్రతినిధి అయిన వివేకానందుడు చెప్పినా అరవిందో వినకపోయుంటే ఎవరు మాత్రం ఏం చేసుండేవారు ?

స్వయంగా బ్లావెట్స్కీమాత శిష్యుడు గాంధీజీ. పతంజలి యోగ సూత్రాలను బాగా అధ్యయనం చేసిన వాడు. యోగసూత్రాల్లో పెద్దగా లోతుక్కూడా వెళ్ళక్కరలేదంటూ కేవలం మొట్టమొదటి నియమంలోని మొట్టమొదటి ఒక్కఅంశాన్ని పట్టుకున్నాడంతే. '**అహింస**'. భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేశాడు గాంధీజీ. పైకి మనక్కనిపించేదదే అయినా వెనుక వివేకానంద, అరవిందుల వంటి మహా మహితాత్ముల సంకల్పబలం అమితంగా పనిచేశాయి. 1926వ సంవత్సరంలోనే గాంధీ ఓ సందర్భంలో ఉపాసనీబాబా దగ్గర కొచ్చాడు. ఉపాసనీబాబా ఇంతకు

ముందు చెప్పుకున్నట్లు షిరిడీ సాయితోనే నోరారా 'నీవు కూడా నాతో సమానమైన వాడివి' అని స్టాంపు వేయించుకున్న మహోన్నతు డాయన. అంతటి వాడు గాంధీతో ఓ మూణ్ణెల్లు నాతో ఉండిపోవయ్యా!' అన్నాడు. ఆయన మాటకు విలువిచ్చి ఓ 3నెలలు ఉండిపోయి వుంటే 1926 లోనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చుండేదేమో ? అలా బాబా నోరు తెరచి అడిగినా గాంధీగారు 'అయ్య బాబోయ్ మూడునెలలా ? అవతల చాల పన్లున్నాయ'ంటూ ఆ మహితాత్ముడి పలుకుల్ని పెడచెవినపెట్టి వెళ్ళిపోయాడు ఆనాటి గాంధీజీ. మూడు గంటలు కూడా సమయంలేదని విదుల్చుకుని వెళ్ళిపోయినందుకు 22ఏళ్ళు ఆగవలసివచ్చింది స్వాతంత్ర్యంకోసం భారతీయులందరూ. దాంతో ఆ మహనీయుడు ఉపాసనీబాబా ఎంతలా ఆవేదనచెందారో ఎవరు అర్థంచేసుకొనుంటారు ?

ఇదే 1926 ప్రాంతంలో ఇంకో అద్భుతమైన ప్రయోగం జరిగింది. బుద్ధుని యొక్క ఆత్మను భూమ్మీదకు దింపేందుకు అనీబిసెంట్ చేసిన ప్రయోగమది. ఎంతో ప్రయాసపడి భారతదేశంతో ఓ వ్యక్తిని ఎన్నుకుందావిడ. 'జిడ్డు కృష్ణమూర్తి' అతనిపేరు. పాపం పదహారు సంవత్సరాల పాటు ఆయనకి శిక్షణ ఇవ్వబడింది. దాని తర్వాత స్విట్జ ర్లాండ్‌లో ప్రధానమైన ఓ సభ ఏర్పాటు చేయబడింది. వేదిక మీద అనీబిసెంట్ ప్రసంగం పూర్తయింది. వెంటనే అక్కడున్న జిడ్డు కృష్ణమూర్తి ఆవిడ ప్రసంగానికి స్పందించి లేచి నుంచుని 'కృష్ణమూర్తిగా నేను తప్పుకుంటున్నాను. నాశరీరంలో పవిత్రాత్మ ప్రవేశించాలని కోరు కుంటున్నాను' అని అంటాడని ఎందరో పరమ గురువులు, శంబలా వాసులు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న ఆ ఉత్కంఠభరితమైన ఆఖరి క్షణంలో "నాకే గురువూలేడు. నేను ఏ గురువును నమ్మను" అన్న జిడ్డు కృష్ణమూర్తి పిరికి తనపు పలుకులకు పెద్దపెట్టున దివ్యాత్మల, పరమగురువుల ఉత్సాహం నీరు కారి పోయింది. పరమ గురువుల యొక్క ఆనాటి ఆవేదనను, ఆందోళనను కాస్తంతైనా అర్థంచేసుకో గలమా మనబోటి వారము ?



అలా బాధపడుతూ కూర్చోలేదు వారు. అనీబిసెంట్ ప్రయోగం విఫలమైందని తెలుసుకున్న ఉపాసనీబాబా స్మృతి పథంలో శ్రీరామకృష్ణ పరమహంస మెదిలారు. శంబలా నించి పరమగురువులు శ్రీరామకృష్ణ పరమహంస కోసం మరో మహోన్నతమైన ఆత్మను పంపించారు. ఇప్పుడు శ్రీరామకృష్ణపరమహంస ఆ శరీరంలో లేరు. 14 ఏళ్ళ బాలుడిగా ఆవల్‌ఖేడాలో తన పూజా మందిరంలో గాయత్రీ జపం చేసుకుంటున్నారు. బాలుడైన శ్రీరామశర్మ అలా తన రోజువారీ పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకొని లేవబోతుండగా ఎదురుగా సర్వేశ్వరా నందజీ సాక్షాత్కరించారు. వసంత పంచమి నాటి ఆ గురుశిష్యుల వింత పరిచయం శ్రీరామశర్మ ఆచార్య ఆత్మకథలో 'సౌభాగ్య సూర్యోదయం' అనే అధ్యాయంలో స్పష్టంగా చదువుతాం.

ఇలా గురువులంతా ఎంతో సఖ్యతగా ఒకే లక్ష్యం కోసం పని చేస్తుంటే మనం మాత్రం అజ్ఞానపు దృష్టితో అవివేకంగా ప్రవర్తిస్తుంటాం. ప్రతి ఒక్క గురువుకు ఓ పరివారముంటుంది. రకరకాల శరీరాలు మార్చినప్పుడల్లా అప్పటికి తగ్గ పరివారం ఏర్పడుతూంటుంది. శిష్యులుగా కొంతమంది దగ్గరౌతుంటారు. గురువుగా ఆయన తెలియజేయదలచు కున్నవన్నీ తాను ఆచరించి చెప్తూంటాడు. తన పరివారానికి 'మీరూ ఇలా నాలా నడుచుకోండ'ంటుంటారు. ఇక ఆయన చెప్తున్నాకూడా తన 'పరివారంలో వాళ్ళు వినిపించుకోవడంలేదు' అనుకున్నప్పుడు శరీరం వదిలేస్తాడు తప్ప గురువుల అమరులు. శరీరం వదిలేశాడంటే ఇక తనక్కడుండి చెప్పేదీ, చేసేది ఏమీ లేదనుకున్నప్పుడు వెళ్ళిపోతారు. ఇంకో చోట ఇంకో రూపంలో వస్తారు. అక్కడ తన చుట్టూ చేరిన పరివారానికి తగ్గట్టు వారికీ ఏవేవో నేర్పించాలని చూస్తాడు. ఎవరైనా సందేశమివ్వమనడిగితే 'నా జీవితమే సందేశము'అంటాడు. 'తనలా జీవించమ'ంటాడు. అయితే ఈ విషయంలో పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య శిష్యులెంతో అదృష్టవంతులు, గొప్పవారు' అంటుంటారు శ్రీమాష్టారు. గురుదేవులు తను అనుకున్న దానికంటే ఎన్నో సంవత్సరాలు అదనంగా మన మధ్య జీవించారాయన.

'చెప్పినవే చెపుతూ గురువులు ఎప్పుడూ కూడా తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోరు' అంటూ గురుదేవులు చెపుతూ Phd చేసేవారు ఏదైనా ఓ కొత్త విషయంపై చేయాలి. అంతకుముందు ఎవరైనా చేసిన దానిపైనే మళ్ళీ చేస్తే Phd ఇవ్వరు. అలాగే ఉదాహరణకు షిర్డీసాయి తను ఆ శరీరంతో చెప్పినవే మళ్ళీ సత్యసాయిగా చెప్పడు. కొత్తవి చెపుతారు. ప్రతి ఒక్క గురువూ అంతే అన్నారు.

సమర్థ సద్గురు వేదపీఠం ద్వారా ఇలా ప్రకటింపబడుతోన్న ఈ మహావాక్యాలు అక్షర సత్యాలు. ఇవి పరమ గోప్యమైనవి. అత్యంత రహస్యమైనవి కూడా. ఆధ్యాత్మికతలో వచ్చిన-వస్తోన్న చిత్రాతి చిత్రమైన మార్పులు గురుదేవుల ఆదేశం మేర ఇలా పుస్తకరూపంలో యావన్మందికీ అందించ బడుతున్నాయి. **అన్ని ఆధ్యాత్మిక సంస్థల్లోని ప్రతి ఒక్క ఆధ్యాత్మికవేత్తా వెంటనే ఈ విషయాల్ని తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే అతి సమీపకాలంలో సంభవించ బోతున్న చిత్రాతి చిత్రమైన వినాశకర మార్పుల్నీ పరిస్థితుల్నీ మనబోటి మామూలు మనుషుల చేత సరిచేయించబోతున్నారు. ఋషి ప్రణాళికలో భాగమిది.** ముఖ్యంగా ప్రతి సంస్థా ప్రక్క సంస్థతో కలిసిపోగలగాలి. ప్రతి ఒక్కడూ ఏదో సంస్థకు సభ్యుడై పోవాలి. అతి సమీపకాలంలో మనమంతా 7000 మందిగా ఏకమవాలి. పరమగురువులు మననించి ఆశిస్తోన్న కనీసపు సంఖ్య అది. ఒంటరిగా 'నా పూజ నేను చేసుకొంటున్నాగా, నాజప సాధనలేవో నేను క్రమం తప్పకుండా నేను చేసుకొంటూనే ఉన్నాగా ' అనే మాటలు చాలా కాలంగా వింటోన్న దివ్యాత్మలు ఇక వాటిని నలుగురితో కల్సి చేయమంటున్నారు. మన మానసిక స్థితిని మనం ఏడువేల మందిమీ కాస్త సరిచేసుకొని ఆత్మిక ప్రగతి కోసం ఓ ప్రణాళికాబద్ధంగా కలిసి నడవలేకపోతే తరువాత్తర్వాత తీవ్ర పశ్చాత్తాపానికి గురికావల్సివస్తుందన్న వారి చిట్టచివరి శంఖారావాన్ని నిర్లక్ష్యపరచకూడదు. ఇది చదివి తెలుసుకున్న ప్రతి ఒక్కరూ తక్షణం ఫోను ద్వారాగానీ, ఉత్తరం ద్వారాగానీ తమపేరు, అడ్రసు సమర్థ సద్గురు వేదపీఠం-తెనాలికి అందించండి.



అందరం కలుద్దాం. అంతర్యాత్ర సాగిద్దాం. దివ్యాత్మలు, సకల సమర్థ సద్గురువులు మన యాత్రి సఫలమయ్యేలా చూసేందుకు సిద్ధంగా ఉన్నారు. మనదే ఆలస్యం.

ముందుగా మన వ్యక్తిగత సమస్యలు, ఇబ్బందులు, అనారోగ్య పరిస్థితులు, బాధ్యతలు మనల్ని ఈ వైపుకు రానీయకుండా ఆలస్యమయ్యేలా చేస్తున్నాయి. ఎంతో ఉత్సాహంగా మనం గురువుల వైపు పరుగులు పెట్టాలనీ, వారి మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించి ముందుకు కదలాలని ఉన్నా మన పరిస్థితులు ముందుకు వెళ్ళనీయడంలేదు. వెనక్కు లాగుతున్నాయి అనుకుంటూ ఎంతో నిరాశగా దిగులుగా జీవితాల్ని సాగించేవారు మన మధ్య ఎంతో మంది ఉన్నారు. **అలాంటి వారికిదే మా ఆహ్వానం.** మీ మీ సమస్యలు ఎలాంటివైనా సరే. మాకు నిరభ్యంతరంగా వ్రాయండి ! మీమీ వ్యక్తిగత సమస్యలు ఇతరులెవ్వరికీ తెలియజేయబడవు. గోప్యంగా ఉంచబడతాయి. గురుదేవుల అనుగ్రహాశీశ్శుల చేత మన సమస్త సమస్యల్ని పోగొట్టుకోవచ్చును. సంపూర్ణ ఆరోగ్యాన్నీ పొందవచ్చును. **ఇవి మామూలుగా వ్రాస్తున్న మాటలుగావు.** వందలాది మంది తమ సమస్యలలోంచి ముఖ్యంగా ఆర్థిక సమస్యలు, అనారోగ్య, సంకట పరిస్థితుల్లోంచి ఎంతో ఆశ్చర్యంగా బైటపడ్డారని సమర్థ సద్గురు వేదపీఠానికి ఎంతో ఉత్సాహంతో ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఫోన్‌ల ద్వారా తమ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసుకొంటున్నారు. ఇది గురుదేవుల అనుగ్రహ తరంగాల ఫలితమే తప్ప మరోటికాదు. మా గొప్పతనం ఏ మాత్రము లేదు అని సవినయంగా మనవి చేసుకొంటున్నాము. రండి ! మనమంతా ఓ విశేష సమూహంగా మారి మన సమస్యల్ని, బాధల్ని పోగొట్టుకొని, ఆపై సాటివారికి, తోటివారికీ కూడా సాయపడదాం.

ఈ సందర్భంలో ఓ ముఖ్యాంశాన్ని ఇక్కడ పేర్కొనడం జరిగింది. పరమ పూజ్య గురుదేవులు శ్రీ పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్యుల వారు మనకు గాయత్రీ అనుష్టానం అందించారు. 9 రోజుల ఉపవాస

అమోఘప్రద దీక్ష. దానిని ఇక్కడ అందరికోసం మనందరి సమస్యలు, కష్టాలు, వ్యాధులు పోగొట్టుకొనేందుకు తిరిగి గురుదేవుల ఆదేశంతో, అందరూ బాగుండాలనే సత్సంకల్పంతో ఇవ్వబడుతోంది. అమితైశ్వర్యకర ఫలితాలనందించే ఆ 9 రోజుల దీక్షా వివరాలు తెలుసుకొందాం, దీనిని అందరూ వినియోగించు కొనగలరని ఆశిస్తున్నాము. అలాగే త్రిరాత్రోపవాస దీక్ష 3 రోజుల అనుష్ఠాన క్రమము. మన జీవితాలలో ఎదురయ్యే ఎలాంటి సమస్యనైనా, బాధనైనా ఇట్టే పోగొట్టుకోగలిగే అద్వితీయ సాధన కూడ యింతకు ముందరి పుస్తకాల్లో వివరించడం జరిగింది. 9 రోజులు వీలుకాని వారు కనీసం 3 రోజులైనా ఆ అనుష్ఠానాన్ని ఉపయోగించుకొని శాంతి, సుఖము పొందెదరు గాక. ఈ అనుష్ఠాన (దీక్షా) వివరాలు ఫోనుద్వారా, ఉత్తరాల ద్వారా తెలుసుకొని ఎందరో వందలాది మంది ఈ 'మాయాజాల విద్య' పట్ల ఆశ్చర్యపోతూ తమ ఆనందాన్ని మాతో పంచుకొంటున్నారు. ఈ చమత్కార విశేషాల్ని మన దగ్గరే దాచుకో కూడదు. లబ్ధి పొందిన అనుష్ఠానపరులు ఇబ్బందులలో ఉన్న సాటివారికి తెలియజేసి పుణ్యం కట్టుకోండి !

ఇంకా దయ గలవారు ఎవరైనా సాహస సాధకులుంటే కష్టాలలో ఉన్న వారి కోసం ఓ 3 రోజులు వారి కష్టము తీరేందుకు మీరు వారి తరపున దీక్ష స్వీకరించగలరేమో చూడండి ! అలాంటి సాయి శిష్యులు - సాహస వంతులు కాస్త మీ చిరునామా మాకు తెలియజేయండి. మాకు కొందరు వ్రాస్తుంటారు తమకు 3 రోజులు కూడా కుదరదనీ, ఓపిక, తీరిక లేవనీ. అలాంటి సాటి మనుష్యులు, తోటి సోదర సోదరీ మణులకు మనం ఈ విధంగా సాయం చేద్దాం. కనీసం 'ఒక్కరి కోసమన్నా మేము చేయగలం' అని అనుకొన్నవారైనా సరే మాకు మీ అడ్రసు వ్రాయండి. అవసరమైతే మీకు తెలియజేస్తాం. గురువులకు మనం చేయబోయే అత్యుత్తమ సేవ అదే. మానవసేవే మాధవసేవ కదా. సాహసం చూపించండి ! మాకు వ్రాయడం మరువకండి ! రాబోవు అతి సమీపకాలంలో ఇలాంటి గొప్ప మనసు గలవారు పెద్ద సంఖ్యలో



అవసరమవుతుందని భవిష్య వాణి కూడ చెబుతోంది. ఓ విధంగా ఆలోచిస్తే ఇది మన మానసిక స్థితిని అంచనా వేసేందుకు గురువులు పెడుతోన్న పరీక్ష కావచ్చు. ఈ test లో pass అవుదాం రండి! త్వరపడండి!

## నవరాత్రోపవాస దీక్ష

ఓ మంచి రోజు చూసుకొని అనుష్ఠానం మొదలుపెట్టాలి. తెల్లవారు ఝామున 3 గంటలకు లేచి కాలకృత్యాలు తీర్చుకొని పసుపు రంగు బట్టలు ధరించి పూజా మందిరంలో ప్రవేశించి దీపారాధన చేసి గురుప్రార్థన, గురుపూజ, గాయత్రి మాత పూజ చేయాలి.

అది ఈ క్రింద వివరించబడింది.

ఓమ్ .... ఓమ్ ..... ఓమ్ ('మ' కారానికి ప్రాధాన్యతనిస్తూ చేయాలి.)

శ్లో॥ ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః ॥

శ్లో॥ అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం ।
యత్పదం దర్శితం యేన తస్మైశ్రీ గురవేనమః ॥

(సంధ్యావందన విధానం తెలిస్తే చేయండి. లేదా ఈ క్రింద వివరించబడిన సంక్షిప్త సంధ్యావందనము చేసుకోవాలి.)

## సంక్షిప్త సంధ్యావందనము

**పవిత్రీకరణము**

ఓం అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపివా ।
యః స్మరేత్ పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరః శుచిః ॥

చేతిలోకి నీటిని తీసుకుని శిరస్సు పైన, శరీరముపైన జల్లుకుంటూ పై మంత్రము పఠించాలి. ఆ తర్వాత ఈ క్రింది విధంగా భావన చేసుకోవాలి. ఆధ్యాత్మిక కర్మకాండలలో భావన ఎంతో అవసరమని గుర్తుంచుకోవాలి. పై మంత్ర శబ్ద తరంగాల ప్రభావం చేత, నీటిని శరీరం పైన, శిరస్సుపైన చల్లుకోవడం వల్ల మన శరీరము, మనసు

పవిత్రత పొందుతున్నట్లు భావన చేసుకోవాలి. ఆపై నిటారుగా కూర్చొని మన శ్వాస ద్వారా అంతరిక్షం నుంచి సూర్యుడి కిరణాలలోని శుచి అనే పేరుకలిగిన కిరణాలు మన నాశికారంధ్రాల ద్వారా మనలోనికి ప్రవేశిస్తున్నట్లు స్పష్టంగా భావనలో చూడగలుగుతూ లోతుగా శ్వాస తీసుకోవాలి.

**ఆచమనము :**

**ఓం అమృతోపస్తరణమసి స్వాహా ।**

చెంచాలో కొద్దిగా నీటిని కుడి చేతిలోకి తీసుకుని పై మంత్రం చెప్పుకుని తాగాలి. సూర్యుని నుంచి వస్తోన్న ఎరుపు రంగు శక్తిధారలు మనలోని సకల బలహీనతల్ని పోగొట్టుగాక ! అని భావన చేసుకోవాలి !

**ఓం అమృతాపిధాన మసి స్వాహా ।**

పై మాదిరిగానే మరోసారి నీటిని తాగుతూ ఈ మంత్రాన్ని చెప్పుకోవాలి. ఈసారి సూర్యుని నుంచి వస్తోన్న పసుపు రంగు శక్తిధారలు మనకు సమస్త వసతులు, వనరులు కల్పించు గాక ! అని భావన చేసుకోవాలి !

**ఓం సత్యం యశః శ్రీర్మయి శ్రీః శ్రయతాం స్వాహా ।**

అని మూడోసారి కూడా ఈ మంత్రంతో ఆచమనం చేస్తూ సూర్యుణ్నుంచి వస్తోన్న నీలిరంగు శక్తిధారలు మన ఆలోచనలలో మంచి మార్పు తెస్తూ సదాలోచనలు చేసే శక్తినిచ్చు గాక ! అని భావన చేసుకోవాలి.

**శిఖాబంధనము**

గోముద్రతో (మధ్యవేలు, ఉంగరం వేలును బొటన వేలుతో కలిపి చూపుడు వేలు, చిటికిన వేలు వెడంగా ఉంచటమే గోముద్ర) శిఖ ఉన్నచోట స్పృశించుచూ ఈ మంత్రము పఠించాలి.

**ఓం చిద్రూపిణీ మహామాయే దివ్యతేజః సమన్వితే ।**
**తిష్ఠదేవీ శిఖామధ్యే తేజోవృద్ధిం కురుష్వమే ॥**



భావన : అంతరిక్షంలోని అనేక దివ్య శక్తులలోంచి మనకు కావలిసిన అనుకూల, అత్యవసర శక్తులు మన శరీరంలోకి ప్రవేశించు గాక ! అంటూ భావన చేసుకోవాలి. అలా భావన చేసుకుంటూ శ్వాస ద్వారా అనేక దివ్యశక్తులు లోనికి ప్రవేశిస్తున్నట్లు భావనతో దీర్ఘశ్వాస తీసుకోవాలి.

**ప్రాణాయామము**

ఈ మంత్రాక్షరాలు ఎరుపు, పసుపు, నీలం వర్ణములుగా శ్వాస ద్వారా లోనికి జొరబడి మనల్ని శక్తివంతులుగా మారుస్తున్నట్లు భావన చేస్తూ 3 సార్లు ఈ మంత్రంతో దీర్ఘ శ్వాసలు తీసుకోవాలి. సప్తవ్యాహృతీ మంత్రమిది. చాలా శక్తివంతమైన ఫలితాలనిస్తుందని గ్రహించాలి !

**ఓం భూః ఓం భువః ఓం స్వః ఓం మహః ఓం జనః ఓం తపః ఓం సత్యం**

**ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి**
**ధియోయోనః ప్రచోదయాత్ ।**

**ఓం ఆపో జ్యోతి రసోమృతం బ్రహ్మా భూర్భువః స్వః ఓమ్ ।**

భావన : స్థూల సూక్ష్మ కారణ శరీరాలలో బ్రహ్మాండమైన మార్పులు తెస్తోందని స్పష్టంగా భావన చేసుకొంటూ లోతుగా మూడు సార్లు పై మంత్రంతో శ్వాస తీసుకోవాలి. తీసుకొన్న శ్వాసనంతా సాంతం బైటకు నెట్టేయాలి. బైటకు వెళ్తోన్న శ్వాసతో పాటు మనలోని సమస్త మాలిన్యాలు, సకల పాపాలు, దుర్గుణాలు బైటకు నెట్టివేయబడుతోన్నట్లు భావన చేసుకోవాలి.

**న్యాసము**

ఎడమ చేతిలోకి కొంచెం నీటిని తీసుకొని కుడిచేతిని దానిపై ఉంచుకొని ఒక్కసారి గాయత్రీ మంత్రాన్ని ఉచ్ఛరించాలి. ఆ తర్వాత కుడి చేతి వేళ్ళ కొనలు ఆ నీటిలో ముంచుతూ వివిధ అంగములను తాకాలి. దానితో ఆయా శరీర భాగాలు పవిత్రత పొందుతున్నట్లు భావించుకోవాలి.

ఓం వాఙ్మే ఆస్యేస్తు - రెండు పెదవులు తడిచేయాలి.
ఓం నసోర్మే ప్రాణోస్తు - రెండు నాశికారంధ్రాలు తడిచేయాలి.
ఓం అక్షోర్మే చక్షురస్తు - రెండు నేత్రాలు తడిచేయాలి.
ఓం కర్ణయోర్మే శ్రోత్రమస్తు - రెండు చెవులు తడిచేయాలి.
ఓం బాహోర్మే బలమస్తు - రెండు భుజాలు తడిచేయాలి.
ఓం ఊర్వోర్మే ఓజోస్తు - రెండు తొడలు తడిచేయాలి.
ఓం అరిష్టానిమే అంగాని తనుస్తన్వామే సహసంతు.

సమస్త శరీరము శక్తివంతము, పవిత్రము అవుతోన్నట్లు భావనతో నీటిని శరీరంపై చల్లుకోవాలి.

**పృథ్వీ పూజనము :**

ఓం పృథ్విత్వయా ధృతా లోకా దేవీత్వం విష్ణునాధృతా ।
త్వం చ ధారయ మాం దేవీ పవిత్రం కురుచాసనమ్ ॥

భూమాతకు అక్షింతలు పులు, జలము సమర్పించి నమస్కరించుకోవాలి.

**కలశ పూజనము :**

ఓం కలశస్య ముఖేవిష్ణుః కంఠేరుద్ర సమాశ్రితః ।
మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృ గణాః స్మృతాః ॥
కుక్షౌతు సాగరాః సర్వే సప్త ద్వీపా వసుంధరా ।
ఋగ్వేదోథ యజుర్వేదో సామవేదో హ్యధర్వణః ॥
అంగైశ్చ సహితాః సర్వే కలశంతు సమాశ్రితః ।
అత్రగాయత్రీ సావిత్రీ శాంతి పుష్టికరీసదా ॥
త్వయి తిష్ఠన్తి భూతాని త్వయి ప్రాణాః ప్రతిష్ఠితాః ।
శివః స్వయం త్వమేవాసి విష్ణుస్త్వంచ ప్రజాపతిః ॥
ఆదిత్యా వసవో రుద్రా విశ్వేదేవా సపైతృకాః ।
త్వయి తిష్ఠంతి సర్వేపి యతః కామఫల ప్రదాః ॥
త్వత్ప్రసాదాదిమం యజ్ఞం కర్తు మి హ జలోద్భవః ।
సాన్నిధ్యం కురుమే దేవా ప్రసన్నో భవ సర్వదా ॥

పై మంత్రముతో కలశానికి భక్తితో పూజ చేయాలి.



**గురు పూజనము :**

ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః ॥
అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం
యత్పదం దర్శితం యేన తస్మైశ్రీ గురవేనమః

అక్షింతలు, పూలు, జలము గురువుకు సమర్పించాలి భక్తితో నమస్కరించుకొని.

**గాయత్రీ దేవి పూజనము :**

ఓం ఆయాతు వరదాదేవీ అక్షరే బ్రహ్మవాదినీం
గాయత్రీం ఛందసాం మాతా బ్రహ్మ యోనిర్నమోస్తుతే
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః
ఆవాహయామి స్థాపయామి పూజయామి
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః గంధం సమర్పయామి
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః పుష్పాణి పూజయామి
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః ధూపమాఘ్రాపయామి
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః దీపం దర్శయామి
ఓం శ్రీ గాయత్రీ దేవ్యై నమః నైవేద్యం సమర్పయామి.
ఓం స్తుతామయా వరదా వేదమాతా ప్రచోదయన్తాం
పావమానీం, ద్విజానాం, ఆయుః, ప్రాణం, ప్రజాం, పశుం,
కీర్తిం, ద్రవిణం, బ్రహ్మవర్చసం మహ్యం దత్వా
వ్రజత బ్రహ్మలోకమ్.

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీ జగజ్జనని మహాయోగీశ్వరీ దేవీ సహిత
ఏకైక అఖండ గురుసత్తా ప్రీత్యర్థం
శ్రీ గాయత్రీ మహామంత్ర జపం కరిష్యే ॥

(అని చెప్పుకుని గాయత్రీ మంత్ర జపం ప్రారంభించాలి.)

ఈ విశేష దీక్షా కాలంలో ఈ తొమ్మిది రోజులూ పసుపురంగు బట్టలు ధరించడం తప్పనిసరి. (కనీసం పూజా సమయంలోనైనా చాలా అవసరం)

పూజకు పసుపు రంగు పూలు వాడాలి. మన జీవితంలో ఎదురయ్యే సమస్త ఆర్థిక ఇబ్బందులు, వసతి సౌకర్యాలు కొరవడడం, ఉద్యోగము, వ్యాపారము వంటి స్థిరమైన ఆదాయం లేకపోవడం మొదలైన సమస్యలకు అమితాశ్చర్యకరమైన ప్రయోజనాలనందించే అనుష్ఠానమిది. అయితే దీక్ష, పట్టుదలలు ఎంతో అవసరం. ఈ అనుష్ఠానానికి తొమ్మిది రోజులు రోజుకు 27 మాలలు చొప్పున గాయత్రీ మంత్రం చేయాల్సి ఉంటుంది. ఒకే ఆసనం మీద 27 మాలలు పూర్తి చేయగలిగితే ఉత్తమం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా కలిపి 27 మాలలు పూర్తిచేయడం మధ్యమం, మూడు పూటలా పూటకి 9 మాలలు చొప్పున 27 మాలల్ని పూర్తిచేయడం అధమం. మనకున్న సమస్య తీవ్రతను బట్టి ఒకే ఆసనంపై 27 మాలల్ని పూర్తిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

అలాగే గాయత్రీ మంత్రానికి 'శ్రీం' బీజాక్షరాన్ని మూడు సార్లు అనుసంధానం చేయవలసి ఉంటుంది.

శ్లో॥ ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ శ్రీం శ్రీం శ్రీం

ఈ పై మంత్రాన్ని 27 మాలలు (27 × 108 = 2916 సార్లు) పూర్తయ్యాక ఏ రోజుకా రోజు కలశ జలంలోని నీటితో (సంధ్యావందనం చేసుకోవడానికి తీసుకున్న నీరుకాక దీపారాధనతో పాటు వేరొక పాత్ర నిండా నీరు నింపి ఉంచుకోవాలి. ఆ నీటితో) సూర్యునికి అర్ఘ్యము సమర్పించాలి. దీక్షా సమయంలో సూర్య అర్ఘ్యాని కెంత ప్రాధాన్యత నివ్వాలో ఒంటి పూట భోజనానికి కూడా అంతే ప్రాధాన్యత నివ్వవలసి ఉంటుంది. అంతేకాకుండా ఆ ఒక పూట కూడా పసుపు కలిపిన ఆహారాన్ని అంటే పులిహోర, కొబ్బరన్నం, కిచిడి వంటివే కాక శెనగ పిండితో తయారుచేసినవి అయినా పరవాలేదు. పాలు, పెరుగు, మజ్జిగ, పండ్లు, పండ్ల రసాలు వాడవచ్చు. రాత్రి నేల మీద పడక, ప్రతిరోజూ తలస్నానం వంటివి మిగతా దీక్షల్లో లాగానే పాటించాలి. టీవీ



చూడటం, పేపరు చదవడం ఇతరులతో బాతాఖానీలు వేయడం, వాదోపవాదాలు వంటివి పనికిరావు. సాధ్యమైనంతవరకు మౌనంగా ఉంటూ వీలయినంతసేపు పూజా మందిరంలోనే గడపడం మంచిది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా తప్పనిసరైతే తప్ప ఈ తొమ్మిది రోజులు ఇంటివద్ద పూజా మందిరంలోనే గడపడం వల్ల అనుకున్న ఫలితాలు పొందవచ్చు. ఈ దీక్షాపరులు ముఖ్యంగా పాటించవలసిన మరో నియమం ఆదివారం పూర్తి ఉపవాసం పాటించడం. అయితే పండ్లు, పండ్ల రసాలు, పాలు, మజ్జిగ తీసుకోవచ్చు. తరువాతి నియమం ఈ తొమ్మిది రోజుల్లో వచ్చే శుక్రవారం నాడు ఉదయాన్నే నువ్వుల నూనెలో పసుపు కలిపి శరీరానికి రాసుకొని తల స్నానం చేయాలి. ఈ తొమ్మిది రోజులు తోలు సంచీలు, బెల్టులు, పర్సుల వంటి వాటిని తాకకుండా ఉంటే ఆశించిన ఫలితాలు పొందగలం. పూజ్య గురుదేవులు సూచించిన పై నియమాలను శ్రద్ధా భక్తులతో పాటించి అనుష్ఠానాన్ని పూర్తిచేసిన వందలాది మంది స్వయంగా మాకు తెలిపి ఆశ్చర్యకరమైన ఫలితాలు పొందారు. యావన్మందికీ అదేవిధంగా అనుకున్న ఫలితాలు త్వరితగతిన పొందేలా అనుగ్రహించమని ఆ పరమ పూజ్య గురుదేవుల పాద పద్మములకు మనసారా నమస్కరిస్తూ ప్రార్థిస్తున్నాము.

తొమ్మిది రోజుల ఈ అనుష్ఠాన క్రమము పూర్తయాక పదవరోజు దీప యజ్ఞము చేసి 108 ఆహుతులు సమర్పించవలసి ఉంటుంది. కనుక సాధకులు పదవ రోజు కూడా దీపారాధన చేసుకొని సంక్షిప్త సంధ్యావందనము పూర్తయాక రోజూలానే గురుపూజ, గాయత్రీ పూజ పూర్తిచేసుకొని ఓ మాల గాయత్రీ మంత్రాన్ని జపించాలి. ఆ తరువాత ఒక మూకుడులో కొద్దిగా ఆవు నేయితో 5 వత్తులను వెలిగించి, వేరే ఒక గిన్నెలో కరిగిన ఆవు నెయ్యిని సిద్ధంగా ఉంచుకోవాలి.

శ్లో॥ ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్
శ్రీం శ్రీం శ్రీం స్వాహా

అనే మంత్రంతో చెంచాలోకి ఒక బొట్టు ఆవు నెయ్యిని తీసుకొని మంత్రం పూర్తిగా చదివాక 'స్వాహా' అనేటప్పుడు మాత్రమే నెయ్యి బొట్టును వెలిగించిన ఐదు వత్తుల దీపంలో వేయాలి. (ఇక్కడ ఆవునెయ్యిని స్వాహా మంత్రంతో సమర్పించేందుకు మామూలు చెంచాలకంటే ఏ మామిడాకునో వాడటం ఉత్తమం.) ఇలా 108 సార్లు మంత్రం చదువుతూ 108 సార్లు దీపంలో నెయ్యి వేయాలి.

పూర్ణాహుతి :

శ్లో॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్
పూర్ణముదచ్యతే పూర్ణస్య
పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥

పై మంత్రంతో మరోసారి కూడా దీపంలో ఆవునెయ్యి సమర్పించి అంతవరకు మనం శ్రద్ధగా చేసిన భక్తిపూర్వకమైన అనుష్ఠానాన్ని ముగిస్తూ తద్వారా ఈ అనుష్ఠానం వల్ల మనమనుకున్న సత్ఫలితాలను సంపూర్ణంగా ప్రసాదించమని సకల సమర్థసద్గురువులను, గాయత్రీ మాతను మిక్కిలి భక్తిశ్రద్ధలతో వేడుకోవాలి.

ఇంతటితో తొమ్మిదిరోజుల అనుష్ఠానము పూర్తయినట్లే. ఈ తొమ్మిదిరోజుల ప్రత్యేక అనుష్ఠానంలో పరమపూజ్యగురుదేవులు శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య మిక్కిలిగా ప్రాధాన్యతనివ్వవలసిన ఓ నాలుగైదు అంశాల్ని గురించి మరోసారి పరిశీలిద్దాం. ★మొట్టమొదటిరోజు పూజావేదికపై దీపారాధనకంటే ముందుగా అంటే పూజా ప్రారంభం లోనే రాగిపాత్రతో గానీ, వెండిపాత్రతోగానీ లేక మట్టిపాత్రతోనైనా సరే నీటితో నింపి కొబ్బరికాయ పెట్టి కలశస్థాపన చేయాలి. ★ ఆ తరువాత ఆ కలశ జలంతో ప్రతి రోజూ సూర్యార్ఘ్యము ఇవ్వాలి. (సూర్యార్ఘ్య మయ్యాక ప్రతిసారీ పాత్రను నీటితో నింపాలి.) ★ఆదివారం పూర్తిగా ఉపవాస ముండాలి. (ద్రవాహారం తీసుకోవచ్చు.) ★శుక్రవారం పసుపు కలిపిన నూనెను ఒంటికి రాసుకోవడం మర్చిపోకూడదు. ★ అలాగే



దీపయజ్ఞం తప్పనిసరి. ★ యజ్ఞానంతరం సత్పాత్రునికి భోజనం పెట్టడం మరువ రాదు. ఈ పై అంశాలకు మనమిచ్చే భక్తిశ్రద్ధలతో కూడిన ప్రాధాన్యతను బట్టి విశేష ఫలితాలుంటాయి.

9 రోజులు పాటు దీక్షగా చేసే ఈ లఘుఅనుష్ఠానము ఏ నెలలోనైనా చేసుకోవచ్చు. పంచమి, ఏకాదశి, పూర్ణిమ తిథులు అత్యంత శుభప్రదములు. పంచమి దుర్గతులను పోగొట్టుకోడానికి, ఏకాదశి చదువు, సంస్కారము, ఆత్మిక జ్ఞానము, తెలివితేటలు మొదలైనవి పొందటంకోసం, పౌర్ణమి ఆర్థిక పరిస్థితులకి సంబం ధించిన వాటికి ఉత్తమమైనది. స్థిరమైన ఆదాయము లేకపోవటం, ఉద్యోగం లేక పోవటం, అనుకున్న పనులు సక్రమంగా జరగకపోవటం వంటి సమస్య లకి పౌర్ణమిరోజున ఈ అనుష్ఠానాన్ని మొదలెడితే చాలా మంచిది. కృష్ణపక్షమి, శుక్లపక్షమి రెండూ మంచివే. అయితే శుక్లపక్షం మరింత మంచిది.

రోజంతా తల్లి ఏ వంటగదిలోనో పనిపాటలు చేసుకుంటుం టుంది. వేరేగదిలోనో, పెరట్లోనో తనపాటికి తను ఆడుకుంటోన్న బిడ్డడు మధ్యమధ్యలో 'అమ్మా ! అమ్మా !' అంటూ పిలుస్తుంటాడు. దానికి బదులుగా తల్లి 'ఆఁ .... ఆఁ ....' అంటూ బదులిస్తుంటుంది. ఆ తల్లీ బిడ్డల ప్రేమ రోజంతా అలా జరుగుతూనే ఉంటుంది. అయితే కొన్ని విశేషమైన పరిస్థితుల్లో అంటే భయం కలిగినపుడో, కష్టమో, దుఃఖమో వచ్చినపుడో, తక్షణ సహాయం కావల్సివచ్చినపుడో కూడా 'అమ్మా' అనే పిలుస్తాడు. అయితే రోజంతా మామూలుగా పిలిచే పిలుపుకు-విశేష అవసరం ఉన్నప్పుడు పిలిచే పిలుపుకు తేడా ఉన్నట్లు తల్లి గమనిస్తుంది. ఆ పిలుపులోని ఆదుర్దాను, ప్రత్యేకతను గుర్తించి తల్లి తన చేతిలోని పని ఎలాంటిదైనా సరే ఉన్నఫళాన వదిలేసి బిడ్డ దగ్గరికి పరిగెత్తుకొస్తుంది కదా ! సరిగ్గా అలాంటి అనుష్ఠానపు పిలుపే మనం ఈ దీక్షలో ఆ గాయత్రీమాతను పిలుస్తాం. దీనికో ప్రత్యేకమైన,

అద్భుతమైన బలమున్నది. గాయత్రీ శక్తి మన పిలుపుకు విశ్వ స్థాయిలో మన దగ్గరకు ఆకర్షింపబడుతుంది. అది ప్రకృతి నియమమ్ము

ఆపదలు కలిగినపుడు, పరిస్థితులు రోజురోజుకు విషమిస్తున్నపుడు, సవ్యంగా చేసిన పని అపసవ్యంగా మారినపుడు, చుట్టూ అయోమయం, అంధకారం ఆవరించినపుడు, పురుష ప్రయత్నం పనిచేయనపుడు, దైవ సహాయం కావల్సినపుడు ఈ అనుష్ఠాన ప్రక్రియ అత్యద్భుతంగా పనిచేస్తుంది. హృదయాకాశంలో జరిగే ఈ అనుష్ఠాన విస్ఫోటనం మన జీవితాల్లోని భయాందోళనలను, ఇతర సమస్యలను, అమిత ఆశ్చర్యంగా పోగొడతాయి. **పరమ పూజ్య గురుదేవులు శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య తమ స్వహస్తాలతో వ్రాసిన మహా వాక్యాలివి.** "బంగారు కలశంలో సువర్ణ నాణాల్ని నింపి గాయత్రీమాత నీకందించవచ్చు పోవచ్చు. ప్రాపంచిక కష్టాలు, సమస్త ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఆందోళనలు, రకరకాల సమస్యలు అసాధారణరీతిలో పరిష్కరింపబడతాయి'' అన్నారు. అయితే మన శ్రద్ధ, ఏకాగ్రతలను బట్టి కూడా అనుష్ఠాన ఫలం శీఘ్రతరం అవుతుంది. మనసును గాయత్రీమంత్రం పైననే ఉంచుకోవాలి. అయితే పొద్దస్తమానం రకరకాల వ్యాపకాలతో పిచ్చి కుక్కలాగా పరిగెత్తే మనసును మంత్రంపై నిలబెట్టటం కష్టమౌతుంది. అందుకు దయామయులైన పరమపూజ్య గురుదేవులే ఓ సూచన చేశారు. "ఎదురుగా ఉన్న గాయత్రీమాత ముఖాన్ని అలా చూసుకుంటూ, సాక్షాత్తు ఆ తల్లి మన ఎదురుగా దివ్య సింహాసనంలో కూర్చునిఉన్నట్టు భావన చేసుకోవాలి. దీనివల్ల నలువైపులకు పరిగెత్తే మనసు యొక్క వేగాన్ని తగ్గించవచ్చు. మానసిక జపంచేసేప్పుడు మనసులో జరిగే జపాన్ని వింటుండాలి. పైకి ఉచ్ఛారణ చేసేప్పుడైనా అంతే. మంత్రజపం చేసేప్పుడు ప్రక్కవారికి వినిపించకుండా కాస్త పైకే ఉచ్ఛరించాలి. అయితే గుసగుసలాడుతున్నట్టు ఉండాలి. అలా చేసే మంత్రజపం ఉత్తమమైన మంత్రజపం కిందకు వస్తుంది.'' అన్నారు శ్రీ పండిత శ్రీశ్రీరామశర్మ ఆచార్య గురు దేవులు. మధ్యమధ్య మనసు



అటూ, ఇటూ పోతున్నా శ్రద్ధతో దాన్ని గమనించి మళ్లీ మళ్లీ ఏకాగ్రత కోసం ప్రయత్నిస్తుండాలి.

కొందరు ఇంటి పనుల్లోనో, పిల్లల పనులతోనో తీరిక లేకుండా ఉంటుంటారు. అలాంటి స్త్రీలకు, ఇంకా ఇంటి పనులు, బయట పనులు, బాధ్యతాయుతమైన ఆఫీస్ పనులు చూసుకోవలసిన మగ వారికి 27 మాలల గాయత్రీమంత్రజపం చేసేందుకు 3,4 గంటల వ్యవధి లేకపోవచ్చు. అలాంటివారికి దయామయులైన పూజ్య గురుదేవులు సంక్షిప్త గాయత్రీనందించారు. అదే పంచాక్షరి గాయత్రీ

**ఓం భూర్భువః స్వః.**

గాయత్రీ పూర్తి మంత్రం 24 అక్షరాలు గుర్తుంచుకోలేనివాళ్ళు, నోరుతిరగని వాళ్లు ఈ పంచాక్షరీ మంత్రాన్ని ఉపయోగించుకొని కార్యసిద్ధి చేసుకోవచ్చు. అలాంటి వారికి కూడా చక్కటి ఫలితాలు వస్తాయన్నారు.

పరమ పూజ్య గురుదేవులు భగవాన్ శ్రీమారెళ్ళ శ్రీరామకృష్ణుల వారు మనల్ని ఓ అద్భుతమైన సమాజంలో సంపూర్ణ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో పాటు అమరులుగా ఉండిపోయేందుకు మనలోని అనేక దివ్యశక్తుల్ని మేలుకొలపాలని సంకల్పించారు. అందుకు సంబంధించిన ప్రధానమైన మూడు శక్తుల్ని మాత్రం మనం వెంటనే మేలుకొలిపేందుకు ప్రయత్నించాలి. దాని కంటె ముందు కొన్ని పరమ సత్యాలనూ, అతికఠోరమైన వాస్తవాలను అవశ్యం మనం గ్రహించాల్సి ఉన్నది.

*పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం*
*ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే*

**(భ.గీ. - 4వ అ. - 8వ శ్లో.)**

ఆ అవతారమూర్తి ఇచ్చినమాట ఇది. దుష్టశిక్షణ - శిష్టరక్షణ జరిగాక ఓ దివ్యమైన వాతావరణాన్ని నిర్మించాల్సి వస్తుంది. అది

నిజంగా ఎంతో ప్రయాసతో కూడుకున్నది. శిష్టరక్షణంటే సాధువుల్క అనుకూలమైన వాతావరణం ఏర్పరచడం. ఇక్కడ మనం సరిగా అర్థం చేసుకోవల్సిందేమంటే భగవంతుని చేత దుష్ట శిక్షణానంతరం ఏర్ప బోయే వాతావరణం సాధువులకు మాత్రమే అనుకూలంగా ఉంటుంది అందరికీ ఉండదు. రాబోయే అతి సమీప కాలంలో ఏర్పడబోయే సమాజంలో సాధువులు మాత్రమే శాంతి, సుఖము, సమృద్ధితో ఉంటారు. దీన్ని మనం బాగా అర్థంచేసుకొని అందరికీ చెప్పాల్సిన పరిస్థితు లొచ్చాయి.

రాబోయేటువంటి సువర్ణమయ సమాజానికి సభ్యులుగా ఉండేందుకు మనం 1. సృజనాత్మకత 2. సద్వినియోగము 3. నిస్వార్థత ఈ మూడు శక్తులూ మనలో మేలుకొలపాలి. మనకు నచ్చినా, నచ్చక పోయినా పైవాళ్ళు చెప్తోంది అనాది కాలం నించీ ఇదే విషయం. వారు ఎంతలా చెబుతున్నా ఈ మానవజాతి పెడచెవిన పెట్టడం జరిగింది. దాంతో గురువులు మూడు విచిత్రమైన రోగాల్ని ప్రవేశపెట్టారు. అవి 1. క్యాన్సర్ 2. డయాబెటీస్ 3. హార్ట్ఎటాక్. ఓపక్క ప్రేమ మూర్తులు, దయాసాగరులు అంటూ మళ్ళీ మరో పక్క అతిభయంకరమైన రోగాల్ని మనకంట గడుతున్నారా అనిపిస్తుంది. కానీ అది పరమ సత్యం. ఈ వాస్తవాల్ని తెలుసుకున్న వారికి గురువులపై కోపం రావచ్చేమో. పరమ వాస్తవాలు ఇలాగే ఉంటాయి. అయితే ఈ మూడు మహావ్యాధుల్నీ మన శ్రేయస్సుకోసమే మనకందిస్తున్నారనేది కూడా అంతే వాస్తవమయినది.

మనలో సృజనాత్మకశక్తి మేలుకొలిపేందుకు మనల్ని ప్రోత్స హిస్తున్నారు. సృజనాత్మకత ఉంటే మట్టిని బంగారంగా మార్చగలం. అది లేకపోతే బంగారమే మట్టిగా తయారవుతుంది. ఐశ్వర్యమనేది ఓ మానసిక స్థితి అని మనకర్థమవ్వాలి. గురువులు ఎక్కడున్నా, ఎలావున్నా వారు ఐశ్వర్యవంతులే. వారి సమాధులు కూడా ఐశ్వర్యంతో తులతూగు తుంటాయి. మనుషుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తెచ్చుకోవటం చేతకావడం లేదని గురువులీ చిత్రమైన రోగాన్ని ప్రవేశపెట్టారు. పనికి రాని కణాలన్నీ శరీరంలో ఓచోట చేరి క్యాన్సర్‌గా రూపొందుతాయి.



పనికిరాని విషయాలన్నీ బుర్రకెక్కించుకోటం వల్ల క్యాన్సర్ వస్తుంది. కాలాన్ని వృథాచేయడం వల్ల ఈ క్యాన్సర్ వస్తుంది. ఎంతగొప్ప వాడైనా చేసే పని సకాలంలో చేస్తేనే మంచి ఫలితాలొస్తాయి. కాలం దాటిపోయాక నీ నైపుణ్యము, నీ శ్రమ వృధా అయిపోతాయి. సృజనాత్మకత అంటే గురువులు ఒక్క మాటలో చెప్పిందేంటంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవడమే.

ఇంకా క్యాన్సర్‌కి గురువులు చెప్తోన్న కారణాలేమంటే అనవసర మైన వాదనలు. అలాగే ఇళ్ళలో అనవసరమైన సామానులు. అదే మాదిరిగా చదువుల పేరుతో జనరల్ నాలెడ్జ్ అంటూ ఎందుకూ పనికి రాని పరమచెత్త విషయాలు బుర్రకెక్కించుకోవడం. వీటన్నింటి కంటే ప్రధాన కారణంగా గురువులేం చెప్తున్నారంటే బ్యాంక్ బ్యాలెన్సులు పెంచుకుంటూ పోవడమనే పాపపు చర్య వల్ల క్యాన్సర్ వ్యాధికి గురికావడం తథ్యమంటున్నారు. మనతో పాటు ఈ విశేషకాలంలో ఓ అద్భుత అవతార మూర్తి స్వయంగా ఇదే భూమ్మీద ఉన్నాడు. ఇక్కడే నువ్వు సోమరిలా కాలహరణం చేస్తుంటే మహా కాలుడైన ఆయన నీకు క్యాన్సర్ అనే శిక్ష విధిస్తాడు జాగ్రత్త! అంటున్నారు.

అయితే పరమ దయామూర్తులైన వారు మనకో సులభ మైన మార్గాన్ని యిలాకూడా తెలియజేస్తున్నారు. సమయదానాన్ని కాస్తంతైనా మనం చేయగలిగితే దాని ప్రభావం చేత మహాకాలుని దండన తప్పించుకోగలుగుతా మంటున్నారు. ఆ మహాకాల స్వరూపుడు మన కొసగిన రోజుకు 24 గంటల సమయంలో ఎంతో కొంత సమయాన్ని ఆయనకు దానమివ్వాల్సి ఉంటుంది. అలా దానమిచ్చిన ఆ సమయంలో మన సొంత పని చేసుకోగూడదు. నీవు ఉంటున్న సమాజానికి పని కొచ్చేదో, ఏ ఆధ్యాత్మిక సంస్థకో ఉపయోగపడేది ఆ సమయంలో నీవు చేయాల్సి ఉంటుంది. అదే సమయ దానము. దానివల్ల క్యాన్సర్ వ్యాధి నుంచి తప్పించు కోవచ్చు!' అన్నారు.

2. డయాబెటీస్ :- మన శరీరంలో శక్తిగా మారాల్సిన షుగర్ శక్తిగా మారదు. అదే డయబెటీస్ అంటే. మానవజాతిని గురుచేతనత్వం

వైపు తీసుకెళ్ళడానికి గురువులు కనిపెట్టిన రెండోరోగమిది. డబ్బుకీ, ప్రాణానికీ చాలా దగ్గర సంబంధముంది. ఈ డయాబెటీస్ అనే వ్యాధిని ఎవరైతే తన శక్తిని దురపయోగం చేస్తారో వాళ్ళకొచ్చేట్టు చేశారు. ఎందరో శక్తివంతులు. ఎందరెందరి చేతుల్లోనో అధికారం ఎక్కువగా ఉంటుంటుంది. ఎవరెవరు తమ శక్తిని వృధా చేస్తుంటారో, వాళ్ళ కొస్తున్నదీ షుగర్ వ్యాధి. వీళ్ళు తమ శక్తిని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేయాలంటే ధనాన్ని సద్వినియోగం చేయటం నేర్చుకోవాలి.

ముఖ్యంగా తల్లి దండ్రులుగా తమ శక్తిని దుర్వినియోగం చేస్తూ పనికిమాలిన విద్యకోసం, రోగ భూయిష్టమైన ఈ చదువుల కోసం పిల్లల్ని అనేక వత్తిళ్ళకి గురిచేస్తున్నారు. అది వరకు ఇలాంటి చదువుల కోసం ఇంత భయంకరమైన ఆరాటము, వత్తిళ్ళు ఉండేవి కావు. కానీ నేడు తల్లి దండ్రులే పిల్లవాడు ఇంజనీరింగ్ చేయాలా, డాక్టరీ చేయాలా అని వాడి మనసు తెలుసుకోకుండా ఆ ఎంట్రన్స్‌లనీ, ఈ టెస్ట్‌లనీ, ఈసెట్లనీ, కేసెట్‌లనీ వరసపెట్టి చావగొట్టి చెవులు మూస్తున్నారు. ఈ కోవకు చెందిన తల్లి దండ్రులంతా నేడోరేపో డయాబెటీస్ రోగాన్ని అంటించుకోవడం ఖాయమంటున్నారు గురువులంతా ముక్తకంఠంతో.

ఈ షుగర్ వ్యాధి గ్రస్థుల కేసులు ఇటీవల ఆకస్మికంగా అంతలా పెరిగి పోవడానికి మరో ప్రధాన కారణం ఈ రెసిడెన్షియల్ కాలేజీలు, ఎంట్రన్స్ టెస్ట్‌లు అని గ్రహించాల్సివుంది.

ప్రాణానికీ, ధనానికీ చాలా దగ్గర సంబంధం ఉందని తెలుసుకున్నాము. ఇలా తమ దగ్గరున్న శక్తినీ, తమ పదవినీ, హోదానూ దురుపయోగం చేసుకున్నందుకుగానూ 'అంశదానం' రూపంలో కొంత ధనాన్ని సమాజానికి ఉపయోగపడేదో, ఏ ఆధ్యాత్మిక సంస్థకో, సమాజానికో, ఆశ్రమాలకో అలా మంచిపనికి ఉపయోగపడేలా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. యీ షుగర్ వ్యాధి నుంచి సులభంగా బయటపడేందుకు యీ 'అంశదానం' ఎంతగానో ఉపయోగ పడుతుంది అంటున్నారు.



3. హార్ట్ఎటాక్ :- ఎక్కడెక్కడ మీ ప్రతిభ దుర్వినియోగం అవుతుంటుందో అక్కడక్కడ హార్ట్ఎటాక్‌లు సంభవిస్తుంటాయి. కాబట్టి మన టాలెంట్‌నీ, మన కళా నైపుణ్యాన్నీ, మనకున్న ప్రతిభనూ చక్కగా ఉపయోగించుకోవాలి. లేకపోతే ఎప్పటికైనా సరే హార్ట్ ఎటాక్‌కి గురి కావల్సిఉంటుంది. ప్రతిభా దానాన్ని సమాజానికి ఉపయోగపడేలానో, ఏ ఆధ్యాత్మిక సంస్థకో, ఆశ్రమానికో ఉపయోగపడేలా చేయడం వల్ల ఆ దోషాన్ని పోగొట్టుకోవచ్చునన్నారు.

ఇలా మూడు రకాల భయంకరమైన రోగాల్ని కేవలం మన ఆలోచనా విధానాలు సరిజేసుకోవడం ద్వారా పోతాయి. అసలిది మన మానసిక స్థితిలోని దోషాలవల్లే పుట్టాయి. అంటే ఏ రోగానికైనా మన ఆలోచనలే కారణమని తెలుసుకున్నాం. సమయదానం ద్వారా అంశదానం ద్వారా, ప్రతిభాదానంతోనూ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చు. దానాలు చేయడమంటే ఇచ్చిన దానిమీద మనకిక హక్కుండదన్న మాట. ఈ సమయదానము, అంశదానము, ప్రతిభాదానము అనే పేర్లు పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్య పెట్టినవి. దానమనేది ఎలా ఉండకూడదో కూడా చెప్తూ ఓ కథ చెప్పేవారు.

ఒకాయనకి గోదానం చేయాలనిపించింది. అందుకతని కొడుకు 'మనకున్న ఆవుల్లో ఓ మంచి ఆవును చూసి దానమిచ్చేద్దామ'ని సలహా ఇచ్చాడు. భేష్ ! బాగా చెప్పావని కొడుకుని మెచ్చుకొని తన గోవుల్లో ఒక దానిని ఓ బ్రాహ్మడికి దానమిచ్చాడు. అంతవరకూ బాగానే ఉంది.

దానమిచ్చి వెళ్ళిపోయినవాడు మరుసటి రోజు చీకటితోనే ఆ బ్రాహ్మడింటి గుమ్మం ముందు కూర్చున్నాడు. పొద్దున్నే తలుపు తీసీ తీయగానే గోదానమిచ్చినాయన గుమ్మంలో అలా నిలబడుండేసరికి 'అయ్యో ఇలా వచ్చారేంటి' అనడిగాడు బ్రాహ్మడు. 'అః.. ఏంలేదు ఆవుకి పరగడుపునే నీళ్ళు తాగించడం అలవాటు. తాగించి పోదామని వచ్చాన' న్నాడు. అందుకు బ్రాహ్మడు మీకు ఆవంటే ఎంత ప్రేమో ! దానమిచ్చేసినా కూడా నీళ్ళు పెట్టాలనే విషయం గుర్తొచ్చి తెల్లవారక

ముందే వచ్చారు. ఎంతమంచివారో !' అని పొగిడాడు. దాని కాయన మురిసి పోతూ వెళ్ళిపోయాడు ఆవుకి నీళ్ళుపెట్టి.

మళ్ళీ మధ్యాహ్నం వచ్చాడు. మాధ్యాహ్నిక సంధ్యా వందనం చేసుకుంటున్న బ్రాహ్మడు ఇతన్ని చూడంగానే ఆశ్చర్యపోతూ "ఏంటిలా వచ్చారు ? ఉదయాన వచ్చినప్పుడు ఏదైనా మర్చిపోయారా ?" అనడిగాడు. అందుకాయన అదోలా నవ్వేస్తూ 'ఆఁ... ఏంలేదు ఆవుకు ఎండుమేత పడదన్నాను గదా ! మరోసారి గుర్తుచేద్దామని వచ్చాన' న్నాడు. అందుకా బ్రాహ్మడు నిజంగా మీరు ఆవును కన్నబిడ్డకన్న ఎక్కువగా చూసుకున్నారనిపిస్తోంది' అంటూ పొగిడాడు. దానికి గోదానం చేసినాయన మురిపెంగా నవ్వు కుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ సాయంత్రం బ్రాహ్మడికి వాళ్ళ గుమ్మంలో మళ్ళా దర్శనమిచ్చాడు గోదానం చేసినాయన. "మీరు చెప్పినట్లు ఎండు మేత పెట్టలేదులెండి ! అలవాటు లేదన్నారుగా"అన్నాడు బ్రాహ్మడు. అందుకా గోదానం చేసినాయన 'అందుక్కాదు లెండి ! పాలుతీసే వేళయింది గదా ! పాలు తీసేముందు ఏ తవుడో తినే అలవాటుంది దానికి.' అంటూ తనతో పాటు తెచ్చిన తవుడు ఆప్యాయంగా తినిపించసాగాడు ఆవుకి ఈ విధంగా ప్రతిరోజూ మూడుపూట్లా ఏదో వంకతో వచ్చిపోతూండే అతనిని రెండు మూడు రోజులు చూశాక ఆ బ్రాహ్మడు 'ఓ పనిచేయండి ! మీ ఆవుని మీరు పట్టుకెళ్ళండ'న్నాట్ట. గోదానం యిచ్చినాయనతో.

మనమిచ్చే దానాలు అలా ఉండకూడదు. ఒకసారి దానమిచ్చే శాక ఇక దానిమీద మనకెలాంటి హక్కు ఉండదని తెలుసుకోవాలి. మా పరివార సభ్యుల్లో రోజుకో గంట సమయదానం యిచ్చిన వాళ్ళున్నారు. తీరా మాష్టారో రహస్యాన్ని బైట పెట్టారోనాడు. ఆ గంట వారు శుబ్భరంగా పడుకొని నిద్దరోతున్నారట చాలాకాలం బట్టీనూ. అలా ఉండకూడదు.



మన భాగ్యవశాన అత్యద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యాంశాలు ఎన్నో మనకు అందించబడుతున్నాయి. వీటిని చదువుతూన్నప్పుడు ఈ పుస్తకాల్లోని తప్పులు పట్టుకోవడం కోసమో - ఇవి నిజమో కాదో అనుకొంటూనో చదవడం నిజంగా వఠ్ఠి దురదృష్టకరం. అసత్యమాడటం గాని, అతిశయోక్తులు చెప్పడంకానీ చేతగాని వారి అమృతవాణి అక్షర రూపం దాల్చింది. మాకన్నీతెల్సు అని అనుకొంటూ ఈ మహా సత్యాల్ని తృణీకరించిన వారు కేవలం పిచ్చివారే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ మహాసత్యాలతో పాటు ఓ ఉదాహరణ కూడా ఇచ్చారు పరమపూజ్య గురుదేవులు.

ప్రతి అమావాస్యకీ ఓ ద్వీపంలో ఒకచోట పడవల పందాలు జరుగుతాయట. ఈ వైపు వారికి ఆవైపు వారికీ జరిగే పోటీల్లో ప్రతిసారీ అవతలివైపు వారే గెలుస్తున్నారు చాలాకాలం బట్టీ. ఈసారి యీవైపు వారు మంచి పట్టుదలతో, కాస్త కుట్రతో కూడ ఓ నిర్ణయానికి వచ్చారు. ఈసారి ఎలాగైనాసరే గెలిచి తీరాల్సిందేనని ఓ పథకం ప్రకారం అవతల వైపు పోటీ చేయబోయే వారి చేత ఎలాగో మత్తు పానీయాలు తాగించారు. కాసేపట్లో మొదలవబోయే పోటీలో మత్తు తలకెక్కేలోగా పడవ లెక్కేశారు. ఎప్పట్లానే ఆ అమావాస్య చీకట్లో పోటీ ప్రారంభమైంది. మత్తుమత్తుగా ఉషారుగా అరుపులు కేకలతో 'మనం ఎటూ గెలుస్తాం కదా!' అనే ధీమాతో వడివడిగా తెడ్లులేస్తూ ఆ అమావాస్య రాత్రి పోటీలు పూర్తి చేశారు. పాపం వీళ్ళ ధీమా వారిపైనే దెబ్బతీసింది. ఈసారి మాత్రం ఈవైపు వాళ్ళు గెలిచారు. వీరి పాచిక పారినందుకు వాళ్ళలో వాళ్ళే అభి నందనలు తెల్పుకొంటూ ఉత్సవం జరుపుకొన్నారు. ఇంతకీ అవతలి జట్టు వారికి తెలీదు తమ జట్టు మనుష్యులు మత్తులోనూ, అంతకంటె తలకెక్కిన 'ధీమా'లోనూ ఓ విషయం గమనించుకోలేకపోయారు. వారి పొడుగాటి పడవకు కట్టిన గొలుసు కళ్ళెం (లంగరు) విప్పుకోలేదని. లంగరు ఎత్తకుండానే హుషారుగా ఎలాగూ తామే గెలుస్తాము గదా అనే ధీమాతో తెడ్లు వేసుకొంటూ సాగిపోయి ఘోరంగా వోడిపోయారు.

ఈ సృష్టి మొత్తమూ కూడా ఒక అత్యద్భుతమైన శక్తి చేత ఎంతో చాకచక్యంగా నడిపింపబడుతోంది. వెంట్రుకలో వేయ్యోవంతైనా ఏమాత్రం బ్యాలెన్స్ తప్పకుండ అత్యంత లీలా వినోదంగా సాగిపోతోంది. సృష్టి కర్త పాపం తనకు ఎప్పుడైనా అవసరపడితే పనికి సాయపడతాడని మనిషిని సృష్టించుకొని అతనికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడ ఇచ్చేశాడు. బుద్ధి అనే ఓ వరాన్ని కూడ ఇచ్చి మరీ తయారుచేసుకున్నాడు. అయితే యుగం మారి కొత్తయుగం రాబోయే కొన్ని సమయాలలో ఈ మానవజాతి తనకివ్వబడిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో గందరగోళం సృష్టిస్తాడు. దాంతో ఆ శక్తిస్వరూపుడు- సృష్టికర్త దిగిరావాల్సిన పరిస్థితులు కల్పిస్తాడు యీ సామాన్య మనిషి.

ఈ సారి ఈ మనిషి తన వినాశకర ధోరణి మరీ పెచ్చుపెరిగి పోయాలా చేసుకొంటూ తన ఉనికితో తన పరిసర ప్రాంతాన్ని మొత్తం నిర్వీర్వం చేసుకొంటూ,తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని వీలయినంత మేర ఎక్కువలో ఎక్కువగా పాడుచేసుకొంటూ యధేచ్ఛగా సాగిపోతున్నాడు. భూమి పుట్టాక ఇంతటి విషమయ వాతావరణము, వినాశకర పరిస్థితులు ఏర్పడడం ఇదే ప్రథమం. ఈ మనిషి ఇంత దుర్భర, అతిఘోరపు, భయానక భీభత్సం సృష్టించడం పరమ గురువులను సైతం ఖంగారు పెడుతోంది. ఋషులు యావత్తు కంట నీరుపెట్టున్నారు. అందుచేతనే **ఈ చిట్టచివరి శంఖారావాన్ని ప్రకటించాల్సి వచ్చింది.**

మాష్టారు చెబుతూంటారు. 'ఓ తండ్రిగారి సుపుత్రుడు చెడు తిరుగుళ్ళకు, చెడు స్నేహాలకు అలవాటుపడి లక్షలకి లక్షలు తగలేస్తు న్నాడు. అయితే డబ్బు తగలేయడం ఆ కోట్లకు పడగలెత్తిన తండ్రికి బాధ కలిగించడంలేదు. పిల్లవాడు చెడిపోతున్నాడని దిగులుపడుతున్నాడు.'

నేడు ఋషుల ఆవేదన ఈ విషమయ వాతావరణం గురించి కాదు. మన గురించి, మన బుద్ధిలేనితనం గురించి, మన నీచమనస్థత్వం గురించి. ఈ వాతావరణాన్ని వారు తృటిలో సరి చేయగలరు. అయితే మనలో మార్పు రానంత వరకు వారెంతగా వాతావరణాన్ని తీర్చిదిద్దినా



తిరిగి తిరిగి మనం ఈ దుర్భర కలుషిత వాతావరణాన్నే తయారు చేసుకొంటుంటాం. మనలో మార్పురావాలి. ఎంతోకాలంగా దాన్ని ఆశించిన దివ్యాత్మలైన వారందరికీ నిరాశే మిగిలుస్తూ వస్తున్నాము. ఈసారి కూడ అంతే. అయితే ఇది last warning ! చిట్ట చివరి హెచ్చరిక - ఇక మనలో వారాసించిన మార్పు కానరాకపోతే అధోగతి పాలుకావడం తథ్యము. **ఇది ఎవరికి వారు తనకివ్వబడిన హెచ్చరికగా ఎంచి తనకు తానుగా మారకపోతే ఇక చెయగలిగే దేమీ లేదు. రాబోవు రోజులలో తీవ్ర పశ్చాత్తాపానికి గురి కావడంతప్పదు.**

ఉదాహరణకు రామాయణంలో రావణుడు సీతమ్మను ఎత్తు కెళ్ళుడం దగ్గర్నుంచి ఒక ప్రణాళిక ప్రకారం జరిగింది Pre-recorded అంటారు. ప్రతి సంఘటన కూడ ఒక అమితాశ్చర్యకరమైన దైవీ ప్రణాళిక. దానిలో శ్రీరాముడు కూడ ఉన్నాడు. తన చేత రూపొందింప బడిన ఆ ప్రణాళిక ఐనా ఆ పరమాత్మ కూడ అందులో బద్ధుడే. నటించాడు. ఇది అందరికీ తెలుసు. ద్వారపాలకులుగా శపించబడిన వాడు ఆ ప్రణాళికలో నటించి, జీవించి ఆ భగవంతుడి చేతిలో వధింపబడి, తిరిగి ఆయనలోనే లీనమవడం మనకు తెలీనిదేమీ కాదు. అయితే ఈ ప్రణాళిక చివరి అంకంలో కొస మెరుపుగా ప్రతిచోట కాస్త గందరగోళ పరిస్థితులు ఏర్పడుతుంటాయి. కథానాయకుడికి కూడ ఖంగారు పుడుతుంటుంది. భగవంతుడికి క్కూడ ఏడుపు వస్తుంటుంది. దిక్కుతోచని పరిస్థితి ఎదురౌతుంటుంది. ఏది ముందు చేయాలి ? ఏది తర్వాత చెయ్యాలి ? అనే సందిగ్ధావస్థ కల్గుతుంటుంది.

అదిగో సరిగ్గా అలాంటి కలవరపాటు కలిగించే విపత్కర సంకట స్థితిలో చిత్రాతి చిత్రమైన మలుపులో మనమంతా ఉన్నాము. ఆ సృష్టికర్త మనల్నెలా మళ్ళించ దల్చుకున్నాడో - మన మానసిక స్థితిని బట్టి సుఖాంతమో, దుఃఖాంతమో సంభవించబోతోంది - ఆ ఛాన్స్ మనకే వదిలి వేయబడింది. 'నీ కివ్వబడిన స్వేచ్ఛను నీ మంగళకర పరిస్థితుల కోసం వినియోగించుకో' అంటున్నారు.

'సోమరితనం' అనేది ఏకైక సంతానంకాదు. దానికెంతో మంది సోదర సోదరీమణులున్నారు. అవిశ్వాసము, ఈర్ష్య, కృతఘ్నత, హడావుడి, చాడీలు చెప్పడం, క్రోధము, భోగలాలస ఇవ్వన్నీ సోదరీమణులు. ఇంక సోదరులో ... చెప్పలేము. ఎంతోమంది ఉన్నారు. ఓపద్ధతి ప్రకారం వీరంతా కలిసే వుంటారు. **కలియుగంలో కలిపురుషుని ప్రజలు నేటి సమాజంలోని సోమరులే.** వీరెంతగా పెరిగిపోయారంటే సత్యయుగం అడుగుపెట్టడానికి వీల్లేనంతగా వీరి సంఖ్య పెరిగిపోయివున్నదట. వీరి సంఖ్య సమూలంగా పోతేనేగానీ స్వర్ణయుగం రాలేదు మరి. వీరిని తీసివేయడం కోసమే ఖడ్గంతో కల్కి భగవానుని రాక !

ఓ రాజుగారికి ఎందుకో ఓ పిచ్చి ఆలోచన వచ్చిందట. ఆ రాజ్యంలో అత్యంత 'సోమరి రత్నాన్ని' కనుగొని వానికి ఘనసన్మానం చేస్తూ ఏదో బిరుదు కూడా ఇచ్చేయాలనిపించింది. వెంటనే దండోరా వేశారుట నలుమూలలా. 'సోమరి సోదరులారా ! ఈ చక్కని సదవకాశాన్ని వినియోగించుకోండి! రాజుగారి ఘన సన్మానాన్నందుకోండి! ' అంటూ పలుప్రాంతాలకు సందేశాలు వెళ్ళాయి. అయితే ఒక్క సోమరిపోతూ కూడా రాజుగారి దగ్గరకు రాలేదు. కాస్త ఆలోచించిన మంత్రి నాలుక కరుచుకొని 'అయ్యా రాజుగారూ! మీరు పంపిన సందేశము సోమరులక్కదండీ.... బద్ధకించివుంటారు పాపం. మనమే వారి కోసం గాలింపు చర్యలు చేపట్టడం బావుంటుందనిపిస్తోంది' అంటూ సైనికుల్ని పురమాయించారు. వారి ఎరుకలో ఎక్కడైనా అత్యంత 'ఘన సోమరి' తటస్థపడితే తగు మర్యాదలతో రాజుగారి కొలువుకు తోడుకొని రమ్మని సదరు రాజుగారి ఆజ్ఞ.

దాంతో ఎంతో దీక్షా, పట్టుదలలతో సైనికులు నలుమూలలా వెదకడం మొదలెట్టారు. వెదకినకొద్దీ ఒకర్ని మించిన వారు మరొకరని తెగబలిసిన సోమరులు కంటబడుతున్నారు. ఇలాగాదని అందర్నీ మించిన ఆణిముత్యం లాంటి సోమరి కనబడక పోతాడాని తిరిగిన వాళ్ళు తిరిగినట్లు తిరుగుతున్నారు. ఓ చోట ఓ ఇంటిపై కప్పుమీద



మిట్ట మధ్యాన్నపు ఎండలో సైతం పండువెన్నెల్లో లాగా ఆరాంగా పడుకొని చుట్టకాల్చు కొంటున్నాడట ఒకడు. "ఒరె అబ్బీ... ఏంటి అలా ఇల్లెక్కి ఎండలో తాపీగా చుట్టకాల్చుకొంటున్నావు ? ఏంటి కథ ?" అని అడిగారు రాజభటులు. అడగ్గా అడగ్గా సమాధానంగా ఏదో గొణగాడు ఇల్లెక్కినవాడు. దాని భావం తెల్సుకొని 'ఆహా ఎంత చక్కని సోమరి బిడ్డ.... మన కలలు ఫలించి దొరికినాడు' అని పాడుకొంటూ "రావోయ్ నీ అదృష్టం బావుంది. నీకోసమే తెగ వెతుకు తున్నాం పద - రాజుగారు నీకు ఘన సన్మానం ఏర్పాటుచేశారు. సకల మర్యాదలతో తీసుకెళ్ళేందుకు వచ్చాం పద పద". అన్నారట. దానికతడు బద్ధకంగా ఆరిపోయిన చుట్టవైపు విసుగ్గా చూసుకొంటూ "ఇంకోసారెప్పుడైనా వస్తాలేండి" అంటూ ఆవలిస్తూ ఏదో గొణిగాడట. దాంతో భటులు మరింత మురిసిపోతూ అతగాడి వైపు ఆనంద భాష్పాలతో చూస్తూ.... నోట మరి మాటలు రాక వెనుదిరిగి పోయారట ఆనందోత్సాహాలతో వురకలు వేస్తూ రాజుగారికీ సువార్త చెవినేద్దామని.

అలా బయలుదేరి రాజుగారి కొలువుకు ప్రయాణమైన భటులు తోవలో దాహంతో ఒక బావిదగ్గర కాసేపు ఆగి కాసిని మంచినీరు తాగారు. ఎండగావుందని ఓ చెట్టుకింద అలా ఒక్కక్షణం కూలబడ్డారు. అదే చెట్టుక్రింద మరో ఇద్దరు కూడ విశ్రాంతి తీసుకొంటున్నారు. ఒకడు చెట్టు కానుకొని వున్నాడు. అతనికి ప్రక్కగా మరోడున్నాడు. అంతవరకూ బాగానే వుంది. దాంతర్వాతే మనభటుల్ని ఖంగుతినేలా చేసింది. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయి ఉక్కిరి బిక్కిరయ్యారు. ఇంతకీ ఆ రాజ భటులకు కనిపించిన సంఘటన ఏమంటే...

చెట్టు క్రింద పరమ బద్ధకంగా చతిగిలబడి కూర్చొన్న ఒకడు మరొకడితో "ఒరే... కాస్త నీ చేతి దగ్గర నేరేడు పళ్ళు పడున్నాయి. కాస్త ఇటు నెట్టు ఆకలిగా వుంది. అవన్నా తిందాం". అన్నాడు పరమ నీరసంగా, మహాబద్ధకంగా. దానికి ఆ రెండోవాడు సమాధానమివ్వలేదు. మళ్ళీ వాడు అదే మాదిరి రెండు మూడు సార్లు అడగ్గా అడగ్గా ఆ

రెండోవాడు మరింత బద్ధకంగా 'సర్లే.... ఇందాకటినుంచి నా కాలు కుక్క నాకుతోంది. దాన్ని తోలుకోడానికే బద్ధకంగా వుంటే నీకు పళ్ళు అందించాలా - పళ్ళు - చాల్లే వూరుకో." అంటూ మగతగా సమాధానం చెప్పాడు. కుక్క ఒకటి అతని కాళ్ళ దగ్గర కూర్చొని అతని కాలు నాకుతోంది. అతను దాన్ని తోలుకొనే ప్రయత్నాలేవీ చేయడం లేదు. దాంతో మన భటులు వీరే ఘనమైన మరింత ముచ్చటైన 'సోమరి సోదరులు' అనుకొంటూ వార్ని ఎంపిక చేసుకొన్నారట ప్రథమశ్రేణి కింద ఆనందోత్సాహాలతో.

కాలము దైవ సంపద. దాన్ని క్షణమైనా వృథా చేయకూడదు. సోమరి తనంతో, బద్ధకంగా కాలాన్ని ఖర్చుచేయడం ఆధ్యాత్మికతకు పూర్తి విరుద్ధము. ఈ కాలమే - శ్వాస - ఆ శ్వాసయే - మనస్సు, ఇలా కాలాన్ని సద్వినియోగ చేయడం ద్వారా మన శ్వాసలు సరిచేయ బడతాయి. తద్వారా అనంతమైన దైవ సంపద మన సొంతమవుతుంది. మన సాధనలు ఫలితాలనివ్వడం మొదలెడతాయి. పరమపూజ్య గురుదేవులు మనకందించిన రహస్యమేమంటే శ్వాసే - వాక్కు; శ్వాసే - కాలము; శ్వాసే - మనసు; శ్వాసే - గురువు అదే నీ సర్వస్వము కూడా. నీ ఆహారం నిన్ను నడిపిస్తుంటుంది. నీవు తిన్న ఆహారం నీ మనసుగా మారి నిన్ను నియంత్రిస్తుంటుందన్నమాట - 'నీ మనసు నీవు చెప్పినట్లు వినాలంటే నీ ఆహారాన్ని సరిచేసుకో' అన్నారు. ఇదో పరమ రహస్యము. నీ వాక్కు నిన్ను గోతిలో పడెయ్యాలన్నా, ఉన్నతికి చేర్చాలన్నా చేయగలదు.నీకెలా ఆ వాక్కును వుపయోగించుకోవాలో తెలీకపోతే మౌనంగా వుండు. వాక్కు విలువ తెల్సినా నీవు మౌనంగా అయిపోతావు. మనం మామూలుగా చాలా ఎక్కువగా మాట్లాడేస్తుంటాం. అది ఎంతో ప్రమాదకర పరిస్థితులు కల్గిస్తుంది.

వివేకానంద ఓ సమావేశంలో ఓ ఛాలెంజ్ చేశాడు. 12 ఏళ్ళు ఎవరైతే అసత్యమాడరో అలాంటివారు ఏదంటె అది జరిగి తీరుతుంది. 'భారతీయ ఋషులు అంతటి ఘనత సాధించడానికి యిదో రహస్యం'



అని చెప్తూ 'మీలో ఎవరన్నా యీ ప్రయోగం చేసి చూసుకోండి కావలసిస్తే. ఓ 12 ఏళ్ళ తర్వాత అబద్ధమాడని మీ నోటితో సూర్యుణ్ణి ఆగిపో అంటే ఆగిపోతాడు. మన పురాణాలలో సావిత్రి; అనసూయ వంటి వాళ్ళు చేసిందిదే.' అన్నాడాయన స్వామీజీ.

మనం వాక్కును దురుపయోగం చేయడం వల్లనే నేడు ఇన్నెన్ని accidentలు జరగడానికి కారణమవుతోందన్న రహస్యాన్ని తెలియ జేశారు. "వాక్కు యొక్క దురుపయోగం వల్లనే భూకంపాలుగాని, అగ్ని ప్రమాదాలుగాని, విషరోగాలుగాని, యుద్ధాలు, కలహాలుగాని ఇవన్నీనూ" అంటూ ఎంతో ఆందోళన చెందుతూ చెబుతోన్న ఆ దయామయులను అర్థం చేసుకోవల్సి వుంది.

మనకన్న విపరీతంగా మాట్లాడే ప్రబుద్ధులున్నారు. మనకు వెతికితేగాని కనబడరలాంటి వాళ్ళు. ఒకావిడ 'ఫోను చేతికి తీసుకుం దంటే అర్ధ గంట అయితేనే ఆవిడకి పాపం తృప్తి. తక్కువ మాట్లాడితే ఏదోలా వుంటుందట. అలాంటావిడ ఓ సారి ఎవరితోనో ఓ ఇరవై నిమిషాలే మాట్లాడి ఫోను పెట్టేసిందట. ఇది గమనించిన నాబోటాయన పిచ్చిగా ఆశ్చర్యపోయి' అమ్మా ఇంత పెందరాడే పెట్టేశావు ఫోను. మామూలుగా అరగంట తక్కువ మాట్లాడవుగా తల్లీ. ఈ రోజు ఇలా చేశావే మమ్మా..." అన్నాట్ట ఆ అమాయకుడు. అందుకావిడ 'ఆఁ ... రాంగ్ నంబర్‌లే' అందిట విసురుగా వంటింట్లోకి దూసుకుపోతూ...

"అయ్య బాబోయ్.... రాంగ్ నెంబరైతేనే అంతసేపు మాట్లాడిన నువ్వు మామూలు మనిషివి కాదు సుమా...." అనిపిస్తుంది. మరి వాక్కు విలువ తెలిసిన వాళ్ళు మనలో ఎంత మంది వుంటారు ?

ఈ షిరిడీ సాయి చేసిన ఘనకార్యాలు ఎన్నో ఉన్నాయి. మనకు తెలీనివి రామకృష్ణ పరమహంస ఏది భరించలేక ఆ భారాన్ని షిరిడీ సాయికి వప్పగించాడో ఆ బరువే కాకుండా ఇంకా చాలా చాలా చేశాడాయన. పాపం ఆ విషయాలెవరికి పట్టాయి. ఎంత సేపటికీ 'నీవే గనక సద్గురువైతే నా యీ కోరిక తీర్చలేవా ? అంటూనో 'నేనే గనక

నీ భక్తుడినైతే నిరూపించుకో ...' యిలా వుంటాయి మనలో ఆలోచనలు. ఆ ఆలోచనలలో మనం మార్పు తెచ్చుకోడానికి ప్రయత్నించాలి.

ఆచరణకు మూలస్వరూపము ఆలోచన. కాలాన్ని నియంత్రించుకొని సద్వినియోగం చేసుకోవడంలానే ఆలోచనలు కూడ నియంత్రించుకొని మంచి ప్రయోజనాల కోసం ఆలోచించడం వల్ల ఆధ్యాత్మికమైన ఎన్నో లాభాలు చేకూరుతాయి. 'దురదృష్టవశాత్తు చెడ్డ అలోచనలు చేసే వారికి వారు తెల్సుకున్నా తెల్సుకోలేకపోయినా ఏదోవిధంగా వారి జీవితాల్లో చెడు జరగడం ఖాయం' అన్నారు పెద్దలు. ఎవరెవరు ఏఏవిధమైన ఆలోచనలు చేస్తూ వాటిని ఆయా విధాల ఆచరణలో పెడుతుంటారో వారికి ఆ విధంగానే ఫలితాలు సంక్రమిస్తూంటాయి. ఇది ప్రకృతి ధర్మం. ఎవ్వరూ ఏమీ చేయలేరు.

పతంజలి మహర్షి తన ఆలోచనల యొక్క శక్తిని, ఏకాగ్రతనూ అర్థం చేసుకొని ఆచరణలో పెడుతూ 'యోగ దర్శనము' అనే మహత్ గ్రంథాన్ని మనకందించాడు. జైమిని ఓ ప్రఖ్యాత అర్ష వేదాంతి. ఆయన తన ఆలోచనల శక్తిని గుర్తించాడు. ఓ రోజు అతని భార్యతో తాను తలుపు తెరవమనే వరకు తెరవవద్దని చెప్పి ఓ ఏకాంత గదిలో ఆహారం వంటి వేమీ లేకుండా ఓ ఏడురోజులు ఏకాగ్రతతో 'మీమాంసా దర్శనము'నే అత్యద్భుత గ్రంధం రచించాడు. ఈ ఆలోచన అనేది ఎవరికి వారే చేసుకోగల అతి గొప్ప చికిత్స. మంచి ఆలోచనలతో మహాద్భుతాలను చేయవచ్చు. దీన్నే మనోనిగ్రహం అంటారు. దీని కోసం రెండు విషయాల్ని చెప్పారు.

1. చెల్లాచెదరుగా ఉన్న అలోచనల్ని సమీకరించి ఒకే దిశలో పెట్టడం.
2. వాటిలో చెడ్డవి, నికృష్టమైనవంటి వాటిని నిర్దాక్షిణ్యంగా కోసిపారేసి మంచివి ఉత్కృష్టమైనవి పెంపొందించుకోవడం.

"అసలీ ఆలోచనలే ఇంద్రియాల్ని, సమయాన్ని, ధనాన్ని, వాక్కును తననుకొన్నట్లుగా ఆడిస్తుంటాయి. దేవాసుర సంగ్రామమంటే వేరేంకాదు. మంచి ఆలోచనలు, చెడు ఆలోచనల మధ్య జరిగే అంతరంగ పోరాటమే. ఆలోచనలు పిచ్చికుక్కలా ఎటు బడితే అటు తిరుగుతూ ఉంటే నీ ధనము, వైభవము, శక్తి ఇలా ఎన్ని ఉన్నా నీకు దుఃఖమే శాశ్వత బంధువవ్వుతుంది. జాగ్రత్త" అంటూ హెచ్చరించారు.



పుష్యమిత్రుడోసారి అశ్వమేధయాగం చేశాడు. యాగం పూర్తయ్యాక అతిథుల వీడ్కోలు సందర్భంగా ఓ నృత్య ప్రదర్శన ఏర్పాటైంది. దానికి యజ్ఞబ్రహ్మగా పతంజలి కూడ హాజరైయ్యారు. శిష్యుల్లో కొందరికది నచ్చలేదు. అయినా బైటికెవ్వరూ చెప్పలేక పోయారు. ఓసారి యోగ వేదాంత విషయాలు చెబుతూండగా మహర్షితో చైత్రుడనే శిష్యుడు ఇక ఆపుకోలేక ఇలా అడిగేశాడు. "గురుదేవా! నృత్యగీతాల రసరంగము చిత్తవృత్తి నిరోధానికి అవరోధం కలిగిస్తుందా? సహాయ పడుతుందా?" అని ప్రశ్నించాడు. మహర్షి శిష్యుల అంతరంగంలోని బాధను అర్థం చేసుకొని ప్రసన్నంగా ఇలా అన్నారు 'వత్సా! అసలు ఆత్మ యొక్క స్వరూపము రసమయమైనదే. ఆనందము ఎప్పుడూ వికృతంగా మారకుండా ఎల్లప్పుడూ తన స్వరూపమైన శుద్ధ స్వరూపంలో ఉండాలి. దీన్నే నియంత్రణ అంటారు' అన్నారు. పొలాలన్నీ కష్టపడి పండించాక ఎలాగూ పశువులు, పక్షులూ వాటిని మేసేసి పాడు చేస్తాయని ఏ రైతన్నా పొలంపని మానేశాడా ? వ్యవసాయం చేయడం లేదూ ? అలాకాకుండా ఏ రైతన్నా అలా ఈ కారణంగా మానేస్తే ఎవరైనా అతన్ని సమర్థిస్తారా ? ఆనందానికీ, మనోవికాసానికి చాలా తేడావుంది. ఆనందాన్ని వదిలెయ్యడం కాదు చెయ్యాల్సింది. మనసు యొక్క వికృతిని వదిలెయ్యాలి. మనసులోని మాలిన్యాల్ని కడిగేసు కోవాలి.

జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః
(భ.గీ. - 6వ అ. - 8వ శ్లో.)

కూటస్థః బొట్టుపెట్టుకొనే చోట - అదే ఆజ్ఞాచక్ర స్థానము. ఎక్కడైతే నుదుటిపైన బొట్టుపెట్టుకొంటామో ఒక అంగుళం లోతుకు (లోపలికి) వెళ్ళాలి. ఆచోట మన మనసును ఉంచాలి. అక్కడ ఉంటూ

దివ్య శ్రవణము - దివ్య స్పర్శ - దివ్యదృష్టి - దివ్యమైన రుచులు - దివ్య గంధములు అనుభూతి చెందాలి. అది అంతర్యాత్ర అంటే.

శ్రీ తిరుమల వేంకటేశునికి పాదరక్షలు అరిగిపోతుంటాయి. ప్రతి సంవత్సరం వాటిని మారుస్తుంటారంటారు. మన ఆజ్ఞా చక్రంలో పిట్యూటరీగ్లాండ్ అనే ఓ గ్రంథి ఉంటుంది. దాంట్లో యాంటీరియర్, పోస్టీరియర్ అనే రెండుంటాయి. మన శరీరం పెరుగుతున్నకొద్దీ, వయస్సు పెరుగుతున్నకొద్దీ ఈ రెండూ అరిగి పోతుంటాయి. అవి అలా అరిగి పోతున్నకొద్దీ మరణం దగ్గర పడుతుంటుంది. అయితే మనం ఓ చక్కని అవగాహనతో ఈ సాధన చేయడం వల్ల ప్రతిసారీ దాన్ని మనం మార్చుకుంటూండవచ్చు. అవి అరిగిపోకుండా చూసు కుంటుండవచ్చు. తద్వారా మనం అమరులమైపోవచ్చు. ఆ సాధనే ఇంతకు ముందు నుంచి వివరించబడుతోంది. ఆజ్ఞాచక్రం మీదే అంటే మన కనుబొమల మధ్యన మనసు నుంచి అన్ని పనులు చేసుకోగలగాలి.

ఇలా ఆజ్ఞాచక్రంలో నిరంతరం మనసు నుంచి ఇంతకుముందు మనం తెలుసుకున్నట్టు నిటారుగా కూర్చొనగలిగితే ఏ సమయానికి మనకి ఏదేది అవసరమో అవే మన దగ్గరకు వస్తుంటాయని చెప్తూ మళయాళ స్వామి వారి గురించి చెప్తుంటారు మాష్టారు. మళయాళ స్వామి వారొకసారి సాధన చేసుకుంటూ తిరుమలలో ఎక్కడో గోగర్భం అనేచోట ఉంటుండేవారు. ఓపికుండి వెళ్ళగలిగితే భోజనానికి ఊళ్ళో కొచ్చేవారు. లేదంటే లేదు. అయన సాధనా మహత్యం వల్ల ప్రతిసారీ ఎవరో ఒకరు ఆయనకు బిక్ష తెస్తుండేవారు. ఓసారాయన ఓ పరీక్ష పెట్టుకున్నారు. అక్కడుంటే వచ్చేపోయే భక్తులు తనకు ఏదో ఒకటి తెస్తున్నారని ఆ అడవిలో ఇంకా కొంచెం లోపలి కెళ్ళి చిరుతపులులు, ఎలుగుబంట్లు వంటివి ఉండే తుంబురకోన అనే ఓ చోటికెళ్ళి కూచున్నారు. కూచొని అక్కడ సాధన చేయడం మొదలెట్టారు. ఆనాడు ఓ భక్తుడు మళయాళ స్వామివారికి తినేందుకు కొన్ని పదార్థాలు



తయారు చేసుకొని గోగర్భం వెతుకుతూ దారి తప్పి తుంబురక్షేత్రాని కొచ్చాడు. అక్కడోచోట కూచున్న స్వామివారికి తను తెచ్చిన తిను బండారాల్ని సమర్పించుకొని వెళ్ళిపోయాడు. కేవలం ఆజ్ఞాచక్రంలో మనసునుంచడం వల్ల అలాంటి చమత్కారాలను మనం అనుభూతి చెందవచ్చు. శ్రీరామకృష్ణ పరమహంస 'మనసే అంతా' అన్నారు.

మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతిం ॥

-శాట్యాయనీయోపనిషత్.

RK mission Hyd

ఉన్నతుడివైనా, పతనం చెందినా కారణం నీ మనసే. సాధారణంగా పరిపరివిధాల పిచ్చి కోతి లాగా పరుగెత్తే మనసును అభ్యాసంతో ఆజ్ఞాచక్రంలో ఉంచగలగడం వల్ల 'యోగి' అనిపించుకుంటాం. మహా మహా చమత్కారాలే అనుభూతి కొస్తాయి. మరి అలాంటిది చిన్నచిన్న కోరికలొక లెక్క కాదు గదా ?

అనీబీసెంట్‌కు ఆవిడ గురువుగారు ఈసాధనను ఆవిడ ఇంటి దగ్గర చేయిస్తూ 'ఇలా ఆజ్ఞాచక్రంలోనే మనసు నుంచుకొని అన్ని పనులూ చేయవచ్చు. ఆ స్థితిలో నిన్నే శక్తీ ఏమీ చేయలేదు. ఆఖరికి ఆటంబాంబైనా సరే కనీసం నిన్ను తాకనైనా లేదు' అంటూ ఆవిడకీ సాధన నేర్పిస్తూ వివరించారు. ఈ మహత్తర సాధన నేర్చుకున్న అనీబీసెంట్ ఆమె గురువుగారితో 'మరైతే నేను అలా ఆజ్ఞాచక్రంలోనే మనసు నుంచుకొని అలా బయటకెళ్ళి నాలుగుబజార్లూ తిరిగి రావచ్చునా ?' అందిట. 'నిరభ్యంతరంగా వెళ్ళి రావచ్చ'న్నారాయన. ఆవిడవెళ్ళొచ్చింది గూడా. అయితే ఇక్కడ మనం గమనించాల్సిం దేంటంటే ఆ దేశంలో ముఖ్యంగా ఆవిడుండే ప్రాంతంలో, ఆ రోజుల్లో ఏవేవో గొడవల వల్ల అంతర్యుద్ధాలు జరుగుతున్నాయి. ('Shoot at sight) - కనిపిస్తే కాల్చివేత'ఉత్తర్వులు జారీచేయబడి పోలీసులు అప్రమత్తంగా గస్తీ తిరుగుతున్న బజార్లలో పట్టపగలు తిరిగొచ్చిందావిడ ఒంటరిగా. క్యాజువల్‌గా. అలాంటిది యీ సాధనా మహత్యం.

శ్లో॥ అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥

(భ.గీ. - 8వ అ. - 14వ శ్లో.)

తా: "ఎవడు అనన్యచింతనతో నన్నే స్మరిస్తూంటాడో అలాంటి నిత్య యుక్తుడగు యోగికి నేను సులభంగా, సుఖంగా దొరుకుతాను.

శ్లో॥ యోగి నా మపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యోమాం స మే యుక్త తమో మతః

(భ.గీ. - 6వ అ. - 47వ శ్లో.)

తా: ఏ మనుజుడు నాయందు మనసు నిలిపి శ్రద్ధతో నన్ను సేవించు చున్నాడో అట్టివాడు యోగులందరి కంటెను ఉత్తముడు అని నా అభిప్రాయము.

శ్లో॥ వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్య ఫలం ప్రదిష్టం
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥

(భ.గీ. - 8వ అ. - 28వ శ్లో.)

'యోగి అయినవాడు వేదముల వలన, యజ్ఞముల వలన, తపస్సుల వలన, దానముల వలన కలిగే పుణ్యఫలము కంటే ఉత్కృష్ట మైన పుణ్యపదమును పొందుచున్నాడు' అని గీతాచార్యుడన్నాడు.

అందుచేత మనము అలాంటి గొప్పదైన యోగికులములో చేరుటకు తక్షణం ప్రయత్నించాల్సి ఉన్నది.

పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్
హాసలీలా నిద్రాదులు చేయుచున్ తిరుగుచున్ లక్షించుచున్
సంతత శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాద
సంధానుడై మరచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా ॥



మహాభాగవతంలోని ఈ పై శ్లోకంలో చెప్పిన సూత్రాన్ని ఆచరించగలగాలి.

చంచలమైన మనసు పౌర్ణమిరోజు శాంతిస్తుంది. ఇడ, పింగళ నాడులు సహజంగానే సమంగా ఉంటాయానాడు. సహజంగానే శాంతస్థితి కొస్తుంది మనసు. మన మనస్సును సులభంగా అదుపులోకి తెచ్చుకొనేందుకు యీ కిటుకులు పనికొస్తాయేమో చూసుకోవాలి. స్పాట్ జాగింగ్, రన్నింగ్‌లు, వాకింగ్‌ల వంటి వాటి వల్ల కూడా ఇడ, పింగళ నాడులు బ్యాలన్సయి సుషుమ్న ద్వారా శ్వాస నడుస్తుంటుంది. అప్పుడు కూడ మనసును అదుపులోకి తీసుకోవచ్చు. ఎడమ నాశిక నుంచి శ్వాస జరుగుతున్నప్పుడు మన మనస్సెప్పుడూ భౌతికమైన వాటి పట్ల ఆసక్తి చూపుతూంటుంది. కుడివైపు నుంచి శ్వాస నడుస్తున్నప్పుడు ఆధ్యాత్మికత వైపు మనసు మక్కువ చూపుతుంటుంది. ఈ రెండూ సమస్థితి కొస్తే అంటే రెండు నాశికలనించీ శ్వాస నడుస్తుంటే సమత్వం అంటారు. ఆ స్థితిలో ఏ రోగాలూరావు. అశాంతి వుండదు. మన సాధనలూ ఫలిస్తాయి. కాబట్టి నిరంతరం సమత్వ స్థితిలో ఉండాలంటే కాసేపు జాగింగ్ చేసి, 'సమంకాయ శిరోగ్రీవం' సాధన చేస్తే ఆ సమత్వస్థితి తేలిగ్గా వస్తుంది. మనసును ఎక్కువ సేపు ఆజ్ఞా చక్రంలో నిశ్చలంగా నిలప గల్గుతాం.

పౌర్ణమి రోజు సాధనకెంతో అనుకూలమైనది. ఆ రోజు సహజం గానే మన మనసు తేలిగ్గా మన వశమౌతుంది. బాడీ లాంగ్వేజి మీద అమెరికాలో పెద్ద పెద్ద శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరుపుతున్నారు. దాన్నే మన ప్రాచీన ఋషులు ఆసన విజ్ఞానంగా ఏనాడో అందించారు. ఆసన శుద్ధి చాలా అవసరం. శరీరాన్ని స్థిరంగా ఉంచుకోగలిగితే మనసును స్థిరంగా ఉంచుకోగలం. సమం కాయ శిరోగ్రీవం - శిరస్సు, మెడ, మొండెము స్థిరంగా ఉంచడం వల్ల ఆజ్ఞాచక్రంలో మనసును స్థిరంగా ఉంచుకోగల్గుతాం. దాని కంటే ముందు స్థిరంగా కూచొని ముక్కు చివర దృష్టి ఉంచి లోపలి కెళ్తున్న శ్వాస, బయటికొస్తున్న

శ్వాసల్ని గమనించడం వల్ల మనసును మెల్లి మెల్లిగా మన వశం చేసుకునేందుకు వీలవుతుంది.

ఇంకా ఏం చెప్తున్నారంటే ఆసనాలలో అత్యుత్తమమైన ఆసనం పద్మాసనం. భారతీయ ఆధ్యాతికతలో అత్యంత ప్రాముఖ్యత ఈ పద్మాసనాని కివ్వబడింది. మన ఆధ్యాత్మిక జగత్తులో ఏ దేవీ దేవతా మూర్తి అయినా పద్మాసనంలోనే ఉంటారు. కొన్ని సందర్భాలలో నిలబడి వున్న దేవతా మూర్తులు కూడా పద్మంలోనే నుంచున్నట్లు మనం చూస్తుంటాం. కాబట్టి దేవతా సాధన పద్మాసనం వేస్తేగానీ ఫలించదు. అని స్పష్టమౌతోంది కదా ! సూర్యుడికీ, పద్మానికీ చాలా దగ్గర సంబంధం ఉంది. సూర్యుడుంటే తప్ప పద్మం వికసించదు. మన శరీరంలో షట్చక్రాలున్నాయి. అవీ పద్మాలే. ఆ సూర్యుణ్ణి కూడా నడిపిస్తున్న శక్తి సవితాశక్తి. గాయత్రీమంత్రాన్ని యోగి కాదలచుకున్నవారు ఆశ్రయించక తప్పదు. పద్మాసనం చాలా ప్రధానమైన ఆసన మని మనం గ్రహించి ఎక్కువసేపు పద్మాసనంలో కూర్చోవడం అభ్యాసం చేయాలి. ముఖ్యంగా 'సమంకాయ శిరోగ్రీవం' సూత్ర మాధారంగా మనం చేస్తోన్న ఈ సాధనకు పద్మాసనాన్ని జోడించగలిగితే శరీరం పటిష్టంగా తయారవుతుంది. అలా స్థిరంగా కూర్చుండిపోవాలి. 'అచలయోగ' మంటూ రమణమహర్షి చెప్పిందిదే. రమణుల వారికి గురువే లేడని చెపుతారు. అది తప్పు. ఆ అరుణాచలమే ఆ మహర్షికి గురువు, దైవము అన్నీ. ఆ కొండను ధ్యానించి అలా నిశ్చల మౌనంలో నిరంతరం అలా ఉండిపోయారాయన. కొందరికి పద్మాసనంలో కూచోవడం కాస్త కష్టమనిపించినా 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్టు నిరంతర సాధన వల్ల సాధించవచ్చు.

కష్టపడకుండా వచ్చినదేదీ కూడా నిలవదు. మన వెనుక మన పట్టుదల ననుసరించి గురువుల అనుగ్రహం పనిచేస్తుంటుందనీ, నిరంతరం వారు మనల్ని పైకి లాగేందుకే ప్రయత్నిస్తుంటారనీ గుర్తు చేసుకుంటుండాలి. ఎప్పుడైనా మంచి వాక్కు గలవారికీ, ఎప్పుడూ



నవ్వుతూ నవ్విస్తూండే వారికీ మాత్రమే ఆసనాల వల్ల ఫలితాలొస్తాయి తప్ప అందరికీ రావు. అలాంటి వారి సాధనలూ త్వరగా ఫలిస్తుంటాయి కూడా.

శ్లో॥ ఓం చందనస్య మహాత్పుణ్యం పవిత్రం పాపనాశనం ।
ఆపదాముప హారతేనిత్యం లక్ష్మీః తిష్ఠతి సర్వదా ॥

మహావీరుడు ముళ్ళ మీద నడుస్తుంటే ఆ విషపూరితమైన ముళ్లు ఆ మహాయోగి పాదాలకు ఎలాంటి బాధా, హానీ కలక్కుండా ఉండేందుకు అలా పక్కకు వంగేవిట గుచ్చుకోకుండా. ప్రహ్లాదుడిని ఎంతగా చంపుదామనుకున్నా ప్రయత్నించి వాళ్ళ నాన్న వల్ల కాలేదు. ఎన్ని రకాల బాధించినా ప్రహ్లాదుడు తన తండ్రిని ఒక్కమాటైనా అనలేదు. అందుకే అతన్ని ఏనుగు తొక్కేది కాదు విషనాగులు కరిచేవి కావు. వాక్కు దురుప యోగం కాకుండా చూసుకొనేవారికి ఎవరూ ఏ హాని తలపెట్టలేరు. ప్రకృతి వారితో ప్రేమమయ స్నేహాన్ని చేస్తుంది.

తత్ సన్నిధౌ వైర త్యాగః

అలాంటి వారి సన్నిధిలో ఆవు, పులి వంటి గర్భశత్రువులు కూడా మంత్రించినట్లు అయిపోతాయి. రమణమహర్షి వంటి ఆశ్రమాల్లో మనకనేక చోట్ల ఈ వింత కనిపిస్తుంటుంది. కలకత్తాలో ఓచోట కొందరు మతోన్మాదులు ఊచకోత కోసుకుంటున్నారు. ఆ సమయంలో అహింసావాది గాంధీజీ ఒంటరిగా అక్కడికెళ్ళారు. వీరిని చూసీ చూడటం తోటే అల్లరి మూకలు చెల్లాచెదురయ్యాయి. మతోన్మాదులంతా మనసు మార్చుకున్నారు. కోపావేశాలు స్విచ్ ఆపినట్టు చల్లారిపోయాయి. భరతభూమిలో మహాభారతయుద్ధమే కాదు. మొదటి ప్రపంచ యుద్ధంగానీ మరే యుద్ధంగానీ వారివారి కర్మల వల్ల జరగడంలేదు. కేవలం వాక్కుతో యితరుల్ని హింసించడం వల్లనే ప్రతి ఘర్షణా, ప్రతి యుద్ధమూ, ప్రతి యాక్సిడెంటు జరుగుతున్నాయి. అంతే కాదు. ఈ వాతావరణ కాలుష్యము, శబ్దకాలుష్యము, నీటికాలుష్యము వంటి కాలుష్యాలు కూడా నోరు పారేసుకోవడం వల్లనే జరుగు తున్నాయి.

అంతేకాదు ఈ దోమలు, పంటల మీది క్రిమి కీటకాలు పెచ్చు పెరిగి పోవడానికి కారణం కూడా వాక్ దురుపయోగం వల్లనే' అన్నారు జ్వాలా కూల్ మహర్షి ఓ సందర్భంలో. ఆఖరికి ఆ మహానుభావుడు తేల్చి చెప్పిందేంటంటే 'control your tongue Immediately. ఈనాటి క్యాన్సర్ వ్యాధికి నీ నెగటివ్ థాట్స్, నీ వాక్కులే' నని చెప్తూ చెడు ఆలోచనలు, ఎంత ప్రమాదమైనవో, చెడు మాటలు కూడా అంతకంటే ఎన్నో రెట్లు ప్రమాదకరమైన వన్నారు. మౌనానికి మించిన ఔషధం లేదన్నారు.

వాక్ శక్తి చక్కగా పెరగాలంటే ఎక్కువగా నవ్వండన్నారు. పెదాలు కదపకుండా నవ్వడాన్ని కుళ్ళు నవ్వులా చెప్తుంటారు. అలాంటి నవ్వు మనలో ఉన్న కుళ్ళు తీసేస్తుంది. చాలా పెద్ద Exercise అది. సింహంలా గట్టిగా నాలుగైదు బజార్లకి వినపడేట్టు నవ్వగలగితే కంటి జబ్బులు పోతాయి. లివర్ ట్రబుల్స్ పోతాయి. జీర్ణశక్తి మెరుగౌతుంది. మణి పూరక చక్రంలో ఉన్న విశేష శక్తులు జాగృతమవుతాయి. ఆర్థిక యిబ్బందులు పోతాయి. ఆధ్యాత్మికోన్నతి కలుగుతుంది.

ముఖ్యంగా ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారో అనేటువంటి పరమ అసహ్యకరమైన ఆలోచన అసలు రానివ్వకూడదు. ఈ లక్షణాన్ని గురువులు భండాలమైన రోగంగా పేర్కొన్నారు. నీవెంతలా జీవిస్తున్నప్పటికీ ఖచ్చితంగా నీ పక్కవాళ్ళ కెవరికో ఒకళ్ళకి నచ్చదు. నీ కుటుంబ సభ్యులు కావచ్చు. తోబుట్టువులు కావచ్చు. పక్కవాళ్ళు కావచ్చు. స్నేహితులు కావచ్చు. నీవు మారడం వారికి నచ్చదు. దానికి కారణం ఒకటి కావచ్చు. నువ్వు మారడం వల్ల వాళ్ళలో ఉన్న లోటుపాట్లు బయట పడతాయి. అందుకే సూటీపోటీ మాటలతో వ్యంగ్యపు ఛలోక్తులతో లేదా వారికి చేతైన నీచపు పద్ధతిలో నిన్ను మారకుండా చేస్తారు. అయితే మనం యితరుల గురించి పట్టించు కోవడం మానేశాక వాళ్ళ వ్యంగ్యోక్తులు, కుళ్ళు చూపులు మనల్నేం చేయలేవు, 'పక్కవాళ్ళు మన గురించి ఏమనుకుంటున్నారో అనే వ్యాధి లక్షణం మనల్నేదో నాడు పతనం



చేస్తుందనీ, ఎదగ నివ్వదనీ' గుర్తుంచుకోవాలి. మనలో చాలా మంది నలుగురిలో డాన్సు చేయమంటే చేయలేరు. కనీసం గట్టిగా నవ్వమన్నా నవ్వలేరు. రాయిలాగా ఎలాంటి స్పందనా లేని అలాంటి బతుకులకు ఇక స్వస్తి చెప్పాల్సి ఉంది. ఎవరో పనీపాటాలేని, పనికి మాలినవాళ్ళు పుట్టించిన పుకారు మన నరనరాల్లో పాతుకుపోయింది. 'నవ్వు నాలుగు విధాల చేటు' అని.

బ్యూటీ క్లినిక్స్‌కి వెళ్ళాల్సినవసరం లేకుండా ముఖంలో ముడతలు, మచ్చలు పోయి తేజోవంతంగా తయారవ్వాలంటే కాళికా అమ్మవారిలాగా సాధ్యమైనంతవరకు కళ్ళు పెద్దవిచేసి నాలుక బయటకు పెట్టి కొద్ది సెకండ్ల పాటు అలా ఉండాలి. ఇది ప్రతిరోజు ప్రాతఃకాల సమయంలో చేయడంవల్ల యింకా ఎన్నో రెట్ల సత్ఫలితాలొస్తాయి. అన్నిటికన్నా పెద్దగా నవ్వడం వల్ల ఏడు లాభాలన్నారు. మనలో ఉన్న ఏడు చక్రాలు యాక్టివేట్ అవుతాయి. మాలిన్యాలు తొలగిపోతాయి. విదేశీ శాస్త్రజ్ఞులు పై విషయాలన్నీ నూటికి నూరు పాళ్ళూ వాస్తవమేనని తమ పరిశోధన ద్వారా వెల్లడిస్తూ మరో రహస్యాన్ని కూడా చల్లగా బయటపెట్టారు. అనవసరంగా ఉత్తి పుణ్యానికే భోరున ఏడవ మన్నారు. ఇలా ఏడవటం వల్ల మనలోని సమస్త మాలిన్యాలు బయటి కెళ్ళిపోతాయి. రాబోయే రోజుల్లో అనేక రోగాలు మనకికరాకుండా ఉండేందుకవకాశం ఉంది. కళ్ళద్వారా, ముక్కుద్వారా హానికరమైన చెడు పదార్థాలు బయటికొచ్చేస్తాంటున్నారు యిలా ఏడుపు సీన్ల వల్ల.

మొన్నామధ్య ఓ ప్రఖ్యాత మధుర గాయకుడు అతని మిత్రుడితో కలిసి ఏ ఆస్ట్రేలియానో వెళ్ళాడుట. అక్కడో చోట జనం కిటకిటలాడు తున్నారు. మిత్రులిద్దరూ అక్కడి కెళ్ళి వారి కోలాహలానికి కారణమేంటో నని చూశారు. అక్కడ నాలుగైదు టికెట్ కౌంటర్లున్నాయి. హడావిడిగా జనం కౌంటర్లలో టిక్కెట్లు తీసుకొని గబగబా హుషారుగా పక్కనున్న హాల్లో కెళుతున్నారు. టిక్కెట్లు తీసుకోకుండా వెర్రిమొహం లేసుకొని తాపీగా నుంచున్న వీళ్ళని పిచ్చివాళ్ళని చూసినట్లు చూస్తున్నారు.

వాళ్ళల్లో ఒకడు చెప్పనే చెప్పాడు. 'అలా చూస్తారేంటయ్యా టికెట్లు తీసుకొని లోపలికి పోక!' అని. సరే అని యాంత్రికంగా వీరు కూడా టిక్కెట్లు తీసుకొని హాల్లోకెళ్ళారు. లోపలికెళ్ళి చూసిన వీళ్ళకి ఏం చేయాలో తెలీలేదు. వాళ్ళని చూసి నవ్వాలో ఏడవాలో తెలీలేదు. ఆ పెద్ద విశాలమైన హాల్లో తలా ఓ మూలకూచొని యధేచ్ఛగా ఏడుస్తున్నారు. పెడబొబ్బలు పెట్టి ఏడ్చేవాళ్ళు కొందరైతే కిందపడి దొర్లుతూ ఏడ్చే వాళ్ళు మరి కొందరు. ఒకరిని మించి ఒకరు నీకంటే పెద్ద ఏడుపుగాణ్ణి నేనంటే నేన'ని పోటీలు పడి మరీ ఏడుస్తున్నారు టిక్కెట్లు తీసుకొని మరీ - ఇంతలో ఒకడు వీరి భుజం తట్టి ఓ ఉచిత సలహా ఇచ్చాట్ట 'మీరు కూడ కాసేపు అక్కడ కూర్చొని ఏడవండి' అని. దాంతో మరి వీరికి ఏమనిపించిందో, ఏడ్చివచ్చారో లేక నవ్వు కుంటూ బైటకొచ్చేశారో తెలీదుగానీ ఈమధ్య సినీగాయకుడు SP బాలసుబ్రమణ్యంగారు, ప్రఖ్యాత మ్యాజీషియన్ పట్టాభిరామ్‌గారు ఏదో సందర్భంలో చెప్పారీవిషయాన్ని. అదీ సంగతి. కాబట్టి నవ్వేకాదు ఏడుపుకూడ అత్యంత ప్రయోజనకారి అనమాట.

శ్లో॥ ఓం చందనస్య మహాత్మ్యం పవిత్రం పాపనాశనం ।
ఆపదాముప హరతే నిత్యం లక్ష్మీః తిష్ఠతి సర్వదా ॥

భారతీయ ఋషుల అత్యద్భుత ప్రతిభా విశేషానికి ప్రత్యక్ష నిదర్శనమీ శ్లోకం. 'అనామికను (సూర్య వేలు, అంటే ఉంగరం వేలు) ఆజ్ఞాచక్రానికి తగిలిస్తే మీరున్న చోట యాక్సిడెంట్స్ జరగవు. ఆపదలు రావు. జరగబోయే విపత్తులు ఆగిపోతాయి. పై శ్లోకాన్ని చదువుకుంటూ గంధమో, బొట్టో పెట్టుకోవాలి' అన్నారు. ఇదిలా వుండగా వైజ్ఞానికులు దీన్ని సమర్థిస్తూ ఏమన్నారంటే 'పిట్యూటరీ గ్లాండ్‌లో హార్మోన్స్ యొక్క రియాక్షన్స్ సరిగా ఉంటే ఆకస్మాత్తుగా జరిగే ప్రమాదాలు జరగవ'న్నారు.

పద్మాసనం వల్ల మూలాధారాని వత్తిడి కలుగుతుంది. బొట్టు పెట్టుకోటం వల్ల ఆజ్ఞాచక్రానికి ఒత్తిడి కలుగుతుంది. దీనివల్ల స్వాధిష్టాన, మణిపూరక, అనాహత, విశుద్ధి చక్రాలు అనుకూలంగా స్పందిస్తాయి.



ఈ 'సమం కాయ శిరో గ్రీవం' సాధనతో పాటు పద్మాసనంలో కూచొని, ఆజ్ఞా చక్రంలో మనసు నుంచి, ఓంకార నాదాన్ని తదేకంగా - నాదంపై ధ్యాసతో నిరంతరం సాధన చేసుకుంటుండాలి. ఇలా చేయటం ప్రారంభించిన కొద్ది రోజులకే మన సమస్యలు నివారణౌతాయి. కోరికలు తీరుతాయి.

రావణాసురుడు, ఋషులు వంటి వారు తపస్సు చేసేవారు. ఇలాగే స్థిరంగా కూచొనేవారు. కదిలేవారు కాదు. నిత్యకృత్యాలకు, ఆహారానికీ రోజు మొత్తమ్మీద ఏ ఒకటి రెండుసార్లో కదిలేవారు. మిగతా సమయాల్లో స్థిరంగా, నిశ్చలంగా అలా కూర్చుండిపోయేవారు. మనం కూడా అలా మంకుపట్టుపట్టి పట్టుదలగా కూర్చుండిపోవాలి. మనసుని శ్వాసపైనో, కనుబొమల మధ్యనో, సద్గురుని పాదాల కిందనో ఇరికించి అలా నిశ్చలంగా బిగుసుకు పోవాలి. అలా ఉండిపోగలిగిన వాళ్ళు యోగి కులానికి సంబంధించిన వాళ్ళు' అన్నారు.

అలా 'బిగుసుకు పోయి కూర్చోవడం' అనే మాటను మనం కాస్త కామన్‌సెన్స్‌తో అర్థం చేసుకోవాలి. ఎవరో మనల్ని పైకి లాగుతున్నట్లు నిటారుగా కూర్చోవాలి.

ఈ రోజుల్లో మనం ఎంతగా తెలివి మీరిపోయామంటే మన అతితెలివి మనల్నే గోతిలో దింపేస్తోంది అని మనం గమనించుకోలేకపోతున్నాం. ఒకవేళ మనం దాన్ని గమనించినా దానికి మనం ఏదో కవరింగ్ ఇచ్చేసుకుని సంజాయిషీ చెప్పుకుంటుంటాం. మనకున్న ఏ అనారోగ్యానికో డాక్టరు 'అయ్యా మీరు సిగిరెట్ తాగడం వెంటనే మానేయాలి.' అన్నాడనుకోండి. ఇక అక్కణ్ణించి మన అతి తెలివితేటలు ఆ డాక్టర్ మీద ప్రయోగిస్తాం. ఎలాగొలా కాలికేస్తే మెడకి, మెడకేస్తే కాలికి ఇలా మన వాక్చాతుర్యాన్ని ఎంతో ఉపయోగించి ఆ డాక్టర్ చేత "సరే ఎప్పుడన్నా ఒకటి. అర తాగండి ఫరవాలేదు." అని అనిపించుకుంటాం. ఇక అక్కణ్ణించి ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎంతో నమ్మకంగా సిన్సియర్‌గా డాక్టరు తనకు "సిగరెట్ తాగటం

మనేయమన్నాడు. అయితే ఒక అర పాకెట్ వరకు పర్మిషన్ ఇచ్చారు." అని చెప్పేస్తాం మొహం పరమ సిన్సియర్‌గా పెట్టి.

రూలంటే రూలే వద్దనుకున్నది వద్దే వద్దు. మనకు నష్టం కలిగించేది పిసరంతైనా వద్దు ఉప్పో, పంచదారో తినొద్దని డాక్టర్ చెబితే మన వాక్ విద్య ఆయన మీద ప్రయోగించి 'సరే కాస్త తిను' అనేలా చేసుకుంటాం. నిజానికి ఆ డాక్టరుకేంపోయింది. మన ఆరోగ్య విషయం పట్ల మనం శ్రద్ధ చూపించాలి కాని అతనికేం పట్టింది. అయితే అక్కడ బిగుసుకుపోయి కూర్చోమంటే మన శారీరక శక్తిని బట్టి అని అర్థం. పరమ భయంకరమైన ఇబ్బందిగా ఉన్నా-కాళ్ళు తిమ్మిర్లెక్కి, చెదలు పట్టినట్లున్నా అలా కదలకుండా కూర్చోమని కాదు. ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించాలి. కూర్చోగలిగితే, పెద్దగా ఇబ్బంది లేకపోతే మొండిగా అలా కూర్చుండిపోవాలి. చిన్న చిన్న ఇబ్బందులైతే అవే సర్దుకుంటాయి.

పాల్ బ్రంటన్ ఓ అద్భుతమైన యోగి విదేశస్థుడు కావచ్చు. మేడమ్ బ్లావెట్స్కీ ఓ యోగిని. సత్యసాయి ఒక యోగి. మన పైవారంతా యోగులు మనం కూడా వారి కులంలో చేరిపోవాలి. ఎప్పుడో రిటైరయ్యాక కాదు. త్వరత్వరగా. వీలయినంత వేగంగా. అది మనకే మంచిది.

ఇది మనం అనుకున్నంత సులభం కాదేమోననిపిస్తుంటుంది. మూడు విషపూరితమైన పదార్థాల్ని అణువణువూ ఎక్కించేసుకున్నాం. **చింతపండు, నూనె, మిరపకాయ. ఈ మూడింటినీ మనం వదిలేయ గలిగితే మన శరీరం తేలికైపోతుంది. అమితాశ్చర్య కరమైన మార్పును మనం అనుభూతి చెందుతాం. మన శరీరం మన మాట వినటం మొదలెడుతుంది.** పద్మాసనంలో కూచున్నప్పుడు మన శరీరం ఎంత తేలికైందో మనకే స్పష్టంగా తెలుస్తుంది. మన ధ్యానం ఏకాగ్రత చెందే కొద్దీ అంగుళాల కొద్దీ పైకి లేస్తాం. 'పతంజలి యోగ శాస్త్రం'లో విభూతి పాదంలో చక్కగా దీని గురించి వివరించబడింది. 'యోగిక్ ఫ్లయింగ్' లాహిరీ మహాశయ జీవితంలో ఆయన తరచు అలా ధ్యానమగ్నుడై ఉండగా అలా గాలిలో పైకి లేచి పోయేవారు ఇంటిపై కప్పు వరకు కూడా. ఎన్నో సార్లు ఆయన



భార్య కంగారుపడ్డట్టు చెబుతుంటారు. 'ఒక యోగి ఆత్మకథ'లో పరమహంస యోగానంద దీనిగురించి స్పష్టంగా వివరించారు.

**ఉదాన జయాత్ జల పంకకంటకాదిష్వసంగ ఉత్క్రాంతిశ్చ.** (విభూతి పాదం. 40 వ సూత్రము)

**సమంకాయ శిరో గ్రీవం ధారయన్ అచలం స్థిరః**

**(భ.గీ. - 6వ అ. - 13వ శ్లో.)**

గ్రీవం అంటే మెడ. శిరో - శిరస్సు, కాయం - శరీరం. సమంగా-తిన్నగా ఉంచుకొని కూర్చోండి. అంటే అర్థం ఏంటంటే నిటారుగా కూర్చోండి. ఏమాత్రం వదులుగా లేకుండా ఎవరో మిమ్మల్ని పట్టిపైకి లాగుతున్నట్టుగా, స్టిఫ్‌గా గోడకానుకోకుండా కూర్చోగలగాలి. lose contact ఉంటే current ఎలాయితే pass కాదో యిదీ అంతే.

గ్రీవం అంటే వాక్కును, శిరో అంటే ఆలోచనల్ని - కాయం అంటే శరీరంతో చేసే ఆచరణ సమంగా ఉంచుకోమని శ్రీకృష్ణుని బోధ. మన మనసులో ఏముందో అదే మాట్లాడాలి. మనసులో ఒకటి పెట్టుకొని పైకింకొకటి మాట్లాడటం కాదు. ఏం మాట్లాడామో అదే ఆచరించాలి కూడా. అంటే మనోవాక్కాయ కర్మలు - త్రికరణశుద్ధి. అదే హ్రీం-శ్రీం-క్లీం అదే సాయి వేంకటేశ శ్రీరాం. అప్పుడు మనలోకి దైవీ సంకల్పాలు దిగుతాయి.

ఈ నియమాన్ని తు.చ తప్పకుండా పాటించగలగాలి. అంతే గాకుండా క్రమం తప్పకుండా నిటారుగా పద్మాసనంలో కూర్చోడం రోజూ అభ్యాసం చేయాలి. చాలా మందికి కూచున్న మరునిమిషం లోనే అలా లేచెళ్ళి ఏ టీనో తాగాలనిపిస్తుంది. లేదా ఏ పక్కింటతనో, స్నేహితుడో వచ్చి అలా వెళదాం పద' అనచ్చు. అంటే మన శిరస్సులో వచ్చిన ఆలోచనకు మన శరీరం సహకరించడం లేదన్నమాట. అందు కని కూర్చునే ముందే మనం గట్టి సంకల్పం తీసుకోవాలన్నమాట. ఎటువంటి పరిస్థితులలోనూ ఓ 45 నిమిషాలో, గంటో టైమ్ పెట్టుకుని

'కదలనుకూడా కదలను' అనేగట్టి సంకల్పం తీసుకుని కూర్చోవాలి. ప్రారంభంలో అలా మొండికేసి కూర్చున్నవాళ్ళే తర్వాత తర్వాత రమణమహర్షి వంటి మహాగురువులవుతారు. తిరుమల కొండలనో, అరుణాచలం వంటి కొండలనో గుర్తు తెచ్చుకోవాలి. ఆ కొండలా స్థిరంగా కూర్చుండిపోవాలి. మధ్యమధ్యలో కాస్తంత కదలాల్సి వచ్చినా కొంచెం సర్దుకుని స్థిరంగా కూర్చోడం కోసమే ప్రయత్నించాలి.

మనందరికీ గోత్రనామాలున్నాయి కదా! అంటే ఋషుల పేర్లేగదా ! ఆ ఋషుల యొక్క సంతానంగదా మనమంతా. మరి ఋషుల సంతానానికి వాళ్ళ స్వభావాలే కదా ఉండేది. కాబట్టి మనం ఆధ్యాత్మిక జగత్తులో దేన్నైనా సాధించగలుగుతాం. అయితే ప్రారంభంలో కాస్త తడబాటు, తప్పటడుగు ఉండవచ్చుగాక! పట్టుదల వదల కూడదు. వదలకుండా అలా నిశ్చలంగా కూచోని ఏం చేయాలో రెండో పాదంలో చెప్పారు.

*సంప్రేక్ష్య నాశికాగ్రం స్వం దిశశ్చా నవలోకయన్.*

'స్థిరంగా కూర్చొని దిక్కులు చూడకుండా మనసును ముక్కు చివర ఉంచండ'ని చెప్పాడు. అంటే శరీరాన్నీ, మెడనీ, శిరస్సునీ నిటారుగా, నిశ్చలంగా, స్థిరంగా ఉంచి కూర్చొని లోపలికి బయటికీ ప్రయాణిస్తోన్న శ్వాసను గమనిస్తుండాలని భావం.

ఆ మధ్య మహేష్ యోగి ఛానల్‌లో తరచూ ప్రసారం చేసేవారు. బ్యాంక్ మేనేజర్లు, వ్యాపారస్తులు అలాంటి వాళ్ళని కొందరిని ఎన్నుకొని Brain Scanning చేశారు. అందరి మెదళ్ళలో పెద్దపెద్ద కన్నాలు ఉన్నాయి. వాళ్ళ బ్రెయిన్‌లోనే అంత పెద్ద పెద్ద కన్నాలున్నాయంటే మన బ్రెయిన్‌లో ఇంకా ఎంత పెద్ద కన్నాలుంటాయో మనం ఊహించలేం. అలా మెదడులో పెద్ద పెద్ద కన్నాలున్న కొంత మందిని ఎన్నుకొని మహేష్‌యోగి ఓ ప్రయోగం చేశారు. పతంజలి యోగసూత్రాలు చదివించాడు వాళ్ళచేత. అంతే ! మెల్లి మెల్లిగా బ్రెయిన్‌లోని కన్నాలు



పూడిపోవడమే కాకుండా మరింత ఆశ్చర్యం కలిగించేట్లు పద్మాసనంలో కూచున్న వాళ్ళని ఎగరగలిగేట్టు చేశాడు. యోగిక్ ఫ్లయింగ్ చేయించారు. భూమ్యాకర్షణ శక్తి తగ్గడం వల్ల అలా జరుగుతుంది. భూమి యొక్క ఆకర్షణ మనపై ఎలాంటి ప్రభావాన్నీ చూపించదు.

అసంభవాన్ని కూడా సంభవాలుగా మార్చగలిగే సమర్థవంతులు గురువులు అని మనకు రామాయణ కాలంనించీ ఋజువు చేస్తున్నారు. ఆస్తిపాస్తులకు, ఐశ్వర్య వైభోగాలకు దూరమైన రాముడు - నగలు కాదు కదా చిన్నమెత్తు బంగారం కూడా లేని సీత. పైగా వల్కలధారులై అరణ్యంలో ఎలాంటి వనరులూ లేకుండా జీవిస్తోన్న ఆ దంపతులు సీతారాములు.

అత్యద్భుతమైన శక్తివంతుడు-హైటెక్ సిటీలో హైలెవెల్‌లో ఉన్న రావణాసురుడుతో యుద్ధం చేయాల్సివచ్చింది. మనబోటి వారం ఆనాడక్కడ ఉండి ఉంటే ఖచ్చితంగా రావణుడికే ఓటు వేసివుండే వాళ్ళం. ఆ వైపుకే చేరిపోయి ఉండేవాళ్ళం.

ఎందుకంటే ఇటువైపున్న రాముడు నిస్సహాయంగా ఉన్నాడు. నీరసంగా కూడా ఉన్నాడు. అడవుల్లో తిరిగే రాముడు. పెద్దగా ఆయుధాలు కూడా లేని రాముడు. అలాంటి రాముడికి హనుమంతుడి లాంటి భక్తుడున్నా ఆయన గురించి ఆయనకే తెలీదు పాపం.

అలాంటి సమస్త విపరీత పరిస్థితుల్లో, అననుకూల వాతావరణంలో రావణుడితో యుద్ధం చేసి అతన్నోడించి తన భార్యను వెనక్కి తెచ్చుకోవాలి. మామూలుగా ఆలోచిస్తే కటిక అసంభవమది. మరా పరిస్థితుల్లో అగస్త్యులవారు ఆ మామూలు రాముడిచేత ఆ అసంభవాల్ని సంభవాలుగా చేయించగలిగాడు. **అదీ మన భారతీయ ఆధ్యాత్మికశక్తి, ఋషుల ప్రతిభ, సద్గురుని సత్తా.**

ఖచ్చితంగా నేటి పరిస్థితులన్నీ అచ్చు గుద్దినట్టు ఇలాగే వున్నాయి. అన్యాయం రాజ్యమేలుతోంది. అక్రమం పక్కనే సింహ

సనంలో ఉంది. దుర్మార్గ నాయకత్వంలో, దుష్టత్వం వీటిన్నిటికీ కేంద్రంలో ఉండగా సాధుత్వం బంధింపబడి ఉంది. మంచితనం దాని పక్కన మగ్గుతోంది. వాతావరణం అంతకు ముందే విషపూరితమై ఉన్నది.

గురువులేమంటున్నారంటే వైష్ణవీ శక్తి ధారలు వీర విహారం మొదలెట్టాయి. ఓ పక్కనించి చెడును తొలగిస్తూ, మంచికి బలాన్నిస్తూ కమ్ముకొస్తున్నాయవి. **ఎప్పుడైనా అశ్వమేధ యజ్ఞం జరిగింది అంటే ఖచ్చితంగా ఆ అవతారమూర్తి అనుకున్నది చేసేసినట్లే. ఆయన చేయదలచుకున్న పని పూర్తయినట్లే. సూక్ష్మ జగత్తులో దుష్టశిక్షణ జరిగిపోయినట్లేనని చెప్తూ పూజ్యగురుదేవులు అసలు పని మనబోటి వారికి యిప్పుడే ఉండేది** అన్నారు. దీన్ని మనం సరిగా అర్థం చేసుకోవాలి.

**శ్లో॥ ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథా ఽన్యానపి యోధవీరాన్**
**మయా హతాంస్త్వం జహి మావ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాఽసి రణే సపత్నాన్ ॥**

**(భ.గీ. - 11వ అ. - 34వ శ్లో.)**

'ఇది వరకే ద్రోణాచార్యులు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు మొదలైన అసలైన వారంతా నా చేత చంపబడ్డారు. మిగతా వాళ్ళని నీవు చంపు. నీవు చంపకపోయినా యీ యుద్ధం తర్వాత ఇక్కడ బతకి బట్టకట్టగలిగే వారెవ్వరూ వుండబోరు.' అన్నాడు గీతాచార్యుడు.

గీతలో భగవానుడు చెప్పినట్టు గురువులంతా మనకు ఓ అపూర్వ అవకాశాన్నిస్తున్నారు. ఎప్పుడో చంపేశాను శిష్యా ! నీక్కని పిస్తోన్న ఈ ఉత్తుత్తి మహామహులు నీవు ఉఫ్ అంటే పడిపోతారు. ఆ కీర్తిని నీకివ్వడం కోసమే నిన్ను ముందు నుంచోమంటున్నాను" అన్నారు. ఆ 'ఉఫ్' అని ఊదటమే శ్వాసకు సంబంధించిన మహావిజ్ఞానము.

పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్య 27 అశ్వమేధ యజ్ఞాలు చేశారు. ఒక్కో ఎసైన్‌మెంట్ పూరిచేసుకుంటూ 27 మెట్లెక్కారు. మనల్ని



ఎక్కించారు. 28వది మన ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిలో ఇటీవల మన చేత చేయించారు. **ఎప్పుడైనా యుద్ధానికి ముందు, యుద్ధం జరిగేటప్పుడు ఉండే పని కంటే యుద్ధమంతా అయిపోయాక జరిగాల్సిన పన్లే చాలా పెద్ద పెద్ద పన్లు.** శకలాల్ని తొలగించడం, శవాల్ని తరలించడం. కూలిన వంతెనలు నిర్మించడం, పోయినవారు పోగా మిగిలిన వాళ్ళని ఓదార్చడం, పునరావాసాలు కల్పించడం ఇలాంటివన్నీ నిజానికి యుద్ధానికంటే పెద్ద పెద్ద పన్లు. మనం కాస్త ఆలోచిస్తే ఈ విషయాలు అర్థమౌతాయి. ఇప్పుడే సామూహికత అవసరం. సామూహిక ప్రయత్నాలు, సాధనలు అమితాశ్చర్చకరమైన ఫలితాలను ఇచ్చేదిప్పుడే. గురువులందిస్తోన్న ఈ మహా రహస్యం పట్ల ఆ సామూహికత చేసే మ్యాజిక్‌ల పట్ల మనకున్న అభి ప్రాయాలతో వాళ్ళకి సంబంధం లేదు. **ప్రస్తుతం చెప్పినట్లు చేయగలిగే వారు కావాలి.** ఆధ్యాత్మిక జగత్తులో నీ ఒంటరి సాధనలు, జపాలు, తపాలు నీ రాక్షసత్వాన్ని తెలియజేస్తాయి. ప్రతి గురువూ అనాది కాలం నించీ సామూహికతనే నేర్పాలని చూస్తున్నా, ఆ గ్రూప్ లివింగ్ మన కలవాటు చేయాలని ఆరాటపడుతున్నా మనం వాళ్ళకి నిరాశే మిగులుస్తూ వచ్చాము. ఇక రాబోవు రోజుల్లో సామూహికత లేకపోవడాన్ని ప్రకృతి సహించదు. ఇది మనం బాగా గుర్తుంచుకోవాలి !

బాంబే వంటి 'పరుగు నగరాల్లో' పిల్లలు తల్లిదండ్రుల్ని 'అమ్మా నాన్నా'అని పిలవడంలేదు 'Sunday Daddy, Saturday Mummy' అంటున్నారు. నిద్రలేచీ లేవంగానే తలా ఒకదిక్కుకీ పరుగులు తీసే ఆ కుటుంబ సభ్యులు నలుగురూ కలిసి కనీసం ప్రశాంతంగా కూర్చోలేక పోతున్నారు. ఉద్యోగరీత్యా తీసే పరుగులో నాన్న ఆదివారం కనిపిస్తాడు. అమ్మ శనివారం కనిపిస్తుంది. మిగతా రోజుల్లో అందరూ ఉండేది ఒకే చోటైనా దోబూచులాడుతున్నట్లు పిల్లలు నిద్రలేవక ముందే నాన్న గబగబాలేచి పరుగెత్తకపోతే ఉద్యోగం లోంచి పీకేస్తారని భయం. రాత్రి వరకు studies పేరుతో పిల్లలు ఆ లేత బుర్రలు వేడెక్కించుకొని శోషొచ్చిపడినట్లుగా నిద్రపోయాక 'చీకటి వీరుడి'లా Daddy వస్తారు. అమ్మ కూడా అంతే.

శ్లో॥ ఉద్ధరే దాత్మ నా 22త్మానం నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపు రాత్మ ॥

(భ.గీ. - 6వ అ. - 5వ శ్లో.)

తా : తనను తానే ఉద్ధరించుకొనవలెను. తనను తాను అధోగతిపాలు చేసుకోకూడదు. తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు.

శ్లో॥ బంధు రాత్మా22త్మాన స్తస్య యే నాత్మై వాత్మనా జితః
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతా22త్మైవ శత్రువత్

(భ.గీ. - 6వ అ. - 6వ శ్లో.)

తా : ఆత్మనిగ్రహము కలిగియున్న వారికి వారి ఆత్మయే వారికి బంధువు. నిగ్రహములేని వారికి వారి ఆత్మయే వారికి శత్రువు.

శ్రీరామకృష్ణపరమహంస 'నీ మనసే అంతా' అన్నట్టు నీ మనస్సును మచ్చిక చేసుకొని, మంచి పట్టుదలతో కూడిన సాధనతో నీవు చెప్పినట్లు నడిపించ గలిగితే నీమనసే నీకు మంచి స్నేహితుడు కాగలదు. అలా గాకుండా అజ్ఞానంతో అది చెప్పినట్లు నీవు ఆడినట్లైతే నీ నిలువెల్లా ఆక్రమించిన నీ మనసే నీకు శత్రువై ఓ రోజు నిన్ను పూర్తిగా నాశనం చేసేస్తుంది. కాబట్టి అప్రమత్తుడవై ఉండాలి. నిన్ను నీవే ఉద్ధరించు కోవాలి. కర్ర పట్టుకొని నీకెదురుగా కూచొని నిన్నూ, నీ మనసునూ ఎవరూ ఉద్ధరించరు. మనల్ని మనం అధోగతిపాలు చేసుకోగూడదు. మంచి మిత్రుడు నీలోనే ఉన్నాడు. అతిభయంకరమైన రాక్షస ప్రవృత్తి గల్గిన నీచమైన శత్రువూ నీలోనే ఉన్నాడు. అదే నీ మనసు' అని గీతాచార్యుడు భగవద్గీతలో పలికిన పలుకులనే శ్రీరామకృష్ణ పరమహంస కూడా సమర్థించారిక్కడ. పైశ్లోకాలకి అర్థం అదే.

దీనికి సంబంధించిన ఓ అద్భుత రహస్య సూత్రాన్ని బట్టి మన లోపలి కెళ్ళిన శ్వాస మన మనసుగా మారుతోంది. రోజుకి 21,600 సార్లు బయటికీ, లోపలికీ తిరుగుతోన్న ఆ శ్వాసరూపి మనసును మన వశం చేసుకోడానికి తెలివిగా ప్రయత్నించాలి. అసలు దాని నైజాన్ని



కాస్త అర్థం చేసుకుందాం. గురువులేమంటున్నారంటే నీవు లోనికి తీసుకున్న శ్వాస ఎన్ని అంగుళాల పొడవుందో దానికంటే తక్కువ పొడవున్న శ్వాసను బయటికి వదలాలి. అప్పటినుంచీ దివ్యానుభూతులు కలిగేందుకు అవకాశం ఉంది. కనీసం లోపలికి తీసుకున్న శ్వాస విడిచి పెడుతున్న శ్వాస సమంగా ఉండేలా చేయగలిగినా మనం సమత్వాన్ని సాధించినట్లే. సమత్వం యోగ ఉచ్యతే అన్నట్లు దానివల్ల కూడా మన కెన్నో విశేష ప్రయోజనాలు కలుగుతాయి. టీనిశై మనం చేసే ప్రయత్నాలన్నీ సఫలమయేందుకు మన వెనుక ఎందరో దివ్యాత్మాలు మన శ్రద్ధను బట్టి మనల్ని కంటికి రెప్పలా కాపాడుతుంటారు. ప్రతిసారీ మనల్ని వారి దివ్యానుగ్రహం చేత పై పైకి లాగేందుకు ప్రయత్నిస్తుంటారు. అసలది వారి బాధ్యత. దీని గురించే గీతలో ఇలా అన్నాడు.

శ్లో॥ పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే
నహి కల్యాణ కృ త్కశ్చి ద్దుర్గతిం తాత గచ్ఛతి ॥

(భ.గీ. - 6వ అ. - 40వ శ్లో.)

శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీ స్సమాః
శుచీనాం శ్రీమతాం గేహే యోగోభ్రష్టో భిజాయతే ॥

(భ.గీ. - 6వ అ. - 41వ శ్లో.)

శ్లో॥ అథవా యోగినా మేవ కులే భవతి ధీమతాం
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥

(భ.గీ. - 6వ అ. - 42వ శ్లో.)

యోగభ్రష్టుడైనవాడు అంటే యోగం చేస్తూ చేస్తూ చనిపోయినా, లేకపోతే మధ్యలో యోగ విద్యాభ్యాసము ఆపేసి మామూలు జీవితం గడుపుతోన్న వారు తరువాతి జన్మల్లో శ్రీమంతుల ఇళ్ళలోగానీ, యోగి కులంలోగానీ పుడతారు. యోగికులంలో పుట్టడమంటే యోగుల ఇళ్ళల్లో పుట్టడమని కాదు. ఎలాంటి ఇళ్ళల్లో పుట్టినా, ఏ కులంలో

జన్మించినా అతడు ఏదో ఒక యోగికులానికి ఆకర్షింపబడతాడు. ఇంతకు ముందు చెప్పినట్టు సత్యసాయి సంస్థ ఒక యోగికులం. రమణమహర్షిది ఒక యోగికులం. మాస్టర్ CVV ఒక యోగికులం. గాయత్రి పరివార్ ఒక యోగికులం. ఇలా రకరకాల యోగికులాలున్నాయి. వీటిలో దేనికో ఒకదానికి ఆకర్షింపబడతారు.ఉదాహరణకు ఎమ్.బి.బిఎస్‌లో ఫీజు కట్టి జాయినైనప్పటి నించీ వాడు డాక్టరే. ఆ రోజునించీ కొన్ని సంవత్సరాలపాటు శ్రద్ధగా చదివి ఆ విద్య నేర్చుకొని పరీక్ష పాసైతే (Full Fledged) పరిపూర్ణ డాక్టరవుతాడు. అలాగే ఇది కూడా. పై శ్లోకాల్లో గీతాచార్యుడేమంటున్నాడంటే యోగ విద్యనభ్యసిస్తూ మధ్యలో ఏ కారణాంతరాల వల్లనో వదిలేసినా, ఆయువు తీరి మరణించినా, జీవితాంతం వరకూ ప్రయత్నించి సాధించలేకపోయినా మరేం ఫరవా లేదని గ్యారెంటీ ఇస్తున్నాడు. వాళ్ళు తిరిగి యుద్ధంలో మరణించి వీరస్వర్గం పొందిన వారిలా వీరికి కూడా పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. అక్కడనేక సంవత్సరాలు సుఖించాక తిరిగి అలాంటివారు సదాచారము కలిగిన ఇళ్ళలో కానీ, గొప్ప ఐశ్వర్యవంతుల ఇళ్ళలో గానీ జన్మిస్తారు. లేదా మిక్కిలి జ్ఞానవంతులైన యోగుల కులంలో పుడతారు. ఇది **జగద్గురువు శ్రీకృష్ణుని భరోసా.**

కాబట్టి యోగి కులంలో చేరదలచుకున్న మనం భయపడ వలసిన పని లేదు. కాబట్టి యోగి కులంలో చేరదలచుకున్నవారు ప్రప్రథమంగా మనసును మన చెప్పుచేతల్లోకి తెచ్చుకో గలగాలి. దానికి గురుదేవులు 'నీ శరీరాన్ని నీ యిష్టం వచ్చినట్టు తిప్పగలిగితే నీ మనసును నీవు నీ ఇష్టప్రకారం తిప్పగలవు' అన్న రహస్యాన్ని ఆసన విద్యగా అందించారు. వజ్రాసనంలోనో, పద్మాసనంలోనో కనీసం మూడు గంటలు కూర్చోలేకపోతే ఆసన విద్యలో మనం సఫలీకృతం కానట్లే. **వారందించిన మరో రహస్య సూత్రము : నీ వాక్కును నీవు నియంత్రించుకో గలిగితే నీ శ్వాసను నీవు నియంత్రించుకో గలుగుతావు. శ్వాసద్వారా నీ మనసు నీ కంట్రోల్లోకొస్తుంది.**



రోజు మొత్తం మీద ఏకొద్దిసేపో మనసు నువ్వు చెప్పినట్టు వింటున్నది. మిగతా సమయాల్లో నీ శక్తిని వృధా పరుస్తూ రకరకాలుగా తిరుగు తున్నది. ఉదాహరణకి మాట్లాడుతున్నప్పుడు ఎనిమిదంగుళాల శ్వాస లోపలికి తీసుకొని పన్నెండంగుళాల శ్వాస బయటికొదిలేస్తున్నాం. అక్కడ నాలుగంగుళాల శ్వాసను నష్టపరుస్తున్నాం. అంటే ఆ మేరకు నీ మనసు నీమీద నాలుగు పాయింట్లు ఎక్కువ గెలిచిందన్నమాట.

నడిచేటప్పుడు ఎనిమిదంగుళాల శ్వాస తీసుకొని పదహా రంగుళాల శ్వాసను వదులుతున్నాం. అక్కడ ఎనిమిదంగుళాల శ్వాస నష్టపోయింది. అంటే మనసు ఎనిమిది పాయింట్లు ఆధిక్యతలో ఉంది.

కూరగాయలు తరగడం వంటచేయడం, బియ్యమేరడం, జడలువేయడం, రాయడం, రుబ్బడం, విసరడం, చెరగడం వంటి పన్లు చేసేప్పుడు పదంగుళాల శ్వాస పీల్చుకొని ఇరవై అంగుళాల శ్వాస వదులుతాం. అంటే పదంగుళాల శ్వాస నష్ట పోతున్నాం. అంటే మన మనసు పది పాయింట్లు అధిక్యతలో ఉన్నట్లు.

పరుగెత్తేటప్పుడు ఇరవై ఏడంగుళాల శ్వాస లోపలికి తీసుకొని యాభైనాలుగంగుళాల శ్వాస బయటికొదులుతున్నాం. ఇక్కడ కూడ మనసు ఇరవై ఏడు పాయింట్లు గెలుచుకుంటుంది.

వాదులాడుకొనేటప్పుడు పన్నెండంగుళాలు లోపలికి తీసు కుంటే, బయటికి ఇరవై నాలుగు అంగుళాలు వదులుతాం. అనగా మనసు పన్నెండు పాయింట్లు గెలిచింది.

నిద్రపోయేటప్పుడు ముప్పై అంగుళాలు లోపలికి, నలభై ఎనిమిది బయటికి వదులుతాం. అంటే పద్దెనిమిది పాయింట్లు మనసు ఆధిక్యతలో ఉంది. సంభోగకాలమందు ఇరవై నాలుగంగుళాలు లోపలికి అరవై నాలుగంగుళాలు బయటికి, యిక్కడ నలభై పాయింట్లు మనసు గెలుచుకుంటుంది. ఈ విధంగా మనిషి రోజుకి 30, 40 వేల శ్వాసలు వృథా చేసుకుంటున్నాడు. అందుకే మనిషికి ఆయువు తగ్గిపోయింది. కాస్త ఆలోచిస్తే మనకే అర్థమవుతుంది. మరి

అదివరకు రోజుల్లో ఈ విసరడం, రుబ్బడం, జడలేయడం, నిద్దరపోవడం వంటివి లేవా ? మరి ఈ మనుష్యులకు ఆయువు తగ్గిపోయిందేమి ? అన్న సందేహానికి సమాధానమే తర్వాత వాక్యాల్లో వివరించారు. ఆ మేరకు మనసు మన మీద అత్యంత అధిక మెజారిటితో గెలుస్తోంది. రకరకాల వ్యాపకాల్ని మనకంట గడుతోంది. మన మైండ్‌ని చెత్తకుండీలా చేస్తోంది. మనల్ని కుక్క కంటే హీనంగా చేసి తోకాడించుకుంటూ దానిచుట్టూ తిరిగేలా చేసు కుంటోంది. అలా జరక్కుండా ఉండాలంటే మనం మన శ్వాసల్ని వృధా చేసుకోకూడదు.

చాలామంది ఈ బైటికెళ్ళే శ్వాసల్ని అంత పొడుగుండకుండా తగ్గించాలంటే ఎలాగా ? అని ఆలోచిస్తుంటారు. దానికి గురుదేవులు సూచించిన సూత్రాన్ని గుర్తు చేసుకోవాలి. లోనికి పీలుస్తోన్న శ్వాస ఆదాయమనుకుంటే బయటికి విడిచిపెడుతున్న శ్వాస వ్యయం. వ్యయం తగ్గించుకోవడం ఎలాగా ? అనేది మన సమస్య కదా ! సింపుల్ సొల్యూషన్ ఆదాయం పెంచుకోవాలి. అంటే దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి, ఇలా అభ్యాసం చేస్తూ చేస్తూండగా ఆటోమేటిక్‌గా దానంతటదే మనక్కావలసినట్టు మారిపోతుంది. ఇక్కడ మనం బాగా గుర్తుంచుకోవాల్సిందేంటంటే నిదానంగా, లోతుగా శ్వాసించడం - అదేమాదిరి నిదానంగా, పూర్తిగా, తీసుకున్న శ్వాసనంతా వదిలేయడం. అంతేగాని వదిలే శ్వాస పొడుగు తగ్గాలని తీసుకున్న శ్వాసంతా వదల కుండా ఉంచడం కాదు. ఇక్కడ మనం జాగ్రత్త పడాల్సిన అంశ మేంటంటే ఊపిరితిత్తుల్లోగానీ, పొట్టలోగానీ ప్రతిసారీ ఏమాత్రం కొంచెం కూడా గాలి నుంచుకోగూడదు. అలా ప్రతి శ్వాసలో కాస్త కాస్త మిగిలిపోయేలా చూసుకుంటుంటే అలా మిగిలిపోయిన శ్వాసలు (గాలి) మన జీవితంలో సమస్యలుగా, కష్టాలుగా, బాధలుగా, రోగాలుగా, ప్రతికూల పరిస్థితులుగా ఎదురవుతాయన్నారు. అందువల్ల లోతుగా, నిదానంగా ఊపిరితిత్తులనిండా లేక పొట్టనిండా లేదా రెండింటి నిండుగా శ్వాస తీసుకొని అదే విధంగ తీసుకున్న శ్వాసనంతా నిదానంగా, పూర్తిగా బయటికి నెట్టేయాలి. ప్రతిసారీ గమనించు



కుంటుండాలీ విషయాన్ని. ఇలా అభ్యాసం చేయగా చేయగా కేవలం కొద్ది కాలంలోనే మనకు శ్వాస తీసుకోవల్సిన అవసరం రాని పరిస్థితి క్రమక్రమంగా అనిపిస్తుంటుంది.

దీనిలో అత్యంత అమృతమయ సాధన మరొకటి కలపగలిగితే ఎంతో అద్భుతం. దానివల్ల కేవలం కొద్ది నెలల్లోనే ఆశ్చర్యకరమైన మార్పులు మనం చవి చూడగలం. మనచుట్టూ అద్భుతమైన ప్రాణశక్తి సముద్రం ఉధృతంగా ప్రవహిస్తోంది. అలా కల్పన చేసుకోనక్కర్లేదు. **వాస్తవంగానే మనమందరం ఓ అద్భుత, అమృతమయ ప్రాణశక్తి సముద్రంలో కూచొని ఉన్నాం.** ఎటొచ్చే దాన్ని మనంలోనికి తీసుకోగలగాలి. ప్రతిశ్వాస ద్వారా అనంత ప్రాణశక్తి మనలోనికి జొరబడుతున్నట్లు భావన చేసుకుంటుండాలి. **ఈ శ్వాస సాధనలో మనకెంతో సహకరించేటువంటి ముద్ర 'చిన్ముద్ర'.** బొటన వేలు, చూపుడువేలు కలిపి ఉంచాలి. మిగతా మూడువేళ్ళు వెడంగా చాపి ఉంచాలి. ఇదే చిన్ముద్ర. ఈ ముద్ర మన సాధనలోని లోపాలను సరిజేయడమే కాక మన శ్వాస సాధనలు త్వరితంగా సఫలమయ్యేట్టు చూస్తుంది. ఆ ముద్రలోని గొప్పదనమది.

**తులసి మొక్కలు ప్రాణశక్తి పెద్దమొత్తంలో వదులుతుంటాయి.** మిగతా అన్ని మొక్కల్లా కాకుండా ఇరవై నాలుగ్గంటలూ పుష్కలంగా తులసి మొక్కల్లో ప్రాణశక్తి ప్రసారం జరుపుతుంటుంది. అందుగ్గాను మనం మన ఇళ్ళలో తులసి మొక్కల్ని ఎక్కువగా పెంచాలి. దీని ద్వారా కూడా మన సాధనలు త్వరిత్వరగా సఫలీకృతం అవగలవు. శ్వాస ఒక పక్కనుంచీ ఇంకోపక్కకు మారుతుంటుందని చెప్పుకున్నాంగదా ! అలా మారుతున్నప్పుడు సుషుమ్నలోనించి ప్రవహిస్తుంటుంది. అలా సుషుమ్నలో శ్వాసలు జరుగుతున్నప్పుడు మనసుని వశం చేసుకోవడం అత్యంత సులభం. జాగింగ్ వంటి ఎక్సర్ సైజుల వల్ల కూడా శ్వాసను సుషుమ్నలో నిలుపవచ్చు. దాంతో మనసు మనం చెప్పినట్లు వింటుంది.

ప్రతి రోజూ శ్వాస మన శరీరంలో ఉన్న ఏడు చక్రాల్లోనూ కొంత కొంత సేపు అలా సంచరిస్తుంటుంది. దాన్ని మనం గమనించి,

ఉపయోగించుకోవాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు అంటే బ్రాహ్మీ ముహూర్తంలో సహస్రారంలో శ్వాస నడుస్తుంటుంది. అలా నడుస్తోన్న శ్వాస సూర్యోదయంతో పాటు మారుతుంది. మరి మూలాధారానికొస్తుంది. అక్కడ ఓ 40 ని॥ పాటు 600 శ్వాసలు నడుస్తాయి. ఆ 600 శ్వాసలు మూలాధారంలో పూర్తి చేసుకుని స్వాధిష్టానానికొస్తుంది. అక్కడ 6000 శ్వాసలు నడుస్తాయి. దానికి 6 గం॥ 40 ని॥ లు పడుతుంది. అక్కడి నుంచి శ్వాస మణిపూరానికి చేరుతుంది. అక్కడ కూడా ఓ 6 గం॥ 40 ని॥ ల పాటు యిందాకటిలా 6000 శ్వాసలు నడుస్తాయి. ఆ తరువాత అనాహతానికి చేరి శ్వాస అక్కడ కూడా 6 గం॥ 40 ని॥ ల పాటు 6000 శ్వాసలు నడుస్తాయి. దాంతో టైము రాత్రి 2 గం॥ ల 40 ని॥ అవుతుంది. అక్కడి నుండి శ్వాస కంఠస్థానంలో ఉన్న విశుద్ధి చక్రానికి చేరి ఓ గంటా ఆరు ని॥ ల పాటు ఒక వెయ్యి శ్వాసలు నడుస్తాయి. అలా వెయ్యి శ్వాసలు విశుద్ధిలో నడిచాక అక్కణ్ణించి ఆజ్ఞా చక్రం చేరుతుంది. అప్పుడు టైం 3 గం॥ 46 ని॥ అవుతుంది. అలా రాత్రి 3 గం॥ 46 ని॥ ల నుండి 4 గం॥ 53 ని॥ ల వరకు అంటే ఒక గంట ఏడు ని॥ ల పాటు ఆజ్ఞా చక్రంలో 1000 శ్వాసలు నడుస్తాయి. అక్కణ్ణించి శ్వాస సహస్రారానికి మారుతుంది. ఆ బ్రాహ్మీముహూర్త సమయంలో ఓ గంట ఏడు ని॥ల పాటు అంటే సూర్యోదయం వరకు సహస్రారంలో శ్వాస నడుస్తుంది. అక్కడ కూడా వెయ్యి శ్వాసలు పూర్తవుతాయి. ఇలా ఏడు చక్రాల్లో తిరిగే శ్వాస ప్రతిరోజూ 21,600 శ్వాసలు పూర్తి చేసుకుంటుంది.

నిమిషానికి పదిహేను సార్లు చొప్పున గంటకి 900 సార్లు అవుతాయి. రోజుకి 24గంటలు అంటే 24 × 900 = 21,600 సార్లు శ్వాస తీసుకుంటున్నాం. ఇక్కడ మనం గమనించాల్సిందేమిటంటే సత్వరమైన ఫలితాల్ని పొందాలని మనందరం అనుకుంటాం. అలా అనుకోడంలో తప్పేంలేదు అని చెప్తూ మాష్టారు మన మెక్కడన్నా ఓ పదివేలు అప్పు చేశామనుకోండి. రోజుకొక్కొక్క రూపాయి చొప్పున తీర్చుకుంటూ పోతే పదివేల రోజులు పడుతుంది. కాస్త పట్టుదల, సాహసం చూపిస్తూ రోజుకో వెయ్యి రూపాయల చొప్పున తీరుస్తూపోతే పదిరోజుల్లో ఎత్తిపారేయచ్చు. ఇదీ అలాగే. సూర్యోదయం నించీ మొదలైన శ్వాసలు అలా చక్రాల్లో తిరుగుతూ తిరుగుతూ ఆజ్ఞాచక్రాని కొచ్చేప్పటికి మూడుగంటల నలభై ఆరునిమిషాలవుతుంది. (ఆరు గంటలకు సూర్యోదయమైన పక్షంలో) గంటా ఏడు నిమిషాల పాటు శ్వాస జరుగుతుంటుందక్కడ. ఏ పాత బాకీలవాడో, మనకు కనిపించ కుండ తప్పించుకుని తిరిగేవాడినో కలవాలనుకుంటే సాధారణంగా ఏం చేస్తాం ? ఆఫీసులోనో, ఏ టీ బంకులోనో ట్రై చేయడం కంటే అతనింటి దగ్గరే కాపేస్తే దొరకడం ఖాయం కదా ! ఇదీ అంతే. ఆ సమయంలో ఆజ్ఞా చక్రంలోకి ప్రతీ శ్వాసా వచ్చి వెళుతుంటుంది. కాబట్టి అప్పుడు మన మనసుని ఆజ్ఞాచక్రంలో ఉంచడలగడం సులభ సాధ్యము. అసలు మనస్సు యొక్క స్వస్థానం (ఇల్లు) కూడా ఆజ్ఞాచక్రం దగ్గరే.



గంటా ఏడు నిమిషాల తరవాత అక్కడి నించి సహస్రారానికి మారుతుంది. ఆ సమయంలో మనం చేసేటువంటి జప, తప సాధనలు వెయ్యి రెట్లు ఫలితాలిస్తాయి ఏ మంత్రమైనా అంతే. ఒకసారి గాయత్రీ మంత్రం చేస్తే సహస్ర గాయత్రీ చేసిన ఫలితమొస్తుంది. అలా కాకుండా ఒక్క నిమిషం పాటు సాయినాథుని లేక సద్గురుని పాదాల చెంత నిశ్చలంగా మనసును శ్రద్ధతో నిలపగలిగితే వెయ్యి నిమిషాలు సద్గురుని పాద స్పర్శవల్ల లేక సద్గురు ధ్యానము వల్ల పొందే ఫలితం పొంద గలుగుతాం. దానికంటే కూడా మరింత అద్భుతమైన ఫలితాలు పొందాలనుకునే వాళ్ళు ఇదే సాధన ఏ తిరుమల క్షేత్రంలోనో, శ్రీశైలము వంటి పుణ్య క్షేత్రంలోనో, సముద్రపు ఒడ్డునో చేయగలిగితే సంవత్సరాలు పట్టే సాధన మన ఏకాగ్రతను బట్టి నెలలు, రోజుల్లోనో సాధించగలం.

ప్రతిరోజు మనం నిద్దర్లేచేటప్పుడు శ్వాస ఏవైపు నించి నడుస్తోందో గమనించుకోవడం మర్చిపోకూడదు. ఆ రోజు మన శుభా

శుభాలు దాని మీదే ఆధారపడుంటాయి. ఆదివారం, మంగళవారం మనం నిద్ర లేచే సమయానికి కుడి ముక్కులో నించి శ్వాస నడుస్తుండాలి. సోమ, బుధ,శుక్ర వారాల్లో ఎడమవైపు నించి నడుస్తుండాలి. గురువారం కృష్ణపక్షమైతే కుడి ముక్కులో నించీ, శుక్లపక్షమైతే ఎడమముక్కులో నించీ నడుస్తుండాలి. శనివారమైతే కుడిముక్కు లోంచి నడుస్తుండాలి. ఇలా శ్వాస నడుస్తుండగా మనం నిద్రలేస్తే శుభసూచకములు. ఒకవేళ అలా ఆరోజు అందుకు వ్యతిరేకంగా శ్వాస నడుస్తుంటే మరేం కంగారు పడక్కర్లేదు. కొద్ది నిమిషాలు ప్రయత్నించి శ్వాసను మార్చుకోవచ్చును. శ్వాసను ఎలా మార్చుకోవాలో ఇంతకు ముందే తెలియజేయబడింది. కుడి కంటి మీద ధ్యానం చేస్తే శ్వాస ఎడమ పక్కకు, ఎడమ కన్ను మీద ధ్యానం చేయడం వల్ల శ్వాసను కుడివైపుకు మార్చుకోవచ్చు. ఇదంతా కాస్త అయోమయంగా ఉంటే ఓ పని చేయవచ్చు ! నిద్దుర లేచేటప్పుడు ఏ వైపు శ్వాస నడుస్తోందో ఆ వైపు పాదాన్ని ముందుగా నేలపై ఉంచి లేచి వెళ్ళాలి. దాని వల్ల ఆ రోజుకు శుభదినం కాగలదు. చెప్పినవే చెప్పకుండా ఉండేందుకు 1,2,3,4 భాగాల్లో మరిన్ని శ్వాసకు సంబంధించిన వివరాలు అందజేయబడ్డాయని తెలియజేస్తున్నాము.

శ్లో॥ ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః
ఆశ్చర్యవచ్చైన మన్య శ్శృణోతి
శ్రుత్వా ప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥

(భ.గీ. - 2వ అ. - 29వ శ్లో.)

ఆస్ట్రేలియాలో అలెగ్జాండర్ అనే ఓ డ్రామా ఆర్టిస్టున్నాడు. అతనికి చాలా మంచి పేరుంది. షేక్స్పియర్ నాటకాల్లో మంచి కమాండుంది అతనికి. జీవించేవాడు పాత్రల్లో. అతని డైలాగులు చెప్తుంటే చప్పట్లు కొట్టేవారు కాదు. అంటే మంత్ర ముగ్ధులై పోయే వాళ్ళనమాట. చప్పట్లు కొట్టడం కూడా మరిచి పోయే వారనమాట. అంతటి మహానటుడికి ఉన్నట్టుండి అకస్మాత్తుగా పెరాలసిస్ స్ట్రోక్



వచ్చింది. ఆ పక్షపాతం ప్రధానంగా మొహం మీద ఎక్కువ ప్రభావం చూపించింది. సడన్‌గా అలా జరిగేసరికి అతని నటజీవితానికి పెద్ద దెబ్బతగిలింది. అతని అభిమానులు, ప్రభుత్వం వాళ్ళు అతన్నెంతగానో ఓదార్చారు. వాళ్ళంతటితో ఆగకుండా ఎన్నోరకాల చికిత్సలూ చేయించారు. రకరకాల సహాయాలు చేశారు. అయినా తగ్గలేదు. నిత్యము బైబిల్ చదువుకుంటూండిపోయాడు కొంతకాలం. అప్పుడతని కెవరో చెప్పారు ఈ శ్వాస సాధన గురించి. సమంకాయ శిరో గ్రీవం మంకుపట్టు పట్టి సాధించాడతను. ఆరునెల్లు తిరక్కుండా పూర్తిగా తగ్గిపోయిందతనికి. మళ్ళీ డ్రామాల మీదకి విరుచుకుపడ్డాడు. తన నట జీవితంలో తిరిగి విజృంభించాడు. అంతకు ముందు కన్న ఇంకా ఎంతో పేరు తెచ్చుకున్నాడు. దాంతో పాటు అతనిచ్చే ప్రతీ ప్రోగ్రాంలో అతను చేసిన సాధన గూర్చి చెప్తుంటాడు. చాలా మందికి అది నేర్పించాడు కూడా. అనేక రోగాలు దీనితో పోవడం గమనించి అతనితో పాటు అందరూ ఆశ్చర్యపోయేవారు. 'ప్రధానంగా క్రానిక్ రోగాలు ఈ సాధనతో తమాషాగా మాయమవడం నేను చూశానన్నా'డతను చాలా మీటింగుల్లో.

మనమెక్కడ దెబ్బతిన్నామంటే ఆశ్చర్యకర ఫలితాలొస్తాయని తెలిసినా ఇలా ఉన్నవి అలా మారిపోతాయని తెలిసినా, పరమాశ్చర్యకర సత్యాల్ని చూస్తున్నా, వింటున్నా మామూలుగా ఉంటాం మనం. ఏమాత్రం స్పందన మననుంచి రాదు. అనంతమైన కష్టాల్ని, రోగాల్ని, దరిద్రాన్నీ ఇంకా అనంతమైన ఓర్పుతో, సహనంతో అలాగ భరిస్తూ, బ్రతుకు ఈడుస్తాం తప్ప గొప్ప విషయాల్ని, ఋషుల సత్యవాక్కులనూ మనం ఆచరణలోనికి దింపేందుకు అసలు ప్రయత్నం చేయము. ఇదీ మన గొప్పతనం. మరింత ఆశ్చర్యకరం కూడా. ఇక ఆ ధోరణి మార్చుకుందాం.

హాలివుడ్‌లో ఇలాంటి ఒక చిన్న సాధన నేర్పుతూ రోగాలను పోగొట్టే చికిత్సకుడికి గంటకి 500 డాలర్లు ఫీజు ఇవ్వాల్సి వుంటుంది. 'అలెగ్జాండర్ టెక్నిక్' అని ఓ ఖరీదైన పుస్తకం తెగ అమ్ముడౌతుంది.

కేవలం ఆ పుస్తకంలో మెడ, తల, మొండెం ఒక గీత గీసినట్టు స్ట్రైటుగా ఉండాలని నేర్పిస్తారంతే. దాంతోనే 90 రకాల రోగాలు పోతున్నాయంటూ ఋజువులు, సాక్ష్యాలుతో సహా ఉన్నాయి దాంట్లో. మరి అలాంటిది మన ఋషులు అందిస్తోన్న ఈ అమరత్వ విద్య 90% రోగాలు పోగొట్టడమే కాదు, 18 మహావ్యాధుల్ని తరిమి కొట్టగలదు. అసలు ఉన్నవి అవే. 19వ వ్యాధి లేదన్నారు. మరి అలాంటి విద్య మనకు నేర్పుతున్నందుకు వారికేమిచ్చి ఋణం తీర్చుకోగలము ?

"ఒక్క ఓంకారము మాత్రమే యీ విశాల విశ్వం మొత్తమూ సర్వత్రా వ్యాపించి ఉన్నది. 'ఏ మాత్రం మనం ప్రయత్నించినా సరే ఆ ఓంకార తరంగాలలో లీనమై పోగలము' అని ఋషుల యొక్క గ్యారెంటీడ్ స్టేట్‌మెంట్" అంటూ తరచుగా మాష్టారు మనకు గుర్తుచేస్తుండే ఓ అమూల్యాంశమిది. ఓం కారము యొక్క శక్తిని గురించి 110 సంవత్సరాల క్రితం మేడమ్ బ్లావెట్స్కీ అనే సద్గురువు వివరిస్తూ "నేనీ ఓం కారంతో 7సార్లు చచ్చి మళ్ళీ బ్రతికాన"న్నారు. అసలీ ఓంకారాన్ని వివరించడానికే దివ్యాత్మలు గాయత్రీ మంత్రాన్ని అభివృద్ధి చేశారు. దానిపట్ల మనకు మరెందుకో అభిరుచి కలగడం లేదు. కొంత కాలం పోయాక దీనికే పేరు మార్చి 'ది సైంటిఫిక్ లైట్ ఎనర్జీ' అనో ã"Thousand lampsã" అనో పెడతారేమో. ఎందుకంటే దేవతలంటే మెరిసే వాళ్ళని అర్థం. మెరుస్తూ కాంతి పంచి పెడతారు. కాంతినిచ్చే దీపానికి ఇంకొక లక్షణం ఉంది. ఆ దీపంతో వేలాది దీపాలు వెలిగించవచ్చు. అయినా మొదటి దీపపు వెలుగేమీ తగ్గదు.

త స్య వా చ కః ప్ర ణ వః

పతంజలి మహర్షి ఆ వెలుక్కి పేరు కనుక్కున్నాడు ఓంకారము. ఆ 'ఓం కారాన్ని గురువు యొక్క గురువుగా గుర్తించాన'న్నాడాయన.

స హ పూ ర్వే షా మ పి గు రుః

మరి అలాంటి గురునామాన్ని మూడు రకాలుగా పలుకవచ్చునన్నారు. 'ఎండలో నుంచుంటే కాళ్ళు కాల్తాయి' అన్నారనుకోండి ఎవరన్నా. 'ఉత్తిదే... నేన్నమ్మన'ంటే ఏం చేస్తాం మనం ?



చెప్పులు విడిచి కాసేపు బండ మీద నిలబెడితే మెరిసే కళ్ళతో వాడే అంటాడు. అవునండోయ్ ! అని. అలాకాకుండా ఇంతలోనే వాడ్ని 'చాదస్తపువాడా ! అమాయకప్పక్షీ !' అని ఏమీ అనుకోనక్కర్లేదు.

అలాగే తక్షణం మనకి ఆ ఓం కారము యొక్క సెగతగిలేందుకు ఓ చిన్న ప్రయోగం చేసుకోవచ్చు. ఎలాగంటే మనమొక చిక్కు సమస్యలో ఇరుక్కున్నాం. నియంత్రణ లేని పరిస్థితిలో ఉన్నాం. నిస్సహాయంగా ఉన్నాం. అశాంతిగా ఉన్నాం. వెంటనే కంగారు పడక్కర లేదు. నిటారుగా కూచోవాలి. ఓం కారాన్ని పైకి ఉచ్చారణ చేయాలి.

ఓంకారనాదంలో ఓ... ఓ'మ్..మ్..మ్.....మ్' అనే దానికి ప్రాధాన్యత (స్ట్రెస్) ఇవ్వాలి. అబద్ధమాడటం చేతగాని ఋషుల యొక్క గురుదేవుల వాక్కు ప్రకారం మనకెంతో బలాన్నిస్తుందది. 'అన్ని సమస్యలనీ పరిష్కారం చేస్తుందది. తక్షణ సహాయం లభించేట్టు చేస్తుందది. హార్ట్‌ట్రబుల్స్ లాంటివి పోగొడుతుందది.' అని చెప్తూ ఇలా అన్నారు. "ఓంకారాన్ని రాత్రి వేళ అన్ని పనులూ అయిపోయి ఇక నిద్రపోతున్నామనే ముందు, నిద్రలేవగానే కళ్ళు తెరవకుండానే యీ ఓంకారాన్ని చేస్తే ఆధ్యాత్మిక, భౌతిక లాభాలొస్తాయి. 'పక్కమీదనే ఎలాగండీ మరీను' అనకండి. మరేం పర్వాలేదు. నిద్రలేవగానే కళ్ళుతెరవకండి ! లేచికూర్చోండి ! ఓంకారం చేయండి ! శాశ్వత లాభాలు పొందండి !" అన్నారు. ఓ నిర్ణీత సమయానికి అలారం పెట్టుకునో ఎలాగోలా నిద్దర్లేచి కళ్ళు తెరవకుండానే పక్క మీద కూచోవాలి. శ్వాస లోతుగా పీల్చు కోవాలి. ఓం..... మ్...మ్ అనాలి. 'మ'కారానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ పొట్ట సాంతం లోపలికెళ్ళి పోయే వరకు అనాలి. ఓ అరగంట చేయాలి. ఇలా కనక ఓ ఆర్నెల్లు చేయగలిగితే పొట్ట, నడుము తగ్గిపోవడమే కాదు అనేక ఆత్మిక లాభాలు కూడా కలుగుతాయని చెప్తూ దీన్నే అసలైన ప్రాణాయామమంటారన్నారు. ఇలా చేయడం వల్లే ద్విజత్వం వస్తుందని కూడా చెప్పారు.

కొన్నాళ్ళ క్రితం గుంటూర్లో ఓ సంఘటన జరిగింది. ఊరు ఊరంతా అల్లర్లు జరుగుతున్నాయి. 144వ సెక్షను కూడా కాదు. కర్ఫ్యూ కూడా అమలులో ఉంది. చాలా ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉన్నది. అనుకోకుండ వేరే ఏదో పని మీద ఓ మిత్రుడింట్లో ఇరుక్కుపోయాము. వీధి శూల ఉండటం చేత ఆ ఇంటి కిటికీలోంచి చూస్తే మొత్తం వీధి వీధంతా ఆ చివరి వరకు బాగా కన్పిస్తోంది. పిట్టపురుగు జనం లేరు రోడ్డు మీద. కనిపిస్తే కాల్చేస్తారని ఎవ్వరూ రోడ్డుమీదకి కాదు కదా పెరట్లోకి కూడ రావడంలేదు. ఆరోజు మిట్టమధ్యాహ్నం ఎండ దంచేస్తోంది.

దూరం నుంచి ఆ కర్ఫ్యూ వీధిలోంచి ఓ వ్యక్తి నడుచుకుంటూ వస్తున్నాడు. కిటికీ లోనించి చూస్తున్న మా ఫ్రెండ్ నడిచొస్తున్న అతన్ని చూసి కెవ్వనరిచాడు. దాంతో మేం గూడా కిటికీలో నించి చూశాం. రోడ్డుమీద అలా నడుచుకుంటూ వస్తున్నతని చేతిలో ఓపెద్ద క్యారియర్ కూడా ఉంది. మావాడు క్యారియర్‌ను చూసి అలా అరవలేదు. అతను మా స్నేహితుడు నారాయణ మూర్తి. గబగబా లోపలికి పిలిచాం అతన్ని. ఉండబట్టలేక మా ఫ్రెండ్ అడగనే అడిగాడు నారాయణమూర్తి పొంతం లోపలికి రాకుండానే. 'నీ కేమన్నా పిచ్చా' అని. దానికతను సమాధానం చెప్పకుండా అలా నిలబడ్డాడు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొంటూ. దాంతర్వాత మేమిచ్చిన కాసిని మంచినీళ్ళు తాగాక అతను చెప్పిన సమాధానానికి మేమందరం సిగ్గుపడ్డాం.

ఆ పక్కసందులో ఉన్న హాస్పిటల్‌లో ఉన్న పేషెంటుకి అన్నం తెచ్చాడతను. మిట్ట మధ్యాహ్నం మండే ఎండను లెక్కచేయకుండా - కర్ఫ్యూనీ, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వుల్నీ లెక్కచేయకుండా అలా ప్రాణాలకు తెగించి అతను క్యారేజీలో భోజనం తీసుకెళ్తోంది అతని బంధువుకో మిత్రులకో కాదు. అతని భార్య తాలూకూ దూరపు బంధువుకి. అతని దయాగుణానికి, అతని సాహసానికి మెచ్చు కుందామని మాటలకోసం వెతికితే ఒక్కమాటా గుర్తు రాలేదు.



అలాంటి మానసిక స్థితి ఉన్నవారికి ఈ అమరత్వ విద్య సులభంగా వస్తుంది. ఈ అమరత్వ విద్య కోసం ఇప్పుడు ఆరాట పడకపోతే, దానికై మనం కొంత సమయాన్ని కేటాయించుకోలేకపోతే రాబోయే రోజుల్లో డాక్టర్ ఫీజుల రూపంలో, మందుల రూపంలో వేలు, లక్షలు ఖర్చు చేయాల్సి రావచ్చు. సమర్థ సద్గురు వేదపీఠం నుంచి ప్రచురింపబడుతోన్న ఈ పుస్తకాల్లో ఉన్న రహస్యమయ విజ్ఞానం కోసం కొద్ది పాటి ఖర్చుకు సాహసించలేకపోతే, వాటిని ఆసాంతం చదివేందుకు కొద్దిపాటి సమయం కేటాయించుకోలేకపోతే ఖచ్చితంగా అది పరమ అవివేకమనిపించుకుంటుంది.

ఈ క్రైస్తవ ప్రసిద్ధగీతం మనలో చాలా మంది వినుంటాం. "నడిపించు నానావ నడి సంద్రమున దేవా" రెండోచరణంలో

"రాత్రంతయూ శ్రమపడినా
రాలేదు ప్రభు జయము"

అంటూ ఎంతో ఆర్తితో పాడేపాట అది. మనకు ఋషులందించింది రాత్రి సాధనలే. నవరాత్రి సాధనలు. దేవీ నవరాత్రులు, వినాయక చవితి నవరాత్రులు, శ్రీరామనవమి నవరాత్రులు, జగద్గురు నవరాత్రులు, గాయత్రీ నవరాత్రులు మొదలైనవన్నీ రాత్రిళ్ళు చేసే సాధనలే. ఇలా రాత్రిసాధనల ఆంతర్యము, దానిలోని రహస్యమయ అంశము ఏమంటే మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర చక్రాల కంటే మన వెన్ను పూసలోని ఆ పై చక్రాల్లోని మాలిన్యాన్ని తొలగించుకోవాల్సి ఉంది. మన సాధనా బలాన్ని వాటిపై ప్రయోగించాల్సి ఉంది. సూర్యోదయానికి మొదలుకొని రాత్రి 8 గంటల వరకు మన శ్వాస మూలాధారంతో నలభై నిమిషాలు, స్వాధిష్ఠానంలో ఆరుగంటల నలభైనిమిషాలు, దాని తర్వాత మణి పూరకంలో ఇంకో ఆరుగంటల నలభై నిమిషాలు శ్వాస నడుస్తుంటుంది. ఆ తరువాత రాత్రి ఎనిమిదిగంటల నించీ ఇంతకు ముందు మనం అనుకున్నట్లు శ్వాస అతి ప్రధాన కేంద్రాలైన అనాహత, విశుద్ధి, ఆజ్ఞ, సహస్రారాలో నడుస్తుంటుంది. కాబట్టి మన శ్వాస సాధనలు ఈ

సమయంలో అమోఘమైన ఫలితాలిస్తాయి. అందుచేత ఋషులు మనకు ప్రతిదీ రాత్రి సాధనలే ఇచ్చారు. త్రిరాత్రో పవాస దీక్షలో, నవరాత్రి అనుష్టానాలో మనకి ఆశ్చర్యకరమైన ఫలితాలివ్వడానికి కారణం దానిలోని ఆంతర్యాన్ని అవగాహన చేసుకొని చేయడమే. ఏదైనా ఓ విషయాన్ని అవగాహన లేకుండా కూడా చేయచ్చు. కానీ అది చుట్టు తిరుగుడు (round about) లాంటిది. చక్కటి అవగాహనతో 'తెలుసుకొని చేయడం వల్ల' శీఘ్ర ఫలితాలిస్తుంది.

రాత్రంతా మేలుకోవడం ఎవరికైనా కష్టమే. అలా రాత్రి మొత్తమూ మేలుకోని ఉండరాదు.

శ్లో॥ నాత్యశ్నతస్తు యోగో స్తి నచైకాంత మనశ్నతః
నచాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవచార్జున ॥

(భ.గీ. - 6వ అ. - 16వ శ్లో.)

గీతాచార్యుడు "అధికంగా తినేవాడికి, అసలే తినని వాడికీ- అధికంగా నిద్రించే వాడికీ, అసలు నిద్రపోని వాడికీ యోగం పనికి రాద"న్నాడు. కాబట్టి రాత్రంతా మేల్కోని సాధన చేసేయమని కాదు. "నవరాత్రుల్లో కానీ-విడిగా కానీ, మామూలు టైముకి పడుకోని పెందలాడే లేవాలి. మధ్యలో మెలకువ వస్తే కూర్చుని సాధన చేయండి !" అన్నారు. పెందలకడనే అంటే సూర్యోదయానికి పూర్వమే అని. అయితే సాధకులు 2-3 మధ్యన మేలుకొని తన సాధనలు ప్రారంభించవలసి ఉంటుంది.

అది వరకు రోజుల్లో ఏ ఇంటిపై కప్పు మీదనో కూసిన కోడికూతతో మెలుకువ వచ్చేసేది. మరి ఇప్పుడు మనలో చాలా మందికి మెలకువ రావడానికి ఏ అలారమో వాడాల్సి వస్తోంది. ఇప్పుడు ఈ సమస్య చాలా మందిని పీడిస్తోందని కనిపెట్టిన కొందరు శాస్త్రవేత్తలు ఓ వింత అలారంని కనుక్కున్నారట. అది ఓ వింత మంచం. మనమను కొన్న టైముకు లేవడం కోసం ఆ మంచం మీద విశ్రమిస్తే చాలు. ఖచ్చితంగా ఆ టైముకు నిద్రలేపి పారేస్తుంది. నిజంగా పారెయడమంటే పారెయ్యడమే మరి. మామూలుగా అలారాలు గట్రా ఆ సమయానికి



మోగుతాయి. కాస్త మగతగా ఉండి ఆ అలారంని మనం పెడిచెవిన పెడతాం. సెకండ్ వార్నింగ్ లాగా ఆ బెల్ మనల్ని నాలుగైదు సార్లు ఊపుతూ లేపేందుకు ప్రయత్నిస్తుందట. అయినా కుంభకర్ణుల బ్రదర్స్ లాటివాళ్ళకు మెలకువ రాకపోతే ఇంక ఫినిష్. ఆఖరి ప్రయత్నంలో ఎత్తికుదేస్తుందట. బెడ్ అమాంతం బోర్లాపడి బెడ్‌మీంచి అమాంతం నేలపైన పడి అప్పుడు మేల్కోవాల్సి వస్తుంది. ఇది కల్పనకాదు సుమా ! ఈ మధ్య అడ్వర్‌టైజ్‌మెంట్లలో ఈ 'విచిత్ర మంచం' చోటుచేసుకొన్నది.

మరి అలాంటి అలారం Beds కంటే మామూలుగా మనం ఓ నిర్ణీత సమయానికి మెలుకువ తెచ్చుకుని ఠక్కున లేచిపోవడం బావుంటుందేమో కదా ! దానికి శ్రీ గురుదేవులు ఏం చెబుతున్నారంటే 'అసలైన అలారం టైంపీస్ నీ అంతరంగిక గడియారమే'.

ఇల్లెక్కి కూసే కోడికి టైమెవరు చెపుతున్నారు ? అంతేకాదు అనేక జీవ జంతువులకు తమ గత విధులు ఏ టైంపీస్ ప్రకారం నెరవేర్చుకుంటున్నాయి ? వెలకట్టలేని, రిపేరుకు రాని అద్భుతమైన ఆ ఆంతరిక గడియారం వాటికి మల్లేనే మనల్నీ ఖచ్చితమైన సమయానికి నిద్ర లేపుతాయి. కుండపోతు వర్షంలో కూడ ప్రభాత సమయానికి పక్షులు మేల్కోవడం - సంధ్యలలో ఎక్కడ, ఎన్ని పనులలో ఉన్నా పక్షులన్నీ గూటికి చేరడం - రకరకాల వన్య మృగాలు అర్ధరాత్రి ఓ నిర్ణీత సమయంలో అరవడం - ఇవన్నీ వాటిలో లోపలున్న ఆంతరిక అలారం టైంపీసుల వల్లే. మనం కూడా సాధకులుగా మారే మొదటి రోజే, యోగి కులంలో చేరబోయే తొలిరోజునే ఆ అలారానికి బూజు దులిపి కీ ఇవ్వాలి. అలా దానిక్కాస్త జీవం పోసి, చైతన్యం కలిగిస్తే సమయానికి నిద్దర్లేపడమే కాదు. సమయానుసారం ఏ టైముకి ఏ పని చేయాలో మంచి ప్రేరణనిస్తూ ప్రోత్సహిస్తుంటుంది మన ఆంతరంగిక గడియారం.

ఆయుర్వేదంలో ఐదురకాల చికిత్సలున్నాయి. దాంతో శరీరంలోని వివిధచోట్ల ఉన్న మాలిన్యాలు బయటికొచ్చేస్తాయి.

1. వమన 2. విరోచన 3. స్వేదన 4. స్నేహన 5. వస్తి

ఈ ఐదురకాల చికిత్సలతో మన శరీరంలోని మాలిన్యాలు పెద్ద మొత్తంలో బయటికెళ్ళి పోతాయి. అలాగే శ్వాస సాధనకు సంబంధించిన ఓ అమోఘమైన చిన్న సాధన మనకెన్నో లెక్కలేనన్ని ప్రయోజనాల్ని అందిస్తుంది. ఇంతకుముందు చెప్పినట్లు ఈ ఐదు రకాల చికిత్సల వల్ల పొందే ప్రయోజనాల్ని మనం ఈ శ్వాససాధనతో పొందగలం. మన శరీరంలో యోగ సాధనకు అడ్డు తగిలే మాలిన్యాలు విసర్జింపబడతాయి. సమం కాయ శిరో గ్రీవం ప్రకారము నిటారుగా కూచొని కళ్ళు మూసుకొని నాభి దగ్గర తెల్లని, చల్లని చంద్రుడు మెరుస్తున్నట్లు భావన చేయాలి. కుడిముక్కును కుడి చేతి బొటన వేలితో మూసి, ఎడమ ముక్కు ద్వారా లోతుగా శ్వాస తీసుకోవాలి. తీసుకున్న శ్వాసనంతా వదిలేయాలి. ఇలా మూడుసార్లు చేయాలి. ఆ తరువాత కుడిచేతి చిటికెన వేలు, ఉంగరం వేలితో ఎడమ ముక్కును మూసి, కుడి ముక్కు ద్వారా లోతుగా శ్వాస తీసుకోవాలి. నాభి దగ్గర ఈసారి వెచ్చటి సూర్యుణ్ణి భావన చేయాలి. ఇందాకటి లాగానే ఇలా మూడుసార్లు తీసుకొని తీసుకున్న శ్వాసనంతా వదిలేయాలి. ఇందాకటి లాగానే మూడు సార్లు చేయాలి. ఇదీ సాధన.

ఇక్కడ మనం ఏకాగ్రత, శ్రద్ధ చూపాల్సిందేమంటే కుడిముక్కు మూసి, ఎడమ ముక్కు ద్వారా మనం పీల్చిన శ్వాస నాభి దగ్గరున్న చల్లని చంద్రుడ్ని తాకి, శ్వాసకూడా చల్లబడి ఎడమ ముక్కులొంచే బయటకొస్తున్నట్లు భావించాలి. అలా మూడు సార్లు చేశాక ఇడానాడి శుభ్రపడుతుంది.

ఈసారి నాభి దగ్గర వేడిగా ఉన్న సూర్యుణ్ణి భావన చేయాలి. ఎడమముక్కు మూసి, కుడి ముక్కు ద్వారా లోపలికెళ్ళిన శ్వాస నాభి దగ్గరున్న సూర్యుణ్ణి తాకి, వేడెక్కి అలా వెచ్చగా కుడిముక్కులొంచే బయటికొస్తున్నట్లు భావించాలి. ఇలా మూడుసార్లు చేస్తే పింగళానాడి శుభ్రపడుతుంది. దీనివల్ల ఇడ, పింగళానాడులు శుభ్రపడతాయి. ఈ



ఇడా పింగళానాడులు రెండూ దీనికల్ల శక్తివంతమౌతాయి. ఇక్కడ మనం గమనించాల్సిందేమంటే మనం లోతుగా తీసుకున్న శ్వాస ప్రతిసారీ వెన్నుపూస చివరి వరకూ వెళ్ళి మూలాధారం చేరి అక్కడి నించి బయటికొస్తోందని తెలుసుకోవాలి. అలా తెలుసుకుంటూ చేయాలి.

ఈసారి రెండు ముక్కుల ద్వారా లోతుగా శ్వాస తీసుకొని వెంటనే వదిలేయకుండా ఎంతసేపు ఆపగలిగితే అంతసేపు ఆపి నోటితో గాలి వదిలేయాలి. ఉఫ్ అని నోటి ద్వారా గాలి బయటకు తెప్పించాలి. ఇది కూడా మూడుసార్లు చేయాలి. దీనితో సుషుమ్న మార్గం కూడా శుభ్రపరచబడుతుంది. ఇడా, పింగళ, సుషుమ్న 3+3+3. ఇదంతా కలిపి ఒక్క ప్రాణాయామం క్రింద లెక్క. దీన్ని నాడీ శోధనా ప్రాణాయామం అనికూడా అంటారు. దీనివల్ల ఈ మూడుమార్గాల్లో ఉన్న అనేక వికారాలు, మాలిన్యాలు తొలగింపబడతాయి. ఇలాంటి ప్రాణాయామాలు రోజు రోజుకి నిదానంగా పెంచుకుంటూ పోవాలి. ఎంత ఎక్కువ వీలయితే అంత ఎక్కువగా చేసుకోవచ్చు. చేయడం అయిపోయాక శవాసనంలో పడుకోవటం వల్ల మంచి ప్రయోజనాలు కనిపిస్తాయి.

మనం చూపించే పిసరంత సాహసమైనా టన్నులకొద్దీ అదృష్టాని కంటే గొప్పదన్నారు. మన సాధనా జగత్తులో మనం కాస్త సాహసం చూపించాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో ప్రతి చోటా ఈ విద్యకు సంబంధించిన పుస్తకాలే ప్రచారం పొందుతాయి. ప్రతీ స్కూల్లో ఈ విద్యకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈ అమోఘప్రద సాధనలు చేసే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతుందన్నారు. మరి అలాంటి సాహసాన్ని మనం ఇవాళ చూపించగలిగితే కేవలం కొద్ది నెలల్లోనే ఇంకా చెప్పాలంటే తీవ్రమైన సాధనలతో కేవలం కొద్ది వారాల్లోనే మనం మన సాధనల్లో సఫలీకృతమైనట్లు, ముమ్ముందుకు వెళుతున్నట్లు తెలిపే అనుభూతులు చాలా స్పష్టంగా ఎదురౌతాయి. 'మహాశూన్యోపాసన' 'సాయికి నీవు శిష్యుడివా ? భక్తుడివా ?' వంటి పుస్తకాల్లో ప్రస్తావించబడిన అమూల్యాంశాల్ని వంటబట్టించుకొని తరచూ వాటిని నెమరు వేసుకుంటూ జీవితాల్లోకి ఆ అమృతసారాన్ని

దింపుకో గలిగితే అంతకు మించిన అదృష్టము లేదు. మొట్టమొదటగా ఏదో తెలీని ఆనందము, శాంతి కలుగుతాయి. ఎప్పటి నించో కనబడక వెదకాలనుకున్న వస్తువు లేదా మనిషో వెదక్కుండానే ఎదురవడం జరుగుతుంది. ఎవరికోసమైతే కలుద్దామని మనం బయలుదేరామో వారే ఎదురుపడతారు. ఊరు, పేరు తెలీని అపరిచితవ్యక్తులు మనకు సహాయాన్నీ, సహకారాన్నీ అందించేందుకు ముందుకొస్తారు. మళయాళ స్వామి వారికి వేళకి ఎలాగైతే భోజనం రప్పించబడిందో అలాగే ఏ వేళకి మనకు ఏది అవసరమో ఆయా సమయాలకు మనకవసరమైనవి మన దగ్గరకే వస్తాయి. ఇవి కేవలం ప్రాథమికంగా మనక్కనబడే చమత్కారాలైనా మన సాధనా తీవ్రత పెరిగే కొద్దీ పెద్ద పెద్ద లాభాల్నీ, పరమానందకర సంఘటనల్నీ, మహాశ్చర్యకర విశేషాల్ని మనం అనుభూతి చెందుతాము.

ఇలాంటి సాధనలతో సఫలీకృతం కావడానికి పూర్వజన్మసుకృతం అవసరమవుతుంది. కనీసం మన కుసంస్కారాలు సరిచేయబడాలి. పూర్వ జన్మ వాసనల ప్రభావం అంత తేలికగా వదలదు. మనలో వాటి తాలూకు పెద్ద పెద్ద మచ్చలు పడుంటాయి. ఇవన్నీ మన శరీరం మీద అచ్చులు పడి ఈ శరీరం పోయాక మళ్ళీ వచ్చే శరీరం మీద అలాగే అదేచోట మళ్ళీ అదే మచ్చ ఏర్పడుతుంది. మళ్ళీ ఆ మచ్చ ప్రభావం వల్ల ఈ శరీరంలోనే కాదు రాబోయే ఆ శరీరంలో కూడా ఇవే సంస్కారాలుగా వెంటబడుతుంటాయి. కర్ణుడు సహజ కవచ కుండలాలతో పుట్టినట్లు తిరిగి తిరిగి మనం అవే సంస్కారాలతో వుడుతుంటాము. నిజానికవి మన మననుకు అంటుకున్న సంస్కారాలు. అల్లోపతి శాస్త్రమైతే భౌతికంగా ఏదైనా ప్రాణాపాయ, విపత్కర పరిస్థితినించి ఉపశమనం కలిగించగలదు. అదే హోమియో అయితే లోపలున్న వ్యాధిని శారీరక, మానసిక, బుద్ధిమయ ఆవరణ వరకూ చొచ్చుకొనిపోయి సంపూర్ణ నివారణ చేయగలదు. అదే ఆయుర్వేద శాస్త్రమైతే అసలు రోగాలు రానివ్వకుండా ఉండాలంటే మనకు మనమే ఎలా కాపాడుకోవాలి ? అనే టెక్నిక్‌లు తెలియ



జేస్తుంది. వైద్యపరంగా దీన్ని దాటి ఇంకే శాస్త్రమూ లేదు. అదే యోగ శాస్త్రమైతే వీటన్నిటినీ మించి ఎంతో లోతుకుపోయి మన మూల మూలల్లో ఉన్న అనేక కుసంస్కారాల్ని అవలీలగా అప్పటి కప్పుడు అక్కడికక్కడే భస్మం చేసేయగలదు. అందుకే మనం ఈ యోగ శాస్త్రానికి సంబంధించిన అమృతత్వ విద్య పట్ల ఆసక్తి చూపాలి. గురువుల అనుగ్రహంతో శ్రద్ధగా పట్టుదలగా దానికి సంబంధించిన సాధన చేస్తూ ఆ సాధనల్ని మన జీవితంలో ఓ ప్రధానాంశంగా మార్చేసుకోవాలి. పండిత శ్రీ శ్రీరామశర్మ ఆచార్య పగలంతా ఆరాధన-రాత్రి సాధన చేసుకునేవారు. అలాంటి మహావ్యక్తి భగవాన్ శ్రీమారెళ్ళ వారికి "రామకృష్ణా ! నీవు రోజుకి 24 గంటలు సాధన చేస్తే చాలు" అనేవారు. దాన్ని తు.చ తప్పకుండా పాటించిన ఆ సద్గురు నాధుడు మన కందించిన అమూల్యమైన దివ్య సందేశాన్ని అందుకున్న మనం కూడా 24 గంటలూ మనం తీసుకుంటోన్న శ్వాసను ఆజ్ఞాచక్రంలోని ఆ సద్గురుని పాదపద్మాలకు సేవచేసేందుకే వినియోగిద్దాం. తరిద్దాం.

అఖండమైన ఆ శ్రీగురునిశక్తి అన్నిచోట్లా అలా అనంతంగా వ్యాపించిపోయి ఉన్నది. అయితే ఆ శక్తిని మనం గుర్తించలేకుండా వున్నాము. కనీసపు జ్ఞానంతో కళ్ళుమూసుకొని మౌనంగా కూర్చోగలిగితే క్రమక్రమంగా అనుభూతి కొస్తుంది. జాయింట్ల దగ్గర వదలుగా వుంటే కరెంటు ప్రవహించలేదు కదా ! ఇదీ అంతే. బిర్ర బిగుసుకుని కూర్చోగలగాలి. స్థిరంగా కూర్చొంటేచాలు. పద్మాసనం దానికి బాగా సహకరిస్తుంది. ఏదైతే పొందిన తర్వాత ఇక అంతకంటే గొప్పలాభం ఉండదో అంత లాభం పొందుతాము. లొంగిపోగలగాలి. ఆ సర్వ వ్యాపకమైనటువంటి, సర్వసమర్థత కలిగినటువంటి ఆ దివ్యశక్తికి లొంగి పోదాం. అనంతమైన లాభలనిచ్చే ఈ సాధన మొదట్లో కాస్త కష్టమనిపించినా ఓర్పుగా సహిద్దాం.

పృథ్విపై స్వర్గావతరణ
వేద సంస్కృతి పునర్జాగరణ
శాంతి, సుఖము, సంపద అందరికీ

ఈ మూడింటిని మనచే సాధింపచేయడానికి పరమ గురువులు, మహితాత్ములు, ఋషులు ఈ ఆహ్వానాన్నందిస్తున్నారు.

యో గి కు లం లో చే రం డి!

అంటూ తమ రహస్యాహ్వానాన్నందిస్తున్నారు. అంతేగాకుండా వారావేదనతో ప్రకటించిన మరో ముఖ్యాంశం ఏంటంటే ఇది మానవజాతికి చిట్టచివరి శంఖారావము. భూమి పుట్టిన తరువాత దివ్యాత్మలను, దయామయులను ఇంతగా కలవరపరచడం ఇదే ప్రప్రథమమన్నారు. ఈ మానవజాతి దుస్థితి వారిని ఎంతగా ఆవేదన పాలు చేసిందంటే ఇలాంటి వాతావరణము, పరిస్థితులు ఇకపై రాకూడదని వారి సంకల్పం. దాని కనుగుణ్యంగా మొదట భూమి మీద స్వర్గీయ వాతావరణాన్ని సృష్టించబోతున్నారు. అదీ మన చేతనే వారు చేయించబోతున్నారు. దేవతలు స్వర్గంలో ఉంటారు. భూమే స్వర్గంగా మారితే ఇక ఇక్కడ ఉండబోయేది మనుషులు కాదు అచ్చంగా దేవతలే. నేడు మనమెలా ఉన్నామంటే ఎవరో పైవారు స్వర్గాన్ని నిర్మించి ఇస్తే చప్పున దాన్ని పరమ నరకంగా మార్చివేయ గలము. సర్వజ్ఞులైన వారికి ఆ విషయం బాగా తెలుసు. మన శక్తి సామర్థ్యాల పట్ల వారికున్న భయమది. మన గొప్పదనం, మన క్షుద్ర మానసిక స్థితి క్షుణ్ణంగా తెలిసిన ఆ దివ్యాత్ములు ఈసారి మన స్వర్గాన్ని మన చేతనే నిర్మింపజేయబోతున్నారు. అంటే మనల్ని దేవతలుగా మార్చబోతున్నారు. అంటే అమరులుగా మనల్ని తీర్చిదిద్దబోతున్నారు. ప్రకృతికి అనుగుణ్యంగా జీవించే విధానాన్ని మనకు నేర్పబోతున్నారు. వేదాలంటే ప్రకృతి యొక్క నియమాలు తెలియజేసేవి. ఆ ప్రాకృతిక నియమాల్ని అవగాహన చేసుకోవడం 'వేద సంస్కృతి'. దానిని తిరిగి అందరికీ అందించ బోతున్నారన్నమాట.

ఆధ్యాత్మిక జీవితమే అసలైన జీవితము. Self Decipline అంటే ఆత్మ సంయమనము. పరమ పూజ్యులు, గురుదేవులు భగవాన్ శ్రీ మారెళ్ళ శ్రీరామకృష్ణులు సుమారు ఓపాతికళ్ళుగా విసుగూ విరామం లేకుండా, కొన్ని సందర్భాలలో ఎంతో ఆందోళనగా, ఎన్నోసార్లు తమ



అనారోగ్యాన్నీ లెక్క చేయకుండా మనకోసం ప్రసంగిస్తూ వచ్చిన అమృత తుల్య ప్రవచనాల్లోంచి అతి రహస్య ముఖ్యాంశాల్ని మరోసారి ఇక్కడ ప్రస్తావించుకొందాం. ఈ అమూల్యాంశాల్ని పరిశీలిస్తున్న మీ అందరి తరుపున కూడ ఆ దివ్యాత్ముడికి మా హృదయ పూర్వక పాదాభివందనాలతో ఇలా ముగింపుకు ప్రయత్నిస్తాము. ఇవన్నీ అత్యంత ప్రధానమైన సాధారణ రహస్యాలుగా తీసుకొని ప్రతి వొక్కరు ఈ రహస్యసాధనల్ని తాను జీవితములో ముఖ్యాంశాలుగా స్వీకరించ గలరని ఆశిస్తున్నాము. ఇవి ఆధ్యాత్మిక జీవనానికి ఎంతైనా అవసరం.

Panctuality. సూర్యోదయం ఈ రోజున 5 గం॥ల 48 ని॥లకు అని లెక్కేస్తాం. ఖచ్చితంగా అయన సరైన సమయానికి ఉదయిస్తాడు. అబ్రహంలింకన్ పాటించే సమయ పాలన గురించి చాలా గొప్పగా చెప్పుకుంటాం. అయన్ని చూసి వాచీలు సరిచూసుకోవలసి వచ్చేది. మన జీవితాల్లో విషాదానికి కారణం మన దృష్టికోణంలో ఉండే తప్పే. తప్పుడు లెక్కలేసుకొని నిర్భాగ్యంగా జీవించేందుకు ఆ భగవంతుడిని శక్తినిమ్మని అడుగుతుంటాం. మొండికేస్తుంటాం. ఉపవాసాలవీ చేస్తుంటాం. గుడ్డులోంచి గాడిదరాలేదని ఏడుస్తూ కూర్చుంటాం. ఇలాంటి మానసికస్థితిలో ఉన్నవాళ్ళు రాక్షసులుగా ట్రీట్ చేయబడతారు. ఇన్ని రహస్యాతి రహస్యాలు, గోప్యాతిగోప్యమైన సాధనలు ఇంతకు ముందు ఎన్నడూ ఎవరికీ ఇవ్వబడలేదు. పూజ్యశ్రీ మాష్టారు చెప్పినట్లు మనందరం ఓ విశేషమైన కారణం కోసం ఈ భూమ్మీద ఈ విశేషమైన సమయంలో అవతరించాం. కానీ ఆ విషయం మర్చిపోయాం మనం. ఈ మర్చిపోడమనేది మనకేగాదు మహా మహులైన ఎంతోమంది అవతార పురుషులు కూడా వారొందుకొచ్చిందీ మర్చిపోయి మామూలు మనుషుల్లానే కోరికల ప్రవాహంలో కొట్టుకుపోయిన సందర్భాలు లేకపోలేదు. అలాంటి పరిస్థితుల్లో వాళ్ళకు చెప్పవలసిన బాధ్యతున్న వారి గురువులు వాళ్ళనోసారి తట్టిలేపి పక్కకు లాగారు. ప్రస్తుతం మనపై బాధ్యతలున్న వాళ్ళుకూడా బహుశ అలాంటి ప్రయోగమే ఈ సందర్భంగా మనపై చేస్తున్నారేమో. మన అదృష్టం కొద్దీ మనల్ని తట్టిలేపి

కర్తవ్యబోధ జరిగాక కూడా ఇంకా మన జీవితాలు ఇదివరకటిలాగానే ఉండిపోకూడదు. మన జీవితాలల్లో మార్పురావాలి. అలా వచ్చిన మార్పులు స్థిరంగా ఉండాలి. మనలో పట్టుదల పెరగాలి. ఆర్తి రావాలి.

మనలో చాలా మంది ఆసనాలు అవీ వేస్తున్న వాళ్ళున్నారు. వాళ్ళు కూడా ఆత్మపరిశీలన చేసుకోవలసివుంది. ఆరునెలలు క్రమం తప్పకుండా ఆసనాలు వేసేవారికి ఆసన శుద్ధి కలుగుతుంది. ఆత్మిక ప్రగతి ఎంతో మెరుగుపడుతుంది. మరి అలా జరగలేదంటే కొన్ని సవరణలు చేసుకోవాల్సి ఉంది. **వాక్కు, ఆలోచనలు, ఆచరణ ఒకేలా ఉండాలి. అలా ఉన్న వాళ్ళకే ఆసనాలు ఫలిస్తాయి.** మనో వాక్కాయ కర్మలు - అంటే త్రికరణశుద్ధి ఉన్న వాళ్ళనే గురువులు స్వీకరిస్తారు. మూల భూతమైన ఈ ప్రధానాంశాన్ని అలక్ష్యం చేస్తే అమరత్వ విద్య కాదు కదా ఆధ్యాత్మి జగత్తుకే అలాంటి వారు అనర్హులని చెప్పారు. **ప్రాణాయామ సాధనలు కూడా వాక్కును ప్రధానంగా అదుపులో ఉంచుకున్న వాళ్ళకు సత్ఫలితాలిస్తాయి.** మహాభారతం మొత్తం ఈ వాక్ శక్తి మీదే ఆధారపడి జరిగింది. వాక్కు మనిషికివ్వబడిన అద్భుతవరం. దాన్ని దురుపయోగం చేసుకుంటే షుగర్ వ్యాధి రావడానికెన్నో అవకాశాలు ఉన్నాయి.ఈ వాక్కుతో ఇతరుల్ని, క్రిందివారినీ, మనకంటే బలహీనుల్నీ హింసించేందుకు ఉపయోగిస్తున్నందుకు ఈనాడు ఇన్ని రకాల ప్రమాదాలు (యాక్సిడెంట్స్) జరుగుతున్నాయి. ఉద్యోగాలు రాక పోవడానికీ, పెళ్ళిళ్ళు జరక్క పోవడానికీ యీ వాక్శక్తే కారణమవు తోందన్న సత్యాన్ని మనం ఎంత త్వరగా గ్రహిస్తామో అంతగా మనం అభివృద్ధిలోకి వస్తామన్నారు.

'సీక్రెట్‌డాక్ట్రిన్' 6th, 7th స్టాంజాల్లో రాబోయే తరము ఎలా ఉంటుందో వర్ణింపబడింది. 'సావిత్రి' అనే అరవిందుని రచనలోనూ కనిపిస్తుంది. బ్రహ్మపురాణంలో వ్యాసుడు కూడా పేర్కొన్నాడు. శ్రీ రామకృష్ణ పరమహంసా సూచించారు. అద్భుతమైన హస్తసా ముద్రికుడు, భవిష్యవేత్త అయిన 'కీరో' కూడా వ్యక్తపరిచాడు.



'తమాషా ఏమంటే నేడు మనమున్న ఈ వాతావరణము, ఇటు వంటి సంకట పరిస్థితులు అతి త్వరలో భూమి మీద స్వర్గావతరణ జరిపేందుకు కావలసిన పరిస్థితులే. నేడు రాబోయే మహత్తర మార్పుకు ఈనాడు ఇలాగే ఉండాలి. ఇలా ఉండకపోతే అసలా పరిస్థితులే రావు' అంటున్నారు. **అనేక రహస్యాల్లో ఇదో చిన్న రహస్యం.** ఋషుల యొక్క బృహత్ప్రణాళికలో ఇదీ భాగమే. ఓ అద్భుతమైన భవనాన్ని కొద్ది రోజుల్లో నిర్మించబోయేముందు, నిర్మిస్తున్నప్పుడు అక్కడంతా రాళ్ళు, రప్పలు, దుమ్ము, ధూళి పనివాళ్ళ కోలాహలం, గుంటలు, మెట్టలు తప్పవు. అలానే ఉంటుంది మరి. కొన్నాళ్ళు భరించాల్సిందే.

ప్రకృతి కనుగుణ్యంగా జీవించడమే ఆధ్యాత్మికత. Spiritualism is a science - వైజ్ఞానిక ఆధ్యాత్మికత ఇది. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ లేకుండా ఎలా అయితే రిజల్ట్స్ రావో ఆధ్యాత్మిక జగత్తులో కూడా ఆచరణ ఉండాలి. ఎక్సర్‌సైజెస్ ఉండాలి. అంటే సాధన ఉండాలి. దాదాపు అవన్నీ మానసికమైనవే. అంటే మన మానసిక స్థితికి సంబంధించినవి తప్ప వేషధారణ - అనుకరణ కాదు. మన మానసికస్థితి ప్రతి పనిలోనూ ప్రతిబింబిస్తూ అవి మనల్ని ఆధ్యాత్మికతవైపు నడిపించేలా ఉండాలి. గురుదేవులు తరచూ ఓ కథ చెప్తుంటారు.

ఓ చోట ఓ అద్భుతమైనటువంటి దేవాలయాన్ని కడుతున్నారు. అనేక మంది పనివాళ్ళు కోలాహలంగా పనిచేస్తున్నారక్కడ. ఆ హడా విడిలో మన దూరదర్శన్ వాళ్ళు కెమేరాలు గట్రా తీసుకొని అక్కడ పని చేస్తున్న కూలీలని ఇంటర్వ్యూ చేయడానికొచ్చారు. నాచురల్‌గా ఉంటుందనో ఏమో, పనివాళ్ళని రకరకాల ప్రశ్నలడుగుతూ సమాధానాల్ని రికార్డ్ చేస్తున్నారు. ఆ పనిలో భాగంగా అక్కడ ఏ సిమెంటు బస్తానో మోసుకుంటూ వెళ్తోన్న పనివాడి మూతికి తగిలేలా మైకు పెట్టి 'నువ్వేం చేస్తున్నావ'ని అడిగారు. హఠాత్తుగా ఉన్నట్టుండి ఈ మైకుతో ప్రత్యక్షమైన ఈ టివి వాడిని కోపంగా చూస్తూ 'కనిపించడంలా?' అన్నాడు కసురుకుంటూ.

అందుకు ఆ టివి అతను పెద్దగా పట్టించుకోకుండా అనునయంగా మాట్లాడుతూ 'అబ్బే .... కనిపించక కాదు ! మీరంతా ఇలా ఈ కట్టుబడి కోసం ఇంతలా కష్టపడుతున్నారు కదా అందుకని అడుగుతున్నానన్న మాట. పని చేస్తూ నువ్వేమనుకుంటున్నావ్ ? రెండు మాటల్లో చెప్పు' అన్నాడు. అందుకీ కూలివాడు 'నా ఖర్మ కాలి ఈ పనిచేస్తున్నా. అసలు భారత దేశంలో పుట్టడమే దరిద్రం. ఏం చేస్తాం ? ఇంటి దగ్గర పెళ్ళాం, పిల్లలు తిండి లేక ఛస్తారని ఇదిగో ఇలా కూలి చేస్తున్నా' అన్నాడు. అందుకు టీవీ వాడు 'ఓహో అలాగా ! అయితే నువు కానీ' అంటూ చేతిలో మైకుతో అక్కడి నుంచి ఒక్క గెంతు గెంతి ఇంకో పనివాడి దగ్గరకెళ్ళాడు. రాళ్ళు కొడుతున్నా డతను. అతన్ని కూడా 'నువ్వు ఇలా ఎండలో నిలబడి పనిచేస్తున్నావు కదా ఈ గుడి కోసం. పనిచేస్తున్నప్పుడు నువ్వేమనుకుంటున్నావు ?' అంటూ మైకుని అతని మొహానికి దగ్గరగా జరిపాడు. అందుకతను చేస్తున్న పని ఆపి అతను తొడుక్కున్న బనీనుతో మొహాన పట్టిన చెమట తుడుచుకుంటూ 'నేను గ్రాడ్యుయేట్‌ని. దాంతో నాకు ఉద్యోగం రాలేదు. ఎకనమికల్ బ్యాక్‌గ్రౌండ్ లేదు. ఎలాగైనా నా కాళ్ళమీద నేను నిలబడాలని ఇదిగో ఇలా రాళ్ళు కొడుతున్నా' నన్నాడు. దానికి టీవీ వాడు తల పంకిస్తూ 'ఓ ఐసీ' అంటూ పక్కనే ఉన్న మరో కూలీని కూడా అదే ప్రశ్న వేశాడు.

అందుకతను బొటబొటా కన్నీళ్ళు కార్చాడు. మధ్యలో వెక్కిళ్ళొస్తున్నా కూడా ఆపుకునే ప్రయత్న మేమీ చేయలేదతడు. టీవీ వాడు కంగారు పడ్డాడు. 'అయామ్ సారీ అయామ్‌సారీ' అంటున్నా వినిపించుకోలేదతను. ఏడుస్తూనే ఉన్నాడు. అయోమయమైంది టీవీ వాడికి. బిత్తరపోయి చుట్టూ చూశాడు. ఇక అక్కణ్ణుంచి జారుకుందా మనుకునేంతలో కూలివాడు టీవీ వాడి భుజం పట్టుకొని నిలిపి 'అదేం కాదు మీ తప్పేం లేదు. ఆనందమిది, ఆగకుండా వచ్చింది మీరు మరోలా అనుకోనుంటారు' అన్నాట్ట.

మరింతగా అయోమయంలో పడుతూ 'ఆనందమా ? ఎందుకు ?' అందుకతను సమాధానంగా మరి రెండు కన్నీటి బొట్లు టపటపా



రాల్చి కన్నీళ్ళు తుడుచుకోకుండా ఇక్కడ దేవాలయం కడుతున్నారు. దానికి బాట వేస్తున్నా నేను. రేపు ఎంతో మంది మహాత్ములు, భక్తులు ఈ బాట వెంట నడుస్తూనే గదా వెళ్ళాలి. ఏ జన్మలోనో నేను చేసుకున్న పుణ్యం వల్ల నేనీ రోజు ఈ పనికి నియమించబడ్డాను. ఎంత అదృష్ట వంతుడినో అననిపిస్తుంటుంది.' అన్నాడట కన్నీళ్ళు తుడుచుకుంటూ.

మనం చేస్తోన్న పని ఇష్టతతో, బాధ్యతతో చేయగలిగితే మంచి ఫలితాలు రావటమే కాదు. మరెన్నో లాభాలు వస్తాయని గుర్తుంచుకోవాలి.

**'ఉత్తిష్ఠిత జాగ్రత ప్రాప్యవరాన్ని బోధత క్షురస్య**
**ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్త తత్కవయెవదన్తి'**

కఠోపనిషత్‌లోని వాక్యమిది. "అయోమయం అజ్ఞానం అనే చీకటిలో నిద్రిస్తున్న సహోదరులారా లేవండి ! జాగ్రత్త పడండి ! శ్రీగురుని కటాక్షమునకై ప్రయత్నించండి ! ఆ పై మిక్కిలి లాభం పొందండి."

ఈ విశేష కాలాన్ని గురించి తెలుసుకున్న మనం పరమ గురువుల రహస్య ఆహ్వానాన్ని అందుకోవాలి. 'యోగి కులంలో చేరండి' అని ప్రాధేయ పడుతూ మనల్ని ఉద్దేశించి యిస్తోన్న ఈ ఆహ్వానం లోని ఆంతర్యాన్నీ, దయామయుల ఆత్రుతను అర్థం చేసుకోవాలి. దీనిపట్ల సరియైన అవగాహన లేకుండా ఈ అమృతమయ కాల ప్రవాహాన్ని ఇదివరకటిలా వృథా చేసుకుంటే మరి కోట్ల కోట్ల జన్మల వరకు ఇంతటి అపూర్వమైన మహదవకాశం పొందలేకపోవచ్చు. తీరా పై విషయాలు మనకి అవగాహనై కళ్ళు తెరచి నడుం బిగించి కదిలి వచ్చేసరికి ఈ అమోఘప్రద సువర్ణమయ శక్తిధారలనందించు ఋషుల ఆహ్వానపు ద్వారాలు మూసి వేయబడవచ్చు. తస్మాత్ జాగ్రత్త !

షిర్డీసాయిది ఒక యోగి కులము. సత్యసాయిది ఒక యోగి కులము. శ్రీరమణమహర్షి వారిది ఒక యోగి కులం. అరవిందో వారిది ఒక యోగి కులం. లాహిరీ వారిదొక యోగి కులం ఇలా ఉన్నాయనుకొన్నాం కదా ! మనం వెంటనే ఏదో ఒక సమూహంలో కలిసిపోవాలి. ఆలోచిస్తూ ఆలస్యం చేయడంగానీ, ఈ రహస్య ఆహ్వానాన్ని నిర్లక్ష్యం చేయడంగానీ తగదు. ప్రకృతి ఎప్పుడూ కూడ ఏదీ Warning (హెచ్చరిక) ఇవ్వకుండా

చేయదు. మనం మన జీవితాలలో శాంతి, సుఖము, సమృద్ధిపొందడమే కాదు. అమరులై ఈ భూమిపై చిరకాలం హాయిగా జీవించగలిగేట్లు చేయడానికి సన్నాహలు చేయబడుతున్నాయి. ఐనా ఇప్పుడు గురువులు 'మీ పూర్వపు జీవితము, తప్పొప్పులు, పాపపుణ్యాలు ఇవన్నీ మాకు అనవసరం. ఇప్పుడు నిన్ను ఈ విద్యలో నిష్ణాతుణ్ణి చేస్తాము. నీవు మేము చెప్పినట్లు చేస్తే' అంటున్నారు. ఇలాంటి పిలుపే మనపై దయతో గీతాచార్యుడు కూడా గతంలో ఓసారి ఇవ్వడం జరిగింది.

శ్లో॥ అపి చేత్సు దురాచారో భజతే మామనన్యభాక్
సాధు రేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః ॥

(భ.గీ.- 9వ అ. - 30వ శ్లో.)

'దురాచారుల్లో ఎక్స్‌పర్ట్ - సు దురాచారి. మిక్కిలి పెద్ద గొప్ప దురాచారి ఐన వాడైనా సరే. అనన్య చింతనలో స్థిర చిత్తుడైన వాణ్ణి నేను నా శిష్యుడిగా స్వీకరిస్తాను. అసలలాంటివాడిని కూడా యోగిగా, సాధువుగా అంగీకరిస్తాను'అన్నాడాయన. అంతేకాదు 'అలాంటివాడికి సైతం శీఘ్రంగా శాంతినిస్తాను. శాశ్వతమైన సుఖాన్ని ఇస్తూ ధర్మాత్ముడయ్యేలా చూసుకొంటాను' అని కూడ మాటిచ్చాడు ఆ జగద్గురువరేణ్యుడు. ఇంకా ఇలా అన్నాడు.

శ్లో॥ క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి
కౌంతేయ ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥

(భ.గీ.- 9వ అ. - 31వ శ్లో.)

శ్లో॥ మాం హి పార్థ ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః
స్త్రియో వైశ్యాస్తథా శూద్రా స్తేఽపి యాంతి పరాంగతిమ్ ॥

(భ.గీ.- 9వ అ. - 32వ శ్లో.)

'పాపపు పుటక పుట్టిన వారైనా, పాపాలెన్నెన్ని చేసివున్నప్పటికీ, వారు ఆడవారైనా, వైశ్యులైనా, శూద్రులైనా ఏ కులం వారైనా నన్ను శరణు వేడిన మరుక్షణం ఉత్తమ గతి పొందినట్లే' అని కూడా అన్నాడాయన మహాకాలుడైన జగద్గురు శ్రీకృష్ణస్వామి.



మన కామన్‌సెన్స్ (ఇంగిత జ్ఞానం) ని ఉపయోగించాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ మన పాండిత్యంతో పని లేదు. గతంలో మనం చేసిన సాధనల అనుభవాలు, వాటి ఫలితాలతో ప్రమేయం లేదు. వారి ఆహ్వానాన్ని అవగాహన చేసుకొని వారి వైపు అడుగులు వేయాలని మనసులో బలమైన కోరిక కలగడమే అందుకు సంపూర్ణ అర్హత. అంతకు మించి మరిలాంటి అర్హతలు, నిబంధనలు షరతులు లేవన్నారు. ఇక మనదే ఆలస్యం. (మనపై గల అనంత ప్రేమను శ్రీగురుదేవులు ఈ పుస్తకానికి 'ముందుమాట' గా వ్రాస్తూ వ్యక్తపరిచారు. దాన్ని ప్రతివొకరూ కాస్త జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉన్నది.)

మాతృమూర్తి-శ్రీ లలితా పరమేశ్వరి అవతారమూర్తి అయిన జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకు ఎంతో మంది దర్శనార్థం వచ్చేవారు. వాళ్ళలో దూర తీరాలనుంచి వచ్చేవారు, విదేశాలనుంచి వచ్చేవారు ఉండేవారు. రకరకాల దేశాలనుంచి అమ్మ దర్శనార్థం జిల్లెళ్ళమూడి వచ్చి తిరిగి వెళ్తూ కడసారిగా అమ్మ దగ్గరకు వెళ్ళి ఒకసారి కనిపించి వెళ్ళొస్తామని చెప్పి తిరిగి ప్రయాణమౌతుంటారు చాలామంది. అలాగే ఓసారి ఓ విదేశీ కుటుంబం కూడా అమ్మ దర్శనార్థం వచ్చి 4 రోజులు ఉండి, తిరిగి వెళ్తూ అమ్మ దగ్గరకు వచ్చి వారి భాషలో అమ్మతో ఏదేదో మాట్లాడారు. వారి సమస్యలు, సందేహాలు అమ్మ దగ్గర వెళ్ళబోసుకున్నారు. వాటికి అమ్మ చక్కటి పరిష్కారాలని, నివారణోపాయాలని కూడా సూచించినట్టున్నారు. ఆ విదేశీ కుటుంబం తృప్తిగా అమ్మ పాదాలకు నమస్కరించుకొని వెళ్ళొస్తామని సంతోషంగా చెప్తూ వెనుదిరిగి పోయారట. అలా పోతూపోతూ వారు అక్కడున్న అన్నయ్యగారితో "అమ్మ మాతో మాట్లాడినంతగా మీతోనూ ఇలానే మాట్లాడుతుందా ?" అంటూ ఆనందంతో అన్నయ్యగారితో ఏదో చెప్పి వెళ్ళిపోయారు వాళ్ళు. ఏ మూడో తరగతిలోనో చదువు మానేసిన అమ్మకు తెలుగు తప్ప మరో భాష తెలియదు అనుకుంటాం. కానీ తల్లి బిడ్డ భాష కన్న భావాన్నే గ్రహిస్తుంది. విదేశీయులతోనూ సంభాషించే అమ్మకు భాషలు తెలియక్కర్లేదు.

ఓ సందర్భంలో మాష్టారు ఇలా అన్నారు "మనలోని భావాన్ని తెలిపేందుకే ఈ భాష. ఇక్కడ భాష ప్రధానం కాదు. అది ఏదైనా కావచ్చు. అవతల వాళ్ళకు మనం చెప్పదలచుకున్నది అర్థమయ్యేట్లు చెప్పడం ప్రధానం" అన్నారు.

బజారులో మనం కొన్ని చోట్ల మనం చూస్తుంటాం "ఇక్కడ పప్పు రుబ్బబడును" అని రాయడానికి బదులు 'రుబ్బింగ్ వేయబడును' అని బోర్డు పెడుతుంటారు ఇంగ్లీషు కాస్త తెలుగు కాస్త కలిపి.

"అబ్బే ఇక్కడ ఇంగ్లీషులో పప్పు రుబ్బుతారేమో పాడు" అనుకుంటున్నామా ? లక్షణంగా పప్పు రుబ్బించుకుంటాం గదా ? అలాగే ఇదీనూ.

మాకు ఆట్టే రచనలు చేసే అనుభవం గానీ, మంచి పాండిత్యాన్ని చూపే నేర్పుగానీ బొత్తిగా లేవు. అయినా మేము చేస్తోన్న ఈ సాహసం ఎవరికైనా ఇబ్బంది పెట్టి ఉండిఉండవచ్చు. సకల సమర్థ సద్గురువుల ఆవేదనా పూర్వకమైన సందేశాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నాం తప్ప మేము ఉద్దేశ పూర్వకంగా ఎవరినీ కూడా కించ పరచాలనో, అవమానించాలనో రాసినవి కావు. అలా ఎవరికైనా అనిపించి ఉంటే మేము అలా ఉద్దేశపూర్వకంగా, చులకన భావంతో ఎవరినీ కూడా తూలనాడే ప్రయత్నం చేయలేదని, అలా చేయబోమని సవినయంగా, హృదయపూర్వకంగా యావన్మందికీ విన్నవించుకుంటున్నాం. ఋషి వచనాలకు అక్షరరూపం తెచ్చే ప్రయత్నమిది. సహృదయతతో దీన్ని అర్థం చేసుకుంటారన్ని ధైర్యంతో ఇలా సాహసించాం. సకల సమర్థ సద్గురువుల రహస్య ఆహ్వానానికి తోటి వారిని స్పందింప జేయడం కోసం పడుతోన్న మా తపన పెద్ద మనసుతో స్వీకరించి మీ అమూల్యమైన అభిప్రాయాలను, సూచనలను మాకు తెలియజేయండి ! అప్పుడు మాత్రమే మా ప్రయత్నం సఫలమైనట్లుగా మేము భావిస్తాం.

ఈ పుస్తకానికి ముగింపుగా భగవాన్ శ్రీ మారెళ్ళ తమ అమృతోపన్యాసాల ద్వారా ఓ సందర్భంలో అందించిన ఓ అద్వితీయ



రహస్య సాధనను ఓసారి పరిశీలిద్దాం. The Book of Dzyan (ది బుక్ ఆఫ్ ధ్యాన్) అనే పుస్తకాన్ని వ్రాస్తూ సద్గురుమూర్తి మేడమ్ బ్లావెట్స్కీ తను వ్రాస్తోన్న పుస్తకానికి రిఫరెన్స్ కావాల్సివచ్చి హిమాలయ గుహలలో ఓ చోట ఉన్న ఓ తాటాకు గ్రంథాన్ని తీసుకొందట. ఆ తాటాకులు నిప్పుల్లో కాలవు. నీటిలో తడవవు. పెద్దపెట్టున వీచే తుఫాను గాలైనా వాటిని కదిలించనైనా లేదు. అలాంటి వాటిపై వ్రాయబడిన రహస్యాంశాల్ని పొందుపరుస్తూ తయారుచేసిందావిడ. ఆ పుస్తకాన్ని. చాలా అద్భుతమైన పుస్తకమది. మామూలుగా చదివితే అర్థమవదది. ఓ ప్రత్యేకమైన మానసికస్థితిలో ఉండి చదివితే సులభంగా అర్థమౌతుంది అంటూ ఆవిడ ఆ మానసికస్థితి గురించి సుమారు 170 పేజీల కామెంట్రీ వ్రాసిందావిడ.

మంచి నిద్రలో ఉన్నాము. తెల్లారింది. నిద్ర అయిపోవస్తోంది. ఇంక లేవబోతున్నాము. అప్పుడు ఎలాంటి మానసిక స్థితిలో ఉంటామో దాన్ని నేర్చుకోవాలి మనం. ధ్యానము అనే పేరుతో మనం ఉత్తినే కాలాన్ని వృధా చేసేసుకోకూడదు.

ఆ స్థితిని తేలిగ్గా పట్టుకోవాలంటే ఏదైనా ఓ మంత్రజపాన్ని ఆశ్రయించాల్సిందేనన్నారు. నిద్ర లేవబోయే ముందున్న ఆ మానసిక స్థితి గురించి వివరిస్తూ శ్రీ మాష్టారు అసలు ఆధ్యాత్మిక జీవనం అక్కణ్ణించే మొదలయ్యేది అన్నారు. కాబట్టి ధ్యానం పేరుతో మనం చేసే ప్రయత్నం ఆ స్థితిని అందుకోవడం కోసమే అనే లక్ష్యాన్ని మర్చిపోకూడదు. అందుకోసం మనం పరిపరి విధాల ప్రయత్నిస్తూ ఉండాలి. అలా ప్రయత్నించగా ప్రయత్నించగా ఎప్పుడో ఒక్కసారి ఠక్కున దొరికిపోతుందది. ఆ స్థితిలో అనంతమైన ఆనందాన్ని పొందుతాము. ఇంతకంటే మెరుగైన లాభం మరోటి ఉంటుందా ? అనిపించక మానదు. ఆ స్థితిలో మన శారీరక, మానసిక బాధలు, కష్టాలు, దుఃఖాలకు తావుండనే ఉండదు. భగవాన్ శ్రీ రమణమహర్షి తన చేతికి వచ్చిన కాన్సర్ పుండును ఎలాంటి మత్తుమందు (ఎనస్తీషియా)

లేకుండా ఏకంగా ఆపరేషన్ చేయించేసుకున్నారాయన. ఓ అత్యద్భుతమైన స్థితి అది. గౌతమబుద్ధుడు కూడా దాన్నే నేర్పారు. మనకందరికీ కూడా అనుభవంలో ఉన్న ఓ విషయమేమంటే మనం ఎంత బాధలో ఉన్నా, కష్టంలోఉన్నా నిద్రపోతున్నప్పుడు మనకు తెలీదు. అయితే ఇది పూర్తిగా నిద్రాస్థితీకాదు. పూర్తిగా మెలకువగా ఉన్న స్థితీ కాదు. ఆ మధ్యస్థ స్థితిలో ఉంటూ మనం అన్ని పనులూ నిరభ్యంతరంగా చేసుకోవచ్చునన్నారు.

శ్వాసమహావిజ్ఞాన్ అనే పేరున దివ్యాత్మలు మనకనుగ్రహిస్తోన్నది ప్రధానంగా అదే. అనాపానసతి పేరున బుద్ధుడు కూడా ఈ స్థితిలోకే మనల్ని ప్రవేశింపచేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రింద వివరిస్తోన్న రహస్యాంశాల్ని జాగ్రత్తగా అవగాహన చేసుకోవాల్సి ఉన్నది.

మేడమ్ బ్లావెట్స్కీ సూచించిన రహస్యమేమంటే మనం పీల్చుకున్న శ్వాస మనలోకి ప్రవేశించాక మూడు రకాలుగా మారుతోంది.

**శ్వాస మనలోకి ప్రవేశించగానే మనసుగా మారుతోంది.**

**ఆ మనసే కాలముగా మారుతోంది.**

**ఆ కాలమే వాక్కుగా మారుతోంది.**

మనం ఈ పై సూత్రాన్ని గుర్తుంచుకొని తెలివిగా మన శ్వాసను పయోగించుకుంటుండాలి.

మెలకువగా ఉన్న మనం ఉన్నట్టుండి చటుక్కున నిద్రలోకి జారతాం. మనం గనక కాస్త ఎవేర్‌నెస్‌తో ఉండి మెలకువకు - నిద్రకు మధ్య బిందువును పట్టుకోగలిగితే సరే. లేదా నిద్రాస్థితి నుంచి మెలకువలోకొచ్చే ఆ బిందువునైనా పట్టుకోగలగాలి. దీనికో అద్భుతమైన ట్రిక్ చెప్తున్నారు. టేప్‌రికార్డర్‌లో క్యాసెట్‌ని రివైండింగ్ చేస్తాం గదా ! అలా రోజూ నిద్రకు ఉపక్రమించే ముందు ఆ రోజు జరిగినదంతా ఒక్కొటి గబగబా రివైండ్ చేసుకోవాలి. అంటే వెనక్కి, వెనక్కి ఆలోచించుకుంటూ పోవాలి. పోయి, పోయి అలాగ ఆ రోజు ఉదయం మనం నిద్దర లేచినప్పటి స్థితి వరకు పోవాలి. ప్రతిరోజూ



ఇలా సాధన చేసుకొంటుంటే ఇంతకుముందు మనమనుకున్నట్టు నిద్రాస్థితికి, మెళుకువకు, మధ్యనున్న స్థితిని-మెళుకువకు నిద్రాస్థితికి మధ్యనున్న బిందువును పట్టుకోగలుగుతాము. పూర్వజన్మ స్మృతులు, పునర్జన్మ విశేషాలు మొదలైనవి మనకాస్థితిలో సులభంగా గోచరిస్తాయి.

సాధారణంగా మనం పెద్దగా పట్టించుకోని ఓ విశేషాన్ని గురించి చెపుతూ గురుదేవులు ఇలా అన్నారు. 'ఏ అగ్ని ప్రమాదంలోనో లేక వరదనీటిలో కొట్టుకుపోతూనో ఆఖరి క్షణంలో ఎవరైనా అతణ్ణి ఆదుకొని రక్షిస్తే బ్రతికి బైటపడతారు. అలా ప్రమాదపుటంచుల నుంచి బైటపడ్డ వారిని ఆ క్షణంలో వారికగుపించిన దృశ్యాలను అడిగి తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. వారు నీటిలో మునిగిపోబోతోన్న క్షణంలో సినిమా రీళ్ళలా అనేక దృశ్యాలు, సంఘటనలు గోచరిస్తాయి. ఐతే అవి ఆ క్షణంనుంచి వెనక్కి వెనక్కి రివైండ్ చేయబడుతోన్న తన జీవిత సంఘటనలేనని వారాక్షణంలో గుర్తించరు గానీ వారి జీవితంలో వారికెదురైన అనేక మలుపులు, సంఘటనలు వారి స్మృతి పథంలో రీవైండింగ్ రీళ్ళలా కదులుతూ ఆ జన్మలో తను జన్మించిన క్షణం వరకు అంటే ఈ భూమ్మీద పడ్డప్పటి వరకు చకచక గుర్తొచ్చేస్తాయి వారికి. అంటే మనిషి చచ్చిపోయేటప్పుడు అతని జీవితం మొత్తం ఫ్లాష్ బాక్‌గా ఫాస్ట్ రివైండింగ్‌లో తెలిసిపోతుంది.

**సీక్రెట్ డాక్ట్రిన్‌లో మేడమ్ ఏం చెప్తారంటే 'నీ శ్వాసలు మార్చుకుంటే నీ జీవితం మొత్తం మారిపోతుంది. ప్రస్తుతం నీవు నిమిషానికి ఏ 16 సార్లో 18 సార్లో శ్వాసిస్తున్నావనుకో. దానిని మార్చుకోగలిగితే అంటే తగ్గించుకో గలిగితే నీ జాతకమే మారిపోతుంది'** అన్నారు. మెళకువగానున్న మనం నిద్రలోకి జారిపోగానే శ్వాసలో ఓ చిన్న జర్క్‌లాంటి గ్రిప్ ఇస్తుంది. దాన్ని మనం పట్టుకోగలగాలి. దానికీ సాధన బాగా ఉపకరిస్తుంది.

రాత్రి పడుకోబోతూ కాళ్ళు శుభ్రంగా కడుక్కొని, పొడిగా, తుడుచుకొని, పక్కమీద పడుకొని ఆలోచనలని రీవైండ్ చేసుకోవాలి.

క్రమక్రమంగా వెనక్కి మళ్ళించాలి. మొట్టమొదట

- ★ పడుకొనే ముందు బాత్రూంలో కాళ్లు కడుక్కున్నాం.
- ★ దానికి ముందు అప్పటివరకు చదివిన పుస్తకాన్ని పక్కన పెట్టాం.
- ★ దానికి ముందు టి.వి. ఆపెయ్యమని పిల్లలకి చెప్పాం.వాళ్లు సరే ఆపుతామనలేదు.
- ★ వాళ్ళని కోప్పడ్డాం.
- ★ మజ్జిగన్నంతో మామిడిపండు తిన్నాం. అలా తినకూడదని ఎవరో చెప్పారు.
- ★ దానికిముందు బాబా గుడికెళ్ళాం.
- ★ దానికిముందు స్నానం చేశాం.
- ★ దానికిముందు ఆఫీస్ నుంచి వచ్చాం.

ఇలా వెనక్కి వెళుతూ, వెళుతూ గబగబా, వేగంగా ఎంత వరకు దీన్ని తీసుకెళ్ళాలంటే ఉదయం నిద్రలేచేవరకు తీసికెళ్ళాలి. ఆ తర్వాత అలా శ్వాసను గమనిస్తూ ఉండిపోవాలి నిద్దర్లొకెళ్ళేవరకు. ఇలా గనక కొద్దినెలలు చేయగలిగితే జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. అందులో ఏ మాత్రం సందేహం లేదన్నారు.

పై సాధనతో పాటు ఈ క్రియాయోగాన్ని కూడా శ్రద్ధతో ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేయాలి. దీనివల్ల మనం చెప్పుకోదగ్గ అత్యద్భుత మార్పులు కేవలం కొద్ది వారాల్లోనే పొందగలం. ఇది మా స్వ అనుభవం కూడా. మీరూ ప్రయత్నించండి !

'సమంకాయ శిరోగ్రీవం' సూత్రం ఆధారంగా నిటారుగా కూర్చుని మొట్టమొదట మూలాధారంలో ఉన్న ఎరుపు వర్ణాన్ని ధ్యానిస్తూ లోతుగా శ్వాస తీసుకోవాలి. దీర్ఘంగా, నెమ్మదిగా అలా తీసుకున్న శ్వాసను పూర్తిగా బయటికి వదిలేయాలి. అలా నాలుగు సార్లు చేయాలి. మూలాధారము ఎరుపు రంగులో ఉంటుంది. మంచి దట్టమైన ఎరుపురంగును భావన చేస్తూ సూర్యుణ్ణించి వస్తోన్న ఆ ఎరుపు రంగు కిరణాలు మన శ్వాసతో పాటు నాశికా రంధ్రాల ద్వారా లోపలికి వెళుతున్నట్లు భావన చేయాలి. స్వాధిష్ఠాన చక్రానికి సంబంధించిన



ఆరు దళాలు కాషాయ వర్ణానికి సంబంధించిన సూర్యుణ్ణించి వస్తోన్న ఆ ఆరెంజ్ వర్ణపు కిరణాలు మన శ్వాస ద్వారా లోపలికెళుతున్నట్లు భావన చేస్తూ ఆరు సార్లు శ్వాస తీసుకుంటూ తీసుకున్నదంతా వదిలేయాలి. ఇక్కడ కూడా ఇందాకటిలా దీర్ఘంగా, లోతుగా శ్వాస తీసుకుంటుండాలి. ఆ తరువాత మణిపూరక చక్రంలో కూడా ఇలాగే పదిసార్లు దీర్ఘంగా, లోతుగా శ్వాస తీసుకుని సాంతం బయటికి వదిలేయాలి. ఈ పది సార్ల శ్వాసతో పాటు సూర్యుణ్ణించి వస్తోన్న పసుపురంగు కిరణాలు మనలోకి వెళుతున్నట్లు భావన చేయాలి. ఆ తరువాత ఆకుపచ్చ వర్ణం గల సూర్య కిరణాలు మన శ్వాసతో పాటు లోనికి ప్రవేశించి మన హృదయ స్థానంలోని అనాహత చక్రానికి చేరి దాని 12 దళాలను స్పర్శిస్తున్నట్లు భావన చేస్తూ 12 సార్లు దీర్ఘంగా శ్వాస తీసుకొని వదిలేయాలి. అలా శ్వాసను ప్రతిసారి పూర్తిగా బయటకు నెట్టేస్తుండాలి. ఆ తరువాత శ్వాసను లోతుగా తీసుకుంటూ మన కంఠస్థానంలోని విశుద్ధి చక్రంలోని 16 దళాలను నీలిరంగు గల ఈ శ్వాస ఆక్రమిస్తోన్నట్లు, శుభ్రపరుస్తోన్నట్లు భావన చేస్తూ 16 సార్లు లోతుగా, నిదానంగా శ్వాస తీసుకొని వదిలేయాలి. ఆ తరువాత కనుబొమల మధ్యనున్న ఆజ్ఞాచక్రానికి రెండు సార్లు ఊదారంగు కలిగిన దీర్ఘ శ్వాసలను చేరవేయాలి. అలా రెండుసార్లు పూర్తయ్యాక ఓసారి గురు నామాన్ని ఉచ్ఛరించాలి.

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః ॥

గురుప్రార్థనయ్యాక శ్వాస సాధనతో సాగి కిందకి ప్రయాణించాలి. మొట్టమొదట ఆజ్ఞాచక్రంలో ఇందాకట్లానే ఊదారంగును భావన చేస్తూ రెండు సార్లు దీర్ఘ శ్వాసను తీసుకోవాలి. ఆ తరువాత విశుద్ధిచక్రం దగ్గర నీలిరంగు కిరణాల్ని భావన చేస్తూ శ్వాసతో పాటు నీలిరంగు శక్తిధారలు మనలోకి ప్రవేశిస్తున్నట్లు భావన చేసుకోవాలి. ఇలా 16 సార్లు లోతుగా శ్వాస తీసుకొని, తీసుకున్న శ్వాసంతా వదులుతూ ఉండాలి. అదే విధంగా అనాహతానికి సంబంధించిన ఆకుపచ్చ వర్ణాన్ని భావన చేస్తూ 12 సార్లు దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి. ప్రతిసారీ తీసుకున్న శ్వాసంతా ఏ మాత్రం లోపల ఉంచుకోకుండా వదిలేస్తుండటం మర్చి

పోకూడదు. ఆ తరువాత మణిపురానికి సంబంధించిన పసుపువర్ణాన్ని భావనచేస్తూ 10 సార్లు లోతుగా శ్వాస తీసుకోవాలి. ఆ తరువాత స్వాధిష్ఠాన చక్రం వద్ద మనసునుంచుకోవాలి. ఇక్కడ కూడా 6 సార్లు లోతుగా శ్వాస తీసుకోవాలి. కాషాయ రంగు శక్తిధారలు శక్తి ద్వారా మనలోకి ప్రవేశిస్తున్నట్లు భావన చేసుకోవాలి. ఆపై మూలాధారానికి రావాలి. ఎరుపురంగు గల శ్వాసను నాలుగు సార్లు దీర్ఘంగా లోనికి తీసుకుని అలా తీసుకున్న శ్వాసంతా బయటికి వదిలివేయాలి. దీంతో మొత్తం 100 శ్వాసలయ్యాయి.

ఇలా ఒకసారి మూలాధారం నుంచి ఆజ్ఞా చక్రానికి, తిరిగి అక్కడి నుంచి మూలాధారానికి రావడం అనే ఓ (Circle) చక్రంతో సాధనా పరంగా 100 శ్వాసలు పూర్తిచేసుకున్నాం. దీని ఫలితంగా ఓ సంవత్సర కాలంలో పరిణామక్రమ చక్రంలో ఎంతదూరం మనం ప్రయాణించ గలమో, అంత మొత్తాన్ని ఈ ఒక్క 100 శ్వాసలతోనే సంపాదించు కోగలం. దీని పట్ల మనకి విశ్వాసమున్నా లేకపోయినా పర్వాలేదు. లాహిరీ మహాశయుని అనుగ్రహ ఆశీస్సుల వల్ల ఎంతో ఎత్తుకు ఎదగగలం.

మరో విషయాన్ని కాస్త మనం గుర్తు చేసుకుంటే సుమారో ఓ 10, 15 సంవత్సరాల క్రితం పేపర్లలో, పత్రికల్లో, రేడియోలో ఓ సంచల నాత్మకమైన వార్త మనల్ని తీవ్రంగా ఖంగారు పెట్టింది. 'స్కైలాబ్ శాస్త్రజ్ఞుల పరిశోధనలు ఫలవంతం కాకపోవడం, రాష్ట్రంలో ఎక్కడైనా కొన్ని శకలాలు ఆకాశం నుంచి భూమ్మీద పడతాయని పేర్కొనడం జరిగింది. అదే పనిగా ఆ వార్తలే రోజుల తరబడి వినిపించాయి. ఆకాశం నుంచి ఏవేవో బరువైన మండుతోన్న శకలాలు పొగలతో భూమ్మీద పడవచ్చునన్నారు. 'ప్రజలంతా అప్రమత్తులై ఉంటూ అలాంటి శకలాలేవైనా భూమ్మీద పడంగానే వెంటనే తాక్కండి !' అంటూ హెచ్చరికలు చేశారు. అని దాంతో జనం బెంబేలు పడి పోయారు. ఇళ్ళపై గాని, మనుష్యులపై గానీ పడతాయేమోనని భయం భయంగా తిరిగేవాళ్ళు కొందరైతే, 'అమ్మో ఇంకేముంది మన పని



అయిపోయింది. ఏదో పెద్ద కొండో, బండో ఆకాశం నుంచి పడబోతోందిట. మనందరం చచ్చిపోవడం ఖాయమ'ని అనుకొన్న సామాన్య జనం ముఖ్యంగా రిక్షావాళ్ళు, చిన్న చిన్న ఉద్యోగాలు, పనిపాటలు చేసుకొనే వారూ, ఎంతోమంది కార్మిక సోదరులు, అమాయకులు వారివారికున్న గిన్నే, చెంబు, బిందెల వంటివో తెగనమ్మి బాకీలుంటే తీర్చేసి లేదా ఎక్కడైనా అప్పు దొరికితే వడ్డీకైనా తీసేసుకుని ఎటూ ఇక మనం ఉండబోముకదా అన్నట్లు ఆ వార్తపత్రికల్లో కౌంట్‌డౌన్ సమయానికి మానసికంగా ఎంతో ఉన్మాదుల్లా ప్రవర్తించడం చూశాం. ఇదిలా ఉండగా ఈ నేపథ్యంలో మాకు స్వయంగా తెలిసి గుంటూరు నెహ్రూ నగర్, కంకరగుంట గేటు వంటి ప్రాంతాల్లో రిక్షావాళ్ళు పాపం భయానికి తట్టుకోలేక వారి తోటివారితో కలిసి చేతికందినంత అప్పు చేసో, ఉన్న రిక్షాబళ్ళు తెగనమ్మో చిత్తుగా తాగి రైలు పట్టాలకు అడ్డంగా పడుకున్నారు కొందరు. వారిని వారించి ఇవతలకు తేవడం బ్రహ్మ ప్రళయమైన విషయం మర్చిపోలేక పోతున్నాము. ఇంతాచేస్తే ఆ స్కైలాబ్ శకలాలు ఏ సముద్రములోనో పడిపోయాయట. 'హమ్మయ్య' అంటూ ఒక్క సారిగా అందరూ పూపిరి పీల్చుకున్నారు. ఈ చేదు అనుభవంలో ప్రత్యక్ష పాత్ర కలిగిన ఎంతోమంది మన మధ్యనే ఉన్నారు కదా !

సర్వజ్ఞులైన సద్గురువులకు, మహాత్ములకు మన ధైర్యసాలు తెలినివా ? మన గుండె ధైర్యం ఏ లెవల్‌లో ఉందో వారికి తెలీకపోతే గదా ! ఇదిగో ఫలానా చోట ఫలాన సంఘటన జరగబోతోంది అంటే తట్టుకొని నిలబడి ధైర్యంతో ఎదురించడమో, నివారించే మార్గాలు వెదకడమో చేయగల సామర్థ్యం మనలో ఎందరికుందో ? మనకంటే వాళ్ళకే క్షుణ్ణంగా తెలుసు. ఎప్పుడెప్పుడు ఎవరెవరికి, ఏ యే విషయాలు తెలియజేయాలి. ఎవరెవరి చేత ఏ ఏ పనులు ఎప్పుడెప్పుడు చేయించాలి అన్న విషయం తెలియనివారా గురువు లంటే ? వారికి తెలియదని అనుకోవడం మన మూర్ఖత్వం తప్ప మరోటికాదు కదా ! రాబోవు అతి సమీపకాలంలో జరుగబోయే ఎన్నో వినాశకర సంఘటన లను వివరింగా చెప్పగలరు గురువులు. ఐతే వాటిని తెల్సుకుని మనం చేయగలిగే

దేముంటుంది. కేవలం భయాందోళనలకు గురికావడం తప్ప. అందుచేత ఎంతో మంది సద్గురువులకు ఈ కాలప్రభావం గురించి తెల్సినా వారి శిష్యగణాలకు వెల్లడించడం లేదు.

ఈ మధ్య ఓ కళ్యాణమండపంలో మాకు తెలిసిన వాళ్ళ బంధువుల పెళ్ళి జరిగింది. ఇరుగ్గా ఉన్న ఆ కళ్యాణ మండపంలో జనం కిటకిట లాడుతున్నారు. పట్టుచీరల ఫెళ ఫెళల మధ్య డోలు, సన్నాయి మోతలు రీ సౌండ్ యిస్తున్నాయి. మాంగల్యధారణ వరకు తెచ్చేశాడు పురోహితుడు. కొద్ది క్షణాల్లో తాళి కట్టించేసి అక్షింతలు వేయించేస్తాడాయన. సరిగ్గా ఆ సమయంలో జరిగిందో సంఘటన. మండపంలో పెట్టబడిన పెద్ద బల్బు ఏ డెకరేషన్ కాగితానికో తగిలుంటుంది. ఆ వేడికి అది కాలి సన్నగా పొగలు చిమ్ముతూ క్రమంగా మండసాగింది. అది గమనించా డొకడు. గమనించి ఊరుకోలేదు. "మంటలు ..... మంటలు ...." అని అరిచాడు ఖంగారుగా. ఆ అరుపులు విన్న కొందరు 'అయ్య బాబోయ్' అంటూ బయటికి పరిగెత్తారు. దాంతో కలకలం ప్రారంభ మైంది. తొక్కిసలాట మొదలైంది. ఎప్పుడైతే అరుపులు ప్రారంభ మయ్యాయో తదుపరి క్షణంలో డోలు, సన్నాయి వాయించేవాళ్ళు తృటిలో మాయమయ్యారు సినిమాలో చూపించినట్లు. ఇంతా చేస్తే పెళ్ళి మండపంలోని ఓ బల్బు వేడికి పక్కనున్న నాలుగైదు కాగితం పూలు అంటుకున్నాయి. సన్నగా మంట కూడా మండింది. దాన్ని కళ్ళారా చూసిన ఓ అతితెలివి యువకుడు తన తెలివితేటల్ని ప్రదర్శించేందుకు సమయం ఆసన్నమైందని మనసారా భావించి ఆ మంటనార్పే సదుద్దేశంతో తన చేతిలోని నీళ్ళగ్లాసును ఆ మంట వైపు విసిరాడు. దాంతో బల్బు మీద నీళ్ళు పడటం, అంతలావు బల్బు ఠప్ మనడం, అక్కడంతా చీకట్లు కమ్మడం క్షణాల్లో జరిగిపోయాయి. ఈ సందర్భంగా భయభ్రాంతుడై పెళ్ళిపీటల మీద నుంచి అమాంతం దూకి పరిగెట్టిన పెళ్ళికొడుకును కొందరు ఆ మసక చీకట్లో, అంత ఖంగారులోనూ పసిగట్టనే కట్టేశారు. అలా అతను బయటికి పరిగెట్టిన ఆనాటి దృశ్యాన్ని



పి.టి. ఉష గనక చూసుంటేనా .... సిగ్గుతో కుంచించుకుపోయేదేమో. ఇంతలో ఎవరో పెట్రోమాక్స్ లైట్ వెలిగించినట్లున్నారు. పెళ్ళిపీటల మీద కొద్ది క్షణాల్లో (పరిస్థితి ఇలా ఉండకుండా ఉంటే) తాళి కట్టించు కోవాల్సిన కన్యామణి ముఖం తిరిగి పడిపోయింది. చేత్తో గ్లాసు పుచ్చుకుని ఆ పిల్ల మొఖాన నీళ్ళు చిలకరిస్తున్నాడొకడు. ఆ పెట్రొమాక్స్ లైటు వెలుగులో అక్కడి వారతన్ని గుర్తుపట్టారు. ఇందాకని బల్బుమీద నీళ్ల చిలకరించినవాడే వీడని. అయితే ఇప్పుడిప్పుడే తేరుకుంటూ అందరి కళ్ళూ చుట్టూ వెతుకు తున్నాయి పెళ్ళిచేయించాల్సిన పంతులుగారేడని ?

ఇలా రాస్తోంది ఎవర్నీ కించపరచాలని కాదండోయ్ ! మేమేదో ధైర్య సాహసాల్ని పుణికి పుచ్చుకున్నవాళ్ళమనుకుంటున్నారేమో. అలా అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే సుమా ! ఆ మధ్య ఓ రోజు మేము ఏదో పుస్తకంలో మునిగిఉండగా పక్క గదిలోంచి 'వర్షం వర్షం' అన్న మాటలు వినిపించాయి. నాకు చటుక్కున గుర్తొచ్చింది మేడమీద పక్కబట్టలున్నాయని. అంతే. ఒక్క వుదుటున మెట్లవైపు కదిలిన నాకు తర్వాత తెల్సింది మావాడు టి.వి. చూస్తూ తన్మయత్వంలో అలా తను చూస్తున్న దృశ్యాన్ని పైకి గట్టిగా అన్నాడని. వర్షం వస్తోంది టి.వీ. సీరియల్‌లో గాని నిజంగా కాదని. దాంతో మావిడ నవ్విన నవ్వు నాకు చిరాకేసింది.

మన జీవితాల్ని నవ్వులపాలు చేయడమో అధోగతిపాలు చేయడమో చేస్తారా సద్గురువులు ? మనల్ని ఎలాగోలా శాంతి మార్గం వైపుకు, ఉన్నతపథం వైపుకు నడిపిస్తారు. ఇక్కడ మరో విషయం గమనించాలి. దాదాపు 99 శాతం గురువులకు తెల్సినా తమ శిష్య బృందాలకు చెప్పి వారిని అశాంతిగా తయారుచేయడం ఇష్టంలేక కూడ కొందరు తెలీనట్లు నిర్లిప్తంగా తటస్థంగా ఉండటం కూడ జరుగు తుంటుంది. ఏది ఏమయినా మనం ఈ పరమగురువుల చిట్టచివరి శంఖారావానికి స్పందించి సమర్థ సద్గురుని ఈ రహస్య ఆహ్వానాన్ని అందుకోవడం మన అదృష్టాన్ని తెలియజేస్తుంది. మన వివేకానికి పరీక్ష ఇది.

అజ్ఞాచక్రంలో మనసునుంచుకొని అలా స్థిరంగా, నిటారుగా, మంకుపట్టుబట్టి కూర్చుండిపోవడంతో అన్నీ మన దగ్గరకే వస్తాయి.

శ్రీ మళయాళ స్వామి వారికి టైముకు భోజనము వచ్చినట్లు ఒక్క ఆహారమే కాదు ఏ సమయానికి ఏది అవసరమైతే అది ఆయా సమయాల్లో మనకు అందుతుంది. ఎటొచ్చీ మనం ఆయా అవసరాల మీద, మనక్కావలసిన వాటిమీద దృష్టి పెట్టక్కర్లేదు. అలా ఆ యా విషయాలపై ఆలోచనలు సాగిస్తూ వేళకి మనకు అన్నీ సమకూరు తున్నాయో లేదో పరిశీలించుకొంటూండడం, అలా వాటి కోసం ప్రయత్నించడం అలా చేయక్కర్లేదు. మనకు మనంగా అలాంటివేవీ చేయకూడదు కూడా. ఈ విషయాన్ని కాస్త జాగర్తగా అర్థం చేసుకోవాలి. నీవు అలా నిశ్చలస్థితిలో ఉండగా పరమాద్భుతులు జరుగుతాయి. బాధ్యతలను వదిలి, కర్తవ్యాలను విస్మరించి చేసే ఏ సాధనలూ ఫలించవని చెప్తూ తరచూ మాష్టారు ఇలా చెప్తుంటారు.

ఒక వ్యక్తి తన ఇంటిని, ఇల్లాలిని, నలుగురి బిడ్డల్ని వదలి ఆత్మ కళ్యాణానికి బయలుదేరాడు. అలా వెళ్తూ వెళ్తూ ఓ అడవిలో ఓ మహాత్ముణ్ణి కలిశాడు. కలిసి "భగవత్ సాక్షాత్కారానికై తాను తన సంసార సాగరాన్ని, మోహ బంధాలైన భార్యాబిడ్డల్ని త్యజించి వచ్చానన్నాడు. తనకు ఆత్మదర్శనం చేయించమన్నాడు. అందుకా మహాత్ముడు "మూర్ఖుడా ! భార్యాబిడ్డలు, మోహబంధాలు ఎప్పటికీ కారు. వారి రూపంలో దైవం నీ ఇంటిదగ్గరే ఉన్నాడు. అలా వారి రూపంలో ఉన్న దైవాన్ని వదిలేసి ఇక్కడేమి సాధించగలవు ? వెళ్లి వారినే సేవించు. ఉద్ధరించబడతావు. కర్తవ్య నిర్వహణను మించిన సాధన లేదు. కుటుంబ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తూ జీవితాన్ని సాధించు. ఆధ్యాత్మికత అనేది బాధ్యతలనుంచి, కర్తవ్య నిర్వహణ నుంచి తప్పించుకొని పారిపోయేవారికి ఎన్నటికీ వంటపట్టదు. పరిస్థితుల్నీ, ప్రకృతి రీత్యా ఎదురయ్యే సంఘటల్నీ ధైర్యంగా నిలబడగలిగి ఎదుర్కోగల్గిన శూరాతి శూరులకు, వీరాధివీరులకు ఆధ్యాత్మిక జగత్తులో స్థానం ఉంటుంది. అలాంటి వారే ఆధ్యాత్మిక జీవనాన్ని జీవించ గల్గుతారు. భార్యాబిడ్డలతో నీవున్న గృహస్థాశ్రమం లోనే ఆధ్యాత్మిక



సాధన దానంతట అదే జరిగిపోతుంది. మీరు త్యజించాల్సింది ఈ మనోవికారాలను, భ్రమలను. అంతేకానీ ఇంటినీ ఇల్లాలినీ, భార్యా బిడ్డల్ని కాదంటూ అతణ్ణి వెనక్కి పంపేశాడా మహాత్ముడు.

కనుక మనం మన బాధ్యతలను, చేయవల్సిన పనులను నిర్లక్ష్య పరచకూడదు. ధ్యానం కంటే వాటికే ఎక్కువ ప్రాధాన్యతనీయాలి. అందుకే ధ్యానం కోసం మనం కేటాయించుకొనే సమయాన్ని కాస్త వివేకంతో ఆలోచించుకొని పెట్టుకోవాలి.ఈ సందర్భంగా శ్రీ రమణ మహర్షి మనకు అందించిన దివ్యవాణిని ఓ సారి గుర్తుచేసుకొందాం !

"ఒకని శిరస్సుకు గురిచూసి వదలిన బాణం తలపాగాకు తగిలి నిర్వీర్యమైనట్లు భక్తుని యొక్క దుష్టకర్మ ప్రారబ్ధము. జ్ఞాని అనుగ్రహంతో తప్పక పూర్తిగా తగ్గించ బడుతుంది. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అయితే జ్ఞానికి సంకల్పాలుండవ్వు. కానీ జ్ఞాని యొక్క ఉనికి లేక సన్నిధి మహా శక్తివంతమైనది. జ్ఞాని ప్రత్యేకించి సంకల్పించ కుండానే, ఆ మహాశక్తి పరమాద్భుతాలను చేస్తుంది. ప్రారబ్ధాలను పోగొట్టడం, వరాలనివ్వడం, భక్తుల్ని రక్షించడం, మనసుకు శాంతి నివ్వడం, తుదకు ముక్తిని అనుగ్రహించడం కూడా సులభసాధ్యము. మీ ప్రార్థనకు ఈ శక్తే బదులు పలుకుతుంది. మీ కర్మలను తొలగించి వరాలను ఇస్తుంది. ఇదంతా అత్యంత సహజంగా జరుగుతుంది. జ్ఞాని సంకల్పించకుండానే ఈ మహాలీల సాగిపోతుంది. కనుక భయపడవలసిన పనిలేదు."

- శ్రీశ్రీశ్రీ భగవాన్ రమణ మహర్షి

జై మహాకాళ్ !

జైజై మహాకాళ్ !!

సర్వేజనాస్సుఖినోభవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

**సమర్థ సద్గురు వేదపీఠము**
ప్లాట్ నెం. : 8 135, అమరావతి ప్లాట్స్, తెనాలి.

**ప్రవేశపత్రము**
**నమూనా**

* ఈ పత్రము పూర్తిచేసిన తేదీ : * సమయము :
* పూర్తిపేరు :
* పుట్టిన సమయము : * తేదీ :
(జాతకచక్రము ఉంటే జతచేయండి)
* తిథి : * వారము : * నక్షత్రము :
* సంవత్సరము : * వయస్సు : * వృత్తి :
* తండ్రిగారి పేరు : * వారి వృత్తి / ఉద్యోగాలు :
* మీ తరపున ఎంతమందిని మన యోగికులంలో చేర్పించగలరో ఆ కనీసపు సంఖ్య :
(ఇచ్చిన మేరకు ఖచ్చితంగా కృషిచేయాల్సి ఉంటుంది. దీనికి చాలా పెద్దగా ప్రాధాన్యత నీయడం జరుగుతుందని గమనించగలరు)
* సమర్థ సద్గురు వేదపీఠము ద్వారా వెలువడిన పుస్తకములు చదివాక మీ అభిప్రాయము :
* ఇతరములైన/ఏవైనా సూచనలు/సలహాలు ...
* 1. మీరివ్వదలచుకొన్న సమయదాన వివరాలు ...
* 2. మీరివ్వదలచుకొన్న అంశదాన వివరాలు ...
* 3. మీరివ్వదలచుకొన్న ప్రతిభాదాన వివరాలు ...
* గతములో మీ ఆధ్యాత్మికానుభూతులు/అభిరుచులు/సాధనా వివరాలు తెల్పండి !
* ప్రతిరోజు సాధన నిమిత్తము ఎంత సమయాన్ని మీరు కేటాయించ గలుగుతారు ?
(ఈ పైన ప్రవేశపత్రము నమూనాను ఆధారంగా చేసుకొని మీ మీ వివరాలను / అభిప్రాయాలను / సూచనలను / ఇతర విశేషాలను వేరే కాగితాలపై వ్రాసి మాకు తెలియజేయ ప్రార్థన)
* మీ చిరునామా :

పైన తెల్పిన వివరాలు పూర్తి వాస్తవాలు మరియు నా ఇష్టపూర్తితో తెలుపుతున్నవి కూడా.

* సంతకము

## సమర్థ సద్గురు వేదపీఠము ద్వారా ప్రచురింపబడిన మహా గ్రంథాలు

- అశ్వనీ సూక్త సహిత శ్వాస మహా విజ్ఞాన్ (ఓ అత్యవసర రహస్యమయ విజ్ఞానము) ఒకటవ భాగము — 24 - 00
- ఓ అత్యవసర రహస్యమయ - శ్వాస మహా విజ్ఞాన్ (రెండవ భాగము) — 33 - 00
- తక్షణం మానవ అయస్కాంతాన్ని తయారుచేసుకోండి ! (శ్వాస మహా విజ్ఞాన్ మూడవ భాగము) — 33 - 00
- గాయత్రీ మహా మంత్రము - మెరుస్తోన్న రహస్య వజ్రాలు (శ్వాస మహా విజ్ఞాన్ - నాల్గవ భాగము) — 24 - 00
- త్వరత్వరగా యోగికులంలో చేరండి ! యోగిక్ ఫ్లయింగ్ (సమర్థ సద్గురుని రహస్య ఆహ్వానమిది) (శ్వాసమహావిజ్ఞాన్ - ఐదవ భాగము) — 33 - 00
- సాయినాధునికి ఆకలిగా ఉందట ! అన్నం పెట్టగలవా ? (ఓ అత్యవసర రహస్యమయ సందేశము) — 5 - 00
- రహస్యవాణి ద్వారా సమర్థ సద్గురు స్పర్శ — 42 - 00
- సాయికి నీవు శిష్యుడివా ? భక్తుడివా ? (సాహసవంతులకు సమర్థ సద్గురుని రహస్య సందేశము) — 24 - 00
- రహస్య కిరణాలు — 33 - 00
- మహామహిమోపేత మహాస్తోత్రాలు — 24 - 00
- మహాశూన్యోపాసన (ఓ మహత్తర రహస్యోపాసన) — 33 - 00
- ఋషి ప్రణాళికలో సంధ్యావందనము మరియు శ్రీ విద్యా రహస్యనామ లాలిత్యానుగ్రహదీపిక — 15 - 00
- గోప్యాతి గోప్యమైన, పరమ రహస్యకరమైన శ్రీ దత్తాత్రేయ వజ్రకవచము మరియు సకల ఆపదల నుంచి వజ్రకవచంలా కాపాడే స్థల ప్రదక్షిణలు — 24 - 00
- విద్యార్థులను వివేకానందులుగా మార్చే అశ్వనీసూక్త మహిమ (విద్యార్థి లోకానికే సంచలనాత్మక శుభవార్త) — 24 - 00
- శ్రీ యోగమాయా మహాత్మ్యం (భక్తులను శిష్యులుగా మార్చే కీలక స్తోత్రాలు) — 24 - 00